సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16+4+16 వెల: ₹ 5.00
సంపుటి: 10
సంచిక: 157
సోమవారం 28-8-2017
SIMULTANEOUSLY PRINTED AT KADAPA | VIJAYAWADA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'ప్రతిపల్లెలోనూ అందరికీ గ్యాస్ సరఫరా, ప్రతి మహిళకూ ఆర్థిక భరోసా నా ధ్యేయం'



34 ఏళ్లు.. 15 స్టోర్లు..
10,700 కోట్ల టర్నోవర్. తెలంగాణలో అడుగుపెట్టిన లలితా జ్యుయలరీ –బిజినెస్‌లో



'మూడు'లోనే కొట్టేశారు
శ్రీలంకపై వరుసగా మూడో వన్డేలోనూ గెలుపు. సిరీస్ భారత్ కైవసం – స్పోర్ట్స్‌లో

● మూడున్నరేళ్ల మోసకారి పాలన

ఓటుతో బుద్ధి చెప్పండి

కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల ప్రచారంలో ప్రజలకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు



ఆదివారం కాకినాడలో వైఎస్ జగన్ రోడ్ షోకు హాజరైన జన సందోహంలో ఓ భాగం. ప్రసంగిస్తున్న ప్రతిపక్ష నేత

- కాకినాడతో మార్పునకు శ్రీకారం చుట్టండి
- ఏడాది తర్వాత వచ్చేది మన ప్రభుత్వమే
- చంద్రబాబుకు ఓటేస్తే మురిగిపోయినట్లే
- ఎన్నికల లబ్ధి కోసమే చంద్రబాబు హామీలు
- మోసాలతోనే మూడున్నరేళ్లు గడిపేశారు
- హామీల అమలుపై నిలదీస్తే కేసులు బనాయిస్తున్నారు
- కత్తులతో స్వైరవిహారం చేసిన టీడీపీ వారిపై కేసుల్లేవ్
- దుర్మార్గపు పాలకులకు ఓటుతోనే బుద్ధి చెప్పండి
- లేదంటే ఇంటికో కారు, కిలో బంగారం ఇస్తామంటారు

5 లో



'రజత' సింధూరం

ఫైనల్లో ఓడినా... తన ఆటతో 'ఫిదా' చేసిన తెలుగు తేజం

ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో తొలిసారి రజతం

- స్పోర్ట్స్‌లో

వీవీప్యాట్ ఈవీఎంలనే కాకినాడలో వాడాలి

వైఎస్సార్ సీపీ నేత భూమన కరుణాకర్‌రెడ్డి డిమాండ్



- సీఎంపై నమ్మకం లేదు
- మామూలు ఈవీఎంలను ఆయన ట్యాంపర్ చేయొచ్చు
- అధికారులందరూ చంద్రబాబు నియమించిన వారే

2 లో

కులాల స్థాయిని మార్చే అధికారం కేంద్రానిదే

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చడంపై సీఎం చంద్రబాబు



- కాపులను బీసీల్లో చేరుస్తామంటూ ప్రకటన
- కాకినాడలో వివిధ కుల సంఘాలతో విడివిడిగా సమావేశం
- తనను మరోసారి నమ్మాలని విజ్ఞప్తి

8 లో

సర్కారుకు ముద్రగడ షాక్



కిర్లంపూడిలో అనుచరులతో కలిసి పాదయాత్ర ప్రారంభించిన ముద్రగడ

అనూహ్యంగా పాదయాత్ర చేపట్టిన కాపు ఉద్యమనేత

- ఉదయం 11.20కి ఇంటినుంచి నడక మొదలుపెట్టిన ముద్రగడ
- తీవ్ర ఉద్రిక్తత నడుమ కిలోమీటరు నడిచాక అడ్డుకున్న పోలీసులు
- అక్కడే బైఠాయించి నిరసన తెలిపిన కాపు ఉద్యమనేత
- అనంతరం పోలీసుల్ని తోసుకుంటూ ముందుకు సాగిన యాత్ర
- సాయంత్రం వీరవరం సమీపంలో ముద్రగడ అరెస్ట్
- వాహనాన్ని అడ్డుకునేందుకు అభిమానుల యత్నం.. నిరసనలు
- ఉద్రిక్తతల నడుమ అర్ధరాత్రి కిర్లంపూడి స్టేషన్‌కు..
- లక్ష్యం నెరవేరేవరకూ పోరు ఆగదని ముద్రగడ స్పష్టీకరణ

7 లో



హింసను సహించేది లేదు

తప్పు చేసినవారికి శిక్ష తప్పదు: నరేంద్ర మోదీ


"విశ్వాసం పేరిట హింసను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోం. ఒకరి విశ్వాసాల కోసం చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే హక్కు ఏ ఒక్కరికీ లేదు. చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకునేవారు, హింసాత్మక ప్రవృత్తిని అనుసరించేవారి విషయంలో ఈ దేశం, ఏ ప్రభుత్వమైనా చూస్తూ ఊరుకోదు. - మోదీ

- డేరా విధ్వంసంపై 'మన్ కీ బాత్'లో ప్రధాని పరోక్ష ప్రస్తావన
- సెప్టెంబర్ 15 నుంచి 'స్వచ్ఛత సేవ' ప్రచారంలో పాల్గొనండి
- జన్‌ధన్‌లో 30 కోట్ల మందికి భరోసా: మోదీ

- ఫుల్‌అవుట్ IVలో

హరియాణాలో హై అలర్ట్

నేడు డేరా చీఫ్ గుర్మీత్ సింగ్‌కు శిక్ష ఖరారు
రోహ్‌తక్ జైలుకు హెలికాప్టర్‌లో వెళ్లనున్న న్యాయమూర్తి




- హింసపై హెచ్చరించిన ఇంటెలిజెన్స్.. అప్రమత్తమైన పంజాబ్ ప్రభుత్వం
- 144 సెక్షన్ అమలు.. పటిష్టమైన భద్రత ఏర్పాటు
- హరియాణాలో నేడు విద్యాసంస్థలకు సెలవు.. రేపటి వరకు ఇంటర్నెట్‌పై నిషేధం

- ఫుల్‌అవుట్ IVలో

'స్విస్' ఒప్పందం ప్రజా ప్రయోజనాలకు భంగం


సీఎంకు ప్రభుత్వ మాజీ సీఎస్ ఐవైఆర్ కృష్ణారావు లేఖాస్త్రం



- స్విస్ ఛాలెంజ్ నిబంధనలు పాటించలేదు
- నల్లధనాన్ని తెల్లధనంగా మార్చే అడ్డాగా సింగపూర్ మారింది
- రాజధాని స్టార్టప్ ఏరియా మాస్టర్ డెవలపర్ ఒప్పందాన్ని రద్దు చేయాలి

2 లో

ఉత్కంఠకు నేడు తెర



- ఉదయం 8 గంటలకు నంద్యాల ఉప ఎన్నిక కౌంటింగ్ ప్రారంభం
- ఒకటో నంబర్ పోలింగ్ కేంద్రం నుంచి ఓట్ల లెక్కింపు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

2 లో

రెండు నెలల్లో రూ.6 పెరిగిన పెట్రోల్ ధర

- ఫుల్‌అవుట్ IVలో

భారతీయుల రక్షణకే అధిక ప్రాధాన్యం: సుష్మ



ముంబై: విదేశాల్లో చిక్కుకున్న భారతీయులను రక్షించడానికి విదేశాంగ మంత్రిత్వ శాఖ గతంతో పోల్చుకుంటే అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఆ శాఖ మంత్రి సుష్మా స్వరాజ్ తెలిపారు. కేంద్రంలో బీజేపీ అధికారం చేపట్టినప్పటి నుంచి విదేశాల్లో చిక్కుకున్న 80,000 మంది పైచిలుకు భారతీయులను రక్షించినట్లు వెల్లడించారు. ఇక్కడి బాంద్రా–కుర్లా కాంప్లెక్స్‌లో 'విదేశ్ భవన్' కార్యాలయాన్ని సుష్మ ఆదివారం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ స్థానిక పాస్‌పోర్ట్ కార్యాలయం, వలసదారుల రక్షణ కార్యాలయం, భారతీయ సాంస్కృతిక సంబంధాల మండలి, బ్రాంచ్ సెక్రటేరియట్‌లు ఈ విదేశ్ భవన్‌లో సేవలు అందిస్తాయన్నారు. ప్రతి రాష్ట్ర రాజధానిలోనూ విదేశ్ భవన్‌లను నిర్మించే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు సుష్మ తెలిపారు.

గత సర్జికల్ దాడుల రికార్డులు లేవు: డీజీఎంఓ

న్యూఢిల్లీ: 2016 సెప్టెంబర్ 29వ తేదీ కంటే ముందు చేపట్టిన సర్జికల్ దాడులకు సంబంధించి ఎలాంటి రికార్డులు తమ వద్ద లేవని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ (డీజీఎంఓ) తెలిపింది. ఈ మేరకు సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేసుకున్న ఓ వ్యక్తి ప్రశ్నకు డీజీఎంఓ సమాధానమిచ్చింది. ఇండియన్ ఆర్మీ రికార్డులో సర్జికల్ దాడులకు ఎలాంటి నిర్వచనం ఉందో తెలపాల్సిందిగా అతను దరఖాస్తులో కోరాడు. దీనికి డీజీఎంఓ సమధానమిస్తూ 'ఇంటెలిజెన్స్ సమాచారంతో నిర్దేశిత లక్ష్యంపై వేగంగా, కచ్చితమైన దాడులు చేయడాన్ని'సర్జికల్ దాడులుగా పేర్కొంది. అంతేకాకుండా భారత సైన్యం చరిత్రలో 2016 సెప్టెంబర్ 29వ తేదీన జరిగిన సర్జికల్ దాడులే మొదటిదా లేక 2004–2014 మధ్యలో ఏమైనా సర్జికల్ దాడులు జరిగాయా తెలపాలని దరఖాస్తులో కోరాడు. ఇంటిగ్రేటెడ్ హెడ్‌క్వార్టర్స్ (ఆర్మీ)కి రక్షణ మంత్రిత్వ శాఖ ఈ దరఖాస్తును బదిలీ చేసింది.

ట్రాఫిక్ రామస్వామి ఆత్మహత్యాయత్నం



ఆత్మహత్యకు ప్రయత్నించిన ట్రాఫిక్ రామస్వామిమిని అడ్డుకుంటున్న పోలీసులు

తిరువొత్తియూరు (తమిళనాడు): తమిళనాడులో ప్రముఖ సామాజిక సేవకుడిగా ప్రసిద్ధి చెందిన ట్రాఫిక్ రామస్వామి ఆదివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. రామస్వామి తమిళనాడు కోర్టుల్లో అనేక ప్రజాహిత వ్యాజ్యాలను దాఖలు చేస్తుంటారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా ఏర్పాట్లు చేస్తోన్న బ్యానర్, కటౌట్లను కూడా తొలగిస్తుంటారు. వాహనాల రాకపోకలకు అంతరాయాన్ని నియంత్రిస్తుండటంతో ఆయనకు ట్రాఫిక్ రామస్వామిగా పేరొచ్చింది. ప్రస్తుతం తమిళనాడులో మైనారిటీలో ఉన్న పళనిస్వామి ప్రభుత్వాన్ని డిస్మిస్ చేయాలని ఆయన డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయంపై మాట్లాడేందుకు గవర్నర్‌ను కలవాలని అయన కోరారు.అయితే అనుమతి నిరాకరించడంతో ఈ నెల 25 నుంచి తన కార్యాలయంలో రామస్వామి నిరాహార దీక్ష చేస్తున్నారు. ఈ క్రమంలో గవర్నర్ ఆదివారం చెన్నైకి చేరుకున్నప్పటికీ తాను ఉత్తరం ఇవ్వడానికి ఇంతవరకు అనుమతి ఇవ్వలేదని తన కార్యాలయం 3వ అంతస్తుపైకి ఎక్కి ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించారు. పోలీసులు ఆయనను బుజ్జగించి కిందికి దించారు.

గద్దెకొండలో అగ్నిపర్వతం!

- గుంటూరు జిల్లా చల్లాపల్లి తండాలో కలకలం
- కొండపై నుంచి దట్టంగా పొగలు

రాజుపాలెం: గుంటూరు జిల్లా రాజుపాలెం మండల పరిధిలోని చల్లాపల్లి తండా సమీపంలో అగ్నిపర్వతం ఉన్నట్టు అధికారులు భావిస్తున్నారు. అటువైపు వెళ్లొద్దని స్థానికులను హెచ్చరించారు. ఆదివారం స్థానిక గద్దె కొండపై నుంచి దట్టమైన పొగలు ఉవ్వెత్తున ఎగసిపడటంతో తండాలో కలకలం రేగింది. తండాకు చెందిన ఓ విద్యార్థి సెల్ఫీ దిగుతుండగా అకస్మాత్తుగా కొండపై భాగం నుంచి దట్టమైన పొగలు, నిప్పురవ్వలు ఎగసిపడటాన్ని గుర్తించాడు. దీంతో వెంటనే స్థానికుల దృష్టికి తీసుకెళ్లాడు. స్థానికులు ఏం జరిగిందో పరిశీలించేందుకు కొండ వద్దకు వెళ్లగా, కొండ పైభాగంలో పెద్ద గొయ్యి ఏర్పడినట్లు గుర్తించారు. రాజుపాలెం తహసీల్దారు కె.నగేశ్, నెమలిపురి రేంజ్ అటవీ శాఖ అధికారులకు సమాచారం తెలియడంతో వారు వెంటనే తండాకు చేరుకున్నారు. ఘటన గురించి స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అటువైపు వెళ్లొద్దని ప్రజలను హెచ్చరించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్టు తెలిపారు.



వీవీప్యాట్ ఈవీఎంలనే కాకినాడలో వాడాలి

- వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత భూమన కరుణాకర్‌రెడ్డి డిమాండ్
- చంద్రబాబుపై నమ్మకం లేదు.. ఎంతకైనా దిగజారుతారు..
- మామూలు ఈవీఎంలను ఆయన ట్యాంపర్ చేయొచ్చు..
- ఈవీఎం దొంగనే ప్రభుత్వంలో చేర్చుకున్న ఘనుడు బాబు
- రాష్ట్ర ఎన్నికల అధికారులందరూ సీఎం నియమించిన వారే
- గంటాను భర్తరఫ్ చేయాలి: చెవిరెడ్డి

సాక్షి, హైదరాబాద్

'నంద్యాల తరహాలోనే కాకినాడ కార్పొరేషన్ ఎన్నికలు సజావుగా జరగాలంటే వీవీప్యాట్ (ఓటర్ వెరిఫైడ్ పేపర్ ఆడిట్ ట్రైల్) ఉన్న ఈవీఎంలనే ఏర్పాటు చేయాలి.. ఈవీఎంను దొంగిలించి, ఎలా ట్యాంపర్ చేయవచ్చో గతంలో నిరూపించిన వి హరిప్రసాద్ అనే వ్యక్తి ఇప్పుడు చంద్రబాబు ప్రభుత్వంలో సలహాదారుగా ఉన్నారు.. రాష్ట్ర ఎన్నికల కమిషన్‌ను నియమించింది కూడా చంద్రబాబు ప్రభుత్వమే.. చంద్రబాబుపై మాకు నమ్మకం లేదు.. ఆయన అధికారం కోసం ఎంతకైనా దిగజారే రకం.. చంద్రబాబు నాయుడు తను నియమించిన ఎన్నికల అధికారులను కూడా తన స్వార్థ ప్రయోజనాల కోసం వాడుకుని కాకినాడ ఎన్నికను ఓ ప్రహసనంగా మార్చే ప్రమాదం ఉంది. ఈ విషయంలో కేంద్ర ఎన్నికల కమిషన్ తక్షణమే స్పందించాలి.. కేంద్ర ప్రభుత్వం కూడా



హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న భూమన కరుణాకర్‌రెడ్డి. చిత్రంలో చెవిరెడ్డి

జోక్యం చేసుకోవాలి' అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత భూమన కరుణాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. హైదరాబాద్ లోటస్‌పాండ్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు కుట్రలు, కుతంత్రాలు తెలిసే.. వీవీ ప్యాట్స్‌తో కూడిన ఈవీఎంలు ఏర్పాటు చేయాలని ఇప్పటికే తమ పార్లమెంట్ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి కేంద్ర ఎన్నికల సంఘానికి లేఖ రాశారని తెలిపారు. టీడీపీకి ఓటు వేయకపోతే వృద్ధాప్య పింఛన్లు కట్ చేస్తామని, రేషన్ కార్డులు రద్దు చేస్తామని నంద్యాల ఉప ఎన్నికలో చంద్రబాబు బెదిరించడాన్ని వైవీ సుబ్బారెడ్డి లేఖలో వివరించారన్నారు. 'నేను ఇస్తున్న పింఛన్ తీసుకుంటున్నారు.. నేను వేసిన రోడ్లపై తిరుగుతున్నారు.. వీధి లైట్లు వాడుకుంటున్నారు.. మరి మాకు ఓటు వేయరా? నేను అనుకుంటే ఓటుకు రూ.5 వేలు పెట్టి కొనగలను' అని చంద్రబాబు బెదిరించారన్నారు. ఈ విషయంలో న్యాయ పోరాటానికి కూడా తమ పార్టీ సిద్ధంగా ఉందన్నారు. కులాల పేరుతో, మతాల పేరుతో ప్రజలను ప్రలోభాలకు గురి చేశారని, లొంగని వారిని బెదిరింపులకు గురి చేశారని చెప్పారు.

ఈవీఎంల దొంగే సలహాదారు

తమకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై ఎంత మాత్రం నమ్మకం లేదని, ఈవీఎంలను ట్యాంపర్ చేయవచ్చు అని గతంలో చాలా సందర్భాల్లో అన్నారని భూమన గుర్తు చేశారు. వి హరిప్రసాద్ అనే వ్యక్తి ఈవీఎంలను దొంగతనం చేసి బయటకు తీసుకొచ్చి ఎలా ట్యాంపరింగ్ చేయొచ్చో చెప్పారని, ప్రజాస్వామ్య వ్యవస్థను ఏ విధంగా అపహాస్యం చేయవచ్చో నిరూపించారన్నారు. అలాంటి వ్యక్తి ఇప్పుడు చంద్రబాబు నాయుడు ప్రభుత్వంలో మౌలిక వసతులు, పెట్టుబడుల విభాగంలో ఎవాల్యూషన్ కమిటీ సలహాదారుగా ఉన్నారని చెప్పారు. ప్రజాస్వామ్యంలో ఎలాంటి దొంగతనాలు చేయవచ్చో చెప్పిన వ్యక్తిని ప్రభుత్వంలో భాగస్వామ్యం చేసిన చరిత్ర చంద్రబాబుది అని దుయ్యబట్టారు. చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఎన్ని దుర్మార్గాలకైనా తెగబడే వ్యక్తి అని, అధికారం కోసం ఎన్ని అడ్డదారులైనా తొక్కడానికి వెనుకాడరని దుయ్యబట్టారు. పోలీసు యంత్రాంగాన్ని లోబర్చుకుని, ఎన్నికల వ్యవస్థనే అపహాస్యం చేస్తారని అన్నారు. పైకి మాత్రం తనంత నీతిమంతుడు లేడని చెబుతూ.. ఎన్నికల్లో కోట్లు వెదజల్లుతాడని, దీన్ని దృష్టిలో పెట్టుకుని కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల్లో చంద్రబాబు అక్రమాలకు పాల్పడే అవకాశం ఉందని అనుమానం వ్యక్తం చేశారు. ఈవీఎంలను ట్యాంపరింగ్ చేయడం ఎలాగో తెలిసిన వ్యక్తి కావడం వల్ల దీనిపై తమకు అనుమానాలున్నాయన్నారు. అందువల్ల నంద్యాల ఉప ఎన్నికలో ఉపయోగించిన వీవీ ప్యాట్స్‌తో కూడిన ఈవీఎంలను కాకినాడలోనూ వాడాలన్నారు. దీని వల్ల ఓటు వేసిన వ్యక్తి.. తను ఎవరికి ఓటు వేశాననేది ఏడు సెకన్ల పాటు చూసుకునే వీలుందని ఆయన వివరించారు. ఇప్పుడున్న సాధారణ ఈవీఎంలు కాకుండా వీవీప్యాట్ ఉన్న వాటినే ఉపయోగించాలని, అప్పుడే ప్రజాభిప్రాయం స్పష్టంగా తెలుస్తుందని ఆయన స్పష్టం చేశారు.

చంద్రబాబు గతమంతా దారుణాలే

చంద్రబాబు గతమంతా విషతుల్యమేనని, ఆయన రాజకీయ జీవితమంతా మోసపు నడతేనని భూమన కరుణాకర్‌రెడ్డి అన్నారు. గెలుపుకోసం ఎంత దారుణాలకైనా పాల్పడే చరిత్ర ఉందన్నారు. 1991లో వైఎస్ రాజశేఖరరెడ్డి ఎంపీగా పోటీ చేసినప్పుడు, ఆయన గెలిస్తే ఎక్కడ కేంద్ర మంత్రి పదవి వస్తుందోనని, పోలంకి వెంకటసుబ్బయ్య అనే స్వతంత్ర అభ్యర్థిని హత్య చేసిన ఘటనలో చంద్రబాబు ఆరోపణలు ఎదుర్కొన్నారన్నారు. రాష్ట్రంలో 1994 సార్వత్రిక ఎన్నికల్లో కోటయ్య అనే బీసీ స్వతంత్ర అభ్యర్థిని హత్య చేయించి, ఎన్నికను వాయిదా వేయడంలో ఆయన ప్రధాన పాత్రధారనే ఆరోపణలున్నాయని చెప్పారు. ఎన్నికలలో అవినీతి సొమ్మును కోటాను కోట్లు గుమ్మరించి ఆ సొమ్ముతో గెలవాలనే ప్రయత్నాలు చేస్తాడని అన్నారు. పోలీసులను తన గుప్పిట్లో ఉంచుకుని, వాళ్లను బెదిరించి, వాళ్లపై అనేక హింసాయుత ప్రయోగాలు చేసి, అడ్డదారులు తొక్కడంలో చంద్రబాబు సిద్ధహస్తుడని చెప్పారు. ఇలాంటి వ్యక్తి తన చేతుల్లో ఉన్న ఈవీఎంలను ట్యాంపరింగ్ చేయడనే నమ్మకం తమకు లేదన్నారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా కాకినాడలో ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలతో సమావేశమైన మంత్రి గంటా శ్రీనివాస్‌ను మంత్రి పదవి నుంచి తక్షణమే భర్తరఫ్ చేయాలని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి డిమాండ్ చేశారు. కాకినాడలో బహిరంగంగా ఉపాధ్యాయులు, ఉద్యోగులు, అంగన్‌వాడీలను మంత్రి పిలిపించుకుని, ఎన్నికల విధులకు వెళ్లే సిబ్బంది అంతా తమకు సహకరించాలని హితబోధ చేయడం దారుణమన్నారు. గంటాపై కేసు నమోదు చేసే ధైర్యం ఎన్నికల అధికారి రమేష్‌కుమార్‌కు ఉందా అని చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ప్రశ్నించారు.

ఉత్కంఠకు నేడు తెర



నంద్యాల పాలిటెక్నిక్ కాలేజీలో సిద్ధమైన కౌంటింగ్ కేంద్రం

భారత్ – పాకిస్తాన్ జట్ల మధ్య క్రికెట్ ఫైనల్ పోరుకంటే నంద్యాల ఉప ఎన్నిక పోరు ఉత్కంఠగా మారింది. తమ నిర్ణయం ఏమిటనేది ఓటర్లు ఇప్పటికే స్పష్టం చేశారు. అయితే ఆ నిర్ణయం ఏమిటనే విషయమై వాదోపవాదనలు.. ఎడతెగని చర్చలు.. వార్డుల వారిగా, కులాల వారిగా కూడికలు, తీసివేతలు.. జోరుగా సాగుతున్నాయి. అక్కడి ఓటర్లతో మాటామంతీ, వివిధ రకాల సర్వేలు బేరీజు వేసుకుంటూ తమ అంచనాలు నిజం కావాలని బెట్టింగ్ రాయుళ్లు జుట్టు పీక్కుంటున్నారు.. వెరసి కొద్ది గంటల్లో కౌంటింగ్ ప్రారంభం కానుంది.. అందరి ఆందోళనకు కాసేపట్లో తెర పడనుంది.

కర్నూలు (అగ్రికల్చర్)

కర్నూలు జిల్లా నంద్యాల ఉప ఎన్నిక ఓట్ల లెక్కింపు సోమవారం నంద్యాలలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రారంభం కానుంది. సరిగ్గా ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపుతో ప్రారంభం అవుతుంది. నంద్యాల నియోజకవర్గానికి గతంలో ఎపుడూ లేని విధంగా తీవ్ర స్థాయిలో పోటీ జరిగింది. మొత్తం 15 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ప్రధానంగా అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్యనే పోటీ జరిగింది. వైఎస్సార్‌సీపీ తరపున శిల్పా మోహన్‌రెడ్డి, టీడీపీ తరపున భూమా బ్రహ్మానంద రెడ్డి పోటీలో ఉన్నారు. ఓట్ల లెక్కింపును పకడ్బందీగా చేపట్టడానికి జిల్లా యంత్రాంగం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది. ఇందుకోసం మొత్తం 60 మందిని వినియోగించనున్నారు. ఒక్కో టెబుల్‌కు ఒక కౌంటింగ్ ఆఫీసర్, ఒక కౌంటింగ్ అసిస్టెంట్ ఉంటారు. రిజర్వ్ సహా 20 మంది కౌంటింగ్ అధికారులు, 20 మంది కౌంటింగ్ అసిస్టెంట్లు ఉంటారు. ప్రతి టేబుల్‌కు ఒక సూక్ష్మ పరిశీలకుడు ఉంటారు. కౌంటింగ్ ప్రక్రియను రిటర్నింగ్ అధికారితో

పోటీలో ఉన్నవారు	:	15 మంది
ప్రధాన పోటీ	:	వైఎస్సార్‌సీపీ, టీడీపీ మధ్య
ఓట్ల లెక్కింపు వేదిక	:	ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, నంద్యాల
మొత్తం ఓటర్లు	:	2,18,858
పోల్ అయిన ఓట్లు	:	1,73,189 (79.13శాతం)
మొత్తం ఈవీఎంలు	:	255
కౌంటింగ్ సిబ్బంది	:	60 మంది

పాటు జిల్లా కలెక్టర్, సాధారణ పరిశీలకుడు పర్యవేక్షిస్తారు.

మూడంచెల భద్రత

కౌంటింగ్ సందర్భంగా నంద్యాలలో 144వ సెక్షన్ అమలు చేస్తున్నారు. ఓట్ల లెక్కింపునకు మూడంచెల భద్రత చర్యలు తీసుకున్నట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సత్యనారాయణ తెలిపారు. కౌంటింగ్ కేంద్రం పూర్తిగా సెంట్రల్ ఆర్మ్‌డ్ ఫోర్స్ ఆధీనంలో ఉంటుంది. కౌంటింగ్ ప్రక్రియను పారదర్శకంగా చేపట్టేందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. మొత్తం ప్రక్రియను వీడియో గ్రఫీ చేయడంతో పాటు వెబ్ కాస్టింగ్ కూడా చేస్తున్నారు. ఓట్ల లెక్కింపునకు 14 టేబుళ్ల (రిటర్నింగ్ అధికారి ప్రసన్న వెంకటేష్ కోసం ఒకటి అదనంగా ఉంటుంది) ఏర్పాటు చేశారు. 255 ఈవీఎంలలోని ఓట్లను లెక్కించాల్సి ఉంది. 18 రౌండ్లలో రౌండుకు 14 ఈవీఎంల ప్రకారం 252 ఈవీఎంలలోని ఓట్లను లెక్కిస్తారు. 19వ రౌండులో మూడు ఈవీఎంల ఓట్లను మాత్రమే లెక్కిస్తారు. ఒక్కో రౌండ్‌లో 8 వేల నుంచి 10 వేల ఓట్ల వరకు ఓట్లు ఉంటాయి. కౌంటింగ్ ప్రక్రియ 12 గంటలకు పూర్తయ్యే అవకాశం ఉంది. కౌంటింగ్ కేంద్రంలో మీడియా సెంటర్‌ను ఏర్పాటు చేశారు. బయట ఏర్పాటు చేసిన ఎల్ఇడీ స్క్రీన్ ద్వారా ఎప్పటికప్పుడు రౌండ్ల వారీగా అభ్యర్థులకు లభించిన ఓట్ల వివరాలను తెలియజేస్తారు. మొత్తం 255 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ జరిగింది. ఒకటవ నంబరు పోలింగ్ కేంద్రం నుంచి.. అంటే నంద్యాల మండలం పోలూరు నుంచి కౌంటింగ్ మొదలు కానుంది. ఈ ప్రకారం తొలుత నంద్యాల రూరల్ మండలం, ఆ తర్వాత నంద్యాల మున్సిపాలిటీ, చివరలో గోస్పాడు మండలం ఓట్లను లెక్కిస్తారు. ఓటు హక్కు వినియోగించుకున్న వారిలో పురుషులు 84,549 మంది, స్త్రీలు 88,639 మంది కాగా, ఇతరులు (ట్రాన్స్‌జెండర్స్) ఒక్కరున్నారు. పోలింగ్ శాతం భారీగా నమోదైన నేపథ్యంలో విజయావకాశాలపై భారీ స్థాయిలో బెట్టింగ్స్ సాగుతున్నాయి. ఫలితం తెలుసుకునేందుకు జనం ఉదయం 8 గంటల నుంచి టీవీల ముందు తిష్ట వేయనున్నారు.



నేడు కోస్తాలో భారీ వర్షాలు

- రాయలసీమపై చురుగ్గా రుతుపవనాలు
- భారత వాతావరణ విభాగం వెల్లడి

సాక్షి, అమరావతి/సాక్షి, విశాఖపట్నం: కోస్తాంధ్రలో వచ్చే 24 గంటల్లో (సోమవారం ఉదయం నుంచి మంగళవారం ఉదయం వరకు) భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) తెలిపింది. వాయువ్య బంగాళాఖాతంలో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం బలపడింది. ఆదివారం సాయంత్రానికి అల్పపీడనంగా మారింది. ఇది ఒడిశా తీరం, పశ్చిమ మధ్య బంగాళాఖాతానికి ఆనుకుని ఉంది. దీనికి అనుబంధంగా సముద్రమట్టానికి 4.5 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం ఆవరించింది. మరోవైపు ఒడిశా నుంచి దక్షిణ తమిళనాడు వరకు కోస్తాంధ్ర, రాయలసీమల మీదుగా అల్పపీడన ద్రోణి కొనసాగుతోంది. అదే సమయంలో రాయలసీమలో నైరుతి రుతుపవనాలు చురుగ్గా ఉన్నాయి. వీటన్నిటి ప్రభావంతో కోస్తా జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో సోమవారం భారీ వర్షాలు, తదుపరి మూడు రోజులపాటు తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ ఆదివారం తెలిపింది. రాయలసీమలో అక్కడక్కడ జల్లులు, తేలికపాటి వానలు కురుస్తాయని వివరించింది. గడచిన 24 గంటల్లో రాయలసీమలో పలుచోట్ల భారీ వర్షాలు కురిశాయి. గోనెగండ్లలో 9 సెం.మీ, నందవరం, ఎమ్మిగనూరుల్లో 7, బనగానపల్లె, కోయిలకుంట్లల్లో 6, ఆళ్లగడ్డ, కర్నూలు, ఆస్పరి, రుద్రవరం, అవుకు, దోనిపాడు, పలాస, ఆత్మకూరుల్లో 5, గజపతినగరం, డోన్, జూపాడుబంగ్లా, మంత్రాలయం, సి.బెనగల్, నందికొట్కూరుల్లో 4 సెం.మీల చొప్పున వర్షపాతం నమోదైంది.

'స్విస్' ఒప్పందం ప్రజా ప్రయోజనాలకు భంగం

సీఎంకు ప్రభుత్వ మాజీ సీఎస్ ఐవైఆర్ కృష్ణారావు లేఖాస్త్రం

- అంతర్జాతీయ పోటీ విధానం ద్వారా మాస్టర్ డెవలపర్‌ను ఎంపిక చేయాలని సూచన

సాక్షి, హైదరాబాద్

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి స్టార్టప్ ఏరియా మాస్టర్ డెవలపర్‌గా సింగపూర్ కన్సార్టియంను ఎంపిక చేస్తూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను (పురపాలక శాఖ జీవోఎంస్ నంబరు 179) తక్షణమే రద్దు చేయాలని ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఐవైఆర్ కృష్ణారావు డిమాండ్ చేశారు. ప్రజా ప్రయోజనాలకు భంగం కలిగించేలా ఉన్న ఆ ఉత్తర్వులను రద్దుచేసి పారదర్శకంగా, అంతర్జాతీయ పోటీ విధానం ద్వారా ఎంపిక చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు లేఖ రాసినట్లు హైదరాబాద్‌లో ఆదివారం ఆయన మీడియా సమావేశంలో ప్రకటించారు. అత్యంత కీలకమైన రాజధాని అమరావతి స్టార్టప్ ఏరియా అభివృద్ధికి మాస్టర్ డెవలపర్‌గా సింగపూర్‌కు చెందిన అసెండాస్ సింబ్రిడ్జి, సెంబ్‌కార్ప్ డెవలప్‌మెంట్ లిమిటెడ్ (సింగపూర్ కన్సార్టియం)ను ఎంపిక చేసిన తీరు అసంబద్ధంగా ఉందని తప్పుబట్టారు. ఇంకా ఆయన ఏమన్నారంటే..

ఇది 'స్విస్ ఛాలెంజ్ ' ఎలా అవుతుంది?

''స్విస్ ఛాలెంజ్ అంటే ఎవరూ పిలవకుండా ఒక పనిని మేము ఇంత మొత్తానికి చేస్తామంటూ ఏదైనా సంస్థ తమంతట తాముగా ప్రతిపాదన సమర్పించాలి. అయితే రాజధాని స్టార్టప్ ఏరియా మాస్టర్ డెవలపర్ ఎంపిక విషయంలో ఇలా జరగలేదు. స్విస్ ఛాలెంజ్ విధానంలో స్టార్టప్ ఏరియా అభివృద్ధికి ప్రతిపాదనలు కోరనున్నట్లు ప్రభుత్వమే పత్రికా ప్రకటన ఇచ్చింది. దీనికి అనుగుణంగా సింగపూర్ కంపెనీలు ప్రతిపాదనలు సమర్పించాయి. ఇది కచ్చితంగా స్విస్ ఛాలెంజ్ విధి విధానాలను వక్రీకరించి దొడ్డిదారిన కంపెనీలను తీసుకు రావడానికి చేసిన ప్రయత్నమే. పైపెచ్చు మాస్టర్ ప్లాన్ డెవలప్‌మెంట్, డీటైల్డ్ ప్లాన్ డెవలప్‌మెంట్ బాధ్యతలను మన ప్రభుత్వం సింగపూర్ ప్రభుత్వానికే అప్పగించింది. వీటిని తయారు చేయడానికి సింగపూర్ ప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వం సమాచారం ఇచ్చింది. దీని ఆధారంగానే సింగపూర్ కంపెనీలు మనకు కొటేషన్లు ఇచ్చాయి. అందువల్ల దీనిని స్విస్ ఛాలెంజ్ అనడం ఏవిధంగానూ సమంజసం కాదు. 'భారతదేశ నల్లధనాన్ని తెల్లధనంగా మార్చి వెనక్కు తీసుకురావడానికి సింగపూర్ ప్రధాన కేంద్రంగా మారింది. శారదా చిట్‌ఫండ్ కుంభకోణానికి సంబంధించిన డబ్బులు సింగపూర్‌లోని ట్రస్టుకు చేరాయనడానికి ఆధారాలు ఉన్నాయి' అని సండే గార్డన్‌లో అభినంద మిశ్రా పేర్కొన్నారు. 'సింగపూర్ దేశ ఆర్థిక విజయానికి ఇండోనేషియా అవినీతి సంపద చాలా కారణం. సింగపూర్‌ను ఇండోనేషియా, సింగపూర్ అధికారులు, వ్యాపారులు అవినీతి ద్రవ్య మార్పిడి కేంద్రంగా పెట్టుకున్నారు. వారి ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం కోసం చైనా దేశపు అవినీతి సొమ్మును రాబట్టేందుకు సింగపూర్ ప్రభుత్వం ప్రయత్నిస్తోంది' అంటూ 2006లో మోర్గన్ స్టాన్లీ చీఫ్ ఎకనమిస్ట్ ఆంటీసై పేర్కొన్నారు. ఈ కన్సార్టియంలోని సెమ్‌కార్ప్ అనుబంధ సంస్థ సెమ్‌కార్ప్ మెరైన్ బ్రెజిల్‌లో ఆయిల్ డ్రిల్లింగ్ కుంభకోణానికి పాల్పడిందని ఫైనాన్సియల్ టైమ్స్‌లో కథనం వచ్చింది. దీనిని బట్టి సింగపూర్ దేశానికే కాదు మనం ఎంపిక చేసుకున్న కంపెనీకి కూడా ఇలాంటి చరిత్రే ఉందని స్పష్టమవుతోంది. ఇలాంటి విధానాలు పాటించే దేశం, సంస్థలతో అంటకాగదలచినప్పుడు వీటిమీద కనీసం రిపోర్టు తెప్పించుకోవాలి కదా?

వివాదాలు తేలకుండానే...

సింగిల్ టెండర్‌ను ఆమోదించడం ఒక తప్పు అయితే, ఈ మొత్తం ప్రాజెక్టులో ప్రభుత్వానికి ట్రాన్సాక్షన్ అడ్వయిజర్‌గా ఉన్న 'మెకెన్సీ' కంపెనీలో ప్రధాన భాగస్వామి అయిన శశి సుంకరను టెక్నికల్ కమిటీలో సభ్యునిగా పెట్టడం మరో తప్పు. సీడ్ కేపిటల్ నిర్మించాలనుకుంటున్న ప్రాంతం వరద ముప్పు ఉన్న ప్రాంతమంటూ జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ)లో కేసు నడుస్తోంది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎన్‌జీటీ తీర్పు ఇస్తే స్టార్టప్ ఏరియాను వేరే చోటికి మార్చాల్సి వస్తుంది. స్టార్టప్ ఏరియాలో కూడా సమగ్రంగా భూసేకరణ ప్రక్రియ పూర్తి కాలేదు. ప్రభుత్వం భూమిని సేకరించి మాస్టర్ డెవలపర్‌కు ఇవ్వడంలో విఫలమైతే సింగపూర్ కన్సార్టియం నష్టపరిహారం డిమాండ్ చేయవచ్చు. ఈ రెండు వివాదాలకు పరిష్కారం చూసుకోకుండా హడావిడిగా తొందరపడి మాస్టర్ డెవలపర్‌ను ఎంపిక చేసి ఒప్పందాలు కుదుర్చుకోవడం తొందరపాటే. ఓ వైపు కోర్టు తప్పు పట్టినా, మరో వైపు కేంద్ర ప్రభుత్వానికి చెందిన కేల్కర్ కమిటీ కాదన్నా మన రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తోంది. అందువల్ల ఈ ఒప్పందాన్ని రద్దు చేసి, అంతర్జాతీయ పోటీ విధానం ద్వారా మాస్టర్ డెవలపర్‌ను ఎంపిక చేయాల''ని కృష్ణారావు డిమాండ్ చేశారు.

ఇదండీ సంగతి



.. కనిపించగానే దాడులు చేస్తాం ట్రంప్ జీ!

భారీగా తగ్గిన విద్యుత్ డిమాండ్

- అంతరాయాలే అసలు కారణం
- చిన్న వర్షానికే నిలిచిపోతున్న విద్యుత్ సరఫరా
- ఏపీ జెన్‌కో ప్లాంట్లలో ఉత్పత్తి నిలిపివేత



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ క్రమంగా పడిపోతోంది. ఈ నెల 23వ తేదీన రోజుకు 151 మిలియన్ యూనిట్ల మేర ఉన్న డిమాండ్ ఆదివారం 135 మిలియన్ యూనిట్లకు తగ్గింది. వర్షాల కారణంగా విద్యుత్ తగ్గడం ఒక కారణమైతే, చిన్నపాటి వర్షాలకు కూడా విద్యుత్ సరఫరాలో తీవ్ర ఆటంకాలు కలుగుతున్నాయి. విద్యుత్ స్తంభాలు ఒరిగిపోవడం, కొన్నిచోట్ల విరిగిపోవడం, చాలా చోట్ల విద్యుత్ తీగలు కిందకు వంగిపోవడం వంటి సంఘటనలు చోటుచేసుకున్నాయి. వీటిని పునరుద్ధరించే వరకూ విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నారు. అధికారిక లెక్కల ప్రకారం రాష్ట్రంలో ఆదివారం 55 ఫీడర్ల పరిధిలో బ్రేక్‌డౌన్లు నమోదయ్యాయి. ఒక్కో ఫీడర్ పరిధిలో కనీసం 4 వేల విద్యుత్ కనెక్షన్లు ఉంటాయి. అంటే సుమారు 2.20 లక్షల మందికి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. 24 గంటల్లోనే విద్యుత్ పునరుద్ధరణ చర్యలు చేపడుతున్నామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, డిస్కమ్‌ల పరిధిలో ఇది సాధ్యం కావడంలేదని సిబ్బందే అంటున్నారు. స్తంభాలు విరిగి, ఒరిగిపోయినప్పుడు వాటిని మార్చేందుకు స్టాక్ ఉన్నప్పటికీ, మారుమూల ప్రాంతాలకు తీసుకెళ్ళడానికి కనీసం రెండు రోజులు పడుతోందని వారు చెబుతున్నారు. విశాఖ జిల్లాలో రోజుకు 12 నుంచి 18 వరకూ విద్యుత్ అంతరాయాలు నమోదవుతున్నాయి. కొద్దిపాటి వర్షం వచ్చినా వాటిని రీప్లేస్ చేయడం సాధ్యంకావడంలేదు. పంపిణీ సంస్థలకు సంబంధించిన లైన్లలో ఏ ఒక్క స్తంభం విరిగిపోయినా ఫీడర్ మొత్తం సరఫరా నిలిచిపోతోంది. గడచిన రెండు రోజులుగా ఇలాంటి సంఘటనలు రెండు డిస్కమ్‌ల పరిధిలో 40 వరకూ నమోదయ్యాయి.

జెన్‌కో ఉత్పత్తి నిలిపివేత

ఇదిలా ఉంటే.. గడచిన వారం రోజులుగా రాష్ట్ర జెన్‌కో ప్లాంట్లలో విద్యుత్ సరఫరా చాలా వరకూ నిలిపివేశారు. కృష్ణపట్నంలోని రెండు యూనిట్లలో ఏ ఒక్కటీ పనిచేయడంలేదు. ఈ రెండూ కలిపి 1600 మెగావాట్లు. అదే విధంగా ఆర్టీపీపీ, విజయవాడ ఎన్టీటీపీఎస్‌లోని మూడు యూనిట్లలో విద్యుత్ ఆపేశారు. ప్రైవేటు థర్మల్ విద్యుత్‌కు తోడు, పవన విద్యుత్ కూడా డిమాండ్‌లో సగానికిపైగానే ఉంటోంది. ఎంత భారీ వర్షాలు పడినప్పటికీ ఈ స్థాయిలో జెన్‌కో ప్లాంట్లను ఆపేసిన దాఖలాలు లేవని జెన్‌కో వర్గాలు అంటున్నాయి. పంపిణీ సంస్థల్లో ఉద్యోగుల కొరత కారణంగానే సకాలంలో అంతరాయాలను నివారించలేకపోతున్నారని వారు చెబుతున్నారు. ఈ కారణంగా జెన్‌కో ఉత్పత్తి నిలిపివేసి నష్టాలపాలు కావల్సివస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


తెలుగు వ్యక్తి అమెరికా పీఠాన్ని అధిరోహించాలి: యార్లగడ్డ



సాక్షి, న్యూఢిల్లీ/ఏయూ క్యాంపస్(విశాఖ తూర్పు): అమెరికా అధ్యక్ష పీఠాన్ని తెలుగు వ్యక్తి అధిరోహించే రోజు త్వరలోనే రావాలని కేంద్రీయ హిందీ సమితి సభ్యుడు, రాజ్యసభ మాజీ ఎంపీ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ ఆకాంక్షించారు. అమెరికాలోని డెట్రాయిట్‌లో జరుగుతున్న డెట్రాయిట్ తెలుగు సంఘం 40వ వార్షికోత్సవంలో శనివారం ఆయన ప్రసంగించారు. ఎన్టీ రామారావు 1993లో అమెరికా పర్యటన ముగించుకొని వచ్చిన తర్వాత మాట్లాడుతూ.. అమెరికా అధ్యక్ష పీఠాన్ని తెలుగు వ్యక్తి అధిరోహించే రోజు వస్తుందని చెప్పారన్నారు. అప్పుడు కొందరు వింతగా చూశారని, కానీ నేడు అమెరికా రాజకీయాల్లో పెనవేసుకున్న తెలుగు వారి బంధాన్ని చూస్తుంటే ఆ మాట నిజమవుతుందని అనిపిస్తోందన్నారు. మేరీల్యాండ్ ప్రతినిధుల సభ సభ్యురాలు కాట్రగడ్డ అరుణా మిల్లర్ మాట్లాడుతూ.. ప్రజాసేవ ద్వారా అమెరికా రుణం తీర్చుకోవాలనే ఉద్దేశంతో రాజకీయాల్లోకి వచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో డా.ముక్కామల బాబీ, సంఘం చైర్మన్ కోనేరు శ్రీనివాస్, సమన్వయకర్త మారెంరెడ్డి సాగర్, అధ్యక్షుడు అంచె హర్ష తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల నిర్లక్ష్యంతో గర్భిణి మృతి

పీహెచ్‌సీ ఎదుట బంధువుల ఆందోళన



మరణించిన గర్భిణి విజ్జేశ్వరి

లింగపాలెం: వైద్యుల నిర్లక్ష్యంతో ఓ నిండు గర్భిణి ప్రాణం కోల్పోయింది. ఈ హృదయవిదారక ఘటన పశ్చిమగోదావరి జిల్లా లింగపాలెం మండలం ధర్మాజీగూడెం పీహెచ్‌సీలో ఆదివారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. లింగపాలెం మండలం మఠంగూడెం పంచాయతీ సుందరరావుపేటకు చెందిన గర్భిణి దేవరపల్లి విజ్జేశ్వరి (23) కాన్పు కోసం ధర్మాజీగూడెం పీహెచ్‌సీకి శనివారం వచ్చింది. రాత్రంతా నొప్పులతో ఆమె బాధపడుతూనే ఉన్నా.. సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించారు. దీంతో బంధువులు ఆమెను చింతలపూడి తీసుకెళ్లిపోతామని చెప్పినా.. వారు వినిపించుకోలేదు. గర్భిణి బాధపడుతున్నా.. వైద్యాధికారి బి.మోజెస్ వినయ్‌కుమార్ రాలేదు. తీరుబడిగా ఆదివారం ఉదయం వచ్చిన ఆయన కనీసం ఆమెను చూడలేదు. సిబ్బంది కాన్పు చేయిస్తుండగా గర్భిణి మరణించింది. దీంతో బంధువుల్లో ఆగ్రహం పెల్లుబికింది. సుందరరావుపేటకు చెందిన ప్రజలు భారీగా తరలివచ్చి ఆస్పత్రిని చుట్టుముట్టారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిబ్బందిని, వైద్యుడిని తక్షణం సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఏలూరు– చింతలపూడి రహదారిపై ధర్నాకు దిగారు. వీరికి పోలీసులు నచ్చజెప్పి ధర్నా విరమింపజేశారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ నుంచి విచారణాధికారి వచ్చారు. దీనిపై స్పందించిన కలెక్టర్ కె.భాస్కర్ ఫోన్‌లో విచారణాధికారితో మాట్లాడారు. వైద్యుడిని సస్పెండ్ చేసి క్రిమినల్ చర్యలకు ఆదేశిస్తున్నట్టు చెప్పారు. దీంతో ఆందోళనకారులు శాంతించారు.

సీపీఎస్ రద్దు కోరుతూ సెప్టెంబర్ 1న మిలీనియం మార్చ్

వైఎస్సార్ టీఎఫ్, ఏపీటీఎఫ్ మద్దతు

సాక్షి, అమరావతి: కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్)ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎస్ ఉద్యోగుల సంఘం సెప్టెంబర్ 1న విజయవాడలో నిర్వహించబోతున్న మిలీనియం మార్చ్‌కు మద్దతు ప్రకటిస్తున్నట్లు ఏపీ వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఆ సంఘం ప్రధాన కార్యదర్శి ఓబుళపతి డిమాండ్ చేశారు. సామాజిక భద్రతలో భాగంగా సాధించుకున్న పాత పెన్షన్ విధానాన్ని రద్దు చేసి 2004లో సీపీఎస్ విధానాన్ని కేంద్రం ప్రవేశపెట్టిందని, దీన్ని రద్దు చేయాలని ఎంతోకాలంగా డిమాండ్ చేస్తున్నామని ఏపీటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్.రఘురామిరెడ్డి, పాండురంగ వరప్రసాదరావులు మరో ప్రకటనలో పేర్కొన్నారు. ఇందుకోసం నిర్వహించనున్న మిలీనియమ్ మార్చ్‌కు తాము కూడా మద్దతు ప్రకటిస్తున్నామని తెలిపారు.

విశ్వబ్రాహ్మణులకు రాజ్యాధికారం అందని ద్రాక్షే!

తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ మధుసూదనాచారి



స్వర్ణకార సంఘ నాయకులతో కలసి అభివాదం చేస్తున్న మధుసూదనాచారి

తణుకు అర్బన్: డబ్బు, రాజ్యాధికారమే ప్రపంచాన్ని శాసిస్తున్నాయని తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ మధుసూదనాచారి అన్నారు. కానీ విశ్వబ్రాహ్మణులకు రాజ్యాధికారం అందని ద్రాక్షలానే మిగిలిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం పశ్చిమగోదావరి జిల్లా తణుకులో జరిగిన స్వర్ణకార సంఘ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశ జనాభాలో తక్కువ శాతమున్న విశ్వబ్రాహ్మణులకు అవకాశాలు రాకపోవడం సహజమేనన్నారు. తన తండ్రిని ఆదర్శంగా తీసుకుని అంచెలంచెలుగా ఎదిగినట్లు చెప్పారు. విశ్వబ్రాహ్మణునిగా పుట్టడం తన అదృష్ట మన్నారు. అనంతరం పొడుగు రామాచారితో స్వర్ణకార సంఘ ప్రధాన కార్యదర్శిగా ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో కర్రి వేణుమాధవ్, వెంకటాచారి తదితరులు పాల్గొన్నారు.

ఫ్రెండ్ రిక్వెస్ట్‌లు పంపి.. ప్రేమ పేరుతో వంచన

- డబ్బులివ్వాలంటూ బెదిరింపులు
- కర్ణాటకలో ప్రభుత్వ ఉద్యోగిని నిర్వాకం.. అరెస్ట్



దొడ్డమణి

తుమకూరు: ధనిక యువకులను ఫేస్‌బుక్‌లో పరిచయం చేసుకుని ప్రేమ పేరుతో వంచించి తరువాత డబ్బుల కోసం బ్లాక్‌మెయిల్ చేస్తోన్న యువతిని పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. కర్ణాటకలోని తుమకూరు జిల్లా దొగ్గనహళ్ళి గ్రామానికి చెందిన దొడ్డ మణి (28) మధుగిరి పట్టణంలోని రాష్ట్ర విద్యుత్ కార్యాలయంలో క్లర్క్‌గా విధులు నిర్వర్తిస్తోంది. ఈమె తన ఫేస్‌బుక్ నుంచి ధనిక యువకులకు ఫ్రెండ్ రిక్వెస్ట్‌లు పంపుతుండేది. ఇలా పరిచయమైన యువకులను ప్రేమ పేరుతో సినిమాలకు, పార్క్‌లకు తిప్పుతూ ఆ సమయంలో తన సెల్‌ఫోన్‌లో ఫొటోలు తీసుకునేది. తరువాత తనకు అడిగినంత డబ్బులు ఇవ్వాలని లేని పక్షంలో ఫోటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తానని బెదిరించి భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేస్తుండేది. ఈ క్రమంలో ఆమెపై కొరటిగెరె పీఎస్‌లో ఫిర్యాదు నమోదవడంతో ఆదివారం నిందితురాలిని పోలీసులు అరెస్ట్ చేశారు. కాగా, ఈమె ఆగడాలపై ఇప్పటి వరకు తుమకూరు జిల్లాలో నాలుగు కేసులు నమోదైనట్లు పోలీసులు తెలిపారు.

తమిళనాడులో ముగ్గురి దారుణ హత్య

టీ.నగర్: తమిళనాడులో ముగ్గురు యువకులు దారుణహత్యకు గురయ్యారు. తిరుచ్చి తిరువానైకావల్ సమీపంలోని కల్లనై రోడ్డులో ఆదివారం ఉదయం వీరు శవాలుగా కనిపించారు. పోలీసుల కథనం మేరకు.. మృతి చెందిన ముగ్గురు యువకులు తిరువానైకావల్ కలంజియపురానికి చెందిన జేసీబీ డ్రైవర్లు వేలు (26), శంకర్ (35), లోకనాథంగా గుర్తించారు. వీరిలో వేలు అనే యువకుడు.. కలంజియపురానికి చెందిన అనసూయ (19)ను ప్రేమించాడు. వీరు ఇద్దరూ వేర్వేరు కులాలకు చెందిన వాళ్లు కావడంతో అనసూయ తల్లిదండ్రులు పెళ్లికి అంగీకరించలేదు. దీంతో వేలు, అనసూయ మూడు నెలల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయి స్నేహితుల సాయంతో వివాహం చేసుకున్నారు. అనంతరం వారు కోవిలడి ప్రాంతంలో నివసిస్తున్నారు. ఈ నేపథ్యంలో వేలు దారుణహత్యకు గురయ్యాడు. దీనిపై అనసూయను పోలీసులు విచారించగా శనివారం రాత్రి వేలు ఫోన్‌చేసి ఇంటికి వస్తానని చెప్పాడని తెలిపింది. కాగా, గుర్తు తెలియని వ్యక్తులు ఈ ముగ్గురిని కిడ్నాప్‌చేసి హతమార్చి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు.

హైదరాబాద్‌లో లలితా జ్యువెలరీ ప్రారంభం

షోరూం ప్రారంభించిన తెలంగాణ మంత్రి కేటీఆర్ దంపతులు



హైదరాబాద్: చెన్నైకి చెందిన ప్రముఖ ఆభరణాల తయారీ సంస్థ లలితా జ్యువెలరీ హైదరాబాద్‌లో అడుగుపెట్టింది. సోమాజిగూడ సర్కిల్‌లో 1.30 లక్షల అడుగుల విస్తీర్ణంలో దాదాపు రూ.750 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేసిన షోరూంను ఆదివారం మంత్రి కేటీఆర్ దంపతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా లలితా జ్యువెలరీ చైర్మన్ ఎం.కిరణ్‌కుమార్ మాట్లాడుతూ... తమ సంస్థ దేశవ్యాప్తంగా 14 స్టోర్స్ నిర్వహిస్తూ రూ.11 వేల కోట్ల వార్షిక టర్నోవర్ సాధిస్తోందన్నారు. దాదాపు రూ.750 కోట్ల పెట్టుబడితో దేశంలోనే అతి పెద్ద షోరూంను సోమాజిగూడలో ఏర్పాటు చేశామని, త్వరలో కూకట్‌పల్లి, విజయవాడ, రాజమండ్రిలో షోరూమ్స్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. రూ.3 వేల నుంచి రూ.3 కోట్ల విలువైన ఆభరణాలు తమ వద్ద లభిస్తాయన్నారు. అత్యంత నాణ్యమైన ఆభరణాలను అతి తక్కువ ధరకు అందిస్తున్నామన్నారు. తమ వద్ద ఆభరణాలను సెల్‌ఫోన్‌తో ఫోటోలు తీసుకొని ఇతర షోరూంలలో తనిఖీ చేసుకొని ధర నచ్చాకే ఇక్కడ కొనుగోలు చేయవచ్చన్నారు. జీఎస్టీ అమలు జ్యువెలరీ రంగంపై పెద్దగా ప్రభావం చూపదని చెప్పారు. ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. ఆభరణాలు తక్కువ ధరకు అందుబాటులో ఉండడం వల్ల సంస్థ లాభాల బాట పట్టి ప్రభుత్వానికి కూడా పన్నుల రూపంలో ఆదాయం వస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి బండారు దత్తాత్రేయ, ఎంపీలు టి.సుబ్బరామిరెడ్డి, అసదుద్దీన్ ఒవైసీ, తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న పుదుచ్చేరి సీఎం



శ్రీవారి ఆలయం వద్ద పుదుచ్చేరి సీఎం నారాయణస్వామి

సాక్షి, తిరుమల: పుదుచ్చేరి ముఖ్యమంత్రి నారాయణస్వామి ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం నైవేద్య విరామ సమయంలో ఆయన కుటుంబ సభ్యులతో కలసి ఆలయానికి వచ్చారు. రిసెప్షన్ డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్ వారికి ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూ ప్రసాదాలు అందజేశారు.

డెంగీతో తెలుగు వర్సిటీ ఉద్యోగి మృతి

హైదరాబాద్: తెలుగు విశ్వవిద్యాలయంలోని విస్తరణల సేవా విభాగంలో టైం స్కేల్ ఆఫీస్ సబార్డినేట్‌గా పనిచేస్తున్న నాగేశ్వరరావు డెంగీ వ్యాధితో శనివారం రాత్రి మృతి చెందారు. వివరాలు.. డెంగీ వ్యాధితో బాధపడుతున్న ఆయన నాలుగు రోజుల క్రితం ఉప్పల్‌లోని ఆదిత్య ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం చేరారు. అయితే ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా శనివారం గుండెపోటు రావడంతో ఆయన మృతి చెందారు. నాగేశ్వరరావు మృతి పట్ల తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య యశస్వీ సత్యనారాయణ ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

ఏదైనా తీసుకోండి.. ఎంతైనా తినండి


చెన్నై



మన జనాభాకు రెట్టింపు ఆహారాన్ని సమకూర్చుకునే సామర్థ్యం మనకు ఉంది. కానీ, 50 శాతం ఆహారాన్ని వృథాగా పడేస్తున్నాం. ఇలా వృథాగా పోతున్న ఆహారాన్ని.. ఆకలిగొన్న కడుపుల వద్దకు చేరిస్తే ఓ పెద్ద సమస్య పరిష్కారమైనట్టే. ఈ ఆలోచనలో నుంచి పుట్టిందే కమ్యూనిటీ ఫ్రిడ్జ్. ఇది చెన్నై నగరంలోని ఎల్లియట్ బీచ్‌లో ఉంది. అందులో పండ్లు, స్వీట్లు, జ్యూస్‌లు, బిర్యానీ ఇలా రకరకాల తినుబండారాలు ఉంటాయి. భోజన విరామ సమయం అయ్యిందంటే చాలూ ఎక్కడెక్కడి నుంచో గుంపులుగా వచ్చే ప్రజలు అందులోంచి ఎవరికి తోచింది వాళ్లు.. ఏం కావాలంటే అది... తీసుకుని తింటారు. ఇందుకోసం డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదు. ఇస్సా ఫాతిమా జాస్మిన్ ఇక్కడ ఈ ఫ్రిడ్జ్‌ను ఏర్పాటు చేశారు. వృత్తిరీత్యా డాక్టరైన ఫాతిమా.. ఆకలి బాధతో లక్షల సంఖ్యలో జనం మరణిస్తున్నారన్న వార్త పేపర్లో చదివి ఈ కమ్యూనిటీ ఫ్రిడ్జ్‌ను ఏర్పాటు చేశారు. ఈ ఫ్రిడ్జ్‌లో ఎవరైనా, ఏ ఆహారమైనా పెట్టొచ్చు. అవసరమైనవారు దానిని తీసుకొని తినవచ్చు. పార్టీలు, ఫంక్షన్లు ముగిసిన తర్వాత మిగిలిపోయిన ఆహారాన్ని ఎంతోమంది ఇక్కడికి తీసుకొచ్చి పెడుతున్నారట. అంతేకాక హోటళ్లు, రెస్టారెంట్లు కూడా ఇందులో భాగస్వాములవుతున్నాయట. చాలా గొప్పపని కదూ!

• కొత్త పుస్తకాలు

పలుకులమ్మ తోటమాలికి...



సుమారు లక్ష పుస్తకాలు సేకరించి, వాటిని అన్నమయ్య గ్రంథాలయంగా రూపాంతరించిన లంకా సూర్యనారాయణ అభినందన సంచిక ఇది. ఆయన జీవన రేఖలు క్లుప్తంగా ఇస్తూనే ప్రసిద్ధుల సాహిత్య వ్యాసాలతో వెలువరించారు.

సంపాదకుడు: మోదుగుల రవికృష్ణ; పేజీలు: 240(హార్డుబౌండు); వెల: 200; ప్రతులకు: అన్నమయ్య గ్రంథాలయం, బృందావన్ గార్డెన్స్, గుంటూరు. ఫోన్: 0863–2246365

కలం అలిగింది




ప్రతి పుట్టినరోజుకీ కొత్త సంకలనంతో పలకరించేవారు సినారె. అదే సంప్రదాయాన్ని కొనసాగిస్తూ ఆయన జయంతి(జూలై 29)కి సినారె బతికుండగా రాసిన 91 కొత్త కవితలతో ఈ సంకలనం వెలువరించారు మహోజ్వల్ ప్రచురణలు, హైదరాబాద్ వారు.

కవి: డాక్టర్ సి.నారాయణరెడ్డి; పేజీలు: 146; వెల: 150; ప్రతులకు: నవచేతన, నవోదయ పుస్తక కేంద్రాలు.

• విద్యార్థుల కవిత్వం

కలల్ని వెంటాడే విద్యార్థులు



ఈ ఎనిమిది మంది కవులు వాక్యాల మంత్రజలం చల్లి, వొక కొత్త సందేశాన్ని మన వొట్టిపోయిన రోజువారీ బతుకుల్లోకి వొంపుతున్నారు. వాళ్ళు వాళ్ళ కలల్ని వెంటాడుతూ వెళ్తూ మనం మరచిపోతున్న కలల్ని కూడా తట్టి లేపి వెళ్తున్నారు. అందుకే, వీళ్ళు 'స్వప్నసాధకులు'.

యంత్రాల సహవాసంలో యాంత్రికతే జీవితపు ఇరుసు అయిపోయిన సందర్భంలో అక్షరాలు అసందర్భమవుతాయి. సాహిత్యం అప్రస్తుత ప్రసంగమే అవుతుంది. కవిత్వం అనేది విరోధాభాసగా మిగిలిపోతుంది. ఆ చేదు విషాన్ని జీర్ణించుకోలేని విషాదంలో వుండగానే ఇదిగో ఇక్కడ ఎనిమిది మంది విద్యార్థులతో అష్ట దిగ్బంధనం చేస్తున్నాడు బాలసుధాకర్ మౌళి. ఈ ఎనిమిది మంది కవులు వాక్యాల మంత్రజలం చల్లి, వొక కొత్త సందేశాన్ని మన వొట్టిపోయిన రోజువారీ బతుకుల్లోకి వొంపుతున్నారు. వాళ్ళు వాళ్ళ కలల్ని వెంటాడుతూ వెళ్తూ మనం మరచిపోతున్న కలల్ని కూడా తట్టి లేపి వెళ్తున్నారు. అందుకే, వీళ్ళు 'స్వప్నసాధకులు'.

స్వప్నం అంటే దాన్ని సాధించడం అంటే ఎప్పుడైనా నాకు గుర్తొచ్చే పేరు మార్టిన్ లూథర్ కింగ్. నల్లజనం హక్కుల కోసం నినదించిన స్వరం. కాని, అది కేవలం నల్లజనం స్వరమే కాదు, పీడితులు ఎక్కడైనా అదే స్వరతీవ్రతతో మాట్లాడ్తారు, మాట్లాడుతూనే వున్నారు, అదే స్వప్న జ్వరంతో! ఆ స్వప్న సాధనలో మార్టిన్ ఎప్పుడో అన్న ఈ వొక్క వాక్యం మనమూ అంటున్నామా లేదా అన్నది ఇన్నేళ్ళ తరవాత మళ్ళీ మనల్ని మనం ప్రశ్నించుకోవాలి. నిలదీసి ప్రతివొక్కరినీ అడగాలి.

I have a dream that my four little children will one day live in a nation where they will not be judged by the color of their skin but by the content of their character.

యీ వాక్యం యే తరానికైనా మేనిఫెస్టో కావాలి.

అందుకే, ఇవాళ హరి అంటున్నాడు: ఆకలి నాకు తోబుట్టువు లాంటిది–అని! అక్కడితో ఆగితే అది కేవలం కవిత్వ వాక్యమే అయ్యేది. ఆ తరవాత ఏమన్నాడో చూడండి:

మేమిద్దరమే గదిలో
మాట్లాడుకుంటున్నాం
మాకు తోడూ నీడా లేదు
మాతో మాట కలపడానికి ఎవరూ లేరు
ప్రభుత్వాలు మార్తున్నాయి
అధికారాలు మార్తున్నాయి
అయినా మేమిద్దరమే
మాట్లాడుకుంటున్నాం.

కవిత్వం ఎక్కడ కవిత్వం అవుతుందీ అంటే అది పరిసరాలతో, చుట్టూ వున్న మనుషుల్తో సంభాషణలో పడ్డప్పుడు! ఈ యెనిమిది మంది కవులూ కవిత్వం కోసం కవిత్వం రాయలేదు. వొక మాట్లాడక తప్పని పరిస్థితి శాసించడం వల్ల కవిత్వం రాశారు.

మోహిని కవిత వినండి:

అతని కోసం ఎదురుచూస్తున్నాం
అతని అడుగుల జాడని వెతుక్కుంటూ
వున్నాం

ఆకలితో పోరాటం చేసిన వాడే జీవితంతోనూ పోరాడగలడు. పనికిమాలిన పాఠాల మధ్య తరగతి గదిని సమాధి చేయకుండా నిత్య చైతన్య ఉత్సవంగా మార్చగలడు. అతని ప్రతి వాక్యం వీరగానమే అవుతుంది. వొక్క మోహిని మాత్రమే అలాంటి గానం కోసం ఎదురుచూస్తోందా?! కాదు!

అలా ఎదురుచూసే వాళ్ళ ముఖాలు విజయ అన్నట్టు 'ఈ రాత్రి ఆకాశం /ఒక స్త్రీ ముఖంలానూ కనిపిస్తుంది!' ఎదురుచూపులకు జెండర్ లేదు, కులం లేదు, మతం లేదు, రంగు లేదు. ఆకలికి లేనట్టే!

ఆకలి అంతమయ్యే రోజు వస్తుందన్న ఊహాజీవి ఉమామహేశ్‌ని వినండి:

ఈ రోజు ఉదయం కురిసిన వాన
పంటలను పండిస్తుంది.

చిన్న వాక్యం చాలు కదా, వొక ఆశ వెలగడానికి!

దాలినాయుడు ఆచరణ వేపు వెళ్తూ అంటున్నాడు:

ఒక అర్ధరాత్రి వేళలో
అమ్మ, నేనూ
చెరువులో వున్న నీటిని
పొలంలోకి తోడుతున్నాం.

ఆచరణ పొలాల్లో మొదలవ్వాలి. అనుచరులు పల్లెల్లోంచి రావాలి. పొలం పోరాట ప్రతీక కావాలి.

అలాంటప్పుడు గౌతమ్ చెప్పినట్టు: వూరు వెళ్లి రావాలి/ ఒక్కసారైనా ఆ ప్రపంచాన్ని కలిసి రావాలి

అలా వెళ్ళినప్పుడల్లా శేఖర్ అన్నట్టు:

ఒక్కొక్కటి ఏరుకుంటూ
ఒక దగ్గరకు పోగు చేయాలి.

ఎన్ని వొంటరి ప్రపంచాలు కలిస్తే వొక సమూహం అవుతుందో విద్యార్థులకే బాగా తెలుసు.

జీవితమంతా అలజడికీ యుద్ధానికీ మధ్యనే వుందని కమలాకర్ అంటున్నాడు ఇదే సందర్భంలో.

ఇన్ని కవిత్వ సందర్భాల్ని ఈ విద్యార్థుల జీవితాల్లోకి ప్రసరించిన తొలి ఉపాధ్యాయుడు బాల సుధాకర మౌళికి తోటి ఉపాధ్యాయుడిగా నా మాటల్లో చెప్పలేనిది ఇదిగో ఈ గ్రీకు రచయిత చెప్తున్నాడు వేరే సందర్భంలో:

True teachers are those who use themselves as bridges over which they invite their students to cross; then, having facilitated their crossing, joyfully collapse, encouraging them to create their own." (Nikos Kazantzakis)

కాని, ఆ గ్రీకు రచయిత కన్నా, నా కన్నా బాగా మౌళి విద్యార్థి మోహిని ఇంకా బాగా చెప్పింది:

అతను చెప్పిన మాటలు రక్తంలో
ఇంకిపోతాయి.

గొప్ప జీవన పాఠం చేసే పని అదే కదా! కల చేసే పని కూడా అదే!

(స్వప్న సాధకులు: సంపాదకుడు: బాలసుధాకర్ మౌళి; ప్రచురణ: చంపావతి ప్రచురణలు; ప్రతులకు: సంపాదకుడు, బోయ స్ట్రీట్, నెల్లిమర్ల, విజయనగరం–535217. ఫోన్: 9676493680)

❖ **అఫ్సర్**

• ఐదు ప్రశ్నలు

రాయడమంటే ప్రేమలేఖ రాసినట్టు

పరవస్తు లోకేశ్వర్ 'షహర్‌నామా: హైద్రాబాద్ వీధులు–గాథలు' వెలువడిన నేపథ్యంలో ఆయనతో సాక్షి సాహిత్యం ప్రతినిధి జరిపిన చిరు సంభాషణ:



పరవస్తు లోకేశ్వర్

ఈ 'షహర్‌నామా' రాయాలన్న ఆలోచన ఎలా వచ్చింది?

పుట్టిందీ పెరిగిందీ ఇక్కడే. ఈ గల్లీల్ల గాలికి తిరిగిన. 1990 వరకు ఓల్డ్ సిటీలనే ఉన్న. మా ఫాదర్ ఉర్దూ పండితుడు. చాలామంది ముస్లిం మిత్రులు ఉండేవారు. అదంతా మనసులవుండి రాయాలనిపించింది. కుశ్వంత్‌సింగ్ 'దిల్లీ' మీదా, అబ్దుల్ హలీమ్ షరర్ 'లఖ్‌నవూ' మీదా రాసినట్టు నాకు కూడా హైద్రాబాద్ మీద రాయాలనిపించింది. నరేంద్ర లూథర్ కూడా రాసిండు. ఆయన పంజాబీ అయ్యుండి రాసుడు గొప్ప విషయం. అయితే నన్ను నేను ఈ భూమిపుత్రుణ్ని అనుకుంట. నేను రాస్తే మరింత సహజంగా వస్తుందనుకున్నా.

సమాచార సేకరణ ఎలా చేశారు?

ప్రత్యేకంగా రీసెర్చ్ చేసిందేమీ లేదు. చిన్నప్పటినుంచీ హైద్రాబాద్ గురించి చదువుతనే ఉన్న, వింటనే ఉన్న, పామరజనులతోటి మాట్లాడుతనే ఉన్న. ఆ కథలు, ముచ్చట్లు, జ్ఞాపకాలు నా మనసులో ఉన్నయి కాబట్టి అవలీలగా రాయగలిగిన. పైగా నాకు పెద్ద పర్సనల్ లైబ్రరీ ఉంది. రాయడానికి కూర్చున్నప్పుడు చరిత్రకు సంబంధించిన వాటిల్లో ఏమైనా తప్పులు రాకుండా ఉండటం కోసం మాత్రం క్రాస్‌చెక్ చేసుకున్న.

'హైద్రాబాద్ వీధులు–గాథలు' రాయడంలో ఉన్న ఆనందం ఏమిటి?

చాలామంది ఒక రచన చేయడమంటే ప్రసవవేదన పడటం అని పెద్ద పెద్ద మాటలు చెప్తరు. నాకు రాయడం అంటే ప్రియురాలికి ప్రేమలేఖ రాస్తున్నంత హాయిగా ఉంటది. ఇదే కాదు, 'సలాం హైద్రాబాద్' రాసినా, చత్తీస్‌ఘడ్, సిల్క్‌రూట్, యూరప్ యాత్రలు... ఏది రాసినా సింగిల్ స్ట్రోక్‌లో రాసిన. రాసినంక ఒక్క అక్షరం కూడా మార్చుకోను. పేపర్ మీద పెన్ను పెట్టడం కంటే ముందే ప్రతి వాక్యం, ప్రతి పదం రిహార్సల్ చేసుకుంట. మళ్లీ సవరింపులు, కుదింపులు, కొట్టివేతలు, ఫెయిర్ కాపీలు ఉండవు. అతిశయోక్తి అనుకోవద్దు, నా రచనా పద్ధతి ఇది.

అసలు హైదరాబాద్ ఏమిటి మీకు?


ప్రపంచంల ఏ నగరం కూడా ప్రేమ కోసం నిర్మించబడలేదు. జాతీయం, అంతర్జాతీయం ఏదైనా తీసుకోండి. ఒక ప్రియుడు ఒక ప్రియురాలికి కానుక ఇద్దామని నిర్మించిన నగరం ఇది. ఖైరున్నీసా, మహ లఖా బాయి, విఖారుల్ ఉమ్రా... ఇట్లా ఎన్నో ప్రేమలు కనబడుతాయి. చలం అంటాడు: ప్రేమ అనేది వ్యక్తిగత విషయం కాదు, స్త్రీ పురుషుల మధ్య ప్రేమ సమాజ ఔన్నత్యానికి దారి తీయాలి, అని. ఆ ప్రేమల వల్ల ఒక పురానాపూల్ దక్కింది, ఒక విఖార్ మంజిల్ దక్కింది. ఒక చార్మినార్ దక్కింది. 'హైద్రాబాద్ కీ హవా ఏక్ లాఖ్ కీ దవా' అంటరు. ఇంత మంచి వాతావరణం ఎక్కడా ఉండదు. గేట్‌వే ఆఫ్ సౌతిండియా. అన్ని మతాలు, ప్రాంతాల వాళ్ల కడుపు నింపే అన్నపూర్ణ. హైదరాబాద్ అంటే ఇవన్నీ.

పాత భాగ్యనగర ప్రేమికుడిగా కొత్త హైదరాబాద్ మార్పులను ఎలా చూస్తారు?

అంగీకరించక తప్పదు. అందుకే పాత వైభవాన్ని తలచుకుని ఆనందపడటం! ఇప్పటి తరానికి అప్పటి గొప్పతనం ఏమిటో చెప్పడం కోసమే ఆ చరిత్రను రికార్డ్ చేసిన.

(షహర్‌నామా: హైద్రాబాద్ వీధులు– గాథలు; పేజీలు: 208; వెల: 110; ప్రతులకు: గాంధి ప్రచురణలు, 12–2–709/5/1/సి, నవోదయ కాలనీ, హైదరాబాద్–28. ఫోన్: 9160680847)

• కవిత



వర్షాకాలపు రాత్రి

ఇంకా పక్షులు కిచకిచమంటూ
బహుళ మాండలికాల్లో
నీడల వలల్ని ఏరుకుంటున్నాయి
పొడవాటి చెట్ల నీడలు
జాడలేని అడవి దారుల్లోకి
నడుస్తున్నాయి
నీడల నాగలి కలల్ని దున్నుతూనే ఉంది
సూర్యుడి చుట్టూ యింతవరకూ
తచ్చాడిన వింత వర్ణాలన్నీ
యిపుడు ఎక్కడకి మాయమయ్యాయి?
సాయంత్రపు రుతువు
కొండపక్క దారుల్లోకి ఎపుడు
మాయమయిందో?

తల్లి జోకొడుతుంటే గాఢమయే
పసిపిల్లాడి కంటి మీద నిద్రలాగ
శబ్దాలన్నీ రాత్రి మౌనంలోకి
కరుగుతున్నాయి
ఇప్పటివరకు మబ్బుల మధ్యే
తిరుగాడిన చంద్రలోలకం
ఇపుడు గదిలోకి కూడా ప్రవేశించింది


పచ్చి ఆకులు
ఒళ్ళంతా పరుచుకున్నట్టు
తేమగా, చలిగా
తూర్పు సముద్రపు గాలి.

అడవి అంచుల్లోంచి
చిత్తం చిత్తడిలోకి
బరువుగా ఇంకుతూ
యీ వర్షాకాలపు రాత్రి...

❖ **ఆకెళ్ళ రవి ప్రకాష్**
9490517777

• నాకు నచ్చిన 5 పుస్తకాలు

ఏవని తడవనూ ఎన్నని చెప్పనూ



కంపల్లె రవిచంద్రన్
9848720478

తేనెతుట్టె మీద రాయి విసిరితే తేనెటీగలు ఝుమ్మని రొద చేస్తూ ఎంత కంగారు పెడతాయో, ఇష్టమైన పుస్తకాలు అనగానే మనం చదివిన పుస్తకాలు కూడా అంతే కంగారు పెడతాయి. అయినా అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని సావకాశంగా ఆలోచించినప్పుడు మస్తిష్కాకాశంలో శుక్రుడిలా కొన్ని పుస్తకాలు మిలమిలా మెరుస్తాయి. అలా మెరిసిన కొన్ని తారకలు:

లస్ట్ ఫర్ లైఫ్

జీవితచరిత్రలంటే మొదటగా స్ఫురించే పేరు ఇర్వింగ్‌స్టన్. ఆయన రాసిన 'లస్ట్ ఫర్ లైఫ్' నన్ను నిలువెల్లా కదిలించింది. చిత్రకారుడు విన్సెంట్ వాంగో జీవితపు ప్రయాణాన్ని ఇది కళ్లముందుంచుతుంది. వాంగో బొమ్మలు వేసిన విధానం, ఉపయోగించిన గాఢమైన వర్ణాలు, అసామాన్యరీతిలో చేసిన వర్ణసమ్మేళనం చూస్తే నిశ్చేష్టులవుతాం. ఈ మాటలు అతిశయోక్తి కాదనడానికి 'సన్‌ఫ్లవర్', 'బూట్స్' చిత్రాలు చాలు! ఇంత ప్రతిభ గల వాంగో జీవితం ఆసాంతం విషాదభరితం. బొగ్గుగని పరిసరాలు, కార్మికుల రూపాలు, మండించే ఎండ... ఎక్కడా నాటకీయతను చొప్పించకుండా, రాగద్వేషాలకు అతీతుడైన యోగిలాగా ఇర్వింగ్‌స్టన్ ఈ రచన చేశాడు.

ఉన్నై పోల్ ఒరువన్

తమిళంలో నా అభిమాన రచయిత జయకాంతన్. ఆయన నవల 'ఉన్నై పోల్ ఒరువన్' నాకెంతో ఇష్టం. భర్త పోయిన ఒక స్త్రీ. ఆమెకో పదేళ్ల కొడుకు. చిలుకజోస్యం చెప్పేవాణ్ని ఆమె వలచింది. అతడూ వీరిద్దరినీ నిష్కల్మషంగా అభిమానిస్తాడు. కానీ పసివాడు అతడిని ద్వేషిస్తాడు. సంభ్రమాశ్చర్యాలకు లోనుగావించే సంఘటనలుగానీ, గొప్ప మలుపులుగానీ ఉండవు. 'లీనియర్ ప్రోగ్రెస్'తో సాగిపోయే కథ. దీన్ని ఒక రచయిత(సారీ! పేరు జ్ఞాపకం లేదు) 'నీలాంటి ఒకరు' పేరుతో తెలుగులోకి అనువదించారు. ఈ నవలను వేరొక దర్శకుడికి ఇవ్వడం ఇష్టంలేక జయకాంతనే అతితక్కువ ఖర్చుతో, సినీరంగంతో పరిచయం లేని నటులతో సినిమాగా రూపొందించి జాతీయ బహుమతి గెలుచుకున్నారు.

వాగ్దత్త

శరత్‌బాబు రాసిన నవలల్లో 'వాగ్దత్త' నాకు మధురస్మృతిగా మిగిలిపోయింది. ముగ్గురు స్నేహితులు ఒక గ్రామంలోని బళ్లో చదువుకుంటూ ఉంటారు. తమ తదనంతరం తమ పిల్లలు తమ స్నేహబంధాన్ని శాశ్వతంగా నిలపాలని వారు తపిస్తారు. ఇతివృత్తం చాలా తక్కువ. కథకంటే కథనం మనోహరంగా ఉంటుంది. 'మనిషికి కావాల్సింది మతాచరణ కాదు. నిర్మల అంతఃకరణం' అనే సందేశాన్నిచ్చే ఇది 'దత్త' పేరుతో బెంగాలీలో సినిమాగా రూపొందింది. నవల ఆధారంగా ఆత్రేయ తానే దర్శకుడై 'వాగ్దానం' నిర్మించారు. బెంగాలీ చిత్రంలోని నిజాయితీ ఇందులో లోపించడంవల్ల నిరాశ పరుస్తుంది.

చెమ్మీన్

మలయాళ సాహిత్యంలో తగలి శివశంకర్ పిళ్లై భీష్మాచార్యుని వంటివారు. భార్య తప్పు చేసినట్లయితే సముద్రం మీద వేటకు వెళ్లిన భర్తకు ప్రాణహాని జరుగుతుందని కేరళ మత్స్యకారుల కుటుంబాల్లో ఒక నమ్మకం ఉండేది. దాని ఆధారంగా రాసిన ముక్కోణపు ప్రేమ నవల చెమ్మీన్. మతాంతర ప్రేమను అటు సమర్థించకుండా, ఇటు నిరసించకుండా దానికి సమాంతరంగా నిలిచిన సంప్రదాయ సమాజాన్ని తగళి ఆవిష్కరించాడు. విజయా సంస్థతో అనుబంధమున్న దర్శకుడు రామూ కారియత్ మొండిమనిషి తగళిని ఒప్పించి దీన్ని తెరకెక్కించాడు. చిత్రం జాతీయ పురస్కారం గెలుచుకుంది. గన్నవరపు సుబ్బరామయ్య దీన్ని 'రొయ్యలు' పేరుతో తెలుగులోకి చక్కగా అనువదించారు.

కుట్ర

రంగనాయకమ్మ రాసిన నవలల్లో అంతగా ప్రాచుర్యం పొందని గొప్ప రచన 'కుట్ర'. విప్లవకారుల నినాదాలనూ, వాళ్ల గోడలమీది రాతలనే ఆమె తన రచనకు ఆధారం చేసుకున్నారు. కేవలం భాషకు సంబంధించిన అంశాల మీద ఒక నవలను రాయడం సాహసమే. తెలుగు భాషలో చోటు చేసుకున్న కృత్రిమ వాక్య నిర్మాణాలను ఆమె తూర్పారబట్టారు. తెలుగుభాషా సంప్రదాయాలు బొత్తిగా తెలియని విప్లవకారులు 'కుట్రలేం చేస్తారు?' అని వాదిస్తారు. అసలు కుట్రే లేనప్పుడు వారిపై బనాయించిన కుట్ర కేసులన్నీ 'ఉత్త హంబగ్' అంటారు. ఇందులో 'జడ్జి' పాత్ర హాస్య, వ్యంగ్య వైభవంతో అలరారుతుంది.

• కవిత

ఖాళీ గమ్యం



గమ్యానికి యే వైపునో
రాత్రి తిరుగుతోంది
కలే కుదురుకోదు

మోయలేని భావం
భాష కాలేదెన్నడూ

ఊహించిన ఆలోచనే
ఉపన్యాస సన్యాసంలో

సీతాకోకచిలుక
మొరుగుతోంది
తూనీగ గాండ్రిస్తోంది

దేహంతాల్ని దర్శించే
దుర్బల అక్షరాలు

ఏ సమాధానమూ వినపడదు
ప్రేక్షకుడా
తోలులేని తెర దిగింది

శ్వాసకుడా
వెనువెంటనే తిరిగి చూడకు
కదలని చిత్రాలే నిద్రలో

యింకా వొదలదు గమ్యం

❖ **ఎం.ఎస్.నాయుడు**

• పుస్తక పరిచయం

శేషాద్రి రమణ కవుల పరిశోధన వ్యాసమంజరి



శేషాద్రి రమణ కవులుగా ఖ్యాతిగాంచిన శతావధానులు, పండిత సోదరులు దూపాటి శేషాచార్యులు, దూపాటి వెంకట రమణాచార్యులు. గుంటూరు జిల్లాలో జన్మించిన వీరు 20వ శతాబ్దపు ఆరంభంలో రెండున్నర దశాబ్దాల పాటు విస్తారంగా పర్యటించి, శాసనాలు బయటకు తీసి, తెలంగాణ చరిత్రకు, సాహిత్యానికి సంబంధించి అనేక అమూల్యాంశాలను వెలుగులోనికి తెచ్చారు. వీటిని అప్పటి భారతి, ఆంధ్రపత్రిక, రెడ్డిరాణి, శారద వంటి పత్రికల్లో ప్రచురించారు. 'తెలంగాణ చరిత్రను పునర్నిర్మించుకునే ప్రయత్నాలు చేస్తున్న తరుణంలో' ఆ సోదరుల చరిత్ర వ్యాసాలను తెలంగాణ సారస్వత పరిషత్తు సంకలనంగా తెచ్చింది. 'ఈ గ్రంథంలో కాకతీయుల కాలపు చరిత్రకు సంబంధించిన వ్యాసాలతోపాటు నిజాము రాష్ట్ర వాఙ్మయానికి సంబంధించిన అనేక విలువైన వ్యాసాలున్నాయి'. అనుబంధంగా వారి పద్యరూప అసంపూర్ణ ఆత్మకథనూ, వారి వాఙ్మయ సూచికనూ ఇచ్చారు.

సంపాదకులు: డాక్టర్ సి.నారాయణరెడ్డి, డాక్టర్ జె.చెన్నయ్య; పేజీలు: 360; వెల: 200; ప్రచురణ: తెలంగాణ సారస్వత పరిషత్తు, తిలక్ రోడ్, ఆబిడ్స్, హైదరాబాద్–500001. ఫోన్: 040–24753724

• ఈవెంట్

కన్యాశుల్కం 125 ఏళ్ల ఉత్సవాలు

ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో మొజాయిక్ సాహిత్య సంస్థ నిర్వహిస్తున్న 'గురజాడ కన్యాశుల్కం– 125 ఏళ్ల జాతీయోత్సవా'లలో చివరి రోజైన నేడు విజయనగరంలోని గురజాడ స్మారక మందిరంలో జాతీయ ఉత్సవాల సావనీర్ ఆవిష్కరణ కానుంది. మండలి బుద్ధప్రసాద్, పరకాల ప్రభాకర్, డి.విజయభాస్కర్ పాల్గొంటారు.

ఆకాశవాణి సేవపై సదస్సు

సాహిత్య అకాడెమి, ఆకాశవాణి–హైదరాబాద్, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంయుక్తంగా ఆగస్టు 28, 29 తేదీల్లో 'తెలుగు భాషా సాహిత్య సేవలో ఆకాశవాణి' సదస్సును రవీంద్ర భారతిలో నిర్వహిస్తున్నాయి. ఎస్.పి.మహాలింగేశ్వర్, ఎన్.గోపి, వి.ఉదయ శంకర్, మామిడి హరికృష్ణ పాల్గొంటారు. కీలకోపన్యాసం: ఆర్.వెంకటేశ్వర్లు. వివిధ అంశాలపై రేడియోతో అనుబంధమున్న ప్రసిద్ధులు పత్ర సమర్పణ చేస్తారు. ఇదే వేదిక మీద జరిగే 'కవిసంధ్య'లో 28న సాయంత్రం 4 గంటలకు ఆశారాజు, 29న సాయంత్రం 5 గంటలకు సుధామ తమ కవితలు చదివి వినిపిస్తారు.

సినారె సాహిత్యంపై సదస్సు

ఉస్మానియా శతాబ్ది ఉత్సవాల సందర్భంగా విశ్వవిద్యాలయ తెలుగు శాఖ డాక్టర్ సి.నారాయణరెడ్డి సాహిత్యంపై ఆగస్టు 30, 31 తేదీల్లో జాతీయ సదస్సు నిర్వహిస్తోంది. వేదిక: ఆర్ట్స్ కళాశాల రూమ్ నం.57. ఈ రెండ్రోజుల సదస్సులో సినారె సాహిత్యంలోని భిన్నాంశాల మీద పలువురు పత్ర సమర్పణ చేస్తారు. ఆచార్య రామచంద్రం, ఎన్.గోపి, టి.పాపిరెడ్డి. ఎస్వీ సత్యనారాయణ, నందిని సిధారెడ్డి పాల్గొంటారు.

పాదముద్రలు ఆవిష్కరణ

ప్రభాకర్ జైనీ కవితా సంకలనం పాదముద్రలు ఆవిష్కరణ సెప్టెంబర్ 3న సాయంత్రం 6 గంటలకు రవీంద్ర భారతి సమావేశ మందిరంలో జరగనుంది. ఆవిష్కర్త: ఎన్.గోపి.

బిక్కి కృష్ణకు పురస్కారం

2017 పాతూరి మాణిక్యమ్మ స్మారక పురస్కారానికి బిక్కి కృష్ణ కవితా సంపుటి 'కాలం నది ఒడ్డున' ఎంపికైంది. పురస్కార ప్రదానం సెప్టెంబర్ 10న సాయంత్రం 5 గంటలకు నెల్లూరులోని రేబాల లక్ష్మీనరసారెడ్డి స్మారక భవనంలో జరగనుంది.

కవితల పోటీ

రెయ్యి వీరాస్వామి స్మారక కవితల పోటీకి కవితలను ఆహ్వానిస్తున్నారు. ఉత్తమ కవితకు 5 వేలు బహుమతి. ఒక కవి తన కవిత మూడు ప్రతులు పంపాలి. చివరి తేదీ: సెప్టెంబర్ 20. చిరునామా: ఆర్.ఆదినారాయణ, టీచర్, కొండపేట, చిన్నబజార్, భీమునిపట్నం–531163

గిడుగు జయంతి ఉత్సవం

గిడుగు రామమూర్తి పంతులు ఫౌండేషన్ ఆధ్వర్యంలో గిడుగు జయంతి ఉత్సవం ఆగస్టు 29న సాయంత్రం 6 గంటలకు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరగనుంది. జస్టిస్ చల్లా కోదండరాం, జస్టిస్ బి.చంద్రకుమార్ పాల్గొంటారు. ప్రభాకర్ జైని, జి.లక్ష్మీనరసయ్య, శిఖామణికి పురస్కారాలు అందిస్తారు.

కవితల పోటీ ఫలితాలు

పాలపిట్ట–విమల సాహితి సమితి నిర్వహించిన కవితల పోటీల్లో నల్లా నరసింహమూర్తి, రత్నాల బాలకృష్ణ, వై.హెచ్.కె.మోహనరావు వరుసగా 1, 2, 3 బహుమతులు గెలుచుకున్నారు. మరో పది మంది ప్రత్యేక బహుమతికి అర్హులయ్యారు.

గ్రహం అనుగ్రహం

శ్రీ హేవిళంబి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, భాద్రపద మాసం. తిథి శు.సప్తమి రా.12.33 వరకు, తదుపరి అష్టమి. నక్షత్రం విశాఖ రా.9.22 వరకు, తదుపరి అనూరాధ. వర్జ్యం రా.1.44 నుంచి 3.30 వరకు. దుర్ముహూర్తం ప.12.26 నుంచి 1.16 వరకు, తదుపరి ప.2.56 నుంచి 3.46 వరకు. అమృత ఘడియలు ఉ.11.48 నుంచి 12.07 వరకు.

సూర్యోదయం : 5.48
సూర్యాస్తమయం : 6.16
రాహుకాలం : ఉ.7.30 నుంచి 9.00 వరకు
యమగండం : ఉ.10.30 నుంచి 12.00 వరకు

నమాజ్ వేళలు

ఫజర్	4.48
జొహర్	12.17
అసర్	4.44
మగ్రీబ్	6.33
ఇషా	7.47



ఆదివారం కాకినాడలోని అన్నమ్మఘాటీ సెంటర్‌లో అశేష జనసందోహాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్. చిత్రంలో పార్టీ నేతలు



అన్నమ్మఘాటీ సెంటర్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు హాజరైన జనసందోహంలో ఓ భాగం

ఓటుతో బుద్ధి చెప్పండి

కాకినాడతో మార్పునకు శ్రీకారం చుట్టండి

ప్రజలకు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు జగన్ పిలుపు

కాకినాడ నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి

చైతన్యవంతులైన కాకినాడ ప్రజలు కార్పొరేషన్ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు ఓటేసి రాష్ట్ర భవిష్యత్తు మార్పునకు శ్రీకారం చుట్టాలని ఆ పార్టీ అధ్యక్షుడు, రాష్ట్ర ప్రతిపక్ష నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఏడాది తర్వాత జరగబోయే అసెంబ్లీ ఎన్నికలనే కురుక్షేత్ర మహాసంగ్రామానికి కాకినాడ ఎన్నికలు నాంది పలకాలన్నారు. కేవలం ఎన్నికలలో గట్టెక్కడం కోసమే అన్ని వర్గాలకు అసంఖ్యాక హామీలిచ్చి తర్వాత మోసం చేయడం చంద్రబాబు నైజం అన్నారు. అన్నింటా మోసాలతోనే మూడున్నరేళ్ల కాలం గడిపేశారని చెప్పారు. వాటి అమలు కోసం డిమాండు చేసినవారిపై కన్నెర్ర జేస్తున్నారని, కేసులు బనాయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి ప్రభుత్వం అవసరమా? దీనికి స్వస్తి పలకాలని పిలుపునిచ్చారు. ఇలాంటి రాజకీయ వ్యవస్థలో మార్పు కోసం, జవాబుదారీతనం కోసం పోరాడుతున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి పౌరులు మద్దతు పలకాలని కోరారు. ధర్మానికీ అధర్మానికీ మధ్య జరుగుతున్న పోరులో ధర్మం వైపు నిలబడాలని విన్నవించారు. ఈనెల 29న జరుగనున్న కార్పొరేషన్ ఎన్నికల ప్రచారానికి ఆఖరి రోజయిన ఆదివారం ఆయన కాకినాడలో విస్తృత ప్రచారం నిర్వహించారు. పలు రోడ్డు షోల్లో పాల్గొన్నారు. ఉదయం అన్నమ్మ ఘాటి, మధ్యాహ్నం 3 గంటలకు డెయిరీఫారం సెంటర్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభల్లో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పరిపాలనా తీరుపై ధ్వజమెత్తారు. మోసానికి, వంచనకు మారుపేరుగా మారాడని విమర్శించారు. ఎప్పుడూ నిజమే చెప్పేవాడిని సత్యహరిశ్చంద్రుడు అంటాం కానీ నోరు విప్పితే అబద్ధాలే చెప్పేవాడు చంద్రబాబు అని వ్యంగ్యంగా అన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇచ్చిన ఏ హామీని అమలు చేయకపోగా డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాలను సైతం అటకెక్కించారని ధ్వజమెత్తారు. జగన్ ప్రసంగంలోని ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే....

అన్నింటా మోసమే..

''చంద్రబాబు అధికారంలోకి వచ్చి మూడున్నర ఏళ్లు అయింది. ఎన్నికలకు ముందు ఏమి చెప్పారో ఇప్పుడేమి చేశారో మీరే చెప్పండి. ప్రతి పేద వాడికీ మూడు సెంట్ల స్థలం అన్నాడు, ప్రతి పేదకూ ఇల్లు అన్నాడు. ఈ మూడున్నర ఏళ్లలో ఒక్క ఇల్లన్నా కట్టించాడా? (లేదు, లేదు అంటూ ప్రజలు రెండు చేతులెత్తి చూపించారు) దీన్నేమంటాం.. మోసం.. చంద్రబాబు మోసం చేశాడు. రేషన్ సరకుల పంపిణీలోనూ ఇలాగే జరిగింది. గతంలో బియ్యం, కిరోసిన్, చక్కెర, పామాయిల్, గోధుమ పిండి వంటివి ఇచ్చేవారు. ఇప్పుడు బియ్యం తప్ప మరేమీ ఇవ్వడం లేదు. ఇది మోసం కాదా? (అవును అవును అంటూ ప్రజలు పెద్ద ఎత్తున స్పందించారు.)

> ప్రభుత్వం టీడీపీది అయినందున ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఓటువేస్తే మురిగి పోయినట్టేనని చంద్రబాబు వ్యాఖ్యానిస్తున్నారు. ఏడాదిలోపే ఎన్నికలు వస్తాయని చంద్రబాబే చెప్పున్నందున ఆయనకు వేసే ఓటే మురిగిపోతుంది. ఏడాది తర్వాత చంద్రబాబు పాలన ఉండదు. వచ్చేది మనందరి పాలన. కాకినాడ మున్సిపల్ కౌన్సిల్‌కు మన అభ్యర్థులను గెలిపించుకుంటే ఏడాది తర్వాత మన పాలనలో మనమే నగరాన్ని అభివృద్ధి చేసుకుందాం.



అన్నమ్మఘాటీ సెంటర్‌లో వైఎస్ జగన్ రోడ్ షోకు హాజరైన జనసందోహంలో ఓ భాగం

పెట్రోలియం వర్సిటీయా? అదెక్కడ?

> కాకినాడలో పెట్రోలియం విశ్వవిద్యాలయం, కాకినాడకు మరో పోర్టు, ఎలక్ట్రానిక్ హార్డ్‌వేర్ పార్క్, ఇండస్ట్రియల్ కారిడార్, పెట్రోలియం కారిడార్, కొబ్బరి పీచు ఆధారిత పారిశ్రామిక కాంప్లెక్స్, స్మార్ట్‌సిటీ, నౌకా నిర్మాణ ఫ్యాక్టరీ, సముద్ర తీరంలో ఆక్వా ప్రాసెసింగ్ యూనిట్, రాజమండ్రిలో ఐటీ హబ్ వంటి ఎన్నో హామీలు ఇచ్చినా అవి ఎక్కడున్నాయో అర్థం కావడం లేదు. ఎన్నికలు ఎక్కడుంటే అక్కడ స్మార్ట్‌సిటీ అనడం చంద్రబాబుకు అలవాటైంది. ఇటీవల ఉపఎన్నికలు జరిగిన నంద్యాలలో కూడా ఇదే మాట అన్నారు.

మోసాలపై నిలదీస్తే కేసులా?

ఎన్నికల ముందు మాట ఇచ్చి ఎన్నికలు అయిపోయిన తర్వాత మోసం చేయడం ధర్మమేనా? ఇచ్చిన హామీలు నెరవేర్చమని నిలదీసేవారిపై కేసులు బనాయిస్తున్నారు. నంద్యాల ఉప ఎన్నిక ముగిసిన తర్వాత టీడీపీ నేతలు వీరంగం సృష్టించారు. నడిరోడ్డు మీద తుపాకీతో కాల్పులు జరిపారు. కాల్చినవాళ్ల మీదగానీ, కత్తులతో వీరంగం సృష్టించిన వాళ్లపై గానీ కేసులు పెట్టలేదు. ఇలాంటి పాలన మనకు కావాలా అని అడుగుతున్నా. ఓటుకు కోట్లు కేసులో ఆడియో టేపులతో అడ్డంగా దొరికిపోయినా చంద్రబాబుపై కేసులు ఉండవు. తనను హీరోగా చూపించుకునేందుకు పుష్కరాల్లో 29 మందిని చంపేసినా కేసులు ఉండవు. కాపులు రిజర్వేషన్ల కోసం కంచాలు మోగిస్తే కేసులు పెట్టారు. ఎన్నికలప్పుడు మాటలు చెప్పి మోసం చేసిన పాలన ఇది. అధికారంలోకి వచ్చాక అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్న పాలన ఇది.

ప్రతి ఇంటికీ రు.78వేల బాకీ...

బాబొస్తేనే జాబు వస్తుందని, లేకుంటే నెలకు రు.2 వేల నిరుద్యోగ భృతి ఇస్తామని ఎన్నికలకు ముందు టీవీలలో, మైకుల్లో, గోడలపై రాతలతో ఊదరగొట్టిన చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత మోసం చేశారు. ఉద్యోగం కానీ ఒక్క రూపాయి డబ్బు గానీ ఇవ్వలేదు. చంద్రబాబు అధికారంలోకి వచ్చి 39 నెలలు అయింది. ఆయన చెప్పిన లెక్కప్రకారమే ప్రతి ఇంటికీ రు.2 వేల చొప్పున రు.78 వేలు బాకీ పడ్డారు.

ఫోన్ కొడితే మందు హోం డెలివరీ ఇస్తారట...

బెల్ట్ షాపులు ఎత్తివేస్తానని, మద్యాన్ని దూరం చేస్తానని తొలి సంతకం చేసిన ఫైలు మూడేళ్లు గడిచినా అమల్లోకి రాలేదు. చంద్రబాబు హైటెక్ పాలనలో వీధివీధికో మద్యం షాపు వెలిసింది. ఫోన్ కొడితే చాలు హోం డెలివరీ ఇస్తామంటున్నారు. ఇది చంద్రబాబు చేసిన మోసం కాదా?

పొదుపు సంఘాల అక్క చెల్లెమ్మలకూ మోసం...

చంద్రబాబు అధికారంలోకి రావడానికి ముందు డ్వాక్రా పొదుపు సంఘాల అక్కచెల్లెమ్మలకు రుణాలు పూర్తిగా మాఫీ చేస్తానని హామీ ఇచ్చారు. ఇంత వరకు ఒక్క రూపాయి కూడా మాఫీ కాలేదు. అధికారం కోసం చంద్రబాబు రైతుల్నీ మోసం చేశాడు. ఎన్నికలకు ముందు రూ.87,612 కోట్ల రుణమాఫీ చేస్తానని, బ్యాంకుల్లో పెట్టిన బంగారం ఇళ్లకు రప్పిస్తానని హామీ ఇచ్చి మూడున్నర ఏళ్లు అయినా ఇంతవరకు బంగారం ఇళ్లకు రాలేదు.

కరెంటు చార్జీలు పెంచాడా? లేదా?

అధికారంలోకి వచ్చిన వెంటనే కరెంటు చార్జీలు తగ్గిస్తానని ఇదే కాకినాడలో చెప్పిన చంద్రబాబు... ఆ తర్వాత మాట తప్పి చార్జీలు పెంచాడు. గతంలో రూ.200 వచ్చే కరెంటు బిల్లు ఇప్పుడు రూ. 500 వస్తోంది. చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తర్వాత ఇంటి పన్ను కూడా రూ. 500 నుంచి రూ. 1000కి చేరింది.

వైఎస్ ఇచ్చిన భరోసా ఏదీ, ఎక్కడ?

ప్రతి పేద వాడు చదువు కోవాలన్న సత్‌సంకల్పంతో ఆనాడు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రారంభించిన ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్య శ్రీ పథకాలను చంద్రబాబు నిర్వీర్యం చేసేశాడు. బడుగు బలహీన వర్గాల వారిని విద్య, వైద్యానికి దూరం చేసున్నాడు. ప్రతి పేద వాడి ఇంటి నుంచి ఒక ఇంజినీరో, ఒక డాక్టరో, మరే ఉన్నతమైన కోర్సు అయినా చదివేందుకు ఎంత ఖర్చయినా భరిస్తానని ఆనాడు వైఎస్ ఇచ్చిన భరోసా ఇప్పుడు లేకుండా పోయింది. ఇంజినీరింగ్ కోర్సుకు ఏడాదికి లక్ష రూపాయల ఫీజు ఉంటే చంద్రబాబు ప్రభుత్వం ముష్టి వేసినట్టు రూ. 35 వేలు... అదీ ఎప్పటికో ఇస్తోంది. ఇటువంటి పాలన మనకు అవసరమా? (వద్దే వద్దు అంటూ ప్రజలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.)

ఇస్త్రీ పెట్టెలు ఇవ్వడమా బీసీల అభివృద్ధి అంటే...

బీసీలపై చంద్రబాబు చూపిస్తున్నది కపట ప్రేమ. బీసీలపై ప్రేమంటే ఇస్త్రీ పెట్టెలు ఇవ్వడం కాదు. వాళ్లు నా అన్నదమ్ములు, నా కుటుంబసభ్యులు అనుకోవాలి, వాళ్ల పిల్లల్ని నేను చదివించాలి అనుకోవాలి.. అదీ బీసీలపై ప్రేమంటే.. కానీ చంద్రబాబు మాటలు కోటలు దాటుతుంటాయి. చేతల్లో మాత్రం ఎన్నికలు వచ్చినప్పుడే ప్రజలు గుర్తుకువస్తారు.

ఆ కుయ్.. కుయ్... ఇప్పుడేదీ?

పేదల విద్య, వైద్యానికి దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి 108 అత్యవసర వైద్య సర్వీసును ప్రవేశపెడితే ఇప్పుడది అటకెక్కే స్థితికి చేరింది. అనారోగ్యం పాలయినప్పుడు పెద్దాస్పత్రుల్లో చూపించుకునేందుకు పేదలు అధిక వడ్డీలకు అప్పులు చేసి ఇక్కట్ల పాలవుతారని భావించి వైఎస్సార్ ఏర్పాటు చేసిన 108, ఆరోగ్య శ్రీని ఇపుడు నిర్వీర్యంగా మార్చేశారు. గతంలో 108కి ఫోన్ చేస్తే 20 నిమిషాల్లో కుయ్ కుయ్ మంటూ అంబులెన్స్ వచ్చేది. కానీ ఇప్పుడు ఫోన్ చేస్తే డీజిల్ లేదని, డ్రైవర్లు సమ్మెలో ఉన్నారని, జీతాలు ఇవ్వడం లేదన్న సమాధానం వస్తున్నది. నెట్‌వర్క్ ఆస్పత్రులకు 8 నెలల బకాయిలు పెండింగ్‌లో ఉండడంతో వైద్యులు పేదల కేసులను చూడడం లేదు. ఇవాళ మూగ, చెవిటి, కిడ్నీ, క్యాన్సర్ పేషెంట్ల పరిస్థితి కూడా చాలా అగమ్యగోచరంగా ఉంది.

ఫోజుల కోసమే దోమలపై దండయాత్ర...

దోమలపై దండయాత్ర అంటూ కాకినాడలోనే కార్యక్రమాన్ని ప్రారంభించిన చంద్రబాబుకు అసలు ఆ సమస్య నిరోధంపై చిత్తశుద్ధి లేదు. కేవలం ఫాగింగ్ మెషీన్ల దగ్గర పోజులివ్వడానికే కాలం సరిపోయింది. కాకినాడలో రోజుకు 220 టన్నుల చెత్త పేరుకుపోతుంటే ఇప్పటివరకూ డంపింగ్‌యార్డుకే స్థలం కేటాయించలేదు. ఆ చెత్తనంతా లోతట్టు ప్రాంతాల్లో పడేస్తుంటే దోమలు, పందులు స్వైరవిహారం చేయక మానేస్తాయా? కనీసం ఈ విషయమే కాదు వరదొస్తే కాకినాడలో ఎన్ని ప్రాంతాలు మునిగిపోతాయో కూడా చంద్రబాబుకు తెలియవు. 17 ప్రాంతాలు నీట మునుగుతాయి. కనీసం ఎన్ని కొళాయిల్లో మురుగునీరు వస్తుందో ఏనాడైనా దృష్టి పెట్టారా? చివరకు మత్స్యకారులకు వేట నిషేధ కాలంలో భృతి ఇవ్వడానికి కూడా చంద్రబాబు ప్రభుత్వానికి మనస్సు అంగీకరించట్లేదు. మేం అధికారంలోకి వచ్చిన తర్వాత మత్స్యకారులకు వేట నిషేధ కాలంలో నెలకు ఐదు వేల రూపాయల భృతి, 50 కిలోల బియ్యం ఇస్తాం. మత్స్యకారుల పిల్లలంతా బడికి వెళ్లాలి. వారికి ఒకటి నుంచి ఐదో తరగతి వరకూ రూ.500, ఆరు నుంచి పదో తరగతి వరకూ రూ.750, ఇంటర్మీడియట్ విద్యార్థులకు రూ.వెయ్యి చొప్పున సహాయం అందిస్తాం. నవరత్నాలతో రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తాం.

ఇది కబ్జాల సర్కార్..

కాకినాడ ఎమ్మెల్యే పేరు మార్చుకున్నారు కబ్జాల కొండబాబు అని. ఆయన ఏటిమొగ దగ్గర 50 ఎకరాలు కబ్జా చేసేశాడు. అతనే కాదు విశాఖ నుంచి విజయవాడ, తిరుపతి వరకూ టీడీపీ నేతలు భూకబ్జాలు చేసేస్తున్నా చంద్రబాబు చూస్తూనే ఉన్నారు తప్ప వారిపై చర్యలు లేవు. ప్రజల భూరికార్డుల్లో పేర్లను మార్చేసి, ఆ పత్రాలతో బ్యాంకుల్లో రుణాలు తెచ్చేసుకుంటున్నారు. ప్రజాధనాన్ని వేల కోట్లలో కొల్లగొడుతున్నారు. ఇలాంటి మోసకారి ప్రభుత్వం మనకు అవసరమా?

నిజం చెప్పనివాడు నారా చంద్రబాబు....

ఎన్నికలకు ముందు ఇచ్చిన ఏ వాగ్దానాన్నీ చంద్రబాబు నెరవేర్చలేదు. ఆయన నైజమే అంత. చంద్రబాబు చస్తే నిజం చెప్పడు. జీవితంలో అబద్ధాలు చెప్పని వ్యక్తి సత్యహరిశ్చంద్రుడు అయితే ఒక్క నిజం చెప్పని వ్యక్తి చంద్రబాబు. ఇదే చంద్రబాబు 2014 ఆగస్టులో సాక్షాత్తు అసెంబ్లీ సాక్షిగా తూర్పుగోదావరి సహా అన్ని జిల్లాలకు అనేక హామీలిచ్చారు. మూడున్నర ఏళ్లు గడిచినా వాటికి అతీగతీ లేదు.

కాలరు పట్టుకుని నిలేసే పరిస్థితి రావాలి...

సీఎం హోదాలో చంద్రబాబు ఇచ్చిన హామీలు కూడా అమలుకు నోచుకోకపోతే ఇక ఈ రాజకీయ వ్యవస్థకు అర్థమేమిటి? మరో ఏడాదిలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల కురుక్షేత్ర మహాసంగ్రామానికి... నంద్యాల ప్రజలు వేసిన ఓటు నాంది కాగా.. రెండో ఓటు కాకినాడ కార్పొరేషన్ నుంచి పడాలి... ఈ రెండు నగరాలను ఎప్పుడూ మరచిపోను. వాటి అభివృద్ధి బాధ్యత నాకు వదిలేయండి. రాజకీయ వ్యవస్థ ప్రక్షాళనతోనే ప్రజలకు మంచి రోజులు. మైకు పట్టుకుని ప్రజల ముందు ఏదయినా చెప్పి ఓట్లు వేయించుకుని తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని చేయకపోతే కాలరు పట్టుకుని నిలదీస్తారన్న భయం రాజకీయ నాయకుల్లో రావాలి. అప్పుడు మాత్రమే ఈ వ్యవస్థ బాగుపడుతుంది. లేకుంటే చంద్రబాబు లాంటి నాయకులు ఎన్నికలప్పుడు మీవద్దకు వచ్చి ప్రతి ఇంటికో మారుతీ కారు ఇస్తానంటాడు, కేజీ బంగారం అంటాడు. అందుకే ఈ చెడిపోయిన రాజకీయ వ్యవస్థను మార్చాలి. న్యాయం వైపు, ధర్మంవైపు నిలబడండి. న్యాయానికి మీ ఓటు వేయండి. మోసం చేస్తున్న చంద్రబాబు లాంటి పాలకులు వద్దని చెప్పండి.'' అని జగన్ విజ్ఞప్తి చేశారు.

> అధికారంలోకి వచ్చిన 3 నెలల్లో అగ్రిగోల్డ్ సమస్యను పరిష్కరిస్తాం. అసెంబ్లీలోనే నేనీ విషయాన్ని ప్రస్తావించాను. వెయ్యి కోట్లు ఇస్తే 14 లక్షల మందికి మేలు జరుగుతుంది. చంద్రబాబుకు చెప్పినా మానవత్వం లేని ఆయన పట్టించుకోలేదు. నంద్యాలలో కూడా ఈ విషయాన్ని చెప్పాను.

హైదరాబాద్‌లో భారీ వర్షం

మరో రెండు రోజులు భారీ వర్ష సూచన ● జల దిగ్బంధంలో 3 అపార్ట్‌మెంట్లు

సాక్షి, హైదరాబాద్: అల్పపీడనం, ఉపరితల ఆవర్తన ప్రభావం వల్ల ఆదివారం గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కుండపోత వర్షం కురిసింది. సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి పొద్దుపోయే వరకు కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, జీడిమెట్ల, మియాపూర్, మల్కాజ్‌గిరి, కుషాయిగూడ, వెస్ట్ మారేడ్‌పల్లి,కాప్రా, తిరుమలగిరి, అల్వాల్, ఈసీఐఎల్, చర్లపల్లిలో భారీగా వర్షం కురిసింది. సికింద్రాబాద్ పరిధిలోని ఓయూ క్యాంపస్, తార్నాక, లాలాపేట, హబ్సిగూడ, నాచారం, మల్లాపూర్, పద్మారావు నగర్, పార్శీగుట్ట, వారాసిగూడ, చిలకలగూడ, సీతాఫల్‌మండి, మారేడ్‌పల్లి, మోండా మార్కెట్, ప్యాట్నీ, బేగంపేట ప్రాంతాల్లో కురిసిన వర్షానికి ప్రధాన రహదారులపై నడుము లోతు వరదనీరు పోటెత్తింది. పలు లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాల్లోని బస్తీల్లో ఇళ్లలోకి చేరిన నీటిని తొలగించేందుకు స్థానికులు అవస్థలు పడ్డారు. మరో రెండు రోజులు నగరంలో భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ తెలిపింది. కాగా, దీప్తిశ్రీనగర్ పరిసర ప్రాంతాలు ముంపుకు గురి కావడంతో కాలనీలు, నాలాలు, అపార్ట్‌మెంట్‌లను జీహెచ్‌ఎంసీ మేయర్ బొంతు రామ్మోహన్ ఆదివారం పరిశీలించారు.

ఇంకా తేరుకోని మదీనాగూడ ..


వర్ష బీభత్సంతో అతలాకుతలమైన మదీనాగూడ, దీప్తిశ్రీనగర్ ప్రాంతాలు ఇంకా తేరుకోలేదు. మదీనాగూడలోని ఉషోదయ అపార్ట్‌మెంట్, పొట్లపల్లి పవిత్ర అపార్ట్‌మెంట్, సాయితేజ ఫ్రైడ్స్, తులసీరాం కాంప్లెక్స్‌తో పాటు మరో రెండు అపార్ట్‌మెంట్ సెల్లార్లు ఆదివారమూ వర్షపు నీటిలోనే ఉన్నాయి. నీటిని ఇంజిన్లతో తొలగించేందుకు ఏర్పాట్లు చేశారు. మదీనాగూడలోని ఖాళీ స్థలంలో భారీగా వరద నీరు వచ్చి చేరింది. ఈ వరద నాలాల ద్వారా గంగారం చెరువులోకి చేరుతుంది. చెరువులోని చేపలు ఖాళీ స్థలంలోని నీటిలోకి వస్తున్నాయి. దీంతో పెద్ద సంఖ్యలో యువత వలలు వేసి చేపలను పట్టుకోవడం సందడిగా మారింది.



మదీనాగూడలో వరద నీటిలో చేపలు పడుతున్న స్థానికులు



కుత్బుల్లాపూర్ పరిధి మాణిక్యనగర్ ప్రధాన రహదారిలో వరదనీటిలో ఇబ్బందులు



మురికి కూపమే!

కాకినాడ నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కాకినాడకు ఇచ్చిన ఏ ఒక్కటీ అమలుకు నోచుకోలేదు. భూ గర్భ డ్రైనేజీ, స్మార్ట్ సిటీ మొదలు కాపుల రిజర్వేషన్ల వరకు... ఒక్క హామీ కూడా అమలు కాలేదు. కాకినాడకు భూ గర్భ డ్రైనేజీ లేక పలు ప్రాంతాలు మురికి కూపాలుగా తయారయ్యాయి. ఈ పరిస్థితిని నివారించి సుందర నగరంగా తీర్చిదిద్దుతానని ఇటీవల కాకినాడ పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చారు. అయితే అది ఆచరణ సాధ్యం కాదని నగర ప్లానింగ్ అధికారులు ఎప్పుడో తేల్చారు. సాధ్యం కాదని తెలిసీ చంద్రబాబు ఈ హామీ ఇవ్వడం నగర ప్రజలను నిశ్చేష్టులను చేసింది. నగరం మురికి కూపంగా మారకుండా సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తానన్న హామీ కూడా కాగితాలకే పరిమితమైంది. ఈ నేపథ్యంలో కాకినాడకు చంద్రబాబు ఇచ్చిన హామీలు ఏమిటి? వాటి ప్రస్తుత పరిస్థితి ఏమిటో ఒక్కసారి పరిశీలిస్తే...



అలవిమాలిన హామీలు.. అడుగు ముందుకు పడలేదు..

కాకినాడలో రూ.32 వేల కోట్లతో పెట్రో కెమికల్ కాంప్లెక్స్, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్, కాకినాడకు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ, ఔటర్ రింగ్‌రోడ్డు, నగరంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించేలా మరో ఫ్లైఓవర్, ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి, దోమల బెడద నివారించేలా డ్రైనేజీ, స్కిల్ డెవలప్‌మెంట్ స్కీం, కాకినాడతో అనుసంధానం చేసేలా బకింగ్‌హాం కెనాల్ ప్రాజెక్టు, స్మార్ట్‌సిటీగా అభివృద్ధి, పేద ప్రజలకు మంచినీటిని సరఫరాకు 36 కోట్లతో ప్రాజెక్టు, కేంద్రప్రభుత్వ స్కీం కింద 3,600 ఇళ్ల నిర్మాణం, ఇంద్రపాలెం జంక్షన్ ఎన్టీఆర్ వంతెన మధ్య ఉన్న ఉప్పుటేరును రూ.90 కోట్లతో పర్యాటక ప్రాంతంగా మార్పు, బొమ్మల తయారీ పరిశ్రమ ఏర్పాటు, కాకినాడను హార్డ్‌వేర్ ఉత్పత్తుల తయారీ కేంద్రంగా మార్పు, 2 వేల ఎకరాలలో ఇండస్ట్రియల్ పార్క్ అభివృద్ధి, రూ. 77.05 కోట్లతో మురికి కాలువల తవ్వకం, ఎల్ఈడీ లైట్లు, పేదల బస్తీలలో 34,179 ఇళ్ల నిర్మాణం, కొండాయపాలెం రైల్వే గేటు ప్రాజెక్టు... ఇలా లెక్కకు మిక్కిలి హామీలను ఇవ్వడంతో పాటు ఈ పనులన్నీ 2019 నాటికి పూర్తి చేస్తామన్నారు. చంద్రబాబు ప్రభుత్వం వచ్చి మూడున్నర ఏళ్లు గడిచినా ఈ హామీలలో ఏ ఒక్కదాన్నీ అమలు చేయలేదు. అధికారమే పరమావధిగా అలవిమాలిన హామీలు ఇచ్చిన చంద్రబాబు వాటి అమలు దిశగా ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదు. పోర్టు రోడ్డు నుంచి జగన్నాథపురం మీదుగా యానాం వెళ్లేందుకు నిర్మిస్తామన్న ఫ్లైఓవర్ పనుల్ని ఇంతవరకు పట్టించుకోలేదు.

కొలిక్కిరాని డంపింగ్ యార్డ్ సమస్య

కాకినాడను పట్టిపీడిస్తున్న సమస్యల్లో అతి పెద్దది డంపింగ్ యార్డ్ సమస్య. ఈ సమస్య కొలిక్కిరాకపోవడంతో కాకినాడ నగరమే ఓ పెద్ద డంపింగ్ యార్డ్‌గా తయారైంది. ప్రతి నిత్యం కాకినాడలో 225 టన్నుల చెత్త తయారవుతోంది. డంపింగ్ యార్డ్, సాలిడ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్ లేకపోవడంతో నగరం మురికి కూపంగా తయారవుతోంది.



అలవిమాలిన హామీలతో మభ్యపెట్టే యత్నం

స్మార్ట్ సిటీ లేదు, అందరికీ ఇళ్లూ లేవు..

అభివృద్ధి పేరుతో మోసగిస్తారా?

బాబు తీరుతో విస్తుపోతున్న కాకినాడ ప్రజలు

స్మార్ట్‌సిటీకి కేంద్ర నిధులే ఖర్చు చేయలేదు...

కేంద్రప్రభుత్వం కాకినాడను స్మార్ట్‌సిటీల జాబితాలో చేర్చి తొలి ఏడాది రూ. 393 కోట్ల నిధులను కేటాయిస్తే ఇంతవరకు కేవలం రూ. 5.25 కోట్ల పనులు మాత్రమే పూర్తయ్యాయి. రెండో సంవత్సరం నిధులు ఇవ్వడానికి కేంద్రం సిద్ధంగా ఉన్నా వాటిని తీసుకువచ్చి అభివృద్ధికి వినియోగించే పరిస్థితి లేకపోవడం విషాదం. ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీ (పీఎంసీ)లో తమ వారిని నియమించుకోవాలన్న తపనతో చంద్రబాబు అనుచరులు చేసిన ప్రయత్నం బెడిసి కొట్టడం, అది కోర్టుల దాకా పోవడంతో స్మార్ట్ సిటీ ప్రకటించి 20 నెలలు దాటినా ఏ ఒక్క పనీ పూర్తి కాలేదు. కమీషన్ల కక్కుర్తే ఇందుకు కారణమని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు.

అందరికీ ఇళ్లు... అదో పెద్ద స్కాం...

సెంట్రల్ అర్బన్ హౌసింగ్ స్కీం కింద 4,600 అపార్ట్‌మెంట్ల నిర్మాణానికి కేంద్రం అనుమతి ఇస్తే లబ్ధిదారుల ఎంపిక పేరిట కొంతకాలం, స్థలం పరిశీలన పేరిట మరికొంత కాలం చంద్రబాబు సర్కార్ జాప్యం చేసింది. తీరా పర్లోపేట వద్ద 46 ఎకరాల స్థలాన్ని ఎంపిక చేస్తే అందులో 25 ఎకరాల భూమి ఉప్పిరిసిన భూమి కావడంతో ఇళ్ల నిర్మాణానికి పనికి రాదని తేల్చారు. ఈలోగా అధికారులు, జన్మభూమి కమిటీ సభ్యులు హడావిడి చేసి లబ్ధిదారుల జాబితాలు తయారు చేసి ఒక్కొక్కరి నుంచి రు.25 వేలు వసూలు చేశారు. లబ్ధిదారులు అప్పొసప్పో చేసి తీసుకువచ్చి కట్టిన ఆ మొత్తం ఇప్పుడు మున్సిపాలిటీ వద్ద నిరుపయోగంగా పడి ఉంది. ఇలా ఏ పథకమూ ముందుకు సాగలేదు.

ఇంక మిగిలింది ఏడాదిన్నరే...

చంద్రబాబు కాకినాడకు ప్రకటించిన పథకాలన్నీ 2019 నాటికి పూర్తి కావాల్సి ఉంది. ఈ లెక్కన ఇక మిగిలింది కేవలం ఏడాదిన్నర కాలం. ఇంత స్వల్పకాలంలో ప్రణాళికలు తయారయ్యేదెప్పుడు, అభివృద్ధి పనులు చేపట్టేదెప్పుడో దేవుడికే తెలియాలని ప్రజలు వ్యాఖ్యానిస్తున్నారు.

కోడ్ ఉల్లంఘించి టీచర్లతో మంత్రి గంటా భేటీ



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి గంటా

సాక్షి ప్రతినిధి, కాకినాడ : కార్పొరేషన్ ఎన్నికల వేళ ఎన్జీవో, ఉపాధ్యాయ సంఘం నేతలు కాకినాడలో హడావుడి పర్యటనచేశారు. ఏపీ జేఏసీ చైర్మన్ అశోక్‌బాబు ఓ వైపు, పీఆర్‌టీయూ నేత, ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు మరోవైపు చాటుమాటు రాజకీయాలు నడిపారు. శనివారం రాత్రి అశోక్‌బాబు తన అనుయాయులను కలిసి ప్రభుత్వానికి మద్దతుగా సంప్రదింపులు చేయగా, ఆదివారం పీఆర్‌టీయూ నేతలతో గాదె సమావేశమై స్వామిభక్తిని చాటుకున్నారు. కాకపోతే, ఎన్నికల వేళ ఉపాధ్యాయులతో మంత్రి గంటా శ్రీనివాసరావు సమావేశం కావడం కాస్తా వివాదాస్పదంగా మారింది.

ఏం జరిగిందంటే..: కాకినాడలో శనివారం రాత్రి ఎన్జీవో సంఘం సమావేశం జరిగింది. సమావేశానికి ఏపీ జేఏసీ చైర్మన్ అశోక్‌బాబు హాజరయ్యారు. ఎన్నికల వేళ అశోక్‌బాబు టీడీపీకి మద్దతు కూడగట్టేలా పరోక్షంగా పావులు కదిపారన్న అభిప్రాయం వ్యక్తమైంది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసుల నాయుడు అత్యుత్సాహం ప్రదర్శించారు. ప్రభుత్వానికి మద్దతుగా పనిచేసిన పేరు అశోక్‌బాబుకు వెళ్లిపోతుందని పీఆర్‌టీయూ సంఘం ఉపాధ్యాయులతో నరసన్న నగర్‌లోని తిరుమల ఫంక్షన్ హాల్లో ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేసి, దానికి మంత్రి గంటాను ఆహ్వానించారు. అలాగే ప్రైవేటు విద్యా సంస్థల ప్రతినిధులను కూడా ఆహ్వానించారు. దీంట్లో పట్టభద్రుల ఎమ్మెల్సీ రవికిరణ్‌వర్మ కీలక పాత్ర పోషించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా ఉపాధ్యాయులతో మంత్రి గంటా , ఎంపీ పండుల రవీంద్రబాబు సమావేశం కావడం వివాదాస్పదమైంది.

ఎన్నికల్లో సహకరించాలని పిలుపు: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి సీఎం ప్రత్యేక దృష్టి సారించారని, పది రోజుల్లో పరిష్కారమవుతాయని, కార్పొరేషన్ ఎన్నికల్లో సహకరించాలని మంత్రి గంటా సమావేశంలో విజ్ఞప్తిచేశారు. ప్రైవేటు సంస్థలు, ఉపాధ్యాయుల సమస్యలన్నీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన ఆయన కార్పొరేషన్ ఎన్నికల్లో టీడీపీకి అనుకూలంగా పనిచేయాలంటూ ఒక సందర్భంలో హుకుం కూడా జారీచేశారు. ఈ విషయం బయటకు రావడంతో మిగతా ఉపాధ్యాయ వర్గాల్లో తీవ్ర చర్చ జరుగుతోంది. అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ ఉపాధ్యాయ సంఘాలతో ఇలా సమావేశాలు ఏర్పాటుచేయడం చర్చనీయాంశమైంది.

కొనసాగుతున్న ప్రలోభాల పర్వం

- బహిరంగంగా డబ్బు పంపిణీ చేస్తున్న టీడీపీ నేతలు
- ఓటు వేశాక మరికొంత ఇస్తామని ప్రచారం
- పేదల బస్తీల్లో విచ్చలవిడిగా మద్యం సరఫరా
- చోద్యం చూస్తున్న పోలీసులు



కాకినాడ నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి :

తూర్పుగోదావరి జిల్లా కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల్లో ప్రలోభాల పర్వం ఆదివారం కూడా యథేచ్ఛగా కొనసాగింది. సాయంత్రానికి ప్రచార పర్వం పరిసమాప్తమయ్యాక ఎన్నికల నిబంధనావళికి విరుద్ధంగా అధికార టీడీపీ నేతలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నా పోలీసులు మిన్నకుండిపోయారు. మంత్రులు, ఎమ్మెల్యేల అండదండలతో చోటా మోటా నాయకులు బహిరంగంగానే స్లిప్పుల్లో ఓటర్లకు డబ్బు పంపిణీ చేస్తున్నారు. పేదల బస్తీలలో మద్యం పంచుతున్నారు. మహిళల్ని ఆకర్షించేందుకు ముక్కు పుడకలు, కుంకుమ భరిణెలు, చీరెలు, జాకెట్ ముక్కల్ని ఎర వేస్తున్నారు. డబ్బు పంచుతున్న వారిని వైఎస్సార్ సీపీ నాయకులు పట్టిచ్చినా పోలీసులు కాసేపు స్టేషన్లో కూర్చోబెట్టి ఆ తర్వాత వదిలేస్తున్నారు. ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన అధికార పార్టీ ప్రజాప్రతినిధులు నగరంలోని పలు ప్రాంతాల్లో మకాం వేసి డబ్బు, మద్యం పంపిణీని పర్యవేక్షిస్తున్నారు. తొలి విడత డబ్బు తీసుకున్న వారు పోలింగ్ జరిగే మంగళవారం స్లిప్పులు చూపించి మలి విడత సొమ్మును తీసుకువెళ్లవచ్చని పోటీలో ఉన్న అధికార పార్టీ అభ్యర్థులు ఇల్లిల్లూ తిరిగి ప్రచారం చేస్తున్నారు. కాకినాడ సిటీ ఎమ్మెల్యే కొండబాబు, ఆయన అనుచరులు ప్రచారం ముగిసిన తర్వాత కూడా పేదల బస్తీల్లో వాహనాల్లో తిరుగుతూ డబ్బు, మద్యం పంచడం వివాదాస్పదమైంది.

కాకినాడ మేయర్ పీఠాన్ని జగన్‌కు బహుమతిగా ఇస్తాం..

కాకినాడ మేయర్ పీఠాన్ని వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి బహుమతిగా ఇస్తామని పార్టీ జిల్లా అధ్యక్షుడు కన్నబాబు, పార్లమెంట్ కో ఆర్డినేటర్ చలమలశెట్టి సునీల్, సిటీ కో ఆర్డినేటర్ ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, ముత్తా శశిధర్ జనం సాక్షిగా ప్రకటించారు. జగన్ పాల్గొన్న ఎన్నికల ప్రచారంలో వారు మాట్లాడుతూ జగన్ నాయకత్వాన్ని అన్ని వర్గాల ప్రజలూ కోరుకుంటున్నారన్నారు. చంద్రబాబు పాలనపై విసిగి వేసారిన ప్రజలు ప్రస్తుత కార్పొరేషన్ ఎన్నికల్లో ఓటు ద్వారా ఆయనకు బుద్ధి చెప్పి తమ పార్టీకి పట్టం కట్టబోతున్నారన్నారు. ప్రస్తుత కార్పొరేషన్ ఎన్నికల్లో అత్యధిక స్థానాలను గెలుచుకుని మేయర్ పీఠాన్ని జగన్‌కు బహుమతిగా ఇస్తామని ప్రకటించారు. జగన్ రోడ్‌షోలో పార్టీ ముఖ్య నేతలు బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావు, వేణుంబాక విజయసాయిరెడ్డి, మోపిదేవి వెంకటరమణ, పార్థసారథి, పినిపే విశ్వరూప్, జిల్లా పార్టీ అధ్యక్షుడు కురసాల కన్నబాబు, ఎమ్మెల్సీ పిల్లి సుభాష్‌చంద్రబోస్, ఎమ్మెల్యేలు విశ్వాసరాయి కళావతి, పీడిక రాజన్నదొర, పాముల పుష్పశ్రీవాణి, కంబాల జోగులు, దాడిశెట్టి రాజా, చిర్ల జగ్గిరెడ్డి, వంతల రాజేశ్వరి పాల్గొన్నారు.

ముస్లిం యువకులను విడిపించండి..

రోడ్‌షో టూటౌన్ పోలీసు స్టేషన్ మీదుగా సాగుతున్నపుడు అక్కడ పెద్ద సంఖ్యలో ముస్లింలు గుమికూడి జగన్‌ను కలిశారు. తమ ప్రాంతంలో అధికార పార్టీ వారు డబ్బు పంచుతున్నారని ఫిర్యాదు చేస్తే తమ పిల్లలనే (యువకులను) స్టేషన్‌లో నిర్బంధించారని వివరించారు. స్టేషన్‌లోకి వచ్చి తమ సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. తాను ఈ సమయంలో పోలీస్‌స్టేషన్‌లోకి రావడం మంచిది కాదని, సమస్యను జటిలం చేయకూడదని ఆయన వారికి నచ్చ జెప్పారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబును పిలిచి.. పోలీసు అధికారులతో మాట్లాడి వారిని విడిపించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జగన్ పర్యటన ముగిసిన వెంటనే కన్నబాబు, ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ఇద్దరూ స్టేషన్‌కు వెళ్లి పోలీసులతో మాట్లాడి నిర్బంధంలో ఉన్న ముస్లిం యువకులను విడిపించారు.

వక్ఫ్‌బోర్డు ఎన్నికల్లో రెండు గ్రూపులుగా టీడీపీ నేతలు

ముతవల్లీ కోటా నుంచి ఇద్దరు సభ్యులకుగాను ముగ్గురు పోటీ

సాక్షి, అమరావతి : వక్ఫ్ బోర్డు ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ నేతలు రెండు వర్గాలుగా విడిపోయారు. ఆ పార్టీకి చెందిన ఎమ్మెల్సీలు షరీఫ్, ఫరూఖ్, ఎమ్మెల్యే చాంద్‌బాషా ఒక వర్గం, ఎమ్మెల్యే జలీల్‌ఖాన్ మరో వర్గంగా విడిపోయారు. దీంతో ముతవల్లీ కోటా కింద వక్ఫ్‌బోర్డు సభ్యులుగా ఇద్దరికి అవకాశం ఉంటే ముగ్గురు బరిలో ఉన్నారు. ఎమ్మెల్యే జలీల్‌ఖాన్ వర్గం నుంచి షేక్ ఖాజా, మొహమ్మద్ ఇంతియాజ్ రంగంలో ఉంటే, మరో వర్గం కేఏ షఫీవుల్లాకు మద్దతు ప్రకటించింది. దీంతో ఎన్నిక అనివార్యమైంది. జలీల్‌ఖాన్ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి ఎన్నికల్లో గెలుపొంది తర్వాత టీడీపీలో చేరడంతో వక్ఫ్‌బోర్డు ఎన్నికలకు సంబంధించి సీఎం చంద్రబాబు ఆయనకు పెద్ద పీట వేస్తుండటంతో మిగిలిన వర్గం మండిపడుతోంది. వక్ఫ్‌బోర్డులో 9 మంది నామినేటెడ్ సభ్యులను ఎన్నుకోవాల్సి ఉంటుంది. రాష్ట్రంలో ముస్లింలు ఎక్కువగా ఉన్న జిల్లాల నుంచి ఒక్కొక్కరికి అవకాశం ఇచ్చేలా సీఎం ముందుగా చర్యలు తీసుకుని ఉంటే ముస్లిం వర్గాల్లో ఇంత గందరగోళ పరిస్థితి ఏర్పడేదే కాదని మరో వర్గం వారంటున్నారు. ఎన్నికల్లో ఎమ్మెల్యే జలీల్‌ఖాన్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నా టీడీపీలో అడిగేవారే కరువయ్యారని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

ఈ నెల 31న విజయవాడలో ఎన్నికలు: బోర్డు సభ్యులకు సంబంధించి ఈ నెల 31న ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు విజయవాడ చిట్టినగర్‌లోని ఈద్గాలో ఎన్నికలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ ఎన్నికల్లో జలీల్‌ఖాన్‌ను దెబ్బకొడితే కొంతవరకు ఆయన ప్రభావం తగ్గుతుందని, లేకుంటే ముమ్మందు వక్ఫ్‌బోర్డులో ఆయన జోక్యం మితిమీరే అవకాశం ఉందని రెండో వర్గంవారు బహిరంగంగానే పేర్కొంటున్నారు. ఇదిలా ఉండగా వక్ఫ్‌బోర్డును ఏర్పాటుచేసేందుకు ఉమ్మడి హైకోర్టు బ్రేక్‌వేసింది. అయితే ఈ నెల 31న జరగాల్సిన పాలకమండలి ఎన్నికలను మాత్రం నిర్వహించుకోవచ్చని తెలపడంతో ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. అయితే వక్ఫ్‌బోర్డును మాత్రం ఎప్పుడు ఏర్పాటు చేస్తారనేది కోర్టు నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది.

ఇది ఎలక్షన్ కాదు.. ఆక్షన్

అధికార పార్టీ వేలంలాగా ఓట్లు కొంటోంది: సీపీఐ రామకృష్ణ ధ్వజం



సాక్షి, అమరావతి: కాకినాడలో జరుగుతున్నది ఎలక్షన్ కాదని, అధికార పార్టీ ఆక్షన్(వేలం) అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ధ్వజమెత్తారు. ఓటమి భయంతో అధికార పార్టీ అడ్డు అదుపూ లేకుండా ఓటర్లను, చోటామోటా నాయకులను వేలం మాదిరిగా కొనుగోలు చేస్తోందని ఆరోపించారు. విజయవాడలోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. అభివృద్ధి చూసి ఓటెయ్యాలని చంద్రబాబు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. కాకినాడను స్మార్ట్‌సిటీగా ప్రకటించినట్టు వెంకయ్య, చంద్రబాబు చెప్పుకుంటున్నారని.. అక్కడ చేసిన అభివృద్ధి ఏమీలేదని, పందులు దొర్లుతున్నాయని ఎద్దేవా చేశారు. టీడీపీ నాయకులపై చర్యలు తీసుకోవడంలో ఎన్నికల కమిషన్ దారుణంగా విఫలమైందన్నారు. కాగా, నరేంద్ర మోదీ ప్రజావ్యతిరేక విధానాలపై సెప్టెంబర్ 15 నుంచి అక్టోబర్ 15 వరకు ప్రచారోద్యమం నిర్వహించనున్నట్లు చెప్పారు. సమావేశంలో సీపీఐ నేతలు రావుల వెంకయ్య, జల్లి విల్సన్, జి.ఓబులేషు పాల్గొన్నారు.

అడుగడుగునా దీవెనలు

- ఈసారి నువ్వే వస్తావు నాన్నా...
- సెల్ఫీలు, ఆదరాభిమానాలతో సాగిన జగన్ రోడ్‌షో
- మహిళల అపూర్వ ఆదరణ
- కాకినాడలో ఐదు గంటలపాటు సుడిగాలి పర్యటన
- పార్టీ అభ్యర్థుల్లో ఆనందం

కాకినాడ నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి

'నీ చేతిలో చెయ్యేసి చెబుతున్నా.... ఈసారి నువ్వే వస్తావు నాన్నా...' అని వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని కాకినాడ నగరంలో సత్యవతి అనే వృద్ధురాలు దీవించింది. తూర్పు గోదావరి జిల్లా కాకినాడ మున్సిపల్ ఎన్నికల ప్రచార పర్వంలో భాగంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదివారం నగరంలో జరిపిన రోడ్‌షోకు జనం జేజేలు పలికారు. దారి పొడవునా పెద్దల దీవెనలు, యువతీ యువకుల ఆదరాభిమానాలు పెల్లుబికాయి. యువతీ యువకులు, మహిళలు సెల్ఫీల కోసం పోటీపడ్డారు. చంటి పిల్లలను ఎత్తుకుని పెద్ద సంఖ్యలో వచ్చిన మహిళలు 'జై జగన్...' అంటూ నినాదాలు చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఉదయం 11.45 గంటల ప్రాంతంలో అన్నమ్మ ఘాటి వద్ద జరిగిన భారీ బహిరంగ సభ ద్వారా ప్రారంభించిన జగన్ ప్రచారం నగరమంతా సుడిగాలి పర్యటనతో ముగిసింది. బలహీన వర్గాలు, ముఖ్యంగా మత్స్యకారులు ఎక్కువగా ఉండే జగన్నాథపురం ప్రాంతంలో కుంతీదేవిపేటలో జగన్ రోడ్‌షో వెళ్తున్నపుడు పలువురు మహిళలు ఆయన్ను కలుసుకోవాలని పోటీపడ్డారు. తన వాహనం దిగిన జగన్ వద్దకు సత్యవతి అనే వృద్ధురాలు తోసుకువచ్చి ఆయన్ను చూసిన ఆనందంలో ఉద్వేగానికి లోనై...



వృద్ధురాలిని ఆప్యాయంగా పలకరిస్తున్న ప్రతిపక్షనేత వైఎస్ జగన్



ముస్లిం మహిళలు, విద్యార్థులతో సెల్ఫీ దిగుతున్న విపక్షనేత

ఈసారి అధికారంలోకి రావడం ఖాయమంటూ చేయి కలిపి మరీ చెప్పారు.

తానే సెల్ఫీలు తీసిన జగన్...

జగన్‌కు దగ్గరగా వచ్చిన పలువురు ముస్లిం మహిళలు, విద్యార్థినులు ఆయనతో సెల్ఫీలు దిగడానికి ఇబ్బంది పడుతుండడంతో జగన్ తానే స్వయంగా సెల్ఫీ తీసి వారికిచ్చినపుడు వారి ఆనందానికి అవధులు లేకుండా పోయింది. మేడల మీద నుంచి, బస్సుల నుంచి వందల సంఖ్యంలో జనం జగన్‌ను తమ మొబైళ్లలో బంధించుకున్నారు. మూడు గంటల నుంచి జగన్ రాక కోసం ఎండలోనే వేచి ఉన్న ఒక గృహిణి పార్టీ జెండాను మెడలో వేసుకుని జగన్‌కు రాఖీని కట్టి తన అభిమానాన్ని చాటుకున్నారు. మరోచోట.. స్కూటర్‌పై వెళ్తున్న ఓ కుటుంబం సెల్ఫీ కోరికనూ జగన్ మన్నించారు. వేరు శనక్కాయలు అమ్ముకునే మహిళలు జగన్ వద్దకు రాగా.. ఆయన వాహనం దిగి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆనందంతో వారు జగన్‌కు వేరుశనక్కాయలు ఇచ్చారు.

రోడ్‌షోతో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల్లో ఆనందం

సాయంత్రం 4.35 గంటలకు డెయిరీ ఫారం సెంటర్ వద్ద పార్టీ ఎన్నికల గుర్తు ఫ్యాన్‌ను ప్రజలకు గుర్తుచేస్తూ జగన్ ప్రచారాన్ని ముగించారు. ఉదయం నుంచి వాడవాడలా సాగిన ఆయన పర్యటన పార్టీ అభ్యర్థుల్లో ఉత్సాహాన్ని నింపింది. జగన్ ప్రచారంతో తమ విజయావకాశాలు మరింత రెట్టింపయ్యాయని పార్టీ అభ్యర్థులు సంబరపడ్డారు. కొద్ది రోజులుగా తీవ్ర జ్వరంతో బాధపడుతున్నా ఆరోగ్యాన్ని సైతం లెక్కచేయకుండా తమ తరపున ప్రచారం చేసిన తీరుకు వారు ముగ్ధులయ్యారు. ఆదివారం సెలవు దినం, ప్రచారానికి చివరి రోజు కూడా అయినందువల్ల భారీగా బయటకు వచ్చిన జనం జగన్ పర్యటనను ఆసక్తిగా తిలకించారు. జగన్ పర్యటన వారిని బాగా ప్రభావితం చేసింది. కాగా, ఉదయం జగన్ రాక నేపథ్యంలో పార్టీ యువత పెద్దఎత్తున మోటారు సైకిళ్ల ర్యాలీ నిర్వహించారు.


జగన్‌కు ఘన స్వాగతం

అన్నమ్మ ఘాటి వద్దకు జగన్ తన కాన్వాయ్‌లో వచ్చినపుడు వైఎస్సార్ కాంగ్రెస్ శ్రేణులు, అభిమానులు ఘనస్వాగతం పలికారు. అప్పటికే సుమారు 2 గంటల ముందు నుంచీ వేచి ఉన్న వారంతా జగన్ రాగానే డప్పులు, నృత్యాలు, పార్టీ భారీ పతాకాలతో హర్షాతిరేకాన్ని వ్యక్తం చేశారు. రోడ్‌షోలో జగన్ ఏ ప్రాంతానికి వెళ్తే ఆ ప్రాంతంలో.. పోటీచేస్తున్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థిని వాహనంపైకి ఎక్కించుకుని వారికి ఓట్లేయాల్సిందిగా అభ్యర్థించారు. 28వ వార్డులో బీజేపీ అభ్యర్థి కార్యాలయం మీదుగా రోడ్‌షో సాగుతున్నపుడు లోపల ఉన్న మహిళలంతా బయటకు వచ్చి చేతులూపుతూ తమ ఆనందాన్ని వ్యక్తంచేశారు. నగరం నడిబొడ్డున ఉన్న పద్మనాభ ఫంక్షన్ హాలులో ఉన్న వైఎస్సార్ కాంగ్రెస్ కార్యాలయంలో జగన్ మధ్యాహ్న భోజనం కోసం కొద్దిసేపు ఆగారు. ఈ సమయంలోనూ పెద్ద సంఖ్యలో కార్యకర్తలు జగన్‌ను కలిసేందుకు పోటీపడ్డారు.

వినాయక నిమజ్జనంలో అపశ్రుతి

రెండు మోటారు సైకిళ్లు ఢీ

నలుగురు మృతి.. ఒకరి పరిస్థితి విషమం



నుజ్జునుజ్జయిన మోటార్ సైకిల్

ఒంగోలు క్రైం: వినాయక నిమజ్జనాలు ప్రారంభమైన మొదటి రోజే తీవ్ర విషాదం చోటు చేసుకుంది. ప్రకాశం జిల్లా కొత్తపట్నం మండలం మడనూరులో వినాయక నిమజ్జనానికి వెళ్లి వస్తున్న ఒక మోటారు సైకిల్, సముద్రం వద్దకు వెళ్తున్న మరో మోటారు సైకిల్ ఎదురెదురుగా బలంగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో నలుగురు మృతి చెందారు. మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. మృతుల్లో ముగ్గురు విద్యార్థులున్నారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఒంగోలులోని భాగ్యనగర్ రెండు, మూడు లైన్లలో నివాసం ఉంటున్న ఇంజినీరింగ్ పూర్తి చేసిన మండపల్లి అశోక్ (23), బత్తుల పవన్ (14), కుట్టుబోయిన శివశంకర్ (20) వినాయక నిమజ్జనంలో పాల్గొనేందుకు ఒంగోలు నుంచి మడనూరు సముద్ర తీరానికి వెళ్తున్నారు. అదే సమయంలో మడనూరు సముద్ర తీరం నుంచి మోటారు సైకిల్‌పై టంగుటూరు మండలం కందులూరుకు చెందిన అల్లూరు రాంబాబు (35), బొబ్బల కృష్ణమూర్తి (25) స్వగ్రామానికి తిరుగుముఖం పట్టారు. సాయంత్రం గం.5.30 సమయంలో ఈతముక్కల వద్దకు వచ్చేసరికి రెండు బైకులు అదుపుతప్పి ఎదురెదురుగా ఢీకొట్టాయి. ఘటనలో మండపల్లి అశోక్, అల్లూరు రాంబాబు అక్కడికక్కడే మృతి చెందారు. మిగిలిన వారు తీవ్రంగా గాయపడ్డారు. బైక్‌లు నుజ్జునుజ్జయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు హుటాహుటిన ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బత్తుల పవన్, బొబ్బల కృష్ణమూర్తి చనిపోయారు. కుట్టుబోయిన శివశంకర్ పరిస్థితి విషమంగా ఉంది. దీంతో బంధువులు, కుటుంబసభ్యులు మెరుగైన చికిత్స కోసం ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ఒంగోలు టూటౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి, ఆస్పత్రికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని టూటౌన్ సీఐ దేవప్రభాకర్ తెలిపారు. మృతుల కుటుంబ సభ్యుల రోదనలు రిమ్స్‌లో మిన్నంటాయి.


బిక్కవోలులోని గణపతి ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న జస్టిస్ శివశంకర్

బిక్కవోలు గణపతి సన్నిధిలో జస్టిస్ శివశంకర్

బిక్కవోలు (అనపర్తి): తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలులో కొలువైన శ్రీ లక్ష్మీ గణపతి స్వామివారిని ఆదివారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శివశంకర్ దర్శించుకున్నారు. తొలుత ఆయనకు ఈవో సుబ్రహ్మణ్యం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అర్చకులు గొల్లపల్లి వెంకట రమణశర్మ జస్టిస్ శివశంకర్ చేత స్వామివారికి ప్రత్యేక హోమాలు, పూజలు చేయించారు. అనంతరం ఆయనకు స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు.

ఇండియన్ సొసైటీ ఆఫ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ ఏపీ చాప్టర్ ఏర్పాటు

కర్నూలు (హాస్పిటల్): రాష్ట్ర విభజన అనంతరం ఇండియన్ సొసైటీ ఆఫ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ ఏపీ చాప్టర్ కర్నూలులో ఏర్పాటైంది. ఆదివారం స్థానిక బళ్లారి చౌరస్తాలోని సూరజ్‌గ్రాండ్ హోటల్‌లో నూతన కార్యవర్గ సమావేశం నిర్వహించారు. దీనికి సొసైటీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చంద్రశేఖరన్ ముఖ్యఅతిథిగా, ఏసియన్ ఇన్స్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులు డాక్టర్ డి.నాగేశ్వరరెడ్డి విశిష్ట అతిథులుగా హాజరయ్యారు. అనంతరం ఏపీ చాప్టర్‌కి సంబంధించి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఇండియన్ సొసైటీ ఆఫ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ అధ్యక్షుడిగా కర్నూలుకు చెందిన డాక్టర్ బి.శంకరశర్మ, కార్యదర్శిగా డాక్టర్ వెంకటరంగారెడ్డి, కోశాధికారిగా డాక్టర్ మోహన్‌రెడ్డి ఎన్నికయ్యారు.

గిడుగు జయంతిని అధికారికంగా నిర్వహించాలి

ప్రభుత్వానికి రాష్ట్ర భాషా ఉపాధ్యాయ సంస్థ వినతి

సాక్షి, అమరావతి: టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిలాగానే వ్యవహారిక భాషోద్యమ పితామహుడు గిడుగు రామమూర్తి పంతులు జయంతిని కూడా పాఠశాలల్లో, కార్యాలయాల్లో అధికారికంగా నిర్వహించాలని రాష్ట్ర భాషా ఉపాధ్యాయ సంస్థ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. 'వాడుక భాష జాతి జనుల జీవన భాష' అని చాటిచెప్పిన గిడుగు రామమూర్తి పంతులు జయంతిని తెలుగు భాషా దినోత్సవంగా ప్రభుత్వం ప్రకటించినప్పటికీ అది అమలు కావట్లేదని సంస్థ గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులు రెడ్డి, అధ్యక్షుడు కొండయ్య ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాగా, రాష్ట్రంలో తెలుగు పీఠాన్ని, తెలుగు విశ్వవిద్యాలయాన్ని కూడా ఏర్పాటు చేయాలని ఉప రాష్ట్రపతి వెంకయ్యానాయుడుకి, కేంద్ర మానవవనరుల శాఖ మంత్రి ప్రకాశ్ జవదేకర్‌కి విజ్ఞప్తి చేసినట్టు తెలిపారు.

కాపులను విద్రోహ శక్తులుగా ముద్రవేసేందుకు కుట్ర

టీడీపీ ప్రభుత్వంపై అఖిల భారత దళిత హక్కుల సంఘం ధ్వజం

సాక్షి, న్యూఢిల్లీ: కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభం పాదయాత్రను ఉద్దేశపూర్వకంగా అడ్డుకుంటున్న టీడీపీ ప్రభుత్వం కాపులను విద్రోహ శక్తులుగా ముద్రవేసేందుకు ప్రయత్నిస్తోందని అఖిల భారత దళిత హక్కుల సంఘం అధ్యక్షుడు ఆనందరావు ధ్వజమెత్తారు. ఆదివారం ఢిల్లీలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ముద్రగడ పాదయాత్రను అడ్డుకోవడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిలా కాకుండా హిట్లర్‌లా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. కాపుల ఉద్యమానికి దళిత సంఘాలు మద్దతుగా ఉంటాయని ఆయన తెలిపారు.

కాపులను బీసీల్లో చేర్చే నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నాం

తెలంగాణ టీడీపీ ఎమ్మెల్యే, బీసీ సంక్షేమ సంఘం నేత ఆర్.కృష్ణయ్య



నగరంపాలెం (గుంటూరు): కాపులను బీసీల్లో చేర్చుతామనే టీడీపీ ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలంగాణ టీడీపీ ఎమ్మెల్యే, బీసీ సంక్షేమ సంఘం నేత ఆర్.కృష్ణయ్య తెలిపారు. ఆదివారం గుంటూరులో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యవర్గ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాపులకు విద్య, ఉద్యోగ అవకాశాల్లో రిజర్వేషన్లు కల్పిస్తున్నామని చెబుతున్నా.. రాజ్యాధికారంలోనూ భాగస్వామ్యం కల్పించే అవకాశం ఉందన్నారు. అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిన కాపులను బీసీల్లో చేర్చితే బీసీల్లోని పేద కులాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. బీసీలతో రాజకీయ పార్టీ ఏర్పాటుకు కార్యాచరణ రూపొందిస్తామన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 70 ఏళ్లవుతున్నా బీసీలకు సంబంధించి 15 డిమాండ్లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వాటిలో ఇటీవల జాతీయ బీసీ కమిషన్‌కు చట్టబద్ధత కల్పించటం, ఓబీసీలో వర్గీకరణ ప్రవేశపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపటంపై ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. మిగతా డిమాండ్‌లను సాధించటానికి బీసీ కులాలను ఏకతాటిపైకి తెచ్చేందుకు రాష్ట్రంలోని తిరుపతి, అనంతపురం, కర్నూలు, గుంటూరు, విజయవాడ, రాజమండ్రి, విశాఖపట్నంలలో భారీ బహిరంగ సభలు ఏర్పాటు చేసి ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం నేతలు కేసన శంకరరావు, కుమ్మరి క్రాంతికుమార్ యాదవ్, కన్నా మాస్టారు, అల్‌మండ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

'అగ్రకులాలను బీసీల్లో చేర్చితే చంద్రబాబుకు రాజకీయ సమాధి కడతాం'

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): అర్హతలేని అగ్రకులాలను బీసీ జాబితాలో చేర్చితే సీఎం చంద్రబాబుకు రాజకీయ సమాధి కడతామని ఏపీబీసీ జేఏసీ చైర్మన్ అన్నా రామచంద్రయ్య హెచ్చరించారు. కాపులను బీసీల్లో చేర్చాలనే ఏ రాజకీయపార్టీకైనా భవిష్యత్‌లో బీసీలు బుద్ధిచెబుతారన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాపులను బీసీల్లో చేర్చి విద్యా, ఉద్యోగాల్లో మాత్రమే రిజర్వేషన్లు వర్తింపజేస్తామని చంద్రబాబు బూటకపు మాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కాపు, బలిజ, తెలగ, ఒంటరి కులాల వారు తమ సామాజిక వెనుకబాటుతనాన్ని నిరూపించుకోలేకపోయారని మంజునాథ కమిషన్ చైర్మనే స్వయంగా ప్రకటించారని గుర్తుచేశారు. కమిషన్ నివేదిక రాకముందే కాపులను బీసీల్లో చేర్చుతామని నంద్యాల, కాకినాడ ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు చంద్రబాబు ప్రకటన చేశారన్నారు. జేఏసీ కన్వీనర్ ఎస్.యానాదయ్య మాట్లాడుతూ.. జాతీయ స్థాయిలో బీసీ కమిషన్‌కు చట్టబద్ధత కల్పించి బీసీలకు న్యాయం చేయాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు చెప్పారు.

గిరిజన రైతులతో పూలతోటల సాగు

సాక్షి, అమరావతి: గిరిజన రైతులతో పూలతోటల సాగుకు గిరిజన కార్పొరేషన్(ట్రైకార్) ప్రత్యేక ప్రణాళిక రూపొందించింది. ఇందులో భాగంగా విశాఖపట్నం జిల్లాలోని అరకువ్యాలీ, చింతపల్లి మండలాల్లో వంద ఎకరాల్లో నాలుగు రకాల పూలతోటలను గిరిజనులతో సాగు చేయించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకయ్యే వ్యయాన్ని ఎస్టీ కార్పొరేషన్ ద్వారా ఖర్చు చేసేందుకు నిర్ణయించినట్లు ట్రైకార్ ఎండీ ఇ.రవీంద్రబాబు తెలిపారు. ఒక ఎకరా సాగుకు రూ.45,000 ఖర్చవుతుందని అంచనా. ఇందులో సబ్సిడీ కింద రూ.36,250 అందజేస్తారు. రైతులు మిగతా రూ.8,750 భరించాల్సి ఉంటుంది. ట్యూబ్ రోజ్ (కానా పుష్పం) విత్తనాల కొనుగోలుకు ఎకరాకు రూ.10,000, చైనా ఆస్టర్ విత్తనాలకు రూ.2,000, మ్యారీ గోల్డ్(బంతిపువ్వు) విత్తనాలకు రూ.4,250, గ్లాడోలిస్(ఉరఃఫలకము) విత్తనాలకు రూ.20,000 ఖర్చు చేస్తున్నారు. విత్తనాలు, ఇతర ఖర్చులతో కలిపి 100 ఎకరాల్లో పూలతోటల సాగుకు రూ.36,25,000 ఖర్చవుతాయని అంచనా వేశారు. 100 మంది రైతులతో ఈ సాగు చేయిస్తారు. పలు ప్రాంతాల్లో సాధా రణ పూలతోటలున్నప్పటికీ గిరాకీ ఉన్న పూల సాగు తో ఆదాయం రాబట్టు కోవచ్చనే ఆ లోచనతో అధికారులు ఈ ప్రతిపాదనలు రూపొం దించారు. పూల తోటల సాగుకు హార్టీకల్చర్ వర్సిటీ శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు తీసుకుని, వినియోగించు కుంటామని ట్రైకార్ ఎండీ రవీంద్రబాబు తెలిపారు.

సర్కారుకు ముద్రగడ షాక్

జగ్గంపేట

కాపులకిచ్చిన హామీల్ని నెరవేర్చాలని తలపెట్టిన 'చలో అమరావతి' పాదయాత్రను నెలరోజులుగా అడ్డుకుంటున్న రాష్ట్రప్రభుత్వానికి కాపు ఉద్యమనేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం అనూహ్యరీతిలో షాకిచ్చారు. పోలీసులకు ఎలాంటి అనుమానం రాకుండా వంటావార్పు పిలుపుతో భారీగా తూర్పుగోదావరి జిల్లా కిర్లంపూడికి తరలివచ్చిన కాపు నేతలు, కాపులతో కలసి ఆయన ఆదివారం తన నివాసం నుంచి ఒక్కసారిగా పాదయాత్రను చేపట్టారు. తీవ్ర ఉద్రిక్త పరిస్థితుల నడుమ పోలీసుల్ని తోసుకుంటూ కిలోమీటర్ దూరంపాటు పాదయాత్ర కొనసాగింది. ఈలోగా అప్రమత్తమైన పోలీసులు యాత్రను నిలువరించేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. వారిని తోసుకుంటూ ఉద్యమకారులు ముందుకు సాగారు. దాదాపు ఐదు కిలోమీటర్ల మేరకు యాత్ర సాగాక సాయంత్రం నాలుగున్నర గంటల సమయంలో వీరవరం సమీపంలో పోలీసులు ముద్రగడను అరెస్ట్ చేశారు. వాహనంలో ఆయన్ను వీరవరం, రామచంద్రపురం, తామరాడ, పాలెం, జగ్గంపేట మండలం రామవరం మీదుగా జాతీయ రహదారి వైపు తరలించారు. ఈ క్రమంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.


పాదయాత్ర చేస్తున్న కాపులతో జనసంద్రమైన రాజుపాలెం రహదారి

ఊహించని రీతిలో..

కాపులను బీసీల్లోకి చేరుస్తామని చంద్రబాబు ఇచ్చిన హామీని నెరవేర్చమని కోరుతూ ముద్రగడ 'చలో అమరావతి' పేరిట పాదయాత్ర తలపెట్టగా.. పోలీసులతో ప్రభుత్వం నెలరోజులుగా అడ్డుకుంటున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో నిరసన తెలిపేందుకోసం వంటావార్పుకోసం కిర్లంపూడికి తరలిరావాల్సిందిగా కాపు జేఏసీ నేత జి.వెంకటరమణ పిలుపునిచ్చారు. ఈ పిలుపు నందుకుని చుట్టుపక్కల గ్రామాల నుంచి కాపు మహిళలు,


ఆదివారం అర్ధరాత్రి కిర్లంపూడి పోలీస్ స్టేషన్‌లో ముద్రగడ

యువకులు, నేతలు, పెద్దలు భారీ ఎత్తున కిర్లంపూడికి ఆదివారం తరలివచ్చారు. కొందరు ఎడ్లబండ్లతో తరలివచ్చారు. ఈ నేపథ్యంలో ఉదయం పదిగంటలకు తన నివాసం నుంచి అనుచరులతో గేటు వద్దకొచ్చిన ముద్రగడ ఓఎస్డీ తదితరులు పోలీసులకు నమస్కరించాక.. మీడియాతో మాట్లాడారు. అనంతరం భారీగా తరలివస్తున్న కాపులకు ఆయన నమస్కరిస్తూ 'పాదయాత్రకు వెళదాం నడవండి' అని పిలుపునిచ్చి ఉదయం 11.20 గంటలకు అనూహ్యంగా బయల్దేరారు. రాజుపాలెంవైపు నడక ప్రారంభించారు. ఆయన్ను పోలీసులు భారీఎత్తున అనుసరించారు. తీవ్ర ఉద్రిక్త పరిస్థితుల నడుమ పోలీసుల్ని తోసుకుంటూ కిలోమీటరుపాటు కొనసాగింది. ఈలోగా కిర్లంపూడిలోనే మకాం వేసిన ఏలూరు రేంజి డీఐజీ రామకృష్ణ, ఓఎస్డీ రవిశంకర్‌రెడ్డి అప్రమత్తమై పోలీసు బలగాలతో మధ్యాహ్నం 12 గంటల సమయంలో యాత్రను అడ్డుకున్నారు. దీంతో అక్కడే ముద్రగడ బైఠాయించి నిరసన తెలిపారు. ఈ పరిస్థితుల్లో అక్కడ తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. పలువురు సీఎంకు వ్యతిరేకంగా నినదించారు. ఈ సమయంలో ఎడ్లబళ్లపై వచ్చిన కాపులు పోలీసుల అడ్డుతొలగించేలా బళ్లను తిప్పారు. రెండుగంటలపాటు అక్కడే బైఠాయించిన ముద్రగడ అనంతరం మళ్లీ నడక చేపట్టారు. అడ్డుకునేందుకు ప్రయత్నించిన పోలీసుల్ని ఉద్యమకారులు తోసుకుంటూ ముందుకు సాగారు. దాదాపు ఐదు కిలోమీటర్ల మేరకు యాత్ర కొనసాగింది. రామకృష్ణాపురం మీదుగా రాజుపాలెం చేరుకున్నారు.

తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు..

ముద్రగడ పాదయాత్ర నేపథ్యంలో పోలీసులు కిర్లంపూడి వైపు వచ్చే రహదారులన్నీ దిగ్బంధించారు. ఎక్కడికక్కడ చెక్‌పోస్టులు ఏర్పాటుచేసి జనాల్ని నిలువరించారు. ప్రత్తిపాడు నుంచి దివిలి వరకు ట్రాఫిక్ భారీగా స్తంభించింది. దీంతో బస్సుసర్వీసులు, ఇతర ప్రైవేటు సర్వీసులు నిలిచిపోయి ప్రయాణికులు పొలాలగుండా నడిచివెళ్లాల్సి వచ్చింది. మరోవైపు ముద్రగడను ఉద్యమకారులు అనుసరించకుండా ఎక్కడికక్కడే అడ్డుకున్నారు. వారిని చెల్లాచెదరు చేసేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో వారిపై లాఠీచార్జికి సైతం దిగారు. ఇందులో పలువురు గాయపడ్డారు. ఈలోగా రాజుపాలెం నుంచి వీరవరం వైపు సుమారు 5 కిలోమీటర్ల మేర ముద్రగడ యాత్ర చేరుకోగానే లాఠీచార్జి విషయం ఆయనకు తెలిసింది. దీంతో ఆయన మండిపడుతూ.. తన జాతిపై లాఠీచార్జి సహించేదిలేదని, తనను అరెస్టు చేసుకుని తీసుకెళ్లాలని ఎవ్వరినీ వదిలిపెట్టవద్దని అన్నారు. ఈలోగా కాకినాడలో సీఎం చంద్రబాబు కార్యక్రమం ముగియడంతో మరిన్ని పోలీసు బలగాలు ముద్రగడ యాత్ర ప్రదేశానికి చేరుకున్నాయి. ఈ నేపథ్యంలో సాయంత్రం 4.30 గంటలకు వీరవరం వద్ద ముద్రగడను పోలీసులు అరెస్ట్ చేశారు. కిర్లంపూడికి తరలిస్తున్నట్టు చెప్పారు. అయితే ఆయన్ను వీరవరం, రామచంద్రపురం, తామరాడ, పాలెం, జగ్గంపేట మండలం రామవరం మీదుగా జాతీయరహదారి వైపు తరలించారు. ఈ క్రమంలో అభిమానులు, కాపులు అడుగడుగునా అడ్డగించి పోలీసులకు, చంద్రబాబుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రామచంద్రపురం, పాలెం వద్ద టైర్లను అంటించి నిరసన వ్యక్తం చేశారు. తామరాడ వద్ద రోడ్డుకు అడ్డంగా చెట్లు దుంగలు, ట్రాక్టర్ ట్రక్కులను అడ్డుగా పెట్టి నిరసనలు తెలిపారు. మరోవైపు హోరున కురిసే వర్షాన్నీ, చీకటినీ లెక్క చేయకుండా ముద్రగడను అభిమానులు అనుసరించారు. రాత్రి పదిగంటలకు ఆ వాహనం రామవరం చేరుకోగా ముద్రగడ అభిమానులు, కాపులు అడ్డుకున్నారు. 16వ నంబర్ జాతీయ రహదారిపై బైఠాయించారు. పాదయాత్రకు అనుమతైనా ఇవ్వండి లేదా అరెస్ట్ చేయండంటూ ముద్రగడ భీష్మించారు. దీంతో రాత్రి 11 గంటల వరకు వాహనం అక్కడే నిలిచిపోయింది.అనంతరం రాత్రి 11:45 గంటలకు కిర్లంపూడి పోలీస్ స్టేషన్‌కు ముద్రగడను పోలీసులు తరలించారు.


ఆగ్రహంతో టైర్లు దహనం చేస్తున్న అభిమానులు

లక్ష్యం నెరవేరేవరకూ పోరు ఆగదు: ముద్రగడ



లక్ష్యం నెరవేరేదాకా తమ పోరాటం ఆగదని కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభం స్పష్టం చేశారు. తుపాకులతో కాల్చినా, లాఠీలతో కొట్టినా ఉద్యమాన్ని వదిలిపెట్టబోమని, ఎన్ని కేసులు పెట్టినా బాధపడమని అన్నారు. పాదయాత్రను అడ్డుకుని నెలరోజులైన నేపథ్యంలో ఆదివారం ఉదయం తన నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు అబద్ధాలతో సిగ్గూలజ్జా లేకుండా రాష్ట్రంలో పాలన సాగిస్తున్నారని దుయ్యబట్టారు. ఎవరిని ఓడించాలో, ఎవరిని నెగ్గించాలో కాపు జాతికి చెప్పనక్కర్లేదన్నారు. కాపులను బీసీల్లోకి చేరుస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చమని కోరితే.. పశువుల కంటే హీనంగా బందెలదొడ్డిలో ఉంచి పోలీసులతో కాపలా కాయిస్తున్నారని ఆక్షేపించారు. కనీసం ఎవరైనా చనిపోతే పరామర్శకు వెళ్లేందుకూ స్వేచ్ఛ లేకుండా చేశారన్నారు. అనుమతి లేదని తనను నెలరోజులుగా గృహనిర్బంధం చేస్తున్నారని మండిపడ్డారు. తామేమీ సీఎంపై దండయాత్రకు వెళ్లట్లేదన్నారు. 'ఎవరికీ లేని ఆంక్షలు నా ఒక్కడికేనా? బ్రిటీషు పాలనలో ఉన్నామా? ఏమిటీ నిర్బంధం? ఎంతకాలం?' అని నిలదీశారు. 2004, 2009లలో గెలిచిన కాంగ్రెస్ ప్రభుత్వాలు కాపు రిజర్వేషన్లపై ఏమీ చెయ్యలేదని చంద్రబాబు చెబుతున్నారని, 1995లో హైకోర్టు జీవో 30కి అనుకూలంగా తీర్పునిచ్చిందని, అంతకుముందు అధికారంలో ఉన్న చంద్రబాబు హైకోర్టు తీర్పును ఎందుకు అమలు చేయలేదన్నారు. మాటిమాటికీ కుల ఉద్యమమని ముద్ర వేస్తూనే నంద్యాల, కాకినాడ ఎన్నికల్లో కులాలవారీగా మీటింగ్‌లు పెట్టలేదా? అని సీఎంను ప్రశ్నించారు. తమకు కల్పించిన ఆశల్ని తీర్చాలంటూ రోడ్డెక్కితే అణచివేతకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. 'మీకు పాదసేవ చేసుకోవాలా? జీవితాంతం మీరు, మీ కొడుకు, మనుమడు పదవులు అనుభవించాలా? మా జాతి పిల్లలకు కనీసం రిజర్వేషన్లు కూడా ఇవ్వరా?' అని నిలదీశారు. 'మేం పరామర్శకు వెళ్లకూడదు. మీరు మాత్రం విదేశాలకు విహారయాత్రలకు వెళ్లవచ్చా?' అని ప్రశ్నించారు. కాపు జేఏసీ నాయకుడు వాసిరెడ్డి ఏసుదాసు మాట్లాడుతూ.. కాపులపై అణచివేతకు పాల్పడుతూ వారిని ఓట్లడగటానికి సిగ్గులేదా చంద్రబాబూ? అని ప్రశ్నించారు. కాపు నేతలు ఆకుల రామకృష్ణ, ఆరేటి ప్రకాష్‌లు కూడా చంద్రబాబు తీరును తప్పుపట్టారు.

విజయవాడలో కాపుల భేటీ

సాక్షి, అమరావతి: కాపు రిజర్వేషన్ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని విజయవాడలో ఆదివారం సమావేశమైన కాపు ప్రతినిధులు హెచ్చరించారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన ప్రతినిధులతో సమావేశం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జరిగింది. అనంతరం విలేకరుల సమావేశంలో తెలగ, బలిజ, కాపు అడహాక్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ ఇమ్మడి సత్యనారాయణ మాట్లాడుతూ కాపు రిజర్వేషన్ ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోయేందుకు ముద్రగడ పద్మనాభంతో కలసి పనిచేస్తామన్నారు. రాజకీయాలకు అతీతంగా పనిచేయాలనే ఉద్దేశంతోనే కొత్తగా కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. త్వరలోనే పూర్తిస్థాయి కమిటీతోపాటు జిల్లాల వారీగా కమిటీలు ఏర్పాటవుతాయన్నారు. అడహక్ కమిటీ రాష్ట్ర కన్వీనర్‌గా ఇమ్మడి సత్యనారాయణ, కో-కన్వీనర్‌గా మల్లెమూడి కోటయ్యనాయుడు, రాష్ట్ర కమిటీ సభ్యులుగా లోటయ్య దొర, ముప్పా రమణ, వాదా ప్రసాద్, ఎస్‌పీ రాజు, సర్వమంగళ శేషగిరిరావు, కేవీవీ సత్యనారాయణ, కె.ఆంజనేయులు, కొప్పుల వెంకట్, ఆలమూరి దుర్గారావు, గాజుల వెంకటేశ్వరావు, వి.నాగేశ్వరావు, హరిరాయల్ ఎంపికైనట్లు తెలిపారు. త్వరలోనే తమ పాలసీని ప్రకటిస్తామని వివరించారు.

ముద్రగడ పాదయాత్రకు అనుమతి లేదు: డీజీపీ

రాజమహేంద్రవరం క్రైం: కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం పాదయాత్రకు అనుమతి ఉన్నట్లు కొన్ని చానళ్లలో వస్తున్న వార్తల్లో నిజం లేదని, పాదయాత్రకు పోలీసుల నుంచి ఎలాంటి అనుమతులూ లేవని డీజీపీ నండూరి సాంబశివరావు స్పష్టం చేశారు. ఆదివారం తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని అర్బన్ జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పోలీస్ అధికారుల ఆదేశాలను బేఖాతరు చేసి పాదయాత్ర చేయడం సరికాదన్నారు. ముద్రగడ పాదయాత్రలో విధ్వంసం సృష్టించడానికి కొందరు వ్యక్తులు వచ్చినట్లు తమకు సమాచారం ఉందని తెలిపారు. ఆయన పాదయాత్ర చేస్తున్నట్లు తమకు లేఖ రాస్తే తప్పకుండా అనుమతి ఇస్తామన్నారు. ముద్రగడపై 65 కేసులు నమోదయ్యాయని, త్వరలో చార్జిషీట్లు దాఖలు చేసి, అరెస్టు చేస్తామని చెప్పారు. ముద్రగడ పాదయాత్రను అడ్డుకోవడంలో స్థానిక పోలీసులు విఫలమయ్యారని, పెద్దాపురం డీఎస్పీ చిలక రామారావును సస్పెండ్ చేస్తామని తెలిపారు.

భార్యాభర్తల వివాదాల్లో మధ్యవర్తిత్వం వహించాలి

న్యాయవాదులకు సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లావు నాగేశ్వరరావు సూచన



'క్రిమినల్ లా అండ్ మ్యారేజ్' అంశం పై జరిగిన సదస్సులో మాట్లాడుతున్న లావు నాగేశ్వరరావు

విజయవాడ లీగల్: సమాజంలో భార్యాభర్తల మధ్య బంధాలను పెంపొందించేలా న్యాయవాదులు పనిచేయాలని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లావు నాగేశ్వరరావు కోరారు. 'క్రిమినల్ లా అండ్ మ్యారేజ్' అనే అంశంపై భారత న్యాయవాదుల సంఘం నేతృత్వంలో నగరంలోని ఐ.వి.ప్యాలెస్‌లో ఆదివారం నిర్వహించిన సదస్సులో ఆయన ప్రసంగించారు. భార్యాభర్తల వివాదాల్లో న్యాయవాదులు మధ్యవర్తిత్వం చేయాలని సూచించారు. గృహహింస చట్టం ప్రకారం దేశంలోనే ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కువ కేసులు నమోదవుతున్నాయని వెల్లడించారు. గతంలో ఉమ్మడి కుటుంబాలుండేవని, ప్రస్తుతం అటువంటివి చూడటానికి కూడా లేవని అన్నారు. కట్నం ఇవ్వడం, తీసుకోవడం రెండూ నేరమేనని పేర్కొన్నారు. వరకట్న కేసులకు సంబంధించి పలు తీర్పులను వివరించారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు లీగల్ సెల్ వెల్ఫేర్ కమిటీని ఏర్పాటు చేశారన్నారు. భార్యాభర్తల కేసుల విషయం లో ఆ కమిటీ పర్యవేక్షించిన తర్వాతే కేసు నమోదు చేస్తార ని స్పష్టం చేశారు. సమాజంలో న్యాయాన్ని కాపాడే విషయంలో న్యాయ వాదిగా సి.పద్మనాభరెడ్డి కృషి చేశారని కొనియాడారు.

వరకట్నం వేధింపుల కేసుల్లో తప్పుడు ఫిర్యాదులు..

హైకోర్టు జడ్జి సి.ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ వరకట్న వేధింపుల కేసుల్లో గతంలో నిజాయతీ ఉండేదని ప్రస్తుతం తప్పుడు ఫిర్యాదులు వస్తున్నాయని వివరించారు. భార్య ఉండగా భర్త మరో వివాహం చేసుకోవడం కూడా తప్పేనన్నారు. పెళ్లి చేసుకుని విదేశాలకు వెళ్లి సమస్యలతో వెంటనే విడాకులకు దరఖాస్తు చేస్తున్నారని తెలిపారు. ఐఏఎల్ అధ్యక్షుడు ఆర్.ఎస్.చీమ, వర్కింగ్ ప్రెసిడెంట్ జితేంద్ర శర్మ, కృష్ణా జిల్లా ప్రధాన న్యాయమూర్తి వై.లక్ష్మణ రావు, నగర మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ఎం.వెంగయ్య, హైకోర్టు న్యాయవాది బొమ్మగాని ప్రభాకర్, బెజవాడ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు చలసాని అజయ్ ప్రసంగించారు.

దేశంలో మానవ వనరులు అపారం

సమర్థంగా వినియోగించుకుంటాం

కేంద్ర మంత్రి అరుణ్‌జైట్లీ

పటాన్‌చెరు బీడీఎల్‌లో 5 మెగావాట్ల పవర్ ప్లాంట్ ప్రారంభం

ఎల్ఆర్ సామ్ క్షిపణి ఇండియన్ నేవీకి అప్పగింత



ఆదివారం హైదరాబాద్‌లోని కంచన్‌బాగ్ బీడీఎల్‌లో జరిగిన కార్యక్రమంలో సామ్ క్షిపణిని నావికాదళానికి అప్పగిస్తున్న రక్షణమంత్రి అరుణ్‌జైట్లీ. చిత్రంలో సతీశ్‌రెడ్డి, వైఎస్ అడ్మిరల్ కరమ్‌బీర్ సింగ్, డీఆర్‌డీవో చైర్మన్ ఎస్ క్రిస్టాఫర్,రక్షణ శాఖ కార్యదర్శి ఏకే గుప్తా, బీడీఎల్ సీఎండీ ఉదయ్ భాస్కర్

సాక్షి, హైదరాబాద్: 'దేశంలో మానవ వనరులు సమృద్ధిగా ఉన్నాయి. విదేశాల్లోనూ సత్తాచాటుతున్నవారు ఎంతో మంది ఉన్నారు. ఈ వనరులను దేశాభివృద్ధికి సమర్థంగా వినియోగించుకుంటాం' అని కేంద్ర రక్షణ, ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ వ్యాఖ్యానించారు. కంచన్‌బాగ్‌లోని బీడీఎల్‌లో జరిగిన కార్యక్రమంలో ఆదివారం మంత్రి పాల్గొన్నారు. బీడీఎల్, మిథాని రూపొందించిన అధునాతన క్షిపణి (ఎల్ఆర్ సామ్)ను ఇండియన్ నేవీకి అప్పగించారు. అలాగే యుద్ధ ట్యాంకర్‌ను రక్షణ శాఖకు అంకితమిచ్చారు. ఈ సందర్భంగా జైట్లీ మా ట్లాడుతూ.. 'సాంకేతిక పరిజ్ఞానంలో మనం దూసుకుపోతున్నాం. పరిశోధనల్లోనూ అదే వేగాన్ని కొనసాగిస్తున్నాం. ఈ రంగాల్లో అపార అవకాశాలున్నాయి. వీటిని యువత సద్వినియోగం చేసుకోవాలి' అని పిలుపునిచ్చారు. జనాభా పరంగా పెద్ద దేశాల్లో భారత్ ఒకటని.. ఇక్కడ మధ్య, పేద తరగతి వర్గాల ప్రజలు ఎక్కువగా ఉన్నారని, ప్రతి పౌరుడికీ నాణ్యమైన విద్య అందాల్సిన అవసరముందన్నారు. భారత్‌లో సాంకేతిక పరిజ్ఞానానికి కొదవ లేదని, ఇక్కడి ఇంజనీర్లు విదేశాల్లోనూ రికార్డులు సృష్టిస్తున్నారని పేర్కొన్నారు. మేకిన్ ఇండియా కార్యక్రమంలో భాగంగా తయారీ రంగాన్ని ప్రోత్స హిస్తున్నామన్నారు. రక్షణ శాఖలో టెక్నాలజీని పూర్తిస్థాయిలో వినియోగిస్తామని చెప్పారు. బీడీఎల్, మిథాని సేవలు రక్షణ రంగానికి తలమానికంగా నిలిచాయన్నారు. కార్యక్రమంలో రక్షణ శాఖ కార్యదర్శి ఏకే గుప్తా, రక్షణమంత్రి సలహాదారు సతీశ్‌రెడ్డి, బీడీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఉదయ్‌భాస్కర్, డీఆర్‌డీఓ చైర్మన్ ఎస్.కిష్టపర్, నేవీ వైస్ అడ్మిరల్ కరమ్‌బీర్ సింగ్ పాల్గొన్నారు.

ఓడీఎఫ్‌ను సందర్శించిన జైట్లీ

సంగారెడ్డి రూరల్: సంగారెడ్డి జిల్లా కంది మండల పరిధిలోని ఎద్దుమైలారం (ఓడీఎఫ్) ఆయుధ కర్మాగారాన్ని జైట్లీ సందర్శించారు. అక్కడ అరగంట పాటు గడిపిన మంత్రి.. కర్మాగారంలో తయారవుతున్న యుద్ధ ట్యాంకులను పరిశీలించినట్లు సమాచారం. రక్షణ మంత్రి పర్యటన సందర్భంగా సమాచార సేకరణకు వెళ్లిన మీడియాను ఓడీఎఫ్ అధికారులు అనుమతించలేదు. ప్రొటోకాల్ ప్రకారం తమను ఓడీఎఫ్‌లోకి అనుమతించాలంటూ మెయిన్‌గేట్ వద్ద రోడ్డుపై బైఠాయించి ఎద్దుమైలారం గ్రామ సర్పంచ్ దశరథ్ నిరసన వ్యక్తం చేశారు. మరోవైపు ఓడీఎఫ్‌ను ప్రైవేటీకరించేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందంటూ ఆల్ ఇండియా ఓడీఎఫ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మెయిన్ సర్కిల్ వద్ద కార్మికులు నిరసనకు దిగారు. ఓడీఎఫ్ నిర్మాణంలో భూములు కోల్పోయిన నిర్వాసితులకు న్యాయం చేయాలంటూ ఇంద్రకరణ్, క్యాసారం, ఎద్దుమైలారం, సింగపురం నిర్వాసితులు డిమాండ్ చేశారు. మంత్రిని కలిసేందుకు అవకాశం ఇవ్వకపోవడంతో మెయిన్ సర్కిల్ వద్ద నిరసనకు దిగారు.

ఇబ్రహీంపట్నం యూనిట్‌లో స్టాటిక్ టెస్ట్ ప్రారంభం

ఇబ్రహీంపట్నం రూరల్: రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం శేరిగూడ బీడీఎల్‌లో జైట్లీ పర్యటించారు. భారత్ డైనమిక్ లిమిటెడ్ ఇబ్రహీంపట్నం యూనిట్‌లో స్టాటిక్ టెస్ట్‌ను ప్రారంభించారు. రెండో దశ భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. బీడీఎల్ ఏర్పాటు చేసిన సైట్ లే అవుట్ మ్యాప్‌లను అధికారులతో కలసి తిలకించారు. ఇప్పటికే నిర్మాణం చేపట్టిన భవన నిర్మాణాలను పరిశీలించారు. పటాన్‌చెరు మండల పరిధిలోని బీడీఎల్ పరిశ్రమను ఆదివారం జైట్లీ సందర్శించారు. పరిశ్రమలో రక్షణ మంత్రి అస్త్ర క్షిపణుల తయారీ ప్రాజెక్టు కార్యాలయాన్ని ప్రారంభించారు.

గేట్, జీప్యాట్ కౌన్సెలింగ్ ప్రారంభం

1 నుంచి పీజీఈసెట్ కౌన్సెలింగ్

ఏయూక్యాంపస్ (విశాఖతూర్పు): రాష్ట్ర వ్యాప్తంగా గేట్, జీప్యాట్-2017 కౌన్సెలింగ్ ఆదివారం ప్రారంభమైంది. ఏయూ ఆన్‌లైన్ కౌన్సెలింగ్ కేంద్రంలో ఉదయం నుంచి సర్టిఫికెట్ల పరిశీలన జరిపారు. ముందుగా గేట్ అభ్యర్థులకు సర్టిఫికెట్ల పరిశీలన జరిపారు. మధ్యాహ్నం నుంచి జిపాట్ ర్యాంకర్లకు సర్టిఫికెట్ల పరిశీలన జరిపి స్క్రాచ్ కార్డులను అందజేశారు. గేట్‌లో ఏరోస్పేస్, ఆర్కిటెక్చర్, బయోటెక్నాలజీ, సివిల్, కెమికల్, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, జియాలజీ-జియోఫిజిక్స్, ఇన్‌స్ట్రుమెంటేషన్, మెటలర్జికల్ ఇంజనీరింగ్, ఫిజిక్స్, ప్రొడక్షన్ ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్ విభాగాలలో సర్టిఫికెట్ల పరిశీలన జరిపారు. సోమవారం ఉదయం 9 నుంచి గేట్, జిపాట్ ర్యాంకర్లకు సర్టిఫికెట్ల పరిశీ లన కొనసాగిస్తామని కౌన్సెలింగ్ కేంద్రం సమన్వ యకర్త ఆచార్య నాగేశ్వరరావు తెలిపారు. ఉదయం సర్వర్ ప్రారంభం కాకపోవడంతో కౌన్సెలింగ్ కాస్త ఆలస్యంగా ప్రారంభమైంది. ఆదివారం సాయంత్రం నుంచి వెబ్‌ఆప్షన్ల ప్రక్రియ ప్రారంభమైంది. ఇలా ఉండగా, ఇంజనీరింగ్, ఫార్మశీ పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన ఏపీ పీజీఈసెట్-2017 కౌన్సెలింగ్ సెప్టెంబర్ 1వ తేదీ నుంచి ప్రారంభం అవుతుంది. 1న ఎన్‌సీసీ, సీఏపీ, పీహెచ్, క్రీడా విభాగాలలో అన్ని ర్యాంకుల వారికి కౌన్సెలింగ్ జరుపుతారు.

నా వల్లే విభజన చట్టంలో హామీలకు చోటు

- చట్టంలో పేర్కొన్న హామీలు ఏనాటికైనా నెరవేర్చాల్సిందే
- అన్ని హామీల అమలు రాత్రికి రాత్రే సాధ్యం కాదు
- ప్రత్యేక హోదాకు అవకాశం లేనందునే ప్యాకేజీ
- ఏపీకి 5.35 లక్షల ఇళ్లు మంజూరు చేశాం..
- రాష్ట్ర ప్రభుత్వం మ్యాచింగ్‌గ్రాంట్ ఇస్తేనే పూర్తవుతాయి
- పత్రికలతో ఎనలేని అనుబంధం
- ఉప రాష్ట్రపతిగా రాష్ట్రానికి నా సహకారం కొనసాగుతుంది
- మీడియాతో చిట్‌చాట్‌లో వెంకయ్యనాయుడు



విలేకరులతో మాట్లాడుతున్న ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

సాక్షి ప్రతినిధి, అమరావతి బ్యూరో: ''రాష్ట్ర విభజన సమయంలో తొలుత రూపొందించిన విభజన చట్టంలో ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకంగా ఇచ్చిన హామీలు ఏమీ లేవు. నేను అప్పటి ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్, యూపీఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీ, అప్పటి మంత్రి జైరాం రమేష్‌తో మాట్లాడిన తర్వాతే.. విభజన చట్టంలో హామీలకు చోటు లభించింది'' అని ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు చెప్పారు. హామీల అమలు రాత్రికి రాత్రి జరిగేది కాదన్నారు. నెరవేరడానికి సమయం పడుతుందన్నారు. చట్టంలో పేర్కొన్నారు కాబట్టి.. ఎప్పటికైనా వచ్చేవేనన్నారు. ఆదివారం స్వర్ణభారత్ ట్రస్టులో పత్రికా ప్రతినిధులతో మాట్లాడారు. తన నాలుగు దశాబ్దాల రాజకీయ జీవిత ప్రయాణంలో పత్రికలతో ఎనలేని అనుబంధం ఉందని గుర్తు చేసుకున్నారు. హోటళ్లలో బసచేస్తే మిగతా వారికిబ్బంది ఉంటుందని స్వర్ణభారత్ ట్రస్టులో బస చేశానని తెలిపారు. రాజ్యాంగబద్ధ పదవిలో ఉండటం వల్ల కొన్ని మర్యాదలు, బాధ్యతలు, పరిమితులుంటాయని, పత్రికల వారితో తరచూ మాట్లాడటం సాధ్యం కాదని అన్నారు. ఉపరాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టాక తొలిసారి విజయవాడ వచ్చిన సందర్భంగా.. పత్రికల ప్రతినిధులతో మాట్లాడి వీడ్కోలు తీసుకుందామన్న ఉద్దేశంతో ఈ సమావేశం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఆయన ఇంకా ఏమన్నారంటే..

అప్పటినుంచీ ప్రజాజీవితంలో ఉన్నా..

పత్రికలతో నాలుగు దశాబ్దాల అనుబంధం. పత్రికల్లో తొలిసారి నాపేరు 1968లో వచ్చింది. 'అవేకళ్లు' అనే సినిమా టికెట్లకోసం నిలబడిన ఒక విద్యార్థిని సినిమాహాల్ యజమాని కొట్టడంతో.. నెలరోజులు ఆందోళన చేశాం. దానికి నాయకత్వం వహించిన నాగురించి పత్రికల్లో స్థానికంగా రాశారు. 1972 జైఆంధ్ర ఉద్యమంలో రాష్ట్రస్థాయిలో నాపేరు పత్రికల్లో రాశారు. అప్పట్నుంచీ ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా పార్టీ నిర్ణయించినరోజు వరకు.. నిరంతరం వార్తల్లో ఉన్నాను. ఎన్నికల్లో గెలుపోటములతో నిమిత్తం లేకుండా ప్రజాజీవితంలో ఉన్నాను. విద్యార్థి రాజకీయాలతో ప్రారంభించి రాజకీయాల్లోకి వచ్చాను. సాధారణ కార్యకర్త నుంచి బీజేపీ అఖిల భారత అధ్యక్షుడిగా పనిచేశాను. జీవితంలో ఇప్పటివరకు రాజకీయాలుతప్ప మరో ధ్యాసలేకుండా పనిచేశాను. ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా ప్రకటించిన మరుక్షణం నుంచి పార్టీకి, ఎంపీకి, మంత్రి పదవికి రాజీనామా చేశాను. రాజకీయాలతో సంబంధం తెగిపోయింది. దేశ సమస్యలమీద అరుదుగా స్పందించే వీలుంది. ఉప రాష్ట్రపతికి కొన్ని నియమ నిబంధనలున్నాయి. సంప్రదాయాలున్నాయి. రాజ్యాంగపరమైన ఆంక్షలు, విధులున్నాయి.

అందుకు గర్వపడుతున్నా..

నేను పుట్టిన ప్రాంతానికి అన్యాయం జరుగుతోందనే ఉద్దేశంతో... విభజన సమయంలో మూడు రోజులు రాత్రిపగలు మథనపడ్డాను. చివరకు విభజన అన్యాయాలమీద మాట్లాడాలని నిర్ణయించుకున్నాను. అనుమతికోసం అద్వానీని అడిగాను. ముందుకెళ్లమని ఆయన సూచించారు. రాజ్యసభలో మాట్లాడిన విషయం అందరికీ తెలిసిందే. చట్టంలో ఉన్న హామీలు ముందులేవు. నేను గట్టిగా ప్రయత్నించడం వల్ల హామీల్ని అప్పటి ప్రభుత్వం చేర్చింది. ఆ పాత్ర నిర్వర్తించినందుకు గర్వపడుతున్నాను.

ఒకేసారి నిధులివ్వడం సాధ్యం కాదు..

ఏపీకిచ్చిన జాతీయ రహదారులన్నీ పూర్తయితే.. మళ్లీ రోడ్ల గురించి అడగక్కర్లేదు. రవాణామంత్రి గడ్కరీతో మాట్లాడి రూ.85వేల కోట్లు ఖర్చయ్యే జాతీయ రహదారులు మంజూరు చేయించాను. జాతీయ సంస్థలకు శంకుస్థాపనలు, అద్దె భవనాల్లో ప్రారంభాలు చేయించాను. ప్రతి బడ్జెట్‌లోనూ కొంత నిధులు వస్తూ ఉంటాయి. ఒకేసారి నిధులివ్వడం ఏ ప్రభుత్వానికీ సాధ్యం కాదు. ఏపీకి 5.35 లక్షల ఇళ్లు మంజూరు చేశాం. మంజూరు చేయడంతో సరిపోదు. దానికి తగిన మ్యాచింగ్ గ్రాంటు రాష్ట్రప్రభుత్వం ఇవ్వాలి.

ప్రత్యేక హోదా సాధ్యం కాని పరిస్థితి..

బడ్జెట్ లోటును తీర్చమని అప్పట్లో అడిగాను. ప్రత్యేక హోదా సాధ్యంకాని పరిస్థితి 14వ ఆర్థిక సంఘం తర్వాత ఏర్పడింది. అందుకే ప్యాకేజీకోసం పట్టుబట్టి ఇప్పించాను. నేను చేసిన పని సంతృప్తికరమని భావిస్తున్నా. తర్వాత చరిత్ర నిర్ణయిస్తుంది. ఉపరాష్ట్రపతిగా నా సహకారం రాష్ట్రానికి కొనసాగుతుంది. ఇంతకుముందు మాదిరిగా మంత్రులతో సమావేశాలు పెట్టడం సాధ్యం కాకపోయినా.. అవసరమైతే మంత్రుల్ని పిలిచి మాట్లాడతాను.

వైద్యశిబిరాన్ని ప్రారంభించిన ఉపరాష్ట్రపతి

స్వర్ణ భారత్ ట్రస్టు ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని వెంకయ్యనాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజహితానికి, సేవకు సంపాదనలో కొంత వెచ్చించాలని సూచించారు. సహాయార్థులకు సేవ చేయడంలో ఉన్న ఆనందం.. అనుభవిస్తే తప్ప తెలియదన్నారు. కార్యక్రమంలో గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులతో ఉపరాష్ట్రపతి ముఖాముఖీ మాట్లాడారు. వారడిగిన ప్రశ్నలకు సమాధానాలిచ్చారు.

త్రిపుల్ తలాక్‌పై సుప్రీంది చారిత్రక తీర్పు

ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు వ్యాఖ్య

సాక్షి, చెన్నై: త్రిపుల్ తలాక్ వ్యవహారంలో సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పుని వెలువరించిందని ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. చెన్నైలోని అన్నా వర్సిటీలో క్విట్ ఇండియా ఉద్యమ వజ్రోత్సవాల్లో భాగంగా ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి ప్రసంగిస్తూ.. వ్యవసాయ ప్రగతి, రైతు సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరింతగా కార్యాచరణలు సిద్ధం చేసి ముందుకు సాగాలని సూచించారు. దేశంలోని ప్రజలు మతాలకు అతీతంగా ఐక్యతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఉప రాష్ట్రపతి హోదాలో తొలిసారిగా చెన్నైలో పర్యటించిన వెంకయ్యనాయుడుకు తమిళనాడు ఇన్‌చార్జ్ గవర్నర్ విద్యాసాగర్‌రావు, డిప్యూటీ సీఎం పన్నీర్ సెల్వం, మంత్రులు జయకుమార్, అన్బళగన్‌లు విమానాశ్రయంలో స్వాగతం పలికారు. అక్కడి నుంచి రాజ్‌భవన్‌కు చేరుకున్న వెంకయ్య తమిళ కవి తిరువళ్లువర్, కవయిత్రి అవ్వయార్ విగ్రహాల వద్ద పుష్పాంజలి ఘటించారు.

పల్స్ సర్వేతో తెల్లకార్డులు కట్

సర్వే వివరాల ప్రకారం అనర్హులంటూ 4.13 లక్షల తెల్లరేషన్ కార్డులు రద్దు

- కార్డులు తిరిగిఇవ్వాలన్న విజ్ఞప్తులు పట్టించుకోని అధికారులు
- ఆందోళనలో లక్షలాది పేద కుటుంబాలు

సాక్షి, అమరావతి

అవినీతిని రూపుమాపడానికి అంటూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా సాధికార సర్వే (పల్స్) పేదలను ఆందోళనకు గురిచేస్తోంది. ప్రభుత్వ ప్రయోజనాల కోసం సర్వేలో పాల్గొనాలని సీఎం చంద్రబాబు కోరడంతో ప్రజలంతా సర్వేకు సహకరించారు. ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఓటరు గుర్తింపు కార్డు, ఆస్తి పన్ను చెల్లింపు బిల్లు, విద్యుత్ బిల్లు, డ్రైవింగ్ లైసెన్స్, వెహికల్ రిజిస్ట్రేషన్ కార్డు, గ్యాస్ కనెక్షన్ పుస్తకం, ఆదాయ ధ్రువీకరణ పత్రం, కిసాన్ కార్డు, పెన్షన్ సర్టిఫికెట్, ఉపాధి హామీ జాబ్ కార్డు, డ్వాక్రా సభ్యత్వ కార్డు ఇలా తమ వద్ద ఉన్న కార్డులన్నీ సర్వే పత్రంలో నమోదు చేయించారు. ఈ వివరాలు సేకరించిన తర్వాత మీరు ధనవంతులంటూ పేదలపై ముద్ర వేసి తెల్లరేషన్ కార్డులను రద్దు చేస్తూ వస్తున్నారు. విద్యుత్ బిల్లు అధికంగా వచ్చిందని, ద్విచక్ర వాహనం ఉందని, 5 ఎకరాల కంటే పొలం ఎక్కువగా ఉందని ఇలా ఏదో ఒక కారణం చూపి రాష్ట్రంలో ఇప్పటి వరకు 4.13 లక్షల తెల్లరేషన్ కార్డులను రద్దు చేశారు. రేషన్ కార్డును రద్దు చేస్తున్నట్లు ఎలాంటి నోటీసు జారీ చేయకుండానే ఈ-పాస్ యంత్రంలో నమోదైన కార్డును తొలగిస్తున్నారు. ఈ విషయం తెలియక సబ్సిడీ సరుకుల కోసం రేషన్ షాపులకు వెళ్లిన పేదలు కార్డు నంబర్ ఈ-పాస్ యంత్రంలో నమోదు చేసిన తర్వాత వివరాలు లేవనే సమాధానం వస్తోంది. ఇదేమి అన్యాయం అని డీలర్లను ప్రశ్నిస్తే తమకేమి తెలియదు, తహసీల్దార్ కార్యాలయాలకు వెళ్లి కనుక్కోండంటూ సమాధానం వస్తోంది. తహసీల్దార్ కార్యాలయాలకు వెళ్లి అన్యాయంగా తమ కార్డును రద్దు చేశారని తిరిగి పునరుద్ధరించాలని పలుమార్లు విజ్ఞప్తులు చేస్తున్నా స్పందించే వారే కరువయ్యారు. అధికార పార్టీకి అనుకూలంగా ఉండే వారి కార్డులు రద్దు చేసి ఉంటే అలాంటి వాటిని పునరుద్ధరిస్తున్నారనే ఆరోపణలు కూడా విన్పిస్తున్నాయి. అయితే మృతి చెందిన వారి పేర్లు మాత్రమే కార్డుల నుండి తొలగించామని, అర్హులైన వారి కార్డులు రద్దయి ఉంటే తిరిగి దరఖాస్తు చేసుకుంటే పునరుద్ధరిస్తామని పౌరసరఫరాల శాఖ అధికారులు చెబుతున్నారు.

పల్స్ సర్వే ఆధారంగా జిల్లాల వారీగా రద్దు చేసిన తెల్లరేషన్ కార్డులు

తూర్పు గోదావరి	53,949
చిత్తూరు	49,505
అనంతపురం	46,380
గుంటూరు	44,164
కృష్ణా	37,683
పశ్చిమ గోదావరి	32,667
ప్రకాశం	24,929
విశాఖపట్నం	24,766
శ్రీకాకుళం	23,951
కర్నూలు	23,823
వైఎస్సార్ జిల్లా	19,843
నెల్లూరు	17,451
విజయనగరం	14,471



'స్టార్' తిప్పుతాం రండి!

- స్టార్ హోటళ్లకు తక్కువ ధరకే ప్లాట్ల కేటాయింపునకు సర్కారు సిద్ధం
- కార్పొరేట్ సంస్థలకు ఇచ్చిన రేటు కంటే తక్కువే..
- కావాల్సిన వారికి చౌక ధరకు కట్టబెట్టేందుకు వ్యూహం

సాక్షి, అమరావతి: రాజధానిలో కారు చౌకగా కార్పొరేట్ సంస్థలకు భూములు కట్టబెడుతున్న సర్కారు పెద్దలు తాజాగా స్టార్ హోటళ్లకు అంతకంటే తక్కువ ధరకు భూములు కట్టబెట్టేందుకు సిద్ధమైంది. ఏడు ఎకరాల విస్తీర్ణంలో ఎనిమిది హోటళ్లకు ప్లాట్లు కేటాయించాలని నిర్ణయించింది. భవిష్యత్తులో రాజధానికి పర్యాటకులు లక్షల సంఖ్యలో వెల్లువెత్తే అవకాశం ఉందని, అప్పటికి అందుకు సరిపడా హోటళ్లు లేకపోతే పర్యాటక రంగం దెబ్బ తింటుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఫైవ్ స్టార్, ఫోర్ స్టార్, త్రీ స్టార్ హోటళ్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని కొద్ది రోజులుగా చెబుతోంది. ఈ నేపథ్యంలో రాజధానిలో హోటళ్లు ఏర్పాటు చేయాలని కొద్ది నెలల క్రితం దేశంలోని ప్రముఖ హోటళ్లను కోరింది. ఇందుకు ఆసక్తి ఉన్న హోటల్ గ్రూపులు ముందుకు రావాలని పదేపదే కోరినా ఒక్క గ్రూపు కూడా ముందుకు రాలేదు. అమరావతిలో హోటళ్లు పెడితే ప్రస్తుతం అవి నడిచే పరిస్థితి లేదని చెప్పడంతోపాటు ప్రభుత్వం చెప్పే ధరకు తాము భూములు కొనుగోలు చేయలేమని స్పష్టం చేశాయి. కార్పొరేట్ సంస్థలకు ఇస్తున్నట్లే ఎకరం రూ.50 లక్షలకు భూములు ఇస్తామని, ఇది మంచి ఆఫర్ అని ప్రభుత్వ పెద్దలు చెప్పినా ఎవరూ వినలేదు. హోటళ్ల అసోసియేషన్ దీనిపై ముఖ్యమంత్రిని కలిసి కార్పొరేట్ సంస్థలకూ, తమకూ ఒకే ధర ఇవ్వడం సరికాదని, తమకు ఇంకా తగ్గింపు ధరకు భూములిస్తేనే రాజధానిలో హోటళ్ల ఏర్పాటుకు ముందుకొస్తామని తేల్చి చెప్పింది. దీంతో కార్పొరేట్ సంస్థలకిచ్చిన ధరలో సగం, అంతకంటే ఎక్కువగా తగ్గించి హోటళ్లకు భూములివ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. తొలుత రెండు ఫైవ్ స్టార్, రెండు ఫోర్ స్టార్, నాలుగు త్రీ స్టార్ హోటళ్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించి బిడ్లు పిలిచింది. మూడు కేటగిరీలుగా ఈ హోటళ్లను విభజించి బిడ్లు దాఖలు చేసిన వారికి స్కోరు ఇవ్వనుంది. ఎక్కువ స్కోరు వచ్చిన హోటళ్లకు ప్లాట్లు కేటాయించనుంది. ఒకటో కేటగిరిలో త్రీ స్టార్ హోటళ్లకు ఎకరం, రెండో కేటగిరిలో ఫోర్ స్టార్ హోటళ్లకు రెండెకరాలు, మూడో కేటగిరిలో ఫైవ్ స్టార్ హోటళ్లకు నాలుగు ఎకరాల (8 హోటళ్లకు కలిపి 7 ఎకరాలు) విస్తీర్ణంలో ప్లాట్లు కేటాయించనున్నారు.

కులాల స్థాయిని మార్చే అధికారం కేంద్రానిదే

కాకినాడలో వివిధ కులాల సంఘాలతో సీఎం చంద్రబాబు సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

సాక్షి, కాకినాడ: ఒక కులం స్థాయిని మార్చే అధికారం కేంద్ర ప్రభుత్వం చేతిలోనే ఉంటుందని సీఎం చంద్రబాబు చెప్పారు. కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నగరంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, ముస్లిం, బీసీ, ఎస్సీ, ఎస్టీ సంఘాల నేతలతో విడివిడిగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నేతలిచ్చిన విజ్ఞప్తులను స్వీకరించి, వాటిని అమలు చేస్తామని హామీ ఇచ్చారు. బీసీ సంఘాలతో జరిగిన సమావేశంలో రజక ఫెడరేషన్ చైర్మన్‌తో సీఎం చంద్రబాబు వేదికపై మాట్లాడించారు. రజకులను ఎస్సీ జాబితాలో చేరుస్తామంటూ గత ఎన్నికల్లో హామీ ఇచ్చారని, టీడీపీ ఎన్నికల మేనిఫెస్టోలో కూడా ఈ అంశం పెట్టారని ఆ నేత గుర్తు చేశారు. మూడేళ్లయినా దీనిపై ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడంతో తమ సంఘం నాయకులు కనపడిన చోటల్లా తమను నిలదీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం సీఎం మాట్లాడుతూ.. ఒక కులానికి చెందిన ప్రజలను.. మరో కేటగిరీలోని కులాల జాబితాలోకి చేర్చే అధికారం కేంద్రం చేతిలో ఉందని చెప్పారు. ఇటీవల కాపు నేతలు తనను కలసి తమకు రాజకీయ రిజర్వేషన్లు వద్దని.. విద్య, ఉద్యోగాల్లో మాత్రమే రిజర్వేషన్లు కావాలని కోరారన్నారు. బీసీలకు ఎలాంటి నష్టం లేకుండా కాపులకు రిజర్వేషన్లు ఇస్తామంటూ సీఎం చెప్పుకొచ్చారు. ముస్లింలు, ఎస్సీ, ఎస్టీల మద్దతు వైఎస్సార్‌సీపీకి ఉంటుందని అంటున్నారని, ఈ ఎన్నికలో టీడీపీకి ఓటు వేయడం ద్వారా అది నిజం కాదని నిరూపించాలని కోరారు. కాకినాడ ఎన్నికల తర్వాత అమరావతిలో కులాల వారీగా సమావేశం నిర్వహించి స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక రుణాలిస్తామని సీఎం హామీలు గుప్పించారు. డ్వాక్రా సంఘాల మహిళలకు పెట్టుబడి నిధి కింద ఇప్పటికి రూ.6 వేలు ఇచ్చామని, రేపో మాపో మిగతా రూ.4 వేలిస్తామని చెప్పారు.

వైఎస్సార్‌సీపీ పిచ్చికుక్కలు వస్తున్నాయి..

కాకినాడ నగరంలోని వీధి కుక్కలకు టీకాలు వేయించి వాటి శక్తిని తాను హరించానని సీఎం చంద్రబాబు ఆదివారం సాయంత్రం జగన్నాథపురం వెంకటేశ్వర స్వామి దేవాలయం సెంటర్‌లో నిర్వహించిన రోడ్‌షోలో పేర్కొన్నారు. కాకినాడకు వైఎస్సార్‌సీపీ కుక్కలు వస్తున్నాయని, అవి కరిస్తే చాలా ప్రమాదమని.. జాగ్రత్తగా ఉండాలంటూ సీఎం చంద్రబాబు అనుచిత వ్యాఖ్యలు చేశారు. జగన్‌కు తన అనుభవమంత వయసు లేదన్నారు. ఈ సమయంలో ప్రతిపక్షనేతపై సీఎం చంద్రబాబు తీవ్రమైన వ్యాఖ్యలు చేశారు. చివరిగా ప్రసంగం ముగిస్తూ తిరిగి తనను నమ్మాలని, టీడీపీకి ఓటు వేయాలని అభ్యర్థించారు. రోడ్ షోలో డిప్యూటీ సీఎం చినరాజప్ప, ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు, పార్టీ అభ్యర్థులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ వయసు పెంపుపై మల్లగుల్లాలు

- సర్కారు జీవోతో ఆర్టీసీలో తర్జనభర్జన
- 2014 జూన్ నుంచిపదవీవిరమణ చేసిన వారిని తిరిగి ఉద్యోగాల్లోకి తీసుకోవాల్సిన పరిస్థితి

సాక్షి, అమరావతి: ఆర్టీసీలో ఉద్యోగుల పదవీవిరమణ వయస్సు 58 నుంచి 60 ఏళ్లకు పెంపుపై ఆర్టీసీ యాజమాన్యం మల్లగుల్లాలు పడుతోంది. వయోపరిమితి పెంపుతో సంస్థపై పడే ఆర్థిక భారం, సాంకేతికంగా ఆర్టీసీలో ఇంకా విభజన జరగనందున ఎదురయ్యే ఇబ్బందులపై తర్జనభర్జన పడుతోంది. 9, 10 షెడ్యూల్స్‌లో ఉన్న కార్పొరేషన్లు, సంస్థల్లో 60 ఏళ్ల వయో పరిమితి నిబంధన అమలుచేయాలని ప్రభుత్వం ఈ నెల 8న జీవో నంబరు 138 జారీచేసిన సంగతి తెలిసిందే. దీని ప్రకారం ఆర్టీసీలోనూ 2014 జూన్ రెండో తేదీ నుంచి పదవీ విరమణ చేసిన వారికీ 60 ఏళ్ల నిబంధన వర్తిస్తుంది. అంటే ఆర్టీసీలోనూ 60 ఏళ్ల వయస్సు పూర్తికాని వారిని తిరిగి ఉద్యోగాల్లో తీసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సర్కారు జారీచేసిన జీవోతో ఆర్టీసీలో అధికారులు యాజమాన్యంపై ఒత్తిడి తెస్తున్నారు. అయితే ఇంతవరకు 60 ఏళ్ల వయోపరిమితి పెంపుపై యాజమాన్యం ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం గమనార్హం. 60 ఏళ్ల పదవీ విరమణ పెంపుపై అధికారులు, కార్మికుల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతుండటంతో యాజమాన్యం వేచిచూసే ధోరణిలో ఉంది.

సాంకేతిక కారణాలు చూపుతున్న యాజమాన్యం

ఆర్టీసీలో 60 ఏళ్ల పెంపుపై నిర్ణయం తీసుకోవాలంటే విభజన జరగాలని, కొత్తగా బోర్డు ఏర్పాటుచేసుకోవాలని నిబంధనలున్నాయి. ప్రస్తుతం ఆర్టీసీలో ఇంకా విభజన జరగనందున ఉమ్మడి బోర్డు కొనసాగుతోంది. ఆర్టీసీ ఆస్తులపై ఇంతవరకూ కొలిక్కి రాకపోవడంతో షీలాభిడే కమిటీకి ఇంకా నివేదిక పంపించలేదు. ఇటీవలే ఉమ్మడి బోర్డు సమావేశమైనా ఆస్తుల పంపిణీపై తెలంగాణ అధికారులు మెలిక పెట్టడంతో సెప్టెంబర్ 15న మరోమారు భేటీ అయ్యేందుకు నిర్ణయించారు. దీంతో 60 ఏళ్ల పెంపు అంశం సాంకేతిక కారణాలతో ముడిపడి ఉందని యాజమాన్యం పేర్కొంటోంది.

సంస్థ ఆర్థిక స్థితిగతుల దృష్ట్యా ఇది భారమే


ఆర్టీసీలో 60 ఏళ్ల నిబంధన అమలుచేస్తే పదవీ విరమణచేసిన 3,600 మంది ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలి. ఆర్టీసీలో ప్రస్తుతం విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులకు జీతాలు చెల్లించలేని పరిస్థితి ఉంది. ఆర్టీసీకి ప్రస్తుతం నష్టాలు, అప్పులు కలిపి రూ.4 వేల కోట్లకు చేరాయి. రూ.4 వేల కోట్లకు రోజుకు రూ.2 కోట్లు వడ్డీ కట్టాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో 60 ఏళ్ల పెంపు సంస్థకు భారం అవుతుందని యాజమాన్యం వాదనగా ఉంది.

జీతాల కోసం పోరాడాల్సి వస్తుందేమో!

అరవై ఏళ్ల పెంపు అధికారులకే ప్రయోజనమని, తమకు నెలవారీ జీతాలు కూడా చెల్లించలేని పరిస్థితి ఉంటుందని కార్మికులు అభిప్రాయపడుతున్నారు. భవిష్యత్తులో తాము కొత్త వేతనాల సవరణ కోసం పోరాటాలు మానేసి చేసినపనికి జీతాలు చెల్లించాలని పోరాటాలు చేయాల్సి వస్తుందని కార్మిక సంఘాల నేతలు పేర్కొనడం గమనార్హం.

రాగికి బదులు పసిడి!

- ఓల్టేజ్ కన్వర్టర్‌లో కేజీకి పైగా బంగారం
- గుట్టురట్టు చేసిన ఎయిర్‌పోర్ట్ కస్టమ్స్ అధికారులు



ఓల్టేజ్ కన్వర్టర్ నుంచి బయటకి తీసిన బంగారం

సాక్షి, హైదరాబాద్: ఓల్టేజ్ కన్వర్టర్‌లో దాచి దుబాయ్ నుంచి తీసుకువచ్చిన 1.23 కేజీల బంగారాన్ని శంషాబాద్ విమానాశ్రయం కస్టమ్స్ అధికారులు శనివారం రాత్రి పట్టుకున్నారు. ఈ దందాలో సూత్రధారులు ఓ బాధితుడిని క్యారియర్(అక్రమ రవాణా చేసే వ్యక్తి)గా వాడుకున్నారని వెలుగులోకి వచ్చింది. ఓల్టేజ్ కన్వర్టర్‌లో ఉండే రాగి వైండింగ్ స్థానంలో 24 క్యారెట్ల బంగారంతో చేసిన దిమ్మెల్ని ఏర్పాటు చేశారు. వీటి చుట్టూ సిల్వర్ పాయిల్స్ చుట్టారు. ఈ కన్వర్టర్‌ను హైదరాబాద్‌కు అక్రమ రవాణా చేయడానికి ఓ బాధితుడిని క్యారియర్‌గా వాడుకున్నారు. రాష్ట్రానికి చెందిన ఓ వ్యక్తి దుబాయ్‌లో ఉద్యోగం కోసం వెళ్లి మోసపోయి... తిరిగి భారత్ బయలుదేరాడు. ఇతడిని దుబాయ్ విమానాశ్రయంలో ట్రాప్ చేసిన స్మగ్లింగ్ సూత్రధారులు ఆ బాక్సును ఇచ్చారు. హైదరాబాద్‌లో దిగిన తర్వాత తమ మనిషి వచ్చి పార్శిల్ తీసుకుంటాడని మాత్రమే చెప్పారు. ఇండిగో ఎయిర్‌లైన్స్‌కు చెందిన 6ఈ 025 విమానంలో ఈ క్యారియర్ శనివారం రాత్రి శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్నాడు. ఎయిర్‌పోర్ట్‌లో దిగిన తర్వాత బాక్స్ తీసుకోవడానికి వచ్చే వారి కోసం ఎదురు చూస్తున్నాడు. ఇతని కదలికలు అనుమానంగా ఉండడంతో కస్టమ్స్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. తనిఖీ చేయగా 1.23 కేజీల బంగారం దిమ్మెలు బయటపడ్డాయి. వీటిని స్వాధీనం చేసుకున్న కస్టమ్స్ అధికారులు తీసుకువచ్చిన 'బాధితుడి'ని ప్రశ్నిస్తున్నారు. ఈ బంగారం విలువ అంతర్జాతీయ మార్కెట్‌లో రూ.36,86,670 ఉంటుందని అధికారులు తెలిపారు.

అంగట్లో డీఈఓ పోస్టులు!

- పదోన్నతులు కల్పిస్తామంటూ భారీగా వసూళ్లు
- ఒక్కో పోస్టుకు రూ.50 లక్షల దాకా రేటు
- ఎస్ఎస్ఏ పీఓ పోస్టులను కలిపి మరీ బేరసారాలు
- చక్రం తిప్పుతున్న పశ్చిమ గోదావరి జిల్లా ప్రజాప్రతినిధి బంధువులు

సాక్షి, అమరావతి: విద్యాశాఖలో పదోన్నతులు, బదిలీల్లో అవినీతికే అగ్రస్థానం దక్కుతోంది. పోస్టులకు వేలం పాట నిర్వహించి మరీ సొమ్ము చేసుకుంటున్నారు. ప్రమోషన్ కావాలన్నా, కోరుకున్న చోటుకు బదిలీ జరగాలన్నా కాసుల మూటలు సమర్పించుకోవాల్సిందే.

ఇటీవల ఉపాధ్యాయుల బదిలీల్లో భారీగా సొమ్ము చేతులు మారింది. డిప్యూటీ డైరెక్టర్లు, అడిషనల్ డైరెక్టర్లు, రీజనల్ డైరెక్టర్ పోస్టుల పదోన్నతుల్లోనూ రూ.లక్షల్లో వసూలు చేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. తాజాగా జిల్లా విద్యాశాఖాధికారుల (డీఈఓ) పదోన్నతులు, బదిలీల్లో కూడా భారీగా అవినీతి చోటు చేసుకుంటున్నట్లు సమాచారం.


పెద్దవాళ్లతో ముందే మాట్లాడుకోండి

డీఈఓలుగా పదోన్నతులు కల్పిస్తాం, మీరెంత ఇస్తారంటూ కిందిస్థాయి అధికారులకు ఫోన్లు చేసి మరీ అడుగుతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం పనిచేస్తున్న డీఈఓలకు కూడా ఫోన్లు చేసి హడలెత్తిస్తున్నారు. ''మీ పోస్టులోకి మరొకరు వచ్చేలా ఉన్నారు, మీరు బదిలీ అవుతారు, ఇక్కడే పని చేయాలనుకుంటే పెద్దవాళ్లతో ముందే మాట్లాడుకోండి. మరొకరు ఫలానా మొత్తం చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నారు, అంత కంటే ఎక్కువ ఇస్తేనే మీరు అక్కడ ఉంటారు'' అంటూ ఫోన్లు చేస్తున్నారని ఓ డీఈఓ చెప్పారు. శ్రీకాకుళం, విజయనగరం, కడప, అనంతపురం, కర్నూలు జిల్లాల డీఈఓ పోస్టులకు రూ.25 లక్షల నుంచి రూ.30 లక్షలు, విశాఖ, ఉభయ గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల డీఈఓ పోస్టులకు రూ.50 లక్షలు, ప్రకాశం నెల్లూరు, చిత్తూరు జిల్లాల డీఈఓ పోస్టులకు రూ.40 లక్షలుగా ధర నిర్ణయించినట్లు సమాచారం. ఇప్పటికే వసూళ్ల తంతు దాదాపు చివరి దశకు వచ్చిందని, ఎవరు ఎక్కువ సొమ్ము ముట్టజెబితే వారికే ఆయా పోస్టులు కట్టబెట్టేలా ఫైల్ సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన ఓ ప్రజాప్రతినిధి బంధువులు ఈ వసూళ్ల దందాలో చక్రం తిప్పుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రేటు అర కోటి

డీఈఓగా ప్రమోషన్ కావాలంటే రూ.25 లక్షల నుంచి రూ.50 లక్షల దాకా ధర నిర్ణయించినట్లు చెబుతున్నారు. డిప్యూటీ డీఈఓలు, అసిస్టెంట్ డైరెక్టర్ కేడర్ నుంచి డీఈఓ, డిప్యూటీ డైరెక్టర్ స్థానాలకు పదోన్నతులు కల్పించాల్సి ఉంటుంది. ప్రస్తుతం రాష్ట్రంలో 11 డీఈఓ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ పోస్టులు దక్కించుకునేందుకు పోటీ అధికంగా ఉండడంతో ఏకంగా వేలం పాటకు తెరలేపారు. ఈ 11 పోస్టులతోపాటు సర్వశిక్షా అభియాన్ ప్రాజెక్టు అధికారుల పోస్టులను కూడా కొన్నింటిని కలిపి పోస్టుల సంఖ్యను 18కి పెంచేశారు. అన్నింటినీ డీఈఓ కేడర్ పోస్టులుగా పరిగణిస్తూ పదోన్నతులంటూ వసూళ్ల దందా సాగిస్తున్నారు. నిజానికి సర్వశిక్షా అభియాన్ ప్రాజెక్టు అధికారుల(పీఓ) పోస్టులను డీఈఓ పదోన్నతుల జాబితాలో కలపడం నిబంధనలకు విరుద్ధమే. వసూళ్ల కోసమే ఇలా కలిపేసినట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కసరత్తులు అక్కర్లేదు.. ఒక్క ట్యాబ్లెట్ చాలు!



లండన్: అప్పుడప్పుడూ టీవీల్లో యాడ్స్ వస్తుంటాయి.. కష్టపడుతూ గంటల తరబడి జిమ్‌లో కండలు కరిగించాల్సిన అవసరం లేదని, ఈ చిన్నపాటి బెల్టును పెట్టుకుంటే చాలు నాజూగ్గా మారిపోతారంటూ చెబుతారు. శాస్త్రవేత్తలు కూడా ఇప్పుడు అలాంటి మాటలే చెబుతున్నారు. ఎక్సర్‌సైజులు చేస్తే శరీరం ఎటువంటి ప్రభావానికి లోనవుతుందో సరిగ్గా అలాంటి మార్పులే శరీరంలో సంభవించేలా చేసే ఓ మాత్రను తయారు చేశామని చెబుతు న్నారు. ఈ ఒక్క మాత్ర వేసుకుంటే చాలు.. వ్యాయామం చేసిన ఫలితాలు పొందుతారంటున్నారు. యూకేలోని లీడ్స్ యూనివర్సిటీకి చెందిన పరిశోధకులు ఈ మాత్రలను తయారు చేశారట. 'పీజో1'గా నామకరణం చేసిన ఈ మాత్ర వేసుకోగానే.. వ్యాయామం చేయడం ద్వారా కలిగే ఫలితాలు పొందవచ్చని చెబుతున్నారు.

9
సాక్షి భవిత
సోమవారం 28-8-2017
స్పర్ధయా వర్ధతే విద్య

విద్య శ్రద్ధావాన్ లభతే జ్ఞానం నేటి విద్యలో..
- జనరల్ స్టడీస్: ఇండియన్ జాగ్రఫీ
- ఐబీపీఎస్ ఆర్ఆర్‌బీ స్పెషల్: క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన ఈ-మెయిల్
sakshieducation@gmail.com

జాబ్ న్యూస్

లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఎల్ఐసీ హెచ్ఎఫ్ఎల్)లో 264 (అసిస్టెంట్-164, అసిస్టెంట్ మేనేజర్-100) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతూ ప్రకటన వెలువడింది. అసిస్టెంట్ పోస్టులకు ఏదైనా డిగ్రీ, అసిస్టెంట్ మేనేజర్ పోస్టులకు ఎంబీఏ ఉత్తీర్ణత ఉండాలి. వయసు 21-28 ఏళ్ల లోపు ఉండాలి. పూర్తి వివరాలకు వెబ్‌సైట్: www.lichousing.com



తిరోగామి ద్రవాభిసరణం అంటే?

పోటీపరీక్షల ప్రత్యేకం
జనరల్ సైన్స్



వివిధ ద్రావణాల ధర్మాలు వాటిలో కరిగి ఉన్న పదార్థ పరిమాణంపై కూడా ఆధారపడి ఉంటాయి. సాధారణంగా నీరు 100°C వద్ద మరుగుతుంది. కానీ ఉప్పునీటి మరిగే ఉష్ణోగ్రత ఎక్కువ. శుద్ధమైన నీరు 0°C వద్ద ఐస్‌గా మారుతుంది. దానికి ఉప్పు కలిపితే దాని ఉష్ణోగ్రత 0°C కంటే తక్కువగా ఉంటుంది. ఈ విధంగా ద్రావణి స్వభావంపై కాకుండా ద్రావణంలో కరిగి ఉన్న మొత్తం కణాల సంఖ్యపై ఆధారపడి ఉన్న ధర్మాలనే కణాధార ధర్మాలు అంటారు. నిత్య జీవితంలో వీటి అనువర్తనాలు అనేకం ఉన్నాయి. అవి..

ద్రావణి సాపేక్ష బాష్పపీడన నిమ్నత

బాష్పీభవనం అనేది నిరంతర ప్రక్రియ. ద్రవతలం నుంచి కొన్ని అణువులు బాష్పం రూపంలో తప్పించుకోవడానికి ప్రయత్నిస్తాయి. ద్రవాల తలంపై ఈ బాష్ప అణువులు కలగజేసే పీడనమే బాష్పపీడనం. ఈ బాష్ప పీడనం వాతావరణ పీడనానికి సమానమైనప్పుడు, బాష్పం ద్రవతలాన్ని వీడిపోతుంది. లేకుంటే తిరిగి ద్రవరూపంలో చేరుతుంది. ఈ బాష్పీభవనం అనేది ఉపరితల ప్రక్రియ. ఉపరితల వైశాల్యం ఎంత ఎక్కువగా ఉంటే 'బాష్పీభవన రేటు' అంతగా పెరుగుతుంది. ద్రావణిలో ద్రావణాన్ని కలిపినప్పుడు ఉదాహరణకు నీటిలో ఉప్పు కలిపినప్పుడు, కొన్ని ద్రావిత కణాలు (ఉప్పు) ద్రావణి (నీరు) ఉపరితలంలోని ప్రదేశాల్లో ఆక్రమిస్తాయి. కాబట్టి ద్రావణి (నీరు) ఆవిరయ్యే కొన్ని దారులు మూసుకుపోతాయి. అందువల్ల బాష్పపీడనం తగ్గుతుంది. దీన్నే ద్రావణి బాష్పపీడన నిమ్నత అంటారు.

- జల చక్రంలో బాష్పీభవనం అనేది అత్యంత ప్రాధాన్యత గల ప్రక్రియ. భూ ఉపరితలంలోని నీరు బాష్పీభవనం చెంది మేఘాలుగా మారి, తిరిగి భూమిపై వర్షాల రూపంలో కురుస్తుంది.
- చెరువులు, సరస్సులు వంటి మంచినీటి వనరుల్లోని నీరు సముద్రం నీటితో పోల్చితే అధికంగా ఆవిరవుతుంది. సముద్రం నీరు తక్కువ ఆవిరి కావడానికి కారణం అందులో కరిగి ఉన్న లవణాలే. లవణీయత కారణంగా బాష్పీభవన రేటు తగ్గుతుంది. చెరువులు, సరస్సుల లవణీయత (కరిగి ఉన్న లవణాల గాఢత) తక్కువ కాబట్టి బాష్పీభవన రేటు ఎక్కువ.
- ఉష్ణోగ్రతతోపాటు బాష్పపీడనం పెరుగుతుంది. అందుకే ఎండా కాలంలో బాష్పీభవన రేటు ఎక్కువ.
- ఇథైల్ ఆల్కహాల్, ఈథర్ అణుఫార్ములా ఒకటే. కానీ ఈథర్ బాష్పపీడనం చాలా ఎక్కువ. అందుకే గది ఉష్ణోగ్రత వద్ద తేలికగా ఆవిరిగా మారుతుంది.
- డీజిల్‌తో పోల్చితే పెట్రోల్ బాష్పపీడనం ఎక్కువ. పెట్రోల్ తేలికగా ఆవిరవుతుంది.
- గాలిలోని నీటి ఆవిరి పరిమాణమే తేమ.
- పొడిగాలి కంటే తేమ గల గాలి తేలికైంది. ఎందుకంటే గాలిలోని నైట్రోజన్, ఆక్సిజన్ భారం కంటే నీటి అణువుల అణు భారం తక్కువ.
- తేమ అధికంగా గల ప్రాంతాల్లో ఉక్కగా ఉండటానికి కారణం తక్కువ చెమట పట్టడమే. నీరు ఆవిరి కావడానికి కావాల్సిన ఉష్ణాన్ని గ్రహిస్తూ కుండలోని నీరు చల్లగా మారినట్లు వేసవిలో చెమట కారణంగా మన శరీర ఉష్ణోగ్రత పెరగకుండా నియంత్రణలో ఉంటుంది.

బాష్పీభవన స్థాన ఉన్నతి

ఏ ఉష్ణోగ్రత వద్ద ద్రవం బాష్పపీడనం వాతావరణ పీడనానికి సమానమవుతుందో, ఆ ఉష్ణోగ్రత వద్ద ద్రవం మరుగుతుంది. దీన్నే ఆ ద్రవం మరిగే ఉష్ణోగ్రత (లేదా) బాష్పీభవన స్థానం అంటారు. ఉదాహరణకు నీరు 100°C (373K) వద్ద మరుగుతుంది. దానిలో చక్కెర (లేదా) ఉప్పు వంటి పదార్థాన్ని కలిపినప్పుడు, దాని బాష్పపీడనం తగ్గుతుంది. కాబట్టి బాష్పపీడనాన్ని పెంచడానికి ఉష్ణోగ్రత పెంచాలి. అంటే మరిగే ఉష్ణోగ్రత పెరుగుతుంది. అందుకే మంచి నీటి కంటే ఉప్పునీటి మరిగే ఉష్ణోగ్రత ఎక్కువ.

- వంట సమయంలో పదార్థాలకు ఉప్పు చేర్చినప్పుడు మరింత ఉష్ణోగ్రతను నీరు పట్టి ఉంచుతుంది. అందువల్ల ఉడికే వేగం కొంత పెరగొచ్చు.

ఘనీభవన స్థాన నిమ్నత

- సాధారణ నీరు 0°C వద్ద ఘనీభవిస్తుంది. దానికి ఉప్పు (లేదా) చక్కెర చేర్చినప్పుడు ఘనీభవన స్థానం తగ్గుతుంది.
- ఐస్‌కు ఉప్పును చేర్చినప్పుడు ఉష్ణోగ్రత 0°C కంటే తగ్గుతుంది. 10% ఉప్పునీటి ద్రావణం (100 మి.లీ. నీటిలో, 10గ్రా ఉప్పు) –6°C వద్ద, 20% ఉప్పునీటి ద్రావణం –16°C వద్ద ఐస్‌గా మారుతుంది.
- శీతల దేశాల్లో రోడ్లపై పేరుకుపోయిన మంచును కరిగించడానికి ఉప్పు చల్లుతారు. (ఘనీభవన స్థానం తగ్గి, ఐస్ కరుగుతుంది)
- 0°C కంటే తక్కువ ఉష్ణోగ్రత కావాలంటే ఐస్‌కు ఉప్పు కలుపుతారు.
- శీతల ప్రాంతాల్లో వాహనాల రేడియేటర్లలోని నీరు గడ్డ కట్టకుండా ఇథిలీన్ గ్లైకాల్ ద్రావణాన్ని యాంటీ ఫ్రీజ్‌గా వాడతారు. 60% ఇథిలీన్ గ్లైకాల్, 40% నీటి మిశ్రమం –45°C వద్ద ఘనీభవిస్తుంది.

ద్రవాభిసరణం- ద్రవాభిసరణ పీడనం

చర్మం, గుడ్డు పై పెంకు లోపలి పొర, చెట్టు బెరడు లోపలి పొర, కృత్రిమంగా తయారు చేసిన సెల్యులోజ్ ఎసిటేట్ వంటి పొరలన్నీ అవిచ్ఛిన్నంగా ఉన్నట్లు కనిపించే పలకలు (లేదా) ఫిల్మ్‌లు. కానీ వాటిలో సూక్ష్మాతి సూక్ష్మ రంధ్రాల అల్లికలు ఉంటాయి. ఈ రంధ్రాల ద్వారా కేవలం ద్రావణి (**ఉదా:** నీరు) అణువులు ప్రయాణిస్తాయి. కానీ ద్రావిత కణాలు ప్రవేశించవు. వీటినే అర్ధ ప్రవేశ్య పొరలు (Semi permeable membranes) అంటారు. ద్రావణికి (**ఉదా:** శుద్ధమైన నీరు) ద్రావణానికి (**ఉదా:** లవణ జలం) మధ్య అర్ధ ప్రవేశ్య పొరను ఏర్పరిస్తే శుద్ధ ద్రావణి నుంచి అణువులు ద్రావణంలోకి ప్రవేశిస్తాయి. స్వచ్ఛందంగా జరిగే ఈ ప్రక్రియనే ద్రవాభిసరణం (Osmosis) అంటారు. ఇలా ద్రవాభిసరణం జరగకుండా ద్రావణంపై కలగజేసే పీడనాన్నే (ఒత్తిడి) ద్రవాభిసరణ పీడనం అంటారు.

ద్రవాభిసరణానికి ఉదాహరణలు

- పచ్చి మామిడి ముక్కలను ఉప్పు వేసి ఊరబెడితే కుచించుకుపోవడానికి కారణం మామిడి ముక్కల్లోని నీరు బయటకు రావడమే.
- రక్త కణాలను ఉప్పునీటిలో వేస్తే చైతన్య రహితమవుతాయి.
- వాడిపోయిన పూలను నీటిలో వేస్తే తిరిగి వికసిస్తాయి.
- మృతదేహాన్ని ఉప్పులో ఉంచినప్పుడు, ఆ ఉప్పు శరీరంలోని నీటిని పీల్చివేసి దేహం కుళ్లిపోకుండా చేస్తుంది.
- వాడిపోయిన కూరగాయలను నీటిలో వేస్తే తిరిగి గట్టిగా మారతాయి.
- డయాలసిస్‌లో కూడా ద్రవాభిసరణ ప్రక్రియ ఇమిడి ఉంటుంది.
- ఎక్కువ ఉప్పు ఉన్న ఆహారాన్ని తినేవారి కణజాలాల్లో ద్రవాభిసరణం వల్ల నీరు అధికంగా చేరి వాచినట్లు అవుతుంది. దీన్నే ఎడెమా (Edema) అంటారు.
- మాంసం వంటి ఆహార పదార్థాలకు ఉప్పును, పండ్లకు చక్కెరను కలిపి ఉంచడం వల్ల వాటిపై ఉన్న బ్యాక్టీరియా ద్రవాభిసరణం వల్ల నీటిని కోల్పోయి నశిస్తుంది. అందువల్ల ఆహార పదార్థాల నిల్వ కాలం పెరుగుతుంది.
- కేశ నాళికీయత ధర్మం ఆధారంగా మొక్కలు, వేళ్ల నుంచి నీటిని పీల్చుకోవడంలో కూడా ద్రవాభిసరణ ప్రక్రియ ఉంది.
- నీటిలో మునిగిన మృతదేహాలు ఉబ్బిపోవడం ద్రవాభిసరణం వల్లే.
- ఎక్కువ ఎరువులు వాడినప్పుడు, నేలలో నీటి లభ్యత తగ్గినప్పుడు మొక్కలు వంగిపోవడానికి కారణం ద్రవాభిసరణమే.

ఐసోటోనిక్ ద్రావణాలు

- ఇచ్చిన ఉష్ణోగ్రత వద్ద ద్రవాభిసరణ పీడనం సమానంగా ఉన్న రెండు ద్రావణాలను ఐసోటోనిక్ ద్రావణాలు అంటారు. వీటిని అర్ధ ప్రవేశ్య పొరతో వేరు చేసినప్పుడు ద్రవాభిసరణం జరగదు.
- ఉదాహరణకు రక్తకణాల లోపలి ద్రవం ద్రవాభిసరణ పీడనం 0.9%. సెలైన్ ద్రావణం ద్రవాభిసరణ పీడనం కూడా ఇంతే. కాబట్టి దీన్ని నేరుగా రక్త నాళాల్లోకి ఇంజెక్ట్ చేస్తే ఏ సమస్యా రాదు.
- అంతకంటే అధిక గాఢ (హైపర్ టోనిక్) ద్రావణంలో కణాలను ఉంచితే, కణంలోపలి నుంచి ద్రవం బయటకు వచ్చి కణాలు కుచించుకుపోతాయి. ఒకవేళ అల్పగాఢ (హైపోటోనిక్) ద్రావణంలో ఉంచితే కణాల్లోకి నీరు చేరి కణం ఉబ్బిపోతుంది. దీన్ని హీమోలిసిస్ అంటారు.
- జల చరాల కణజాలాల్లోని ద్రవ ద్రవాభిసరణ పీడనం దాదాపు, సముద్రపు నీటి ద్రవాభిసరణ పీడనానికి సమానంగా ఉంటుంది. అందుకే అవి జీవించగలుగుతున్నాయి. భూచరాల కంటే ఇది ఎన్నో రెట్లు ఎక్కువ.

తిరోగామి ద్రవాభిసరణం (Reverse Osmosis)

ద్రవాభిసరణ పీడనం కంటే ఎక్కువ పీడనాన్ని ద్రావణంపై కలగజేస్తే, ద్రావణం నుంచి అర్ధ ప్రవేశ్య పొర ద్వారా ద్రావణి బయటకు వస్తుంది. దీన్నే తిరోగామి ద్రవాభిసరణం (R.O. ప్రక్రియ) అంటారు.

- సముద్రపు నీరు (లేదా) ఉప్పునీటి నుంచి సెల్యులోజ్ ఎసిటేట్ వంటి వివిధ రకాల పొరలు ఉపయోగించి స్వాదు జలాన్ని ఈ ప్రక్రియ ద్వారానే పొందుతున్నారు. దీనికి కావాల్సిన పీడనం చాలా అధికం.
- ప్రస్తుతం మార్కెట్లో లభిస్తున్న మినరల్, ప్యాకేజ్డ్ వాటర్‌ను R.O. పద్ధతిలోనే తయారు చేస్తున్నారు.

మాదిరి ప్రశ్నలు

1. **నీటి బాష్పసాంద్రత, పొడిగాలి సాంద్రత కంటే?**
   1) ఎక్కువ 2) సమానం
   3) తక్కువ
   4) ఎక్కువ (లేదా) తక్కువ కావచ్చు
2. **ఏ నీరు సులభంగా ఆవిరవుతుంది?**
   1) సముద్రపు నీరు
   2) చెరువులోని నీరు
   3) ఉప్పునీటి సరస్సుల్లోని నీరు
   4) అన్నీ సమానం
3. **సముద్రపు నీటి నుంచి మంచి నీరు పొందే పద్ధతి?**
   1) ద్రవాభిసరణం 2) జల విశ్లేషణ
   3) ఫెర్మెంటేషన్
   4) తిరోగామి ద్రవాభిసరణం
4. **మాంసం ఎక్కువ కాలం నిల్వ ఉండాలంటే?**
   1) మంచినీటిలో నానబెట్టాలి
   2) సుగంధ ద్రవ్యాలు చేర్చాలి
   3) ఉప్పు కలపాలి
   4) అన్నీ సరైనవే
5. **కాళ్ల నొప్పులున్న వారికి?**
   1) ఎక్కువ ఉప్పు ఉన్న ఆహార పదార్థాలను ఇవ్వాలి
   2) ఎక్కువ ఎలక్ట్రోలైట్లు ఇవ్వాలి
   3) తక్కువ ఉప్పుగల ఆహార పదార్థాలను ఇవ్వాలి
   4) ఎక్కువ నిల్వ పచ్చళ్లు తినిపించాలి

సమాధానాలు
1) 3; 2) 2; 3) 4; 4) 3; 5) 3.

డా॥ బి. రమేష్
సీనియర్ ఫ్యాకల్టీ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జమ్మికుంట.



ప్రపంచ జీవ వైవిధ్య దినోత్సవం?

ప్రశ్నలు-వివరణాత్మక సమాధానాలు



- **కరువు ప్రధానంగా దేనివల్ల ఏర్పడుతుంది?**
  ఎ) ఉష్ణోగ్రతలు
  బి) దీర్ఘకాలం వర్షాలు లేకపోవడం
  సి) రెండు వర్షాల మధ్య వ్యవధి లేకపోవడం
  డి) పంటలు పండకపోవడం
  వివరణ: సాధారణ వర్షపాతం కన్నా 25 శాతం తక్కువ వర్షపాతం నమోదైతే ఆ పరిస్థితిని కరువు అంటారు. దేశంలో దాదాపు 2,31,000 గ్రామాలు నీటి సమస్యాత్మక గ్రామాలుగా ఉన్నాయి. ఈ గ్రామాల్లో 1.5 కి.మీ. లోతులో కూడా నీరు లభించడం లేదు.
- **చెర్నోబిల్ తర్వాత పెద్ద అణు విపత్తు ఎక్కడ సంభవించింది?**
  ఎ) అమెరికా బి) రష్యా
  సి) జపాన్ డి) జర్మనీ
  వివరణ: 2011, మార్చి 11న పసిఫిక్ మహాసముద్రంలో వచ్చిన సునామీ వల్ల జపాన్‌లోని ఫుకుచిమాదైచీ అనే అణు విద్యుత్ కేంద్రం ధ్వంసమైంది.
- **జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ ఎక్కడ ఉంది?**
  ఎ) న్యూఢిల్లీ బి) ముంబై
  సి) పుణె డి) కోల్‌కతా
  వివరణ: 2005లో జాతీయ విపత్తు నిర్వహణ ప్రాధికార సంస్థను ప్రధానమంత్రి అధ్యక్షతన న్యూఢిల్లీలో ఏర్పాటు చేశారు. విపత్తు నిర్వహణకు కేంద్ర ప్రభుత్వం 2009లో జాతీయ విధానాన్ని ప్రకటించింది.
- **సునామీ అనే పదాన్ని తొలుత ఎప్పుడు ఉపయోగించారు?**
  ఎ) 1995 బి) 2006 సి) 1991 డి) 1963
  వివరణ: సునామీ అనే పదాన్ని తొలుత 1963లో అంతర్జాతీయ శాస్త్రవేత్తల సదస్సులో ఉపయోగించారు. ఇది జపనీస్ పదం. 'సు' అంటే హార్బర్, 'నామీ' అంటే కెరటాలు. సునామీలు ఎక్కువగా పసిఫిక్ మహాసముద్రంలో వస్తాయి.
- **భూకంపం ప్రారంభమయ్యే ప్రాంతం?**
  ఎ) భూకంప అధికేంద్రం
  బి) భూకంప రేఖ సి) భూకంప నాభి
  డి) భూకంప అభికేంద్రం
  వివరణ: భూకంపం భూ అంతర్భాగంలో రెండు పలకలు ఢీకొనే చోట వస్తుంది. ఆ ప్రదేశాన్ని భూకంప నాభి అంటారు. భూకంప నాభి ఉపరితల ప్రదేశాన్ని భూకంప అధికేంద్రం అంటారు. భూకంప అధ్యయన శాస్త్రాన్ని సిస్మాలజీ అంటారు.
- **బిహార్ దుఃఖదాయినిగా ఏ నదిని పేర్కొంటారు?**
  ఎ) గంగా బి) కోసి
  సి) యమున డి) దామోదర
  వివరణ: కోసి నది బిహార్ గుండా ప్రవహించి గంగా నదిలో కలుస్తుంది. దీని వల్ల బిహార్‌కు ఎక్కువగా వరదలు వస్తాయి. అందువల్లే దీన్ని బిహార్ దుఃఖదాయిని అంటారు.
- బెంగాల్ దుఃఖదాయిని – దామోదర నది
- ఒడిశా దుఃఖదాయిని – బ్రాహ్మణి నది
- అసోం దుఃఖదాయిని – బ్రహ్మపుత్ర నది
- **భూతాపానికి కారణమయ్యే వాయువులను ఏమంటారు?**
  ఎ) హరిత వాయువులు
  బి) హరిత గృహ వాయువులు
  సి) గ్లోబల్ వాయువులు
  డి) వాతావరణ వాయువులు
  వివరణ: వాతావరణంలోని కార్బన్ డై ఆక్సైడ్, సల్ఫర్ డై ఆక్సైడ్, నత్రికామ్లం వంటి వాటి వల్ల శీతోష్ణస్థితిలో మార్పులు వచ్చి భూగోళం వేడెక్కుతుంది. ఇలాంటి వాయువులను హరితగృహ వాయువులు అంటారు. గ్లోబల్ వార్మింగ్ వల్ల రుతుపవనాల్లో అసమతుల్యత ఏర్పడుతుంది. మంచు పర్వతాలు కరుగుతాయి. ఆవరణ సమతుల్యత దెబ్బతింటుంది.
- **ప్రపంచంలో మొదటి విపత్తు ఏ నగరంలో సంభవించినట్లు నమోదైంది?**
  ఎ) కోల్‌కతా బి) హవాయి
  సి) టోక్యో డి) ఏథెన్స్
  వివరణ: ప్రపంచంలో మొదటి విపత్తుగా క్రీ.పూ.430లో ఏథెన్స్ నగరంలో ఈగల ద్వారా వ్యాపించిన టైఫస్ వ్యాధిని పేర్కొనవచ్చు. 1556కు ముందు ప్రపంచంలో 10 భయంకర ప్రకృతి విపత్తులు సంభవించాయి.
- **దేశంలో విపత్తు నిర్వహణ సెల్‌ను మొదట ఏ శాఖ కింద ఏర్పాటు చేశారు?**
  ఎ) హోం శాఖ బి) ఆర్థిక శాఖ
  సి) వ్యవసాయ శాఖ డి) రక్షణ శాఖ
  వివరణ: భారతదేశ విపత్తు నిర్వహణ వ్యవస్థ నిర్మాణం బ్రిటిష్ వారి కాలంలో ప్రారంభమైంది. 1990 తర్వాత వ్యవసాయ మంత్రిత్వ శాఖ కింద విపత్తు నిర్వహణ సెల్‌ను ఏర్పాటు చేయడంతో ఒక శాశ్వత వ్యవస్థ ప్రారంభమైంది. విపత్తు నిర్వహణ విభాగాన్ని 2002లో కేంద్ర హోం మంత్రిత్వ శాఖ పరిధిలోకి తెచ్చారు.

కాంపిటీటివ్ గైడెన్స్
విపత్తులు- పర్యావరణం

- **జాతీయ భూభౌతిక సంస్థ ఎక్కడ ఉంది?**
  ఎ) ఢిల్లీ బి) హైదరాబాద్
  సి) ముంబై డి) పుణె
  వివరణ: హైదరాబాద్‌లో నేషనల్ జియో ఫిజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్‌జీఆర్ఐ)ని 1961లో స్థాపించారు. ఇక్కడ డిజిటల్ టెలీ వ్యవస్థతో పాటు జియోస్కోప్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. దీనికి ప్రపంచంలోని భూకంప కేంద్రాలన్నింటితో అనుసంధానం ఉంది.
- **భూకంపాల వల్లే సునామీలు వస్తున్నట్లు తొలుత గుర్తించిన వ్యక్తి?**
  ఎ) హిప్పార్కస్ బి) ఛార్లెస్ రిక్టర్
  సి) మెర్కిలీ డి) థుసిడైడ్స్
  వివరణ: భూకంపాల వల్లే సునామీలు వస్తున్నట్లు థుసిడైడ్స్ అనే గ్రీకు చరిత్రకారుడు గుర్తించాడు. సముద్ర గర్భాల్లో భారీ శక్తితో పలకల కదలికల వల్ల భూకంపం ఏర్పడి పెద్ద వరద తరంగంగా మారుతుంది. దీన్నే సునామీ అంటారు.
- **'కరువు పీడిత ప్రాంతాల పథకం' కార్యక్రమాన్ని ఎప్పుడు ప్రారంభించారు?**
  ఎ) 1973–74 బి) 1977–78
  సి) 1979–80 డి) 1989–90
  వివరణ: 'కరువు పీడిత ప్రాంతాల పథకం' కార్యక్రమాన్ని 1973–74లో 13 రాష్ట్రాల్లోని వివిధ జిల్లాల్లో ప్రారంభించారు. జల వనరుల శాస్త్రీయ వినియోగం, అడవుల అభివృద్ధి ఈ కార్యక్రమ ఉద్దేశం.
- **ప్రపంచ జల దినోత్సవాన్ని ఎప్పుడు నిర్వహిస్తారు?**
  ఎ) మార్చి 22 బి) మే 22
  సి) జూన్ 22 డి) జూన్ 16
  వివరణ: మార్చి 22న ప్రపంచ జలదినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఇది 2005లో ప్రారంభమైంది. 2025 నాటికి ప్రతి ముగ్గురిలో ఇద్దరు నీటి కొరతను ఎదుర్కోవాల్సి వస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.
- **ప్రపంచంలో అత్యంత జీవ వైవిధ్యం గల ప్రాంతం?**
  ఎ) ఉత్తర అమెరికా –కాలిఫోర్నియా ప్రాంతం
  బి) ఆస్ట్రేలియా – తూర్పు భాగం
  సి) రష్యా – ఉత్తర ప్రాంతాలు
  డి) దక్షిణ అమెరికా – అమెజాన్ ప్రాంతాలు
  వివరణ: దక్షిణ అమెరికాలోని ఉష్ణమండల అయనరేఖా ప్రాంతాలు అత్యంత జీవవైవిధ్యం గల ప్రాంతాలు. ఇక్కడ సుమారు 40,000 జాతుల మొక్కలు, 1300 పక్షి జాతులు, 3000 మత్స్య జాతులు, 427 ఉభయచర జాతులు, 2 మిలియన్ల కీటకాలు ఉన్నట్లు గుర్తించారు.
- **ప్రపంచంలో సుదీర్ఘ తుపాన్ పేరు?**
  ఎ) జాన్ బి) ఐలా
  సి) లైలా డి) కత్రినా
  వివరణ: 1994, ఆగస్టు 11 నుంచి సెప్టెంబర్ 10 వరకు పసిఫిక్ తూర్పు నుంచి పశ్చిమ తీరం వరకు 31 రోజుల పాటు సుదీర్ఘ చక్రవాతం సంభవించింది. దీన్నే జాన్ అంటారు.
- **విపత్తులకు సంబంధించి ఎఫ్.ఎం. రేడియోను ప్రారంభించిన రాష్ట్రం?**
  ఎ) తెలంగాణ బి) కేరళ
  సి) ఒడిశా డి) తమిళనాడు
  వివరణ: విపత్తులకు సంబంధించి శరణాలయ స్వచ్ఛంద సంస్థ అభ్యర్థన మేరకు తమిళనాడులోని కడలూరులో 2005, డిసెంబర్‌లో 107.8 ఎఫ్.ఎం. రేడియోను ప్రారంభించారు. మన దేశంలో తుపాన్లు, సునామీల తాకిడి ఎక్కువగా తమిళనాడులో ఉంటుంది.

- ప్రపంచ వన్యప్రాణి దినోత్సవం – మార్చి 3
- ప్రపంచ అడవుల దినోత్సవం – మార్చి 21
- ప్రపంచ జల వనరుల దినోత్సవం – మార్చి 22
- ధరిత్రీ దినోత్సవం – ఏప్రిల్ 22
- ప్రపంచ పర్యావరణ దినోత్సవం – జూన్ 5
- అంతర్జాతీయ పులుల దినోత్సవం – జూలై 29
- ప్రపంచ జీవ వైవిధ్య దినోత్సవం – మే 22
- ప్రపంచ మహాసముద్రాల దినోత్సవం – జూన్ 8
- ఓజోన్ పొర సంరక్షణ దినోత్సవం – సెప్టెంబర్ 16
- అంతర్జాతీయ పర్వతాల దినోత్సవం – డిసెంబర్ 11
- ప్రపంచ నదుల దినోత్సవం – సెప్టెంబర్ చివరి ఆదివారం
- ప్రపంచ జనాభా దినోత్సవం – జూలై 11



కె. వెంకటరెడ్డి
సీనియర్ ఫ్యాకల్టీ



కాంపిటీటివ్ కౌన్సెలింగ్


గ్రూప్స్ పరీక్షలకు సంబంధించి భారతదేశ చరిత్ర అంశాలకు ఎలా సిద్ధమవ్వాలి?
- ఎ.కల్పన, గుంటూరు

ప్రాచీన భారతదేశ చరిత్ర విభాగంలో ముఖ్యాంశాలు–సింధు నాగరికత, వేద నాగరికత, జైన, బౌద్ధ మతాలు, మౌర్యులు, గుప్తులు, హర్ష సామ్రాజ్యం మొదలైనవి. ఇందులో సింధు, వేద నాగరికత, జైన, బౌద్ధ మతాలు, మౌర్యులు, గుప్తులపై ప్రశ్నలు తప్పనిసరిగా ఉంటున్నాయి.

- **భారతీయ బౌద్ధ గ్రంథాలను చైనా భాషలోకి అనువదించిన భారతీయ బౌద్ధ మతాచార్యుడెవరు?**
  1) కశ్యప మాతంగుడు
  2) ఆచార్య నాగార్జునుడు
  3) ఆర్య అసంగుడు
  4) ధర్మ కీర్తి *సమాధానం: 2*
- మధ్యయుగ భారతదేశ చరిత్ర హర్షుడి అనంతర కాలం నుంచి ప్రారంభమవుతుంది. ఢిల్లీ సుల్తానులు, రాజపుత్ర రాజ్యాలు, చోళులు, చాళుక్యులు, విజయనగర సామ్రాజ్యం, మొగలులు, మరాఠాలు ఈ విభాగంలోని ముఖ్యులు.
- **దక్షిణ భారతదేశంలో భూదానాల వల్ల అత్యధికంగా లబ్ధి పొందిన వారెవరు?**
  1) సైనికులు, అధికారులు
  2) బ్రాహ్మణులు 3) దేవాలయాలు
  4) 2, 3



- ఔరంగజేబు మరణించిన సంవత్సరం (1707) నుంచి ఆధునిక భారతదేశ చరిత్ర ప్రారంభమవుతుంది. ఇందులో భాగంగా చివరి మొగల్ రాజులు, బ్రిటిషర్ల రాక, భారతదేశ ఆక్రమణ, వారి పాలనకు వ్యతిరేకంగా జరిగిన తిరుగుబాట్లు–ఉద్యమాలు, సామాజిక మత సంస్కరణోద్యమాలు, జాతీయోద్యమం, గవర్నర్ జనరల్‌లు, వైస్రాయ్ వంటి అంశాలకు అధిక ప్రాధాన్యతనివ్వాలి. మిగతా విభాగాల కంటే ఈ అంశం నుంచే ప్రశ్నలు అధికంగా అడిగే అవకాశం ఉంది.
- **శాసనోల్లంఘన ఉద్యమానికి సంబంధించి గత ఉద్యమాల కంటే భిన్నమైన అంశం?**
  1) రైతులు పాల్గొనడం
  2) విద్యార్థులు పాల్గొనడం
  3) వ్యాపారులు, పారిశ్రామికవేత్తలు పాల్గొనడం
  4) మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనడం



ఎస్‌బీఐ.. 2017, ఫిబ్రవరిలో 2313 ప్రొబేషనరీ ఆఫీసర్ (పీఓ) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఎంపిక ప్రక్రియలో తొలి దశ ప్రిలిమినరీ ఎగ్జామినేషన్‌కు దేశ వ్యాప్తంగా దాదాపు పది లక్షల మంది హాజరయ్యారు. దాదాపు 50 వేల మంది మెయిన్ ఎగ్జామినేషన్‌కు అర్హత సాధించారు. ఇందులో ప్రతిభ చూపిన దాదాపు 6,376 మంది చివరిదశ అయిన గ్రూప్ ఎక్సర్‌సైజ్, పర్సనల్ ఇంటర్వ్యూకు ఎంపిక య్యారు. ఈ ప్రక్రియ త్వరలో ప్రారంభమయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో అభ్యర్థులకు ఉపయోగపడేలా విజయానికి సూచనలు..

తుది దశలో విజయానికి..

తుది దశ.. గ్రూప్ ఎక్సర్‌సైజ్‌కు 20 మార్కులు, ఇంటర్వ్యూకు 30 మార్కులు కలిపి మొత్తం 50 మార్కులకు ఉంటుంది. వాస్తవానికి గతేడాది వరకు ఎస్‌బీఐ పీవో ఎంపిక ప్రక్రియలో చివరి దశను గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూగా పేర్కొనేవారు. తాజా నోటిఫికేషన్‌లో గ్రూప్ డిస్కషన్‌కు బదులు గ్రూప్ ఎక్సర్‌సైజ్‌ను ప్రవేశపెట్టారు.

గ్రూప్ డిస్కషన్ (జీడీ)



- → నోటిఫికేషన్‌లో 'గ్రూప్ ఎక్సర్‌సైజ్' అని పేర్కొన్నప్పటికీ.. గ్రూప్ డిస్కషన్ (జీడీ)కు సన్నద్ధమై వెళ్లడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.
- → జీడీలో అయితే ఆరు లేదా ఏడుగురు అభ్యర్థులను ఒక బృందంగా ఏర్పరచి.. ఏదైనా ఒక అంశం ఇచ్చి దానిపై చర్చించమంటారు. ఈ చర్చకు కేటాయించే సమయం పది నుంచి పదిహేను నిమిషాలు ఉంటుంది.
- → ఒక అంశం ఇచ్చిన తర్వాత చర్చ ప్రారంభించడానికి రెండు నిమిషాలు కేటాయిస్తారు. ఆ సమయంలో అభ్యర్థులు సదరు టాపిక్‌కు సంబంధించి ముఖ్యాంశాలను సిద్ధం చేసుకోవాలి.
- → చర్చ ప్రారంభించిన తర్వాత అభ్యర్థులు తమ టాపిక్‌కు సంబంధించి గుర్తించిన అంశాలు, తాజా పరిస్థితులను అన్వయిస్తూ అభిప్రాయాలు వ్యక్తం చేయాలి.
- → అభిప్రాయ వ్యక్తీకరణ క్రమంలో స్పష్టత అవసరం. చర్చను నిర్దిష్ట అభిప్రాయంతో ముగించడం మేలు చేస్తుంది.

గ్రూప్ ఎక్సర్‌సైజ్

ఆరేడు మంది అభ్యర్థులను ఒక గ్రూప్‌గా ఏర్పాటు చేసి.. వారికి ఒక సమస్యను ఇస్తారు. ఈ సమస్యను అభ్యర్థులు క్రమపద్ధతిలో పరిష్కరించాల్సి ఉంటుంది. కొన్ని సమస్యలకు నేరుగా సమాధానం చెప్పే అవకాశం ఉంటుంది. కానీ, గ్రూప్ ఎక్సర్‌సైజ్ ప్రధాన ఉద్దేశం అభ్యర్థుల్లోని విశ్లేషణాత్మక, నిర్ణయాత్మక శక్తిని గుర్తించడమే. కాబట్టి ఎంత సులువైన సమస్యను ఇచ్చినా.. క్రమపద్ధతిలో పరిష్కారాన్ని సూచించడం లాభిస్తుంది.

ఒక సమస్యను పరిష్కరించే సమయంలో అనుసరించాల్సిన క్రమ పద్ధతి

- → సమస్యకు గల కారణాన్ని గుర్తించడం.
- → కారణాన్ని విశ్లేషించడం.
- → పరిష్కార, ప్రత్యామ్నాయ మార్గాలను గుర్తించడం.
- → మెరుగైన ప్రత్యామ్నాయాన్ని ఎంపిక చేయడం.
- → ప్రత్యామ్నాయం ఆధారంగా సమస్యకు పరిష్కారం కనుగొనడం.

ఇంటర్వ్యూ

ఇందులో అధిక శాతం ప్రశ్నలు విద్య, వ్యక్తిగత నేపథ్యం, భవిష్యత్తు లక్ష్యాలకు సంబంధించినవిగా ఉంటాయి. ఇంటర్వ్యూ 15 నుంచి 20 నిమిషాల పాటు జరిగే అవకాశం ఉంటుంది. అభ్యర్థులు బోర్డు సభ్యులు అడిగిన ప్రశ్నలకు తడబడకుండా సమాధానాలు చెప్పేలా సన్నద్ధం కావాలి. గ్రూప్ డిస్కషన్/గ్రూప్ ఎక్సర్‌సైజ్ సమయంలో అభ్యర్థులు వ్యక్తం చేసిన అభిప్రాయాల గురించి కూడా అడిగే అవకాశం ఉంది. సమాధానాలు తెలియని ప్రశ్నలకు తెలియదని నిజాయితీగా అంగీకరించడం మేలు.



న్యూస్ పేపర్ రీడింగ్

గ్రూప్ ఎక్సర్‌సైజ్, ఇంటర్వ్యూకు ప్రిపరేషన్ పరంగా అభ్యర్థులకు న్యూస్ పేపర్ రీడింగ్ ఎంతో మేలు చేస్తుంది. ఇలా చదువుతున్నప్పుడు ముఖ్యమైన అంశాలకు సంబంధించి నిపుణుల వ్యాసాలు- అందులోని ముఖ్య పాయింట్లతో సినాప్సిస్ రూపొందించుకోవాలి. ఒక వ్యాసం చదవడం పూర్తయిన తర్వాత దాని సారాంశం ఆధారంగా.. సొంతంగా, క్లుప్తంగా నోట్స్ రాసుకోవాలి. న్యూస్ ఛానెళ్లలో సమకాలీన పరిణామాలపై వచ్చే చర్చలను పరిశీలించాలి. తద్వారా ఆయా రంగాలకు చెందిన నిపుణుల అభిప్రాయాలను తెలుసుకోవచ్చు. ఫలితంగా కొత్త అంశాలపై అవగాహన ఏర్పడుతుంది.



వొకాబ్యులరీపై పట్టు

గ్రూప్ ఎక్సర్‌సైజ్, పర్సనల్ ఇంటర్వ్యూలలో మెరుగైన ప్రదర్శన కోసం.. అభ్యర్థులు ఇంగ్లిష్ వొకాబ్యులరీని మెరుగుపరచుకోవాలి. తద్వారా పద ప్రయోగం, వాక్య నిర్మాణంపై అవగాహన ఏర్పడుతుంది. వొకాబ్యులరీపై పట్టు కోసం ప్రామాణిక ఇంగ్లిష్ గ్రామర్ పుస్తకాలను ఉపయోగించుకోవాలి. వర్డ్ పవర్ మేడ్ ఈజీ, ఇంగ్లిష్ బైట్స్ వంటి పుస్తకాలను అధ్యయనం చేయడం ద్వారా వొకాబ్యులరీని మెరుగుపరచుకోవచ్చు.

సమతూకంగా..

గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ సమయంలో అభ్యర్థులు తమ వ్యవహార శైలి పరంగా బ్యాలెన్స్‌డ్ అప్రోచ్‌ను అలవర్చుకోవాలి. ఆవేశానికి లోనుకావడం.. పెద్దగా మాట్లాడటం.. ఇతరుల చర్చకు ఆటంకం కలిగించడం వంటివి ఎట్టి పరిస్థితుల్లోనూ చేయకూడదు. బాడీ లాంగ్వేజ్ పరంగా జాగ్రత్తలు తీసుకోవాలి. వస్త్రధారణ ప్రొఫెషనల్‌గా ఉండాలి.

ముఖ్యమైన అంశాలు

- డీమానిటైజేషన్
- ఎస్‌బీఐలో అనుబంధ బ్యాంకుల విలీనం
- జీఎస్‌టీ అమలు
- భారత్ – చైనా సరిహద్దు వివాదం
- ఈ– గవర్నెన్స్
- నీతి ఆయోగ్ తాజా సిఫార్సులు
- దేశంలో బ్యాంకింగ్ వ్యవస్థ పనితీరు
- యువతకు ఉద్దేశించిన పథకాలు
- స్టాక్ మార్కెట్ ఒడిదొడుకులు
- ఇటీవల కాలంలో కార్పొరేట్ రంగంలో చోటుచేసుకున్న పరిణామాలు.



ఆత్మవిశ్వాసంతో అడుగులు వేయాలి

"ఎస్‌బీఐ పీఓ ఎంపిక ప్రక్రియలో తుది అంకానికి చేరుకున్న అభ్యర్థులు.. ఈ దశలో ఆత్మవిశ్వాసంతో అడుగులు వేయాలి. లక్షల మందితో పోటీ పడి తమ ప్రతిభ ద్వారా చివరి దశకు చేరుకున్న అభ్యర్థులు.. ఇప్పుడు ఏ మాత్రం తడబడినా తుది ఫలితంపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. కాబట్టి ఒత్తిడిని దరిచేరనీయకుండా, ఫలితం గురించి ఆలోచించకుండా ముఖ్యమైన అంశాలపై అవగాహన పెంపొందించుకునేందుకు కృషి చేయాలి. ఇలా చేస్తే తప్పక విజయం లభిస్తుంది.

– మనోజ్ సేథి, కోర్స్ డైరెక్టర్, టైమ్ ఇన్‌స్టిట్యూట్.

బులెటిన్ బోర్డ్

ఎయిర్ ఇండియా ఇంజనీరింగ్ సర్వీసెస్ లిమిటెడ్‌లో 40 ఖాళీలు



ఎయిర్ ఇండియా ఇంజనీరింగ్ సర్వీసెస్ లిమిటెడ్ (ఏఐఈఎస్ఎల్).. కాంట్రాక్ట్ పద్ధతిలో 40 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతూ ప్రకటన విడుదల చేసింది.

- ❖ **పోస్టుల పేరు:** ఎయిర్‌క్రాఫ్ట్ మెయింటెనెన్స్ ఇంజనీర్ (ఏఎంఈ).
- ❖ **మొత్తం పోస్టులు:** 40 (జనరల్–22, ఓబీసీ–10, ఎస్సీ–5, ఎస్టీ–3).
- ❖ **వేతనం:** ఏఐఈఎస్ఎల్ నిబంధనల మేరకు.
- ❖ **అర్హతలు:** ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్ సబ్జెక్టులతో ఇంటర్మీడియెట్ లేదా తత్సమాన విద్యార్హత. అలాగే జెట్ ఇంజన్స్‌కు సంబంధించి క్యాట్ బీ1 లైసెన్స్ /క్యాట్ బీ2 లైసెన్స్ ఉండాలి. బీ 737–800 ఎన్‌జీ ఎయిర్‌క్రాఫ్ట్ విభాగంలో ఉద్యోగానుభవం తప్పనిసరి.
- ❖ **వయోపరిమితి:** 2017, ఆగస్టు 1 నాటికి 60 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్ నిబంధనలు వర్తిస్తాయి.
- ❖ **దరఖాస్తు ఫీజు:** రూ.1,000; ఎస్సీ/ఎస్టీ/ఎక్స్–సర్వీస్‌మెన్ కేటగిరీ అభ్యర్థులకు ఫీజు లేదు.
- ❖ **దరఖాస్తు విధానం:** నిర్దేశిత విధానంలో దరఖాస్తు పత్రం నింపి, దానికి సంబంధిత ధ్రువపత్రాలు, డీడీ జతచేసి నేరుగా నిర్దేశిత తేదీలో నేరుగా వాక్ ఇన్ ఇంటర్వ్యూకు హాజరుకావాలి.
- ❖ **ఎంపిక విధానం:** వాక్ ఇన్ ఇంటర్వ్యూ, ప్రి–ఎంప్లాయిమెంట్ మెడికల్ టెస్ట్.
- ❖ **వాక్ ఇన్ ఇంటర్వ్యూ వేదిక:** ఎయిర్ ఇండియా ఇంజనీరింగ్ సర్వీసెస్ లిమిటెడ్, మెయింటెనెన్స్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్, నియర్ మస్కట్ హోటల్, తిరువనంతపురం–695033.
- ❖ **వాక్ ఇన్ ఇంటర్వ్యూ తేదీలు:** ఆగస్టు 30, 2017, సెప్టెంబర్ 14, 2017.
- ❖ **వెబ్‌సైట్:** www.airindia.in

ఈడీసీఐఎల్‌లో 17 ఖాళీలు

EdCIL (India) Limited
A Mini Ratna Company
A Government of India Enterprise
ISO 9001-2008 & 14001:2004

ఎడ్యుకేషనల్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్ (ఈడీసీఐఎల్).. వివిధ విభాగాల్లోని 17 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- ❖ **పోస్టుల పేరు–ఖాళీలు:** చీఫ్ జనరల్ మేనేజర్ (సీజీఎం)–1; మేనేజర్–2; కంపెనీ సెక్రెటరీ–1; డిప్యూటీ మేనేజర్–1; అసిస్టెంట్ మేనేజర్–12.
- ❖ **వేతనం:** చీఫ్ జనరల్ మేనేజర్–రూ.36,600–రూ.62,000; మేనేజర్, కంపెనీ సెక్రెటరీ–రూ.24,900–50,500; డిప్యూటీ మేనేజర్–రూ.20,600–46,500; అసిస్టెంట్ మేనేజర్–రూ.16,400–రూ.40,500.
- ❖ **అర్హతలు:** సంబంధిత పోస్టులను అనుసరించి బీఈ/బీటెక్/ఎంబీఏ/పీజీడీఎం/డిగ్రీ+ఏసీఎస్/సీఏ/ఐసీడబ్ల్యూఏ/ఎంబీఏ+(బీఈ/బీటెక్)/పీజీడీఎం+(బీఈ/బీటెక్).
- ❖ **వయోపరిమితి:** 2017, ఆగస్టు 1 నాటికి చీఫ్ జనరల్ మేనేజర్‌కు 48 ఏళ్లు; మేనేజర్‌కు, కంపెనీ సెక్రెటరీకి 36 ఏళ్లు; డిప్యూటీ మేనేజర్‌కు 32 ఏళ్లు, అసిస్టెంట్ మేనేజర్‌కు 30 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్ నిబంధనలు వర్తిస్తాయి.
- ❖ **ఎంపిక విధానం:** రాతపరీక్ష.
- ❖ **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ❖ **దరఖాస్తులకు చివరి తేదీ:** సెప్టెంబర్ 23, 2017.
- ❖ **వెబ్‌సైట్:** www.edcilindia.co.in




ప్రస్తుతం దేశంలో ఆర్థిక కార్యకలాపాల విస్తరణ నేపథ్యంలో కామర్స్, సంబంధిత కోర్సులు పూర్తిచేసిన వారికి సుస్థిర కెరీర్ అవకాశాలు అందుబాటులో ఉంటున్నాయి. గతంతో పోల్చితే ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో కామర్స్ కోర్సుల్లో చేరుతున్న వారిసంఖ్య పెరుగుతోంది. ఈ క్రమంలో భవిష్యత్తులో సీఏ/సీఎంఏ/సీఎస్ తదితర ప్రొఫెషనల్ కోర్సులు పూర్తి చేసి, సుస్థిర కెరీర్‌కు బాటలు వేసుకోవాలను కునే వారు ఇంటర్మీడియెట్‌లో ఎంఈసీ (మ్యాథమెటిక్స్, ఎకనామిక్స్, కామర్స్) గ్రూప్ తీసుకొంటున్నారు. ఈ నేపథ్యంలో భవిష్యత్ అవసరాల దృష్ట్యా ఎంఈసీకు సమాంతరంగా సీఏ-సీపీటీకి సన్నద్ధత ప్రణాళికపై ఫోకస్..

ఎంఈసీ+సీపీటీ

సన్నద్ధతకు సూచనలు

ఇటీవల కాలంలో చార్టర్డ్ అకౌంటెన్సీ (సీఏ) కోర్సుకు ఆదరణ పెరుగుతోంది. ఒకప్పుడు ఉన్న అపోహలు తొలగిపోవడం, ఏటా ఉత్తీర్ణత శాతం పెరుగుతుండటం దీనికి కారణం. కామర్స్‌పై అమితాసక్తి ఉండి, భవిష్యత్తులో కామర్స్ కోర్సులతో పాటు దేన్నయినా ఎంపిక చేసుకునేందుకు అవకాశం ఉండాలనుకునే వారికి ఇంటర్మీడియెట్‌లో ఎంఈసీ బెస్ట్ చాయిస్‌గా ఉంటోంది. ఒకప్పుడు తెలుగు రాష్ట్రాల్లో ఎంఈసీ గ్రూప్ చదివే వారు పది వేల లోపే ఉండేవారు. ఇప్పుడా సంఖ్య లక్ష దాటిందంటే ఎంఈసీ గ్రూప్‌పై ఉన్న క్రేజ్ ఏమిటో అర్థమవుతోంది. భవిష్యత్తులో ఎంటర్‌ప్రెన్యూర్‌గా ఎదగాలనుకునే వారు సైతం ఎంఈసీ కోర్సుపై ఆసక్తి చూపుతున్నారు.



ఎంఈసీకి సన్నద్ధత

ఎంఈసీ గ్రూప్‌లో మ్యాథమెటిక్స్ ముఖ్యమైన సబ్జెక్టు. ఈ సబ్జెక్టు సీఏ–సీపీటీలోనూ ఉంటుంది. కాబట్టి రెండింటికీ ఒకేసారి ప్రిపేరవడం వల్ల సబ్జెక్టుపై పట్టు సాధించవచ్చు. సెకండియర్ సిలబస్‌లో ముఖ్యాంశాలు: డిమోవియర్స్ సిద్ధాంతం, సమీకరణవాదం, ద్విపద సిద్ధాంతం, విస్తరణ కొలతలు, సంభావ్యత, యాదృచ్ఛిక చలరాశులు, సంభావ్యతా విభాజనాలు, వృత్తం, పరావలయం, సమాకలనం, నిశ్చిత సమాకలనులు, అవకలన సమీకరణాలు.

- ■ ఇంటర్మీడియెట్ ఎకనామిక్స్‌కు సంబంధించి భారతదేశ ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన వివిధ అంశాలు, ఆర్థిక సమస్యలు–కారణాలు, నివారణ చర్యలు, గణాంక వివరాలను క్షుణ్నంగా అధ్యయనం చేయాలి.
- ■ వ్యాపార, వాణిజ్య రంగాలకు సంబంధించి అనేక విషయాలను పరిచయం చేసే సబ్జెక్టు కామర్స్. ఈ సబ్జెక్టుకు సంబంధించి థియరీ, అకౌంట్స్ ఉంటాయి. విద్యార్థులు వ్యాపార భావనలు, వివిధ రకాల వ్యాపార సంస్థలు, కంపెనీ నిర్మాణం, వ్యాపార ఆర్థిక వనరులు; సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థలు, వ్యవస్థాపకుడు, వ్యవస్థాపకత, స్వదేశీ–విదేశీ వర్తకం, ఫైనాన్షియల్ మార్కెట్లు తదితర అంశాలపై పట్టు సాధించాలి.
- ■ అకౌంటింగ్ భావనలు, ఖాతాల నిర్వహణ, బ్యాంకు నిల్వల సమయ పట్టీ, కన్‌సైన్‌మెంట్ ఖాతాలు, కంపెనీ ఖాతాలు, భాగస్వామ్య ఖాతాలు తదితరాలకు సంబంధించిన అంశాలను క్షుణ్నంగా అధ్యయనం చేయాలి. ఈ అవగాహన సీపీటీలో రాణించేందుకు ఉపయోగపడుతుంది.

సీపీటీ సన్నద్ధత

అకౌంట్స్: సీపీటీతో పాటు ఐపీసీసీ, ఫైనల్‌కు కూడా అకౌంట్స్ ముఖ్యమైన సబ్జెక్టు. అందువల్ల ఇందులోని ప్రతి అంశాన్నీ నిశితంగా పరిశీలిస్తూ అధ్యయనం చేయాలి.



- ■ కేవలం చూసి చదవడం ద్వారా, బట్టీ పట్టడం వల్ల అకౌంట్స్‌పై పట్టు చిక్కదు. సబ్జెక్టులోని సమస్యలను ఎంత సాధన చేస్తే అంతమంచిది. తార్కిక ఆలోచనా దృక్పథాన్ని అలవరచుకుంటూ, నిరంతరం ప్రాక్టీస్ చేస్తే తేలిగ్గానే ఈ సబ్జెక్టుపై పట్టుసాధించొచ్చు.
- ■ అకౌంట్స్ సబ్జెక్టులో జర్నల్ ఎంట్రీస్ చాలా ముఖ్యమైనవి. ప్రతి చాప్టర్‌లోనూ ఇవి ఉంటాయి. అన్ని జర్నల్ ఎంట్రీస్‌ను ఒకచోట రాసుకోగలిగితే, పునశ్చరణ తేలికవుతుంది.
- ■ థియరీ, ప్రాబ్లమ్స్ ఎంసీక్యూలను బాగా ప్రాక్టీస్ చేయాలి. పార్టనర్‌షిప్ అకౌంట్స్, కంపెనీ అకౌంట్స్, అకౌంటింగ్ యాన్ ఇంట్రడక్షన్, ఫైనల్ అకౌంట్స్, కన్‌సైన్‌మెంట్ అకౌంట్స్ చాప్టర్లు ముఖ్యమైనవి.

మర్కంటైల్ లా: సబ్జెక్టు పరంగా వివాదాస్పద అంశాలు ఎక్కువ కాబట్టి ప్రామాణిక పుస్తకాలను మాత్రమే చదవాలి. వివిధ రకాల పుస్తకాలను చదవకూడదు. అర్థ వివరణ నైపుణ్యాన్ని పెంచుకోవాలి.

- ■ identify the correct/incorrect/all of the above/none of the above questions ఉంటాయి. వీటి విషయంలో జాగ్రత్తగా ఉండాలి. ఇండియన్ పార్టనర్‌షిప్ యాక్ట్, సేల్ ఆఫ్ గూడ్స్ యాక్ట్ ముఖ్యమైన చాప్టర్లు.
- ■ మర్కంటైల్ లా సబ్జెక్టు ఐపీసీసీలోనూ ఉంది కాబట్టి, ప్రతి అంశానికీ ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రణాళిక ప్రకారం ప్రిపేరైతే ఈ సబ్జెక్టులో అధిక మార్కులను తేలిగ్గానే తెచ్చుకోవచ్చు.
- ■ **ఎకనామిక్స్:** మైక్రో ఎకనామిక్స్‌లో డయాగ్రమ్స్‌ను విశ్లేషించగలగాలి. మ్యాక్రో ఎకనామిక్స్‌లో ఫ్యాక్ట్స్, ఫిగర్స్ (సంవత్సరాలు, శాతాలకు సంబంధించిన సమాచారం) చాలా ముఖ్యమైనవి.
- ■ మైక్రో ఎకనామిక్స్‌లో Theory of Consumer Behaviour, Cost Analysis, Production Analysis, Price and Output Determination ముఖ్యమైన అంశాలు.

మ్యాథ్స్, స్టాటిస్టిక్స్

- ■ వివిధ చాప్టర్లకు సంబంధించి ఫార్ములాలను ఒకచోట రాసుకొని, పునశ్చరణ చేస్తుండాలి. క్యాలిక్యులేటర్‌ను వేగంగా ఉపయోగించడాన్ని ప్రాక్టీస్ చేయాలి.
- ■ మ్యాథమెటిక్స్‌లో లిమిట్స్, డెరివేటివ్స్, పెర్ముటేషన్స్–కాంబినేషన్స్, రేషియో–ప్రపోర్షన్స్, మ్యాథమెటిక్స్ ఆఫ్ ఫైనాన్స్ ముఖ్యమైన చాప్టర్లు.
- ■ స్టాటిస్టిక్స్‌లో ప్రాబ్లమ్స్‌తో పాటు థియరీకి కూడా ప్రాధాన్యమివ్వాలి. ఇందులో ప్రాబబిలిటీ, థియరిటికల్ డిస్ట్రిబ్యూషన్స్, శాంప్లింగ్, స్టాటిస్టికల్ డిస్ట్రిబ్యూషన్ ఆఫ్ డేటా ముఖ్యమైన చాప్టర్లు.

ప్రిపరేషన్ టిప్స్

- ■ ఎంఈసీకి సమాంతరంగా సీపీటీకి ప్రిపేరవుతున్నప్పుడు ప్రణాళిక కీలకపాత్ర పోషిస్తుంది. అందుబాటులో ఉన్న సమయం, చదవాల్సిన సబ్జెక్టులు, చాప్టర్లతో టైంటేబుల్‌ను రూపొందించుకోవాలి. దాని ప్రకారం చదవాలి.
- ■ ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం నుంచే సీపీటీకి కొంత సమయం కేటాయించాలి. రోజులో 8 గంటలను ఇంటర్‌కు కేటాయిస్తే, సీపీటీకి కనీసం 2 గంటలు కేటాయించాలి.
- ■ ఇంటర్, సీపీటీలో ఉమ్మడిగా ఉన్న అంశాలను చదివే ముందు తొలుత ఇంటర్‌లోని కాన్సెప్టులపై పట్టు సాధించి, ఆ తర్వాత సీపీటీలోని అంశాలపై దృష్టిసారించాలి.
- ■ ప్రిపరేషన్ సమయంలో వచ్చే సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేసుకోవాలి.



ఎం.ఎస్.ఎస్. ప్రకాశ్
డైరెక్టర్, మాస్టర్‌మైండ్స్

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు (గురువారం ముగింపు)	సెన్సెక్స్	నిఫ్టీ
మార్పు	28 ▲	5 ▲
ముగింపు	31,596	9,857

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు (శుక్రవారం ముగింపు)		
నాస్‌డాక్	6,266	▽ 6
డోజోన్స్	21,814	▲ 30
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,401	▽ 6
డాక్స్	12,168	▽ 13
షాంఘై	3,332	▲ 60
నికాయ్	19,453	▲ 99

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			● కొనుగోలు	● అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	63.25	64.93
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	80.49	83.27
€	యూరో	ఎస్‌బీఐ	74.32	76.94
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	57.66	59.68
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	49.65	51.62
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	46.34	47.83
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	15.50	18.37
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	15.86	18.54
¥	చైనా యువాన్	థామస్‌కుక్	6.81	11.04

మీ బ్యాంకుకు మీరు వీఐపీనా?



- ప్రీమియం కస్టమర్లయితే ప్రత్యేక సేవలు
- లావాదేవీలపై పరిమితులే కాదు... చార్జీలూ ఉండవు
- లాకర్లు, అడ్వయిజరీ సేవలూ అందించేందుకు సిద్ధం
- ఇంటి ముంగిటకే సేవలు; రుణాలపై వడ్డీలోనూ రాయితీ
- రిలేషన్ షిప్ వాల్యూ మాత్రం కాస్త ఎక్కువే ఉండాలి
- బ్యాంకులను బట్టి మారుతున్న రిలేషన్‌షిప్ వాల్యూ

ఈ మధ్య బ్యాంకంటేనే భయమేస్తోంది. ఎందుకంటే అన్ని సేవలపైనా చార్జీల బాదుడు షురూ అయింది. ఏటీఎం లావాదేవీల నుంచి మొదలు పెడితే... శాఖల్లో నగదు ఉపసంహరణ, డిపాజిట్ సహా ఇదివరకు ఉచితంగా లభించిన సేవలన్నీ ఇపుడు షరతులతోను, చార్జీలతోను మాత్రమే అందుతున్నాయి. కాకపోతే ఇవన్నీ సామాన్య ఖాతాదారులకే సుమండీ!!. ప్రీమియం ఖాతాదారులకు ఇలాంటి షరతులేవీ లేవు. అధిక మొత్తంలో వ్యాపారాన్నిస్తున్నారు కనక వీరికి ప్రివిలేజ్ బ్యాంకింగ్ పేరిట రెడ్ కార్పెట్ వేసి మరీ వీఐపీ సేవలందిస్తున్నాయి. బ్యాంకు బ్రాంచుల్లో నిర్వహించే నగదు లావాదేవీలు మాత్రమే కాదు!. ఏటీఎం లావాదేవీలు, ఆఖరికి డిమాండ్ డ్రాఫ్ట్‌ల జారీ వంటి సేవలు కూడా వీరికి ఉచితమే!! అదీ లెక్క. ఆ వీఐపీ సేవలు ఎవరికిస్తున్నారో... ఎలా ఇస్తున్నారో... వాటిని అందుకోవాలనుకునే వారు ఏం చేయాలో వివరించే కథనమే ఇది...

ఇక్కడ సేవలన్నీ ప్రత్యేకమే...

రుణాలపై వడ్డీ రేటులో కూడా తమ వీఐపీ కస్టమర్లకు బ్యాంకులు ప్రాధాన్యమిస్తున్నాయి. అంటే సాధారణ ఖాతాదారులతో పోలిస్తే వీరికిచ్చే రుణాలపై వడ్డీ రేటు తక్కువే ఉంటుంది. లాకర్లపై చార్జీలు కూడా ఉండవు. అంతేకాదు!! వీరికి మంచి ప్రీమియం లాకర్లను కేటాయిస్తున్నాయి. వీరు పిలిస్తే పలికేందుకు, కావాల్సిన సేవలు అందించేందుకు రిలేషన్‌షిప్ అధికారుల పేరిట ప్రత్యేక సిబ్బంది, వీరికోసం టోల్ ఫ్రీ నంబర్లు కూడా అందుబాటులో ఉన్నాయి. డిపాజిట్ చేయాలన్నా, డిమాండ్ డ్రాఫ్ట్ కావాలన్నా ఇంటి వద్దకే వచ్చి నగదు స్వీకరించడం, విత్‌డ్రాల విషయంలో ఇంటికే వచ్చి నగదు చెల్లించడం తదితర సేవలను అందిస్తున్నాయి. అంతేకాదు! పలు బ్యాంకులు వీరికోసం అదనపు వేళలు పనిచేస్తున్నాయి. ఇక రోజువారీ నగదు ఉపసంహరణ పరిమితుల్లోనూ వీరికి ప్రత్యేక నియమాలున్నాయి. బ్యాంకు శాఖల్లో వీరి కోసం ప్రత్యేక కౌంటర్లు కూడా ఉంటున్నాయి. ఇవికాక అత్యాధునిక ప్లాస్టిక్ కార్డులు, ఇంధన సర్‌చార్జీల ఎత్తివేతతో పాటు షాపింగ్, పర్యటనలు, రెస్టారెంట్లకు సంబంధించిన ఆఫర్లు కూడా అందిస్తున్నాయి. ఖాతాల్లో కనీస నగదు నిల్వలు ఉంచకపోయినా, ఫిక్స్‌డ్ డిపాజిట్లను గడువుకు ముందే రద్దు చేసుకున్నా గానీ చార్జీలు విధించడం లేదు!! అడిగిన వారి విషయంలో పెట్టుబడులకు సంబంధించి వీరికి ప్రత్యేకమైన సలహా సేవలు కూడా అందిస్తున్నాయి. ముఖ్యంగా ప్రైవేటు బ్యాంకులు, విదేశీ బ్యాంకులు ఈ సేవల్లో ముందుంటున్నాయి. భిన్నమైన ఉత్పత్తులు, సేవలతో సంపన్న ఇన్వెస్టర్లను ఆకట్టుకుంటున్నాయి.





ఈ సేవలు... ఎవరికేంటి?

సేవలన్నీ బాగానే ఉన్నాయి. మరి బ్యాంకుల నుంచి ఇలాంటి వీఐపీ సేవలు పొందాలంటే ఏం చేయాలి...? ఇందుకోసం బ్యాంకులకు ఆ మేరకు వ్యాపారాన్ని ఇవ్వాల్సి ఉంటుంది. ఎందుకంటే బ్యాంకులు ఈ తరహా సేవలందించేందుకు అధిక వ్యయం చేయాల్సి వస్తుంది. అందుకే అవి కస్టమర్ల నుంచి అధిక వ్యాపారాన్ని ఆశిస్తున్నాయి. ఇందుకోసం రిలేషన్‌షిప్ వాల్యూ అధికంగా ఉండాలి. ఖాతాలో బ్యాలెన్స్‌లు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, రికరింగ్ డిపాజిట్లు, బీమా పాలసీలు, పెట్టుబడులు, రుణాలు ఇవన్నీ కలిపి బ్యాంకులు ఆశిస్తున్న విలువ మేర కొనసాగిస్తే... వారికి సేవలన్నీ ఎంచక్కా ప్రీమియం స్థాయిలో అందుతాయి.

ఏ బ్యాంకుకు... ఎవరు వీఐపీ?



మరి వీఐపీ అంటే ఎవరు? రిలేషన్ షిప్ వాల్యూ ఎంతుండాలి? ఇలాంటి ప్రశ్నలకు సమాధానాలు బ్యాంకులను బట్టి మారుతుంటాయి. ఉదాహరణకు ఆర్‌బీఎల్ బ్యాంకు సిగ్నేచర్ బ్యాంకింగ్ పేరిట ఖాతాదారులకు ప్రీమియం సర్వీసులను ఆఫర్ చేస్తోంది. వీటిని పొందాలంటే ఖాతాదారుడు కనీసం రూ.15 లక్షల రిలేషన్‌షిప్ వాల్యూ (మొత్తం విలువ) కలిగి ఉండాలి. సేవింగ్స్ ఖాతా అయితే నెలవారీ రూ.2 లక్షల కనీస నగదు నిల్వలు, కరెంటు ఖాతా అయితే రూ.5 లక్షల కనీస బ్యాలెన్స్‌ను ఉంచాల్సి ఉంటుంది. అదే ఐసీఐసీఐ బ్యాంకు వెల్త్ కస్టమర్ అయితే రూ.25 లక్షల రిలేషన్‌షిప్ వాల్యూను బ్యాంకుతో కలిగి ఉండాలి. సేవింగ్స్, కరెంటు ఖాతాల బ్యాలెన్స్‌లు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, మ్యూచువల్ ఫండ్స్, బీమా పాలసీల ప్రీమియం కూడా ఇందులో భాగమే. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఇంపీరియా ప్రోగ్రామ్ సేవల కోసం సేవింగ్స్ ఖాతా బ్యాలెన్స్, ఫిక్స్‌డ్ డిపాజిట్ల రూపంలో రూ.30 లక్షల విలువను కొనసాగించాలి. లేదా త్రైమాసికంవారీగా సేవింగ్స్ ఖాతాలో అయితే రూ.10 లక్షల కనీస బ్యాలెన్స్, కరెంటు ఖాతాలో అయితే రూ.15 లక్షల బ్యాలెన్స్‌ను నిర్వహించడం తప్పనిసరి. కోటక్ మహీంద్రా బ్యాంకు ప్రైవీలేగ్ బ్యాంకింగ్ పేరిట నాలుగు రకాల ఆప్షన్లను ఆఫర్ చేస్తోంది. ఇన్‌సిగ్నియా, ఆప్టిమా, ప్రైమా, మ్యాక్సిమా అంటూ సేవలను వర్గీకరించింది. ఇన్‌సిగ్నియా కస్టమర్ బ్యాంకుతో రూ.కోటి రిలేషన్‌షిప్ వాల్యూ కలిగి ఉండాలి. నెలవారీగా రూ.2.5 లక్షల బ్యాలెన్స్ ఉంచాలి. ఆప్టిమా కస్టమర్ అయితే రూ.30 లక్షల రిలేషన్‌షిప్ వ్యాల్యూ, ఖాతాలో నెలవారీ కనీస బ్యాలెన్స్ రూ.2.5 లక్షలు కలిగి ఉండాలి. సిటీబ్యాంకు ఇండియా సైతం 'సిటీగోల్డ్' పేరిట ప్రివిలేజ్ బ్యాంకింగ్ సేవలను అందిస్తోంది. ఇందుకోసం ఖాతాదారులు బ్యాంకుతో కనీసం రూ.75 లక్షల రిలేషన్‌షిప్ వాల్యూ కలిగి ఉండాలి. సేవింగ్స్, కరెంట్ ఖాతాల్లోని బ్యాలెన్స్‌లు, డిపాజిట్లు, మ్యూచువల్ ఫండ్స్, రుణాలు (గృహ రుణం కూడా), బీమా ప్రీమియం, డీమ్యాట్ ఖాతాలోని హోల్డింగ్స్‌ను కూడా రిలేషన్‌షిప్ వాల్యూ కోసం పరిగణనలోకి తీసుకుంటోంది. హెఎస్‌బీసీ ప్రీమియం బ్యాంకింగ్ సేవల కోసం ఖాతాదారులు కనీసం రూ.40 లక్షల రిలేషన్‌షిప్ వాల్యూను కలిగి ఉండాలి.

ప్రయోజనమేనా...?



ప్రైవేటు బ్యాంకుల్లో ఆర్‌బీఎల్ ప్రిఫర్డ్ బ్యాంకింగ్ సేవల కోసం సులభమైన నిబంధనలు విధించింది. కేవలం రూ.15 లక్షల రిలేషన్‌షిప్ వాల్యూ కలిగి ఉంటే సరిపోతుంది. ఇక, ఐసీఐసీఐ బ్యాంకు అర్హతలు మధ్యస్తంగా ఉన్నాయి. సిటీబ్యాంకులో ఇది మరీ ఎక్కువ. అయితే, ఈ తరహా సేవలకు ఓకే చెప్పే ముందే... ఏ సేవలు అందుతాయి? వేటికి చార్జీల మినహాయింపులున్నాయి? రుణాల్లో వడ్డీపై రాయితీలు ఇస్తున్నాయా? ఇలా అన్ని అంశాలనూ ఓసారి గమనించాలి. సంపద నిర్వహణకు సంబంధించి (వెల్త్ మేనేజ్‌మెంట్) బ్యాంకు అదే పనిగా ఇస్తున్న సలహాలు, పోర్ట్‌ఫోలియోలో మార్పులతో ప్రయోజనం కలగకపోవచ్చు. అందుకే బ్యాంకుల్లో వీఐపీ ట్రీట్‌మెంట్ ఆశించే దృష్టితో కాకుండా వాస్తవానికి మీకు ఏ సేవలు అవసరమన్న దానిపై దృష్టి పెట్టాలి. కనీస రిలేషన్‌షిప్ వాల్యూను కొనసాగించడంలో విఫలమైతే బ్యాంకులు సంబంధిత ఖాతాలను సాధారణ ఖాతాల కిందకు మార్చేస్తాయి. దీంతో సాధారణ ఖాతాదారులకు విధించే అన్ని చార్జీలు, ఏటీఎం ఉచిత లావాదేవీ పరిమితులు అమలవుతాయి.

నచ్చితే మరో మెట్టు పైకి



ప్రీమియం సేవలకు ముగ్ధులై బ్యాంకుతో మరింత పెద్ద మొత్తంలో రిలేషన్‌షిప్ వాల్యూకి సిద్ధమైతే మరో మెట్టు ముందుకు తీసుకెళ్లేందుకూ పలు బ్యాంకులు సిద్ధంగా ఉన్నాయి. రూ.కోట్ల రూపాయల రిలేషన్‌షిప్ వాల్యూకు ముందుకు వస్తే లగ్జరీ బ్యాంకింగ్ సేవలు అందుకోవచ్చు. వీరికి సీనియర్ బ్యాంకర్లు వ్యక్తిగతంగా సలహాలు, సూచనలు అందిస్తారు. కోరితే వారికోసమే ప్రత్యేకంగా సేవలు రెడీ అవుతాయి కూడా!!.

పసిడి 'బుల్' రన్!

- 15 డాలర్లు పడిలేచిన బంగారం
- ఫెడ్ 'రేటు' పెంపు ఉండదనే అంచనాలు
- భారీగా పడిన డాలర్ ఇండెక్స్



అమెరికా ఆర్థిక పరిణామాలు పసిడిని పటిష్ట స్థాయిలో ఉంచుతున్నాయి. న్యూయార్క్‌లోని అంతర్జాతీయ ఫ్యూచర్స్ మార్కెట్- నైమెక్స్‌లో ఆగస్టు 25వ తేదీ శుక్రవారంతో ముగిసిన వారంలో వారం వారీగా పసిడి ఔన్స్ (31.1 గ్రా.) ధర వారం వారీగా కేవలం ఒక్క డాలర్ పెరిగి 1,296 డాలర్ల వద్ద పటిష్టంగా ఉన్నప్పటికీ, పసిడిది 'బుల్' ధోరణే' అన్నది నిపుణుల అంచనా.

భారీ ఒడిదుడుకులు...: వారమంతా పసిడి భారీ ఒడిదుడుకుల్లో ఉంది. 25వ తేదీ శుక్రవారం అమెరికా సెంట్రల్ బ్యాంక్ చీఫ్ జానెట్ యెలెన్ ఆర్థిక వ్యవస్థపై ప్రకటన చేయనుండటం, అదే రోజు అమెరికా జూలై నెల వినియోగ వస్తువుల గణాంకాలు విడుదల కానుండటంతో వారమంతా హెచ్చుతగ్గులు నమోదయ్యాయి. శుక్రవారం కీలక నిరోధం 1,300 డాలర్ల స్థాయి వద్ద ఉన్న పసిడికి టెక్నికల్‌గా అమ్మకాల ఒత్తిడి ఎదురైంది. మరోవైపు యెలెన్ ప్రకటన నేపథ్యంలో 1,280 డాలర్ల స్థాయికి కుప్పకూలింది. అయితే యెలెన్ తన ప్రకటనలో 'ఫెడ్ రేటు' (ప్రస్తుతం 1.00–1.25 శాతం శ్రేణి) ప్రస్తావన చేయకపోవడంతో వారమంతా దాదాపు 93పైన కొనసాగిన డాలర్ ఇండెక్స్ దాదాపు ఒక డాలర్ కుప్పకూలి 92 స్థాయికి చేరుకుంది. దీంతో బంగారం పడినంత వేగంగానే తిరిగి 1,295 స్థాయికి లేచింది.

1,300 నిరోధం కీలకం...: గత వారం 1,303 స్థాయికి చేరి, అక్కడ నిలబడలేకపోయిన పసిడి ఈ నిరోధాన్ని అధిగమించడానికి ఈ వారమంతా ప్రయత్నించింది. 1,340 స్థాయికి చేరడానికి తక్షణ నిరోధం ఇదే నని టెక్నికల్ అనలిస్టుల అభిప్రాయం. ఇక దిగువ దిశలో 1,280, 1,242, 1,204 స్థాయిల వద్ద మద్దతు లభిస్తుందన్నది వారి అంచనా.

దేశీయంగా రూపాయి ఎఫెక్ట్...

నిజానికి అంతర్జాతీయంగా పసిడి దాదాపు అక్కడక్కడే ఉంది కాబట్టి దేశంలో కూడా అదే పరిస్థితి ఉండాలి. అయితే దేశీయంగా ధర పడింది. అమెరికా డాలర్ మారకంలో రూపాయి విలువ వారంవారీగా దాదాపు 24 పైసలు బలపడి 63.85 వద్ద ముగియడం దీనికి కారణం. దేశీయ ఫ్యూచర్స్ మార్కెట్- మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్‌లో పసిడి వారంలో రూ.118 తగ్గి రూ. రూ.29,167 కి చేరింది. ముంబై ప్రధాన మార్కెట్‌లో వారం వారీగా పసిడి 99.9 స్వచ్ఛత 10 గ్రాముల ధర రూ.225 తగ్గి, రూ.29,060కి చేరింది. ఇక 99.5 స్వచ్ఛత విషయంలో ధర ఇదే స్థాయిలో పడి రూ. 28,910కు చేరింది. వెండి కేజీ ధర కూడా భారీగా రూ.590 తగ్గి రూ. 38,710 కి చేరింది.



గత వారం హీరోలు

స్టాక్స్	24 ముగింపు	17 ముగింపు	మార్పు(%)
హెచ్‌పీసీఎల్	466	434	7
జేఎస్‌డబ్ల్యూ స్టీల్	246	234	5
దివీస్ ల్యాబ్స్	673	645	4
అరబిందో ఫార్మా	732	703	4
లుపిన్	992	954	4
భారతీ ఎయిర్‌టెల్	433	417	4
డా.రెడ్డీస్ ల్యాబ్స్	2,088	2,010	4
బజాజ్ ఫిన్‌సర్వ్	5,504	5,311	4
కోల్గేట్ పామోలివ్	1,093	1,059	3
సెయిల్	61	59	3

ఎందుకు పెరిగాయంటే...

హెచ్‌పీసీఎల్ విలీనానికి ఓఎన్‌జీసీ బోర్డు సూత్రప్రాయ ఆమోదం తెలపడంతో హెచ్‌పీసీఎల్ షేర్ 7 శాతం వరకూ ఎగసింది. అంతర్జాతీయ మార్కెట్లో స్టీల్ ధరలు పెరగడం, మరింతగా పెరిగే అవకాశాలున్నాయన్న అంచనాల నేపథ్యంలో జేఎస్‌డబ్ల్యూ స్టీల్, సెయిల్ వంటి స్టీల్ కంపెనీల షేర్లు 3–5 శాతం రేంజ్‌లో లాభపడ్డాయి. జూలైలో ఆరు లక్షలకు పైగా కొత్త వినియోగదారులు లభించారన్న వార్తల కారణంగా భారతీ ఎయిర్‌టెల్ షేర్ 4 శాతం వరకూ పెరిగింది.

గత వారం జీరోలు

స్టాక్స్	24 ముగింపు	17 ముగింపు	మార్పు(%)
ఇన్ఫోసిస్	912	1,021	-11
ఆర్ఈసీ	160	169	-5
ఎక్సైడ్ ఇండస్ట్రీస్	202	213	-5
సీమెన్స్	1,263	1,322	-4
ఎన్‌టీపీసీ	169	177	-4
మదర్‌సన్ సుమి	310	324	-4
బ్యాంక్ ఆఫ్ బరోడా	143	148	-4
పవర్ ఫైనాన్స్ కార్ప్	121	126	-4
భారత్ ఫోర్జ్	1,148	1,188	-3
హీరో మోటొకార్ప్	3,874	3,997	-3

ఎందుకు తగ్గాయంటే...

విశాల్ సిక్కా సీఈఓ పదవికి రాజీనామా చేయడంతో ఇన్ఫోసిస్ నష్టాలు కొనసాగాయి. అయితే నందన్ నీలేకని మళ్లీ చైర్మన్‌గా రానున్నారన్న వార్తల తో నష్టాలు తగ్గాయి. విద్యుత్ కంపెనీలకు రుణాలివ్వడంలో ఆర్‌బీఐ నిబంధనలకనుగుణంగా పీఎఫ్‌సీ, ఆర్ఈసీలు వ్యవహరించలేదని కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) వ్యాఖ్యానించడంతో ఈ విద్యుత్ రంగ ఫైనాన్స్ కంపెనీలు (ఆర్ఈసీ, పీఎఫ్‌సీ)లు 4–5 శాతం రేంజ్‌లో నష్టపోయాయి.

స్మాల్‌క్యాప్ ఫండ్స్‌లో ఎంత ఇన్వెస్ట్ చేయాలి?



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

నేను మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేద్దామనుకుంటున్నాను. కనీసం ఐదు నుంచి ఏడేళ్లు ఇన్వెస్ట్ చేయాలనుకుంటున్నాను. థీమాటిక్ ఫండ్‌ను ఎంచుకోవాలా లేక స్మాల్ క్యాప్ ఫండ్‌ను ఎంచుకోవాలా ? దేంట్లో రిస్క్ తక్కువగా ఉంటుంది? –జగదీశ్, విజయవాడ

థీమాటిక్, స్మాల్ క్యాప్ మ్యూచువల్ ఫండ్స్ రెండూ వేర్వేరు. థీమాటిక్ ఫండ్స్ ఒక ప్రత్యేకమైన థీమ్‌కు సంబంధించినవి. అన్నీ అనుకున్నట్లుగా, సవ్యంగా జరిగితే ఈ థీమాటిక్ ఫండ్స్ మంచి రాబడులనిస్తాయి. కానీ ఇది జూదం లాంటిదే. అంచనాలు తప్పినా, లేకపోతే, సరైన సమయంలో థీమాటిక్ ఫండ్‌లో ఇన్వెస్ట్ చేయకపోయినా మీకు భారీగా నష్టాలు వస్తాయి. సాధారణంగా ఇన్వెస్టర్లు ఇప్పటికే బాగా పెరిగిన రంగాల్లో ఇన్వెస్ట్ చేయడానికే ఇష్టపడతారు. భవిష్యత్తులో బాగా పెరిగే అవకాశాలున్న రంగాల్లో ఇన్వెస్ట్ చేసే అవకాశాలు సాధారణ ఇన్వెస్టర్లకు చాలా తక్కువగా ఉంటాయి. భవిష్యత్తులో మంచి రాబడులనిచ్చే థీమాటిక్ ఫండ్స్‌ను ఇప్పుడే గుర్తించడం చాలా కష్టం. స్మాల్‌క్యాప్ కంపెనీలు మూలధన పరంగా చిన్న సైజువి. కానీ లార్జ్ క్యాప్‌కంపెనీల కంటే వేగంగా వృద్ధి చెందగల సత్తా వాటికి ఉంటుంది. అందుకని మీ పోర్ట్‌ఫోలియోలో 20–30% వరకూ ఖచ్చితంగా స్మాల్ క్యాప్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయాలి. సాధారణంగా స్మాల్‌క్యాప్ కంపెనీలు ఆర్థిక మందగమనం, ప్రభుత్వ విధానాలు, పోటీ, తదితర అంశాల పరంగా చూస్తే తీవ్రమైన ఒడిదుడుకులకు గురవుతాయి. అందుకని ఏ స్మాల్ క్యాప్ కంపెనీల్లో ఇన్వెస్ట్ చేయాలి అనేది మీ ఫండ్‌మేనేజర్‌కు వదిలేయండి. స్మాల్ క్యాప్‌కంపెనీల్లో ఇన్వెస్ట్ చేస్తున్న డైవర్సిఫైడ్ ఈక్విటీ ఫండ్‌లో ఇన్వెస్ట్ చేస్తే మీరు మంచి రాబడులు పొందవచ్చు.

నేను 2012లో ఎల్ఐసీ జీవన్ మిత్ర పాలసీ తీసుకున్నాను. ఈ పాలసీ కాలపరిమితి 30 సంవత్సరాలు. వార్షిక ప్రీమియమ్ రూ.47,950. ఈ పాలసీని పెయిడప్-పాలసీగా మార్చుకోమంటారా ? లేక ఈ పాలసీలో కొనసాగమంటారా ? –రాజేశ్, విశాఖపట్టణం

'ఎల్ఐసీ జీవన్ మిత్ర' ఎండోమెంట్ ప్లాన్. ఇది ఇన్సూరెన్స్-కమ్-ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్. ఇవి ఖరీదైనవి. పైగా తగిన తగిన బీమా కవరేజ్‌ను ఇవ్వలేవు. రాబడులూ అంతంత మాత్రమే. ఈ పాలసీని పెయిడప్ పాలసీగా మార్చుకుంటే, మీ పాలసీ కాలపరిమితి పూర్తయ్యేవరకూ మీ సొమ్మును తీసుకోలేరు. దీనికి బదులు మీరు ఈ ప్లాన్‌ను సరెండర్ చేయండి. దీనివల్ల మీకు నష్టాలు వస్తాయి. కానీ మంచి రాబడులు రాని ఇన్వెస్ట్‌మెంట్ నుంచి మీరు బైటపడినట్లవుతుంది. ఈ ప్లాన్‌ను సరెండర్ చేస్తే, మీకు కొంత మొత్తం గ్యారంటీడ్ సరెండర్ వేల్యూగా లభిస్తుంది. ఎల్ఐసీ స్పెషల్ సరెండర్ వేల్యూను చెల్లించవచ్చు. ఇది గ్యారంటీడ్ సరెండర్ వేల్యూతో సమానంగా లేదంటే, దానికంటే అధికంగానే ఉండొచ్చు. ఇక ఈ పాలసీని పెయిడప్ పాలసీగా మార్చుకుంటే పెయిడప్ వేల్యూ ఎంత వస్తుందనేది మీరు ఎల్ఐసీ కార్యాలయంలో సంప్రదించి తెలుసుకోగలరు. పాలసీ కాలపరిమితి తీరిన తర్వాతనే మీకు పెయిడప్ వేల్యూ లభిస్తుంది. బీమా, ఇన్వెస్ట్‌మెంట్ కలగలసిన ఈ తరహా ప్లాన్‌ల్లో ఎప్పుడూ ఇన్వెస్ట్ చేయకూడదు. బీమా కవరేజ్ కోసం ప్యూర్ టర్మ్ పాలసీ తీసుకోవాలి. ఈ టర్మ్ పాలసీల్లో బీమా కవరేజ్ అధికంగానూ, చెల్లించాల్సిన ప్రీమియమ్‌లు తక్కువగానూ ఉంటాయి. ఇక దీర్ఘకాలిక ఆర్థిక లక్ష్యాల కోసం ఏదైనా బ్యాలన్స్‌డ్ ఫండ్ లేదా డైవర్సిఫైడ్ ఈక్విటీ మ్యూచువల్ ఫండ్‌లో సిస్టమేటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్(సిప్) విధానంలో ఇన్వెస్ట్ చేయండి. ఇలా చేస్తే ద్రవ్యోల్బణాన్ని తట్టుకోగలిగే రాబడులు మీకు వస్తాయి.

నా వయస్సు 53. నేను 65 ఏళ్ల వరకూ పనిచేయగలను. పెన్షన్ నిధిగా రూ.50 లక్షల వరకూ ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఉన్నాయి. నెలకు రూ.40,000–50,000 వరకూ సిప్ విధానంలో ఇన్వెస్ట్ చేయగలను. తగిన ఇన్వెస్ట్‌మెంట్ విధానాన్ని సూచించండి. –జాఫర్, హైదరాబాద్

మీ అత్యవసర ఖర్చులకు అవసరమైన మొత్తాన్ని మాత్రమే స్థిరాదాయ సాధనాల్లో ఉంచుకోవాలి. స్థిరాదాయ సాధనాల్లో ఇన్వెస్ట్‌మెంట్‌పై వచ్చే వడ్డీలపై పూర్తిగా పన్ను భారం(టీడీఎస్) ఉంటుంది. అందుకని ఫిక్స్‌డ్ డిపాజిట్లను ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ ఫండ్‌లోకి మార్చుకోండి. ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయడం వల్ల కొన్ని పన్ను ప్రయోజనాలు లభిస్తాయి. మీరు మరో 12 ఏళ్ల పాటు పనిచేయగలుగుతారు. అంటే మీరు దీర్ఘకాలం పాటు ఇన్వెస్ట్ చేయవచ్చని అర్థం. మీ అత్యవసర ఖర్చులకు కొంత మొత్తాన్ని ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ ఫండ్‌లో ఇన్వెస్ట్ చేయండి. మిగిలిన మొత్తాన్ని ఈక్విటీ లేదా బ్యాలన్స్‌డ్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయవచ్చు. ఫిక్స్‌డ్ డిపాజిట్లలో ఉన్న మొత్తాన్ని ఈ బ్యాలన్స్‌డ్‌లేదా ఈక్విటీ ఫండ్స్‌లోకి రెండేళ్లలో బదిలీ చేయండి. రెండేళ్లపాటు ఫిక్స్‌డ్ ఇన్‌కమ్, ఈక్విటీ ఫండ్స్‌ల నుంచి వచ్చే రాబడులు స్వల్పంగా ఉండొచ్చు. కానీ దీర్ఘకాలంలో ఈక్విటీ ఫండ్స్‌తో వచ్చే రాబడులు అధికంగా ఉంటాయి.



“నువ్వు ఒక పనిని కష్టంగా భావిస్తే... దాన్ని పూర్తి చేయడానికి ఎక్కువ సమయాన్ని తీసుకుంటావు.”
–ఆండ్రియా జంగ్, బిజినెస్ ఉమన్

పొదుపు-మదుపు



డిపాజిట్ ఉంటే.. కార్డిస్తారు!

- క్రెడిట్ కార్డులు పొందటానికి ఈజీ మార్గం
- క్రెడిట్ స్కోరు బాగులేని వారికిది అనుకూలమే
- వేతన రుజువులు చూపించాల్సిన పనిలేదు
- కాకపోతే డిపాజిట్‌లో 85 శాతం వరకే పరిమితి
- ఇతర నిబంధనలు సాధారణ కార్డుల మాదిరే
- తక్కువ వడ్డీకే డిపాజిట్‌ను కొనసాగిస్తుండాలి
- ఈ పరిస్థితుల్లో అది ప్రతికూలమే: నిపుణులు
- స్వయం ఉపాధి, స్థిరాదాయం లేనివారికీ బెటర్

క్రెడిట్ కార్డు ఒకప్పుడు పెద్దగా అవసరం లేదనుకునే వారు. అప్పులకు భయపడేవారు కార్డులకూ్కడా దూరంగానే ఉండేవారు. ఇక అప్పులు బాగా ఎక్కువైన వారికి కంపెనీలే కార్డులిచ్చేవి కాదు. కొన్నాళ్ల కిందటిదాకా ఇంచుమించు ఇదే పరిస్థితి ఉన్నా... పెద్ద నోట్లు రద్దు, వ్యవస్థలో నగదుకు కటకట ఏర్పడటం, వైద్య ఖర్చుల వంటివి భారీగా పెరగటం తదితర పరిణామాలతో క్రెడిట్ కార్డులకు సంబంధించి చాలా మార్పులొచ్చాయి. కార్డు వినియోగం, అవసరం బాగా పెరిగింది. అవసరానికి క్షణాల్లో అప్పు పుట్టించే ఈ కార్డులకు డిమాండూ పెరిగింది.

వేతన జీవులకు క్రెడిట్ కార్డు సులభంగానే లభిస్తుంది. స్థిరమైన ఆదాయం వస్తుంది గనుక వీరు అడగకుండానే... బ్యాంకులే స్వయంగా కార్డులు చేతిలో పెట్టే పరిస్థితి వచ్చింది. కానీ, అదే సమయంలో స్థిరమైన ఆదాయం లేని వారు, స్వయం ఉపాధిలో ఉన్నవారికి, క్రెడిట్ హిస్టరీ లేని వారికి క్రెడిట్ కార్డు లభించడం అంత సులభంగా లేదు. అయితే, వీరికూ్కడా ఓ మార్గం ఉంది. నిర్ణీత మొత్తం ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తే దానిపై క్రెడిట్ కార్డు తీసుకోవచ్చు. వీటిని సెక్యూర్డ్ క్రెడిట్ కార్డులుగా పరిగణిస్తున్నారు. యాక్సిస్ బ్యాంకు, ఐసీఐసీఐ బ్యాంకు, కోటక్ మహీంద్రా బ్యాంకు, బ్యాంకు ఆఫ్ బరోడా ఇలా ఎన్నో బ్యాంకులు ఎఫ్‌డీ చేస్తే ఇతర అర్హతలేవీ చూడకుండా క్రెడిట్ కార్డులు ఇచ్చేస్తున్నాయి. అందుకు గల విధి, విధానాలు ఒకసారి చూద్దాం...

అర్హతలు ఇవీ..

క్రెడిట్ కార్డు తీసుకుందామనుకున్న తర్వాత సంబంధిత బ్యాంకు వద్ద ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. డిపాజిట్ సమయంలో బ్యాంకు అవసరమైన పత్రాలను తీసుకుంటుంది. కనుక క్రెడిట్ కార్డు సమయంలో ఇతరత్రా పత్రాలేవీ సమర్పించాల్సిన అవసరం ఉండదు. దరఖాస్తు ఒక్కటి మాత్రం సరిపోతుంది. ఐసీఐసీఐ బ్యాంకు, యాక్సిస్ బ్యాంకు కనీసం రూ.20,000 డిపాజిట్‌ను అడుగుతున్నాయి. కోటక్ మహీంద్రా బ్యాంకు, బ్యాంకు ఆఫ్ బరోడా అయితే రూ.25,000 డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. గరిష్టంగా ఎంత మేరకైనా డిపాజిట్ చేయవచ్చు. ఒక్క యాక్సిస్ బ్యాంకు మాత్రం గరిష్ఠ డిపాజిట్ రూ.25 లక్షలుగా పరిమితి నిర్దేశించింది. డిపాజిట్ చేయాల్సిన కాల వ్యవధి ఐసీఐసీఐ కోరల్ లేదా ఇన్‌స్టంట్ ప్లాటినమ్ కార్డులకు 180 రోజులుగా ఉంది. సెంట్రల్ బ్యాంకు ఆఫ్ ఇండియా నుంచి యాస్పైర్ క్రెడిట్ కార్డు పొందాలంటే సెంట్ యాస్పైర్ టర్మ్ డిపాజిట్ చేయాల్సి ఉంటుంది.

పరిమితులు కూడా ఉన్నాయ్...

డిపాజిట్‌పై తీసుకునే క్రెడిట్ కార్డుల విషయంలోనూ కొన్ని పరిమితులు కూడా ఉన్నాయి. యాక్సిస్ బ్యాంకు మైనర్ల పేరిట డిపాజిట్ చేసినప్పటికీ క్రెడిట్ కార్డులిచ్చేందుకు ముందుకు రావడం లేదు. ఇదే బ్యాంకులో ఫ్లెక్సీ డిపాజిట్, ట్యాక్స్ సేవర్ డిపాజిట్లు చేసినట్టయితే వాటిపైనా కార్డులను జారీ చేయడం లేదు. ఐసీఐసీఐ బ్యాంకు థర్డ్‌పార్టీకి, భాగస్వామ్య సంస్థలు తదితర వర్గాలకు క్రెడిట్ కార్డులు ఇవ్వడం లేదు. అలాగే, తనఖాలో ఉంచిన డిపాజిట్లపై కూడా క్రెడిట్ కార్డులు జారీ చేయడం లేదు. చాలా బ్యాంకులు డిపాజిట్ మొత్తంలో 80 శాతం విలువకు సమానమైన క్రెడిట్ లిమిట్ (రుణ పరిమితి) ఇవ్వటానికే మొగ్గు చూపిస్తున్నాయి. ఆ మేరకే కార్డులు మంజూరు చేస్తున్నాయి. ఉదాహరణకు రూ.1 లక్ష డిపాజిట్ చేసి ఉంటే రూ.80,000 వరకు లిమిట్‌తో క్రెడిట్ కార్డును తేలిగ్గా పొందొచ్చు. కొన్ని బ్యాంకులు కార్డులపై క్రెడిట్ లిమిట్‌ను కూడా పరిమితం చేస్తున్నాయి. కోటక్ మహీంద్రా బ్యాంకు ఆక్వాగోల్డ్ కార్డ్‌పై గరిష్టంగా రూ.12 లక్షలకే క్రెడిట్ లిమిట్‌ను ఖరారు చేసింది. అంటే డిపాజిట్ రూ.50 లక్షలు చేసినా, రూ.12 లక్షలకే క్రెడిట్ లిమిట్‌తో కార్డు ఇస్తుంది. సెంట్రల్‌బ్యాంకు యాస్పైర్ క్రెడిట్ కార్డుపై రూ.10 లక్షల గరిష్ఠ పరిమితి ఉంది.



చార్జీలు, వడ్డీ రేట్లు మామూలే!

క్రెడిట్ కార్డు కాల వ్యవధి, ఫీజులు, వడ్డీ రేటు, ఇతర చార్జీలన్నీ కూడా వీటికీ సాధారణ క్రెడిట్‌కార్డుల మాదిరిగానే అమల్లో ఉన్నాయి. రుణ కాల వ్యవధి 30 నుంచి 60 రోజుల వరకు ఉంది. సకాలంలో చెల్లింపులు చేయకపోతే ఆలస్య రుసుం, వడ్డీ పడుతుంది. ఈ కార్డుల వల్ల బ్యాంకులకు ఉన్న వెసులుబాటు కార్డు దారుడు రుణం తీసుకుని చెల్లించకపోతే డిపాజిట్ నుంచి రికవరీ చేసుకుంటాయి. ఐసీఐసీఐ బ్యాంకు అయితే క్రెడిట్ కార్డుపై తీసుకున్న రుణం గనక డిపాజిట్ విలువకు చేరినట్లయితే వెంటనే డిపాజిట్‌ను రద్దు చేసి రుణం కింద జమ చేసుకుంటోంది. క్రెడిట్ కార్డు కాలవ్యవధి అన్నది డిపాజిట్ కాలవ్యవధిపైనే ఆధారపడి ఉంటుంది. క్రెడిట్ కార్డులకు హామీగా ఉన్న డిపాజిట్లను బ్యాంకులు సాధారణంగా ఆటో రెన్యువల్ మోడ్‌లో ఉంచుతాయి. అంటే గడువు తీరిన తర్వాత డిపాజిట్లు తిరిగి పునరుద్ధరిస్తూ ఉంటాయి. డిపాజిట్ మెచ్యూరిటీ అయిన తర్వాత కూడా క్రెడిట్ కార్డును వాడుకోవాలని అనుకునేవారు దానిపై తనఖా మార్కును తీసేసి అన్ సెక్యూర్డ్ క్రెడిట్ కార్డు కిందకు మార్చాలంటూ బ్యాంకులను కోరవచ్చనేది రుబిక్యూ ఎండీ, సీఈవో మానవ్‌జీత్ సూచన. అయితే, మీ క్రెడిట్ స్కోరు, ఇతర అంశాల ఆధారంగా క్రెడిట్ పరిమితిని సవరించే అవకాశం ఉంటుంది. ''డిపాజిట్‌పై క్రెడిట్ కార్డు తీసుకున్నాక చెల్లింపులు సకాలంలో చేయడం ద్వారా కాల వ్యవధి ముగిసే నాటికి మంచి క్రెడిట్ స్కోరును సంపాదించొచ్చు. దాంతో సాధారణ కార్డుకు దరఖాస్తు చేసుకునే అర్హత లభిస్తుంది'' అని క్రెడిట్ మంత్రి సీఈఓ రంజిత్ పుజా తెలియజేశారు.

ఈ కార్డులు ఎవరికి అనుకూలం?

ఫిక్స్‌డ్ డిపాజిట్‌పై క్రెడిట్ కార్డులు మూడు వర్గాల వారికి అనువైనవన్నది నిపుణుల మాట. క్రెడిట్ హిస్టరీ లేకుండా, అప్పటి వరకు ఆర్థిక సంస్థల నుంచి రుణం తీసుకోని వారికి ఇవి అనువైనవి. వీరు డిపాజిట్‌పై కార్డు తీసుకుని అవసరాలు తీర్చుకోవడంతో పాటు క్రెడిట్ స్కోర్‌ను కూడా సాధించుకునే వీలుంటుంది. అలాగే, తక్కువ క్రెడిట్ స్కోరు ఉండి, రుణం పొందడానికి అడ్డంకిగా ఉన్న వారికి సైతం ఇవి అనుకూలం. స్థిరమైన ఆదాయం లేని వారికి కూడా ఇవి అనువైనవేనని లోన్‌ట్యాప్ సహ వ్యవస్థాపకుడు వికాస్ కుమార్ తెలియజేశారు. చిన్న వ్యాపారాల్లో, స్వయం ఉపాధిలో ఉండి అస్థిరమైన ఆదాయం కలిగిన వారు, క్రెడిట్ కార్డు కావాలనుకుంటే డిపాజిట్ చేసి సులభంగా కార్డు తీసుకోవచ్చని సూచించారు. అయితే, కార్డు పొందాలంటే ముందుగా డిపాజిట్ చేయడంతో పాటు దాన్ని లాకిన్‌లో ఉంచడం మాత్రం ప్రతికూలమే.

యాప్‌కీ కహానీ...

ఎస్‌బీఐ స్మార్ట్

స్టాక్ మార్కెట్‌లోకి డైరెక్ట్‌గా ఎంట్రీ ఇద్దామనుకుంటున్నారా? షేర్లపై ఇన్వెస్ట్ చేయాలని భావిస్తున్నారా? నచ్చిన స్టాక్స్‌తో ట్రేడింగ్ చేయాలనుకుంటున్నారా? షేర్లను కొని వాటిని భవిష్యత్ అవసరాల కోసం అలాగే అట్టి పెట్టుకుందామనుకుంటున్నారా? అయితే ఇంకేం ఎస్‌బీఐక్యాప్ సెక్యూరిటీస్.. 'ఎస్‌బీఐ స్మార్ట్' యాప్‌ను మార్కెట్‌లోకి తీసుకువచ్చింది. దీన్ని గూగుల్ ప్లేస్టోర్ నుంచి ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.



ప్రత్యేకతలు

- ఇండియన్ ఫైనాన్షియల్ మార్కెట్లకు సంబంధించిన వార్తలను తెలుసుకోవచ్చు.
- లైవ్ రీసెర్చ్ కాల్స్, కోట్స్, మేసేజ్‌లను పొందొచ్చు.
- స్టాక్స్‌ను కొనొచ్చు. విక్రయించొచ్చు. పెండింగ్‌లో ఉన్న ఆర్డర్లను రద్దు చేసుకోవచ్చు.
- రీసెర్చ్ టూల్స్ సాయంతో స్టాక్స్ అనలైజ్ చేయవచ్చు.
- ఫండ్స్‌ను లీన్, అన్‌లీన్ చేసుకోవచ్చు.
- మనకు నచ్చిన మార్కెట్ వాచ్‌లిస్ట్‌ను రూపొందించుకోవచ్చు.
- ఆర్డర్ స్టేటస్‌ను, పొజిషన్లను చెక్ చేసుకోవచ్చు.
- ఎన్ఎస్ఈ, బీఎస్ఈలను ఎప్పటికప్పుడు ట్రాక్ చేయవచ్చు.

ఫైనాన్షియల్ బేసిక్స్

గృహ రుణ బదిలీ ఎప్పుడు బెటరంటే...

గృహ రుణమంటే పెద్ద మొత్తం. వడ్డీ రేట్లలో స్వల్ప తేడా కూడా రుణ గ్రహీతలపై ప్రభావం చూపిస్తుంది. గృహ రుణాన్ని మనం ఒక సంస్థ నుంచి మరో సంస్థకు బదిలీ చేసుకోవచ్చు. దీనికి ముందు కొన్ని అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి.

- మనకు గృహ రుణమిచ్చిన సంస్థ ఆఫర్ చేస్తోన్న వడ్డీరేటు... బదిలీ చేసుకోవాలనుకుంటున్న సంస్థ అందించే వడ్డీ రేటు/మార్కెట్ రేటు కన్నా ఎక్కువగా ఉందని భావిస్తే అప్పుడు రుణాన్ని మార్చుకోవచ్చు.
- అలాగే ఈఎంఐ బరువును తగ్గించుకోవాలని భావించినా రుణాన్ని బదిలీ చేసుకోవచ్చు.
- ఇక 15 ఏళ్ల కాల పరిమితితో రుణం తీసుకొని అందులో పదేళ్లు గడిచిపోయిన తర్వాత గృహ రుణాన్ని బదిలీ చేసుకోవాలని అనుకోవడం తెలివైన ఆలోచన కాదు.



సెబీ చెంతకు

85 కొత్త ఫండ్ స్కీములు



మ్యూచువల్ ఫండ్ స్కీముల్లో రిటైల్ ఇన్వెస్టర్ల పెట్టుబడులు అంతకంతకూ పెరుగుతున్న నేపథ్యంలో మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ చెంతకు ఈ ఏడాది ఇప్పటివరకూ 85 కొత్త స్కీములు పరిశీలనకు వచ్చాయి. మ్యూచువల్ ఫండ్ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీలు... ఈక్విటీ, డెట్, హైబ్రీడ్, ఫిక్స్‌డ్ మెచ్యూరిటీ ప్లాన్ల జారీకి ఈ స్కీము ప్రతిపాదనల్ని సెబీకి సమర్పించాయి. న్యూ ఫండ్ ఆఫర్ల(ఎన్ఎఫ్ఓలు)కోసం సెబీకి దరఖాస్తు చేసిన సంస్థల్లో మహీంద్రా, యాక్సిస్, రిలయన్స్, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్, బిర్లా సన్‌లైఫ్ హెచ్‌డీఎఫ్‌సీ, యూటీఐ, ఎడెల్‌వీజ్, ఎస్‌బీఐలు ఉన్నాయి. వీటిలో కొన్ని ఎన్ఎఫ్ఓలు ఇప్పటికే జారీకాగా, మరికొన్ని అనుమతులు రాగానే ప్రారంభంకానున్నాయి.

హిందీ పేర్లతో...: ఆసక్తికరమైన అంశమేమిటంటే..కొన్ని మ్యూచువల్ ఫండ్స్ జారీచేసే స్కీములకు హిందీ భాషలో పేర్లు పెట్టాయి. ఫండ్ స్కీములకు ఇప్పటివరకూ ఇంగ్లీషులోనే పేర్లు ఉంటుండగా, గ్రామీణ ప్రాంతాల ఇన్వెస్టర్లకు స్కీముల లక్ష్యాలు సులభంగా అర్థమవుతాయన్న ఉద్దేశ్యంతో హిందీ పేర్లతో స్కీముల్ని జారీచేసేందుకు ఫండ్ హౌస్‌లు శ్రీకారం చుట్టాయి. మహీంద్రా మ్యూచువల్ ఫండ్ సెబీకి సమర్పించిన స్కీములకు.. డైనమిక్ బాండ్ బచత్ యోజన, ప్రగతి బ్లూచిప్ యోజన, ఉన్నతి మిడ్ స్మాల్‌క్యాప్ యోజన వంటి పేర్లు ఉన్నాయి.

4.8 కోట్లకు ఫండ్ ఇన్వెస్టర్లు....

మ్యూచువల్ ఫండ్ స్కీముల పట్ల రిటైల్ ఇన్వెస్టర్లు కనపరుస్తున్న అమితాసక్తి కారణంగా కొత్త స్కీముల జారీని ఫండ్ హవుస్‌లు వేగవంతం చేశాయని, ఇటీవల ప్రారంభమైన స్కీములకు మంచి స్పందన లభించిందని పరిశ్రమ వర్గాలు పేర్కొన్నాయి. ఈ ఏడాది జూలై చివరినాటికి మ్యూచువల్ ఫండ్ స్కీముల్లో పెట్టుబడి చేసిన ఇన్వెస్టర్ల సంఖ్య 4.8 కోట్లకు చేరిందని ఆ వర్గాలు పేర్కొన్నాయి.

స్టాక్స్ వ్యూ

క్రెడిట్ ఎనాలసిస్ అండ్ రీసెర్చ్ — కొనొచ్చు

బ్రోకరేజ్ సంస్థ: ఎడిల్‌వీజ్ ఫైనాన్షియల్

ప్రస్తుత ధర: రూ.1,454 **టార్గెట్ ధర:** రూ.1,770

ఎందుకంటే: రేటింగ్ సర్వీసులందజేసే రెండో అతిపెద్ద భారత కంపెనీ ఇది. మాల్దీవులు, హాంగ్‌కాంగ్, నేపాల్, మారిషస్‌లకు కూడా తన సేవలను విస్తరించింది. బ్రెజిల్, పోర్చుగల్, మలేషియా, దక్షిణాఫ్రికా దేశాల్లో రేటింగ్ సర్వీసులందజేయడానికి ఆయా దేశాలకు చెందిన క్రెడిట్ రేటింగ్ ఏజెన్సీలతో ఒప్పందాలు కుదుర్చుకుంది. రీసెర్చ్ సరీ్వసులు కూడా అందిస్తోంది. ప్రొడక్ట్ పోర్ట్‌ఫోలియో సర్వీసుల రంగంలోకి కూడా ప్రవేశించింది. రిస్క్ మేనేజ్‌మెంట్ సర్వీసుల రంగంలోకి కూడా ప్రవేశించనున్నది. భారత్‌లో ఆర్థిక పరిస్థితుల మెరుగుపడుతుండటంతో కార్పొరేట్ డెట్ రేటింగ్స్, బ్యాంక్‌లోన్ రేటింగ్స్‌కు డిమాండ్ పెరుగుతుందని అంచనా. కంపెనీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసిక ఆర్థిక ఫలితాలు అంచనాలకు అనుగుణంగానే ఉన్నాయి. ఆదాయం 7 శాతం వృద్ధి చెందింది. కార్పొరేట్ బాండ్ మార్కెట్ పుంజుకుంటుండటం, ఆర్థిక పరిస్థితులు మెరుగుపడుతుండడం, మౌలిక, గృహ నిర్మాణ రంగాలకు ప్రభుత్వ కేటాయింపులు పెరుగుతుండడం వంటి కారణాల వల్ల రుణ వృద్ధి పుంజుకోగలదని కేర్ అంచనా వేస్తోంది. ఫలితంగా కంపెనీ అమ్మకాలు రెండేళ్లలో 12% చొప్పున చక్రగతిన వృద్ధి చెందగలవని అంచనా. క్యూ1లో కొత్తగా 817 క్లయింట్లు లభించారు. దీంతో మొత్తం క్లయింట్ల సంఖ్య 15,222కు పెరిగింది. రెండేళ్లలో ఇబిటా 13 శాతం చొప్పున చక్రగతిన వృద్ధి సాధిస్తుందని అంచనా. ఈ కంపెనీ రేటింగ్ అంచనాలు తప్పితే కంపెనీ విశ్వసనీయత దెబ్బతినే అవకాశాలు ఉన్నాయి. ఈ కంపెనీ మొత్తం ఆదాయంలో రేటింగ్ ఆదాయం 97 శాతంగా ఉంది. పోటీ కంపెనీలైన క్రిసిల్, ఇక్రాల ఆదాయంలో వివిధీకరణ సాధించాయి. వ్యయాల నియంత్రణ, టెక్నాలజీ వినియోగం కారణంగా ఈ కంపెనీకి నిర్వహణ మార్జిన్లు అధికంగా ఉన్నాయి. కొత్త విభాగాల్లోకి, కొత్త మార్కెట్లలోకి ప్రవేశించడం.. మార్జిన్లపై ప్రతికూల ప్రభావం చూపించవచ్చు.

ఎన్‌బీసీసీ — కొనొచ్చు

బ్రోకరేజ్ సంస్థ: జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్

ప్రస్తుత ధర: రూ.205 **టార్గెట్ ధర:** రూ.227

ఎందుకంటే: ఎన్‌బీసీసీ.ప్రభుత్వ రంగ నవరత్న కంపెనీల్లో ఒకటి. ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీ(పీఎంసీ), ఇంజినీరింగ్ ప్రొక్యూర్‌మెంట్ అండ్ కన్‌స్ట్రక్షన్(ఈపీసీ), రియల్ ఎస్టేట్ వ్యాపారాలను నిర్వహిస్తోంది. ఈ కంపెనీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసిక ఆర్థిక ఫలితాలు అంచనాలకనుగుణంగానే ఉన్నాయి. ఆదాయ వృద్ధి అంతంతమాత్రంగానే ఉన్నప్పటికీ, వ్యయాలు తక్కువగా ఉండడం, ఇబిటా మార్జిన్లు అధికంగా ఉండటంతో నికర లాభం 24% వృద్ధి చెందింది. పీఎంసీ వ్యాపారం 3% పెరగ్గా, రియల్ ఎస్టేట్‌వ్యాపారం 49%, ఈపీసీ వ్యాపారం 10% చొప్పున క్షీణించాయి. ఇబిటా మార్జిన్లు 160 బేసిస్ పాయింట్లు వృద్ధి చెంది 5.1 శాతానికి పెరిగాయి. వడ్డీ వ్యయాలు తగ్గడంతో నికర లాభం 24 శాతం పెరిగింది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఇబిటా మార్జిన్ 7 శాతానికి చేరగలదని అంచనా. పూర్తి చేయాల్సిన ఆర్డర్లు రూ.75వేల కోట్లకు పైగా ఉన్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.25 వేల కోట్ల మేర ఆర్డర్లు వస్తాయని అంచనా. రీడెవలప్‌మెంట్ ఆర్డర్లు భారీగా ఉండటంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో అర్థభాగం నుంచి ఆదాయ వృద్ధి మరింతగా మెరుగుపడగలదని భావిస్తున్నాం. రెండేళ్లలో ఆదాయం 38 శాతం, నికర లాభం 42 శాతం చొప్పున చక్రగతిన వృద్ధి చెందగలవని అంచనా. భారీ ప్రాజెక్టుల అమలులో నైపుణ్యం, పోటీ తక్కువగా ఉండడం, ఆర్డర్ బుక్ భారీగా ఉండడం.. ఇవన్నీ సానుకూలాంశాలు. ఇటీవలనే పది రైల్వే స్టేషన్ల రీడెవలప్‌మెంట్ కాంట్రాక్ట్‌ను ఈ కంపెనీ సాధించింది. రానున్న కొన్నేళ్లలో మరో 40–50 రైల్వే స్టేషన్ల రీడెవలప్‌మెంట్ ప్రాజెక్ట్‌లను సాధించే అవకాశాలున్నాయి. ఒక్కో రైల్వే స్టేషన్ రీడెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ విలువ రూ.400–500కోట్ల రేంజ్‌లో ఉంటుంది. రూ.25,000–40,000 కోట్ల విలువ ఉండే ముంబైలోని ధారవి మురికివాడ రీడెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ కూడా ఈ కంపెనీకే దక్కవచ్చు.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజి సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే.

గతవారం బిజినెస్

లాభాల్లోకి వస్తాం: టాటా మోటార్స్



టాటా మోటార్స్ దేశీ వ్యాపారాన్ని మళ్లీ లాభాల్లోకి మళ్లించడంపై దృష్టి పెడుతున్నట్లు టాటా గ్రూపు చైర్మన్ ఎన్. చంద్రశేఖరన్ చెప్పారు. ముఖ్యంగా సమస్యాత్మక పరిస్థితులతో ప్రతికూల ప్రభావాలెదుర్కొన్న వాణిజ్య వాహనాల విభాగంపై మరింతగా కసరత్తు చేయనున్నట్లు తెలియజేశారు. పెద్ద నోట్ల రద్దు, జీఎస్‌టీ అమలుతో పాటు బీఎస్–3 నుంచి బీఎస్–4 ప్రమాణాలకు మారాల్సిందేనన్న సుప్రీం కోర్టు ఆదేశాలు వంటి వాటితో వాణిజ్య వాహనాల వ్యాపారం పలు సవాళ్లు, అనిశ్చితి పరిస్థితిని ఎదుర్కొనాల్సి రావడమే ఇందుకు కారణమని చెప్పారు.

ఉబెర్ రైడ్స్‌కు యూపీఐ ద్వారా చెల్లింపు

ఉబెర్ తాజాగా తన ప్లాట్‌ఫామ్‌కు యూపీఐ సేవలను అనుసంధానించింది. దీని కోసం నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ), యాక్సిస్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లతో భాగస్వామ్యం కుదుర్చుకుంది. దీంతో ఉబెర్ ప్లాట్‌ఫామ్‌లో రిజిస్టర్ అయిన 4.5 లక్షలకుపైగా డ్రైవర్లు యూపీఐ ద్వారా పేమెంట్స్‌ను స్వీకరించొచ్చు. అంటే మనం కూడా ఉబెర్ రైడ్స్‌కు అయిన మొత్తాన్ని యూపీఐ ద్వారా చెల్లించొచ్చు.

ఎయిరిండియా ఆస్తుల విక్రయం షురూ!

ప్రభుత్వ రంగ విమానయాన సంస్థ ఎయిరిండియా... దేశవ్యాప్తంగా తనకున్న ఆస్తుల్లో కొన్నింటిని అమ్మకానికి పెట్టింది. సంస్థకు వివిధ ప్రాంతాల్లో ఉన్న 27 రెసిడెన్షియల్ ఫ్లాట్లు, విల్లాలు, కమర్షియల్ ఫ్లాట్లు, స్థలాలు, ఆఫీసు భవంతులను అమ్మకానికి పెట్టారు. ఈ విక్రయం ద్వారా రూ. 500 కోట్లు సమకూరుతాయని సంస్థ భావిస్తోంది. ప్రభుత్వ రంగ సంస్థ ఎంఎస్‌టీసీ ఈ ఆస్తులకు ఈ–వేలం నిర్వహించనుండగా... బిడ్ల దాఖలుకు చివరి తేదీని సెప్టెంబర్ 6గా నిర్ణయించారు.

కారు రుణాలపై ప్రాసెసింగ్ ఫీజు మాఫీ



ఎస్‌బీఐ పరిమిత కాలానికి కారు, బంగారం, వ్యక్తిగత రుణాలపై ప్రాసెసింగ్ ఫీజు నుంచి నూటికి నూరు శాతం మినహాయింపునిస్తోంది. గృహ రుణాల టేకోవర్‌పై ఈ తరహా ఆఫర్ ఇస్తున్నట్లు వివరించింది. ఈ ఏడాది డిసెంబర్ 31 దాకా కారు లోన్స్‌పై 100% ప్రాసెసింగ్ ఫీజు మాఫీ చేసినట్లు పేర్కొంది. అక్టోబర్ 31 దాకా బంగారం రుణాలపై 50% మేర మినహాయింపు కల్పిస్తున్నట్లు తెలిపింది. సెప్టెంబర్ 30 దాకా వ్యక్తిగత రుణాలకు సంబంధించి ఎక్స్‌ప్రెస్ క్రెడిట్ స్కీముపై 50% మేర ప్రాసెసింగ్ ఫీజు మాఫీ చేసినట్లు పేర్కొంది.

సొంతగూటికి నీలేకని



ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నీలేకని సొంత గూటికి తిరిగొచ్చారు. ఇతర సహ వ్యవస్థాపకులు, ఇన్వెస్టర్ల ఒత్తిడికి తలొగ్గి కంపెనీ కొత్త చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టేందుకు అంగీకరించారు. ఇప్పటిదాకా చైర్మన్‌గా ఉన్న ఆర్ శేషసాయి స్థానంలో ఆయన బాధ్యతలు చేపడతారు. నాన్ ఎగ్జిక్యూటివ్, నాన్ ఇండిపెండెంట్ డైరెక్టరుగా కూడా వ్యవహరిస్తారు. ఇక రవి వెంకటేశన్ సహచైర్మన్ పదవికి రాజీనామా చేశారు. ఆయన ఇకపై స్వతంత్ర డైరెక్టర్‌గా కొనసాగుతారు. వైస్ చైర్మన్‌గా కొనసాగుతున్న విశాల్ సిక్కా.. బోర్డు నుంచి కూడా తప్పుకున్నారు. మరో ఇద్దరు స్వతంత్ర డైరెక్టర్లు జెఫ్రీ ఎస్ లేమాన్, జాన్ ఎచ్‌మెండీ బోర్డు నుంచి వైదొలిగారు. తాత్కాలిక సీఈవోగాను, ఎండీగాను యూబీ ప్రవీణ్ రావు కొనసాగుతారు.

బ్యాంకుల విలీన ప్రక్రియ వేగవంతం

పటిష్టమైన, భారీ బ్యాంకుల ఏర్పాటు దిశగా మరిన్ని ప్రభుత్వ రంగ బ్యాంకుల (పీఎస్‌బీ) విలీన ప్రక్రియను కేంద్రం వేగవంతం చేసింది. విలీన ప్రతిపాదనలను పరిశీలించి, సత్వర నిర్ణయాలు తీసుకునేలా ప్రత్యామ్నాయ యంత్రాంగం (ఏఎం) ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఏఎం ఏర్పాటు యోచన ద్వారా పీఎస్‌బీల విలీనానికి కేంద్ర కేబినెట్ సూత్రప్రాయంగా ఆమోదముద్ర వేసినట్లు ప్రభుత్వం ఒక ప్రకటనలో పేర్కొంది. విలీనానికి సంబంధించి ఆయా పీఎస్‌బీల బోర్డుల నుంచి వచ్చే ప్రతిపాదనలను ఏఎం పరిశీలిస్తుందని ఆర్థిక మంత్రి జైట్లీ పేర్కొన్నారు.

మార్కెట్‌లోకి రూ.200 నోట్లు

ఆర్‌బీఐ తొలిసారిగా రూ.200 నోట్లను మార్కెట్‌లోకి తీసుకువచ్చింది. తక్కువ డినామినేషన్ కరెన్సీకి ఉన్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని రూ.200 నోట్లను చెలామణిలోకి తెచ్చినట్లు బ్యాంక్ పేర్కొంది. ఆర్‌బీఐ గవర్నర్ ఉర్జిత్ పటేల్ సంతకం కలిగిన ఈ నోట్లు ప్రకాశవంతమైన పసుపు రంగులో, సాంచీ స్థూపంతో, మహాత్మా గాంధీ నూతన సిరీస్‌లో ఉంటాయని తెలిపింది.

26 శాతం పెరిగిన 'మైక్రో' రుణాలు



సూక్ష్మ రుణ సంస్థల (ఎంఎఫ్ఐ) రుణ మంజూరీలు 2017 తొలి త్రైమాసికంలో (ఏప్రిల్–జూన్) 26 శాతం ఎగసి రూ.35,045 కోట్లకు పెరిగాయి. గత ఏడాది ఇదే కాలంలో ఈ మొత్తం రూ. 27,921 కోట్లు. 2017 జూన్ 30వ తేదీతో ముగిసిన త్రైమాసికంలో 2.08 కోట్ల మందికి సూక్ష్మ రుణ మంజూరీలు జరిగాయి. గత ఏడాది ఇదే కాలంలో పోల్చితే ఈ సంఖ్య 19 శాతం పెరిగింది.

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 'డిజిపీవోఎస్ మెషీన్లు'



హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్.. ఆల్‌ఇన్‌వన్ 'డిజిపీవోఎస్ మెషీన్'లను మార్కెట్‌లోకి తీసుకువచ్చింది. వీటి ద్వారా పలు రకాల డిజిటల్ పేమెంట్ చెల్లింపులను నిర్వహించవచ్చు. 'ఒక వర్తకుడు డిజిపీవోఎస్ మెషీన్ ద్వారా డెబిట్/క్రెడిట్ కార్డు స్వైపింగ్‌తోపాటు యూపీఐ, భారత్ క్యూఆర్, ఎస్ఎంఎస్ పే, పేజాప్, ట్యాప్ అండ్ పే వంటి పలు డిజిటల్ పేమెంట్ సర్వీసులను పొందొచ్చు' అని బ్యాంక్ తెలిపింది.

డీల్స్..



- అమెరికాకు చెందిన సాఫ్ట్‌వేర్ సేవల సంస్థ ఈబిక్స్.. యూఫస్ట్ మనీ ఎక్స్‌ప్రెస్‌లో భాగమైన నగదు బదిలీ సేవల విభాగాన్ని కొనుగోలు చేయనుంది. ఇందుకు ఎంత చెల్లిస్తున్నదీ వెల్లడించలేదు. ఫైనాన్షియల్ టెక్నాలజీ సేవలు అందించే ఇట్జ్‌క్యాష్ కార్డ్‌కి ఈబిక్స్ మాతృసంస్థ.
- హెచ్‌సీఎల్ ఇన్ఫోసిస్టమ్స్ ఇక నుంచి యాపిల్ ప్రొడక్ట్స్‌ను డిస్ట్రిబ్యూట్ చేయనుంది. ఐఫోన్ సహా ఇతర యాపిల్ ఉత్పత్తులను భారత మార్కెట్‌లో డిస్ట్రిబ్యూట్ చేస్తామని హెచ్‌సీఎల్ ఇన్ఫోసిస్టమ్స్ ప్రకటించింది. ఈ విషయానికి సంబంధించి యాపిల్ ఇండియాతో ఒక ఒప్పందం కుదుర్చుకున్నామని పేర్కొంది.
- రుణభారంతో సతమతం అవుతున్న ఎస్సార్ గ్రూపు తన పరిధిలోని ఎస్సార్ ఆయిల్‌ను రష్యాకు చెందిన రాస్‌నెఫ్ట్‌కు విక్రయించింది. ఎస్సార్ ఆయిల్, దాని పరిధిలోని పోర్టు, విద్యుత్తు, రిటైల్ ఆస్తులను రాస్‌నెఫ్ట్‌తోపాటు ఇతర ఇన్వెస్టర్ల కన్సార్టియం 12.9 బిలియన్ డాలర్లు (రూ.82,500 కోట్లు) చెల్లించి సొంతం చేసుకున్నాయి. దేశంలోకి వచ్చిన అతిపెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి ఇదే.
- వైద్య సేవల రంగంలో ఉన్న మ్యాక్స్‌క్యూర్ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్‌లో యూరప్ సంస్థ మెడికవర్ 22 శాతం వాటా చేజిక్కించుకుంది. ఇందుకోసం రూ.100 కోట్లు వెచ్చించింది.
- విమానయాన సంస్థలు విస్తారా, ఖతర్ ఎయిర్‌వేస్.. ఇంటర్‌లైన్ భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకున్నాయి. దీంతో ఇరు సంస్థల ప్రయాణికులు నిరాటంకంగా గమ్యం చేరుకునేందుకు దోహదపడే థ్రూ చెకిన్ సదుపాయం అందుబాటులోకి వచ్చింది.
- ఇంటిగ్రేటెడ్ వీసా ప్రాసెసింగ్ సొల్యూషన్స్ సంస్థ టీటీ సర్వీసెస్ (టీటీఎస్)ను ఔట్‌సోర్సింగ్ మరియు టెక్నాలజీ సర్వీసెస్ కంపెనీ వీఎఫ్ఎస్ గ్లోబల్ చేజిక్కించుకుంది.
- మ్యాన్‌కైండ్ ఫార్మాస్యూటికల్స్‌కు చెందిన ప్రెగ్నెన్సీ డిటెక్షన్ కిట్ 'ప్రెగా న్యూస్' తాజాగా విమానయాన సంస్థ స్పైస్‌జెట్‌తో భాగస్వామ్యం కుదుర్చుకుంది. గర్భిణి స్త్రీలకు విమాన ప్రయాణాన్ని మరింత సౌకర్యవంతంగా మార్చడం ఈ ఒప్పందం ముఖ్య ఉద్దేశం. భాగస్వామ్యంలో భాగంగా స్పైస్‌జెట్ గర్భిణి స్త్రీలకు ప్రత్యేకమైన సదుపాయాలను కల్పించనుంది.
- అమెజాన్‌కు చెక్ పెట్టేందుకు టెక్నాలజీ దిగ్గజం 'గూగుల్', ప్రపంచ అతిపెద్ద రిటైలర్ 'వాల్‌మార్ట్' చేతులు కలిపాయి. ఈ ఒప్పందం వల్ల వినియోగదారులు వాల్‌మార్ట్ ఉత్పత్తులను గూగుల్ ఆన్‌లైన్ షాపింగ్ మాల్ గూగుల్ ఎక్స్‌ప్రెస్‌లో కొనుగోలు చేయవచ్చు. అయితే ఈ సేవలు వచ్చే నెలలో అందుబాటులోకి వస్తాయి. అలాగే కస్టమర్లు గూగుల్ అసిస్టెంట్, గూగుల్ హోమ్‌కు వాయిస్ కంట్రోల్ ఇవ్వడం ద్వారా కూడా షాపింగ్ చేయొచ్చు.

ఆటో మొబైల్స్






- దక్షిణ కొరియాకు చెందిన వాహన తయారీ కంపెనీ 'హ్యుందాయ్'.. 'వెర్నా'లో కొత్త వెర్షన్‌ను (ఐదో జనరేషన్) మార్కెట్‌లోకి తీసుకువచ్చింది. దీని ప్రారంభ ధర రూ.7.99 లక్షలుగా (ఎక్స్ షోరూమ్ ఢిల్లీ) ఉంది.
- దేశీ మొబైల్ హ్యాండ్‌సెట్స్ తయారీ కంపెనీ 'మైక్రోమ్యాక్స్'.. 'కాన్వాస్ ఇన్‌ఫినిటీ' స్మార్ట్‌ఫోన్‌ను మార్కెట్‌లో ఆవిష్కరించింది. దీని ధర రూ.9,999.
- ఆటోమొబైల్ సంస్థ యమహా.. 250 సీసీ సామర్థ్యంతో ఫేజర్ 25 మోటార్‌సైకిల్‌ను భారత మార్కెట్లో ఆవిష్కరించింది. దీని ధర రూ.1.28 లక్షలు (ఎక్స్‌షోరూమ్ ముంబై)గా ఉంది.
- మొబైల్ హ్యాండ్‌సెట్స్ తయారీ కంపెనీ 'వీడియోకాన్ మొబైల్'.. 'మెటల్ ప్రొ 2' స్మార్ట్‌ఫోన్‌ను మార్కెట్‌లోకి తీసుకువచ్చింది. దీని ధర రూ.6,999గా ఉంది.



బిజినెస్

> ఏ పనిలోనైనా అత్యుత్తమ ప్రదర్శనను చూపించు...
> అప్పుడు ఒక విజయం మరొక విజయానికి పునాదిగా నిలుస్తుంది.
> – స్టీవ్ జాబ్స్



34 ఏళ్లు.. 15 స్టోర్లు
10,700 కోట్ల టర్నోవర్



చైర్మన్ ఎం. కిరణ్‌కుమార్

తెలంగాణలో అడుగుపెట్టిన లలితా జ్యుయలరీ

- సోమాజిగూడలో భారీ షోరూమ్‌తో రంగంలోకి
- 1983లో తమిళనాడులో షోరూమ్‌తో ఆరంభం
- ఇపుడు తమిళనాడు, పాండిచ్చేరి, కర్ణాటక, ఏపీల్లో
- త్వరలో విజయవాడ, రాజమండ్రిలో షోరూమ్‌లు
- తరుగు లేకుండా, తక్కువ ధరలకే: ఛైర్మన్ కిరణ్‌కుమార్
- ఈ ప్రత్యేక నియమాలే తమను నిలబెట్టాయని వ్యాఖ్య



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:

తమిళనాడు, పాండిచ్చేరి, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో విస్తరించిన లలితా జ్యుయలరీ మార్ట్... అత్యంత భారీ షోరూమ్‌తో తెలంగాణలో అడుగుపెట్టింది. హైదరాబాద్‌లోని సోమాజిగూడ సర్కిల్‌లో 1.3 లక్షల చదరపుటడుగుల్లో ఏర్పాటయిన లలితా జ్యుయలరీ షోరూమ్... ఆదివారం అట్టహాసంగా ఆరంభమయింది. 1983లో తమిళనాడులో ఒక షోరూమ్‌తో మొదలైన లలితా జ్యుయలరీ... ఇపుడు ఒక్క తమిళనాడులోనే తొమ్మిది భారీ షోరూమ్‌లతో పాటు... పాండిచ్చేరిలో ఒకటి, బెంగళూరులో రెండు, తిరుపతి, విశాఖపట్నంలలో తలా ఒకటి చొప్పున మెగా షోరూమ్‌లను నిర్వహిస్తోంది. హైదరాబాద్‌తో షోరూమ్‌ల సంఖ్య 15కు చేరినట్లయింది. ''బంగారం, వజ్రాలు, వెండి, ప్లాటినం ఆభరణాలను తయారీ ధరకే అందిస్తున్నాం. అంతేకాదు! తరుగును ఇంకా ఇంకా తగ్గించటంపై మేం నిరంతరం శ్రమిస్తున్నాం. అందుకే 1 నుంచి 9 శాతం తరుగుకే నగలను విక్రయించగలుగుతున్నాం. వజ్రాభరణాల తరుగు క్యారెట్‌కు రూ.975 మాత్రమే. వెండికి తరుగే లేదు. బంగారు ఆభరణాలకు బీఐఎస్916 హాల్‌మార్క్ సర్టిఫికెట్‌ను, వజ్రాభరణాలకు అంతర్జాతీయ స్థాయి గుర్తింపు సర్టిఫికెట్‌ను కూడా అందజేస్తున్నాం'' అని షోరూమ్ ఆరంభం సందర్భంగా లలితా జ్యుయలరీ మార్ట్ ఎండీ, చైర్మన్ ఎం.కిరణ్‌కుమార్ వ్యాఖ్యానించారు. తమ సంస్థ వార్షిక టర్నోవర్ రూ.10,700 కోట్ల వరకూ ఉందని, త్వరలో విజయవాడ, రాజమండ్రిలో కూడా షోరూమ్‌లు ఏర్పాటు చేస్తున్నామని ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు. ''తక్కువ తరుగు, బయటికి చెప్పని చార్జీలు వడ్డించకపోవటం, సరసమైన ధర వంటివి మా నియమాలు. వీటిని పాటిస్తుండటం వల్లే ఈ స్థాయికి చేరుకున్నాం'' అని ఆయన వివరించారు.




వజ్రాభరణాలకు పలు జాగ్రత్తలు



వజ్రాభరణాలు కొనేవారు దానికి షోరూమ్ ఇచ్చే సొంత సర్టిఫికెట్ కాకుండా అంతర్జాతీయ స్థాయి సర్టిఫికెట్‌ను తప్పనిసరిగా తీసుకోవాలని కిరణ్‌కుమార్ స్పష్టంచేశారు. వజ్రాల రంగు, కట్, క్యారెట్, క్లారిటీ తదితరాలన్నీ సర్టిఫికెట్లో ఉంటాయని తెలియజేశారు. హైదరాబాద్ షోరూమ్ ఆరంభం సందర్భంగా పరిమిత కాలం పాటు అన్ని వజ్రాభరణాలకూ క్యారెట్‌పై రూ.2వేల వరకూ తగ్గింపు అందజేస్తున్నట్లు తెలిపారు. బంగారం తరుగులోనూ 1 శాతం రాయితీ ఇస్తున్నామన్నారు.

బంగారం నగలకు రెండు స్కీమ్‌లు...



- 'స్వర్ణ ఉదయం' పేరిట లలితా జ్యుయలరీ అందిస్తున్న స్కీమ్ వ్యవధి 11 నెలలు. దీన్లో తొలి నెల వాయిదా పూర్తిగా ఉచితం. మిగిలిన 10 నెలలు చెల్లించాక తగిన నగలు పొందొచ్చు. అంతేకాక ఈ స్కీమ్‌లో భాగంగా కొనుగోలు చేసే నగలకు తరుగు లేదని కూడా ప్రకటించింది.
- 'అడ్వాన్స్ నగల బుకింగ్ స్కీమ్'లో కూడా నగలు కొనేటపుడు తరుగు లేదని సంస్థ తెలిపింది. "ఒకసారి నగదు చెల్లించి 7 నెలల తరవాత తరుగు లేకుండా మీకు నచ్చిన నగలు కొనుగోలు చేయొచ్చు. 7 శాతం తరుగు ఉన్న నగలను 7 నెలల తరవాత, 8 శాతం తరుగున్న నగనలు 8 నెలల తరవాత తరుగు లేకుండా కొనొచ్చు. అంతకన్నా ఎక్కువ తరుగుంటే ఆ వ్యత్యాసం చెల్లించాల్సి ఉంటుంది. ఈ స్కీమ్‌లో మరో ప్రత్యేకత ఏంటంటే పాత నగలు ఇచ్చి కూడా దీన్లో చేరొచ్చు.



ధరలు పోల్చి నగలు కొనొచ్చు!

ఏ షాపులోనైనా బంగారం కొనేటపుడు సదరు నగను ఫొటో తీసుకుని మరో షాపులో చూపిస్తామంటే ససేమిరా అంగీకరించరు. లలితా జ్యులయరీ మాత్రం దీన్నే ఓ చాలెంజ్ స్థాయికి తీసుకెళ్లింది. తాము నగలు కొనేముందు ఎస్టిమేట్ స్లిప్ ఇస్తామని, నగ ఫొటోను కూడా తీసుకోవచ్చని తెలిపింది. ''ఆ ఫొటోను, నగను ఇతర షోరూమ్‌లలో ఎక్కడైనా చూపించొచ్చు. ఎక్కడ తక్కువ ధరకు దొరుకుతుందో అక్కడే కొనొచ్చు. ఇంత ధైర్యంగా ఈ చాలెంజ్‌ను ఎందుకు స్వీకరించామంటే ఎవ్వరూ మాకన్నా తక్కువ ధరకు విక్రయించలేరన్న మా నమ్మకమే కారణం'' అని 'సాక్షి' బిజినెస్ బ్యూరో ప్రతినిధితో కిరణ్ కుమార్ వ్యాఖ్యానించారు. ''కొందరు ఉచిత ఆఫర్లు చూసి మోసపోవటం, స్కీమ్ అనగానే చేరిపోవటం, బిల్లు – ట్యాక్స్ లేదంటే వెంటనే ఒప్పేసుకోవటం చేస్తుంటారు. అలా చేయొద్దనేది నా అభ్యర్థన. తరుగుకు ఎంత చెల్లిస్తున్నామో చూసుకోవటంతో పాటు బిల్లులో అన్ని అంశాలూ ఉన్నాయో లేదో కూడా గమనించాలి. నగ బరువు, ఆ రోజు బంగారం ధర, తరుగు చార్జీలు, రాళ్ల ధర వంటివన్నీ బిల్లులో ఉండాలి. అప్పుడే మీ డబ్బుకు తగ్గ విలువైన బంగారాన్ని సొంతం చేసుకుంటారు'' అని వివరించారు.

పీఎఫ్ ఖాతాల్లోకే ఈటీఎఫ్ యూనిట్లు...!

ఈపీఎఫ్‌ఓ యోచన



న్యూఢిల్లీ: ఎక్స్ఛేంజ్ ట్రేడింగ్ ఫండ్స్ (ఈటీఎఫ్‌లు)లో ప్రావిడెంట్ ఫండ్ సంస్థ ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్‌ఓ) చేసే పెట్టుబడుల ద్వారా వచ్చే యూనిట్లను నేరుగా ప్రావిడెంట్ ఖాతాల్లో జమచేయాలని ఈపీఎఫ్‌ఓ యోచిస్తోంది. దాంతో ఈపీఎఫ్‌ఓ చందాదారులు అడ్వాన్సుల్ని తీసుకునే సమయంలో ఈ యూనిట్లను రీడీమ్ చేసుకునే వెసులుబాటు వుంటుందని ఈపీఎఫ్‌ఓ భావిస్తోంది. ఈటీఎఫ్ యూనిట్లను ఖాతాల్లో జమచేసే అంశమై కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) అభిప్రాయాల్ని ఈపీఎఫ్‌ఓ కోరింది. కాగ్ త్వరలోనే అభిప్రాయాల్ని వెల్లడిస్తుందని తాము భావిస్తున్నట్లు సెంట్రల్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ వీపీ జాయ్ చెప్పారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేటప్పటికి ఈటీఎఫ్‌ల్లో ఈపీఎఫ్‌ఓ పెట్టుబడులు రూ. 45,000 కోట్లకు చేరతాయని అంచనా. కాగ్ అభిప్రాయాలు అందిన తర్వాత ఈ ప్రతిపాదన కార్మిక మంత్రిత్వ శాఖ నేతృత్వంలోని ఈపీఎఫ్‌ఓ ట్రస్టీల బోర్డు ముందుకు వెళుతుంది. ట్రస్టీల బోర్డు సమావేశం వచ్చే నెలలో జరగవచ్చు. ఈపీఎఫ్‌ఓ పెట్టుబడి చేసే నిధుల్లో 5 శాతం ఈటీఎఫ్‌ల్లో 2015 ఆగస్టు నుంచి ఇన్వెస్ట్ చేయడం ప్రారంభించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఈ మొత్తాన్ని 15 శాతానికి పెంచారు.

కార్లపై జీఎస్‌టీ సెస్ పెంపుపై ఈ వారంలో ఆర్డినెన్స్!



న్యూఢిల్లీ: పెద్ద కార్లు, ఎస్‌యూవీలు, మిడ్‌సైజ్ కార్లపై జీఎస్‌టీ సెస్‌ను 15 శాతం నుంచి 25 శాతానికి పెంచేందుకు ఆర్డినెన్స్ జారీ ప్రతిపాదనపై ఈ వారంలో కేంద్ర కేబినెట్ నిర్ణయం తీసుకోనుంది. జూలై 1 నుంచి జీఎస్‌టీ అమల్లోకి వచ్చిన తర్వాత ఆయా కార్ల ధరలు తగ్గినందున, వీటిపై సెస్‌ను పెంచే ప్రతిపాదనకు జీఎస్‌టీ కౌన్సిల్ ఆగస్టు 5న ఆమోదం తెలిపింది. అయితే సెస్ పెంపునకు జీఎస్‌టీ చట్టం సెక్షన్ 8లో సవరణలు చేయాల్సివుంటుంది. అందుచేత ఈ సవరణకు అవసరమయ్యే ఆర్డినెన్స్ జారీపై వచ్చే కొద్దిరోజుల్లో కేబినెట్ నిర్ణయం తీసుకుంటుందని కేంద్ర ఆర్థిక శాఖ ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. సెస్ పెంపుపై నిర్ణయం తీసుకునేముందు...రోడ్డు రవాణా, భారీ పరిశ్రమల శాఖల అభిప్రాయాల్ని పరిగణనలోకి తీసుకోనున్నట్లు ఆయన తెలిపారు. ఆర్డినెన్స్ జారీ తర్వాత ఆరునెలలలోపుగా చట్ట సవరణకు పార్లమెంటు ఆమోదం పొందాల్సివుంటుంది. తదుపరి సెస్ పెంపును ఎప్పటి నుంచి అమలు చేయాలన్న నిర్ణయాన్ని జీఎస్‌టీ కౌన్సిల్ తీసుకుంటుందని ఆ అధికారి వివరించారు. జీఎస్‌టీ కౌన్సిల్ తదుపరి భేటీ హైదరాబాద్‌లో సెప్టెంబర్ 9న జరుగుతుంది.

టాప్-10లో 7 మారుతీ కార్లే..



న్యూఢిల్లీ: జూలై నెల కార్ల అమ్మకాలకు సంబంధించి టాప్–10 ప్యాసింజర్ వాహనాల్లో మారుతీ సుజుకీవే 7 మోడల్స్ ఉన్నాయి. సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ మాన్యుఫాక్చరర్స్ (సియామ్) విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం జూలై నెలలో ప్యాసింజర్ వాహన విక్రయాల్లో మారుతీ ఆల్టో అగ్రస్థానంలో నిలిచింది. 25,009 ఆల్టోల విక్రయాలు జరగ్గా, 19,153 యూనిట్లతో ప్రీమియం హ్యాచ్‌బ్యాక్ బాలెనో ద్వితీయస్థానాన్ని ఆక్రమించింది. వేగన్ ఆర్ 16,301 యూనిట్ల అమ్మకాలతో తృతీయస్థానంలో నిలిచింది. 15,243 యూనిట్ల విక్రయాలతో విటారా బ్రెజా, 13,738 యూనిట్లతో స్విఫ్ట్ తదుపరి స్థానాల్లో నిలిచాయి. హ్యుందాయ్ హ్యాచ్‌బ్యాక్ మోడల్ గ్రాండ్ ఐ 10 ఆరో స్థానంలో (12,002 యూనిట్లు), హ్యుందాయ్ ఎలైట్ ఐ 20 (11,390 యూనిట్లు), 6,7వ స్థానాల్ని సంపాదించగా, మారుతీ డిజైర్ 11,187 యూనిట్లతో 8వ స్థానంలోనూ, ఇదే కంపెనీకి చెందిన హ్యాచ్‌బ్యాక్ సెలెరియో 9వ స్థానంలో (11,087 యూనిట్లు) ఉన్నాయి. హ్యుందాయ్ ఎస్‌యూవీ క్రెటా 10,556 యూనిట్లతో 10వ స్థానంలో ఉంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్/100కు రూ.లలో) 28-8-2017

విశాఖ	362-00
చిత్తూరు	390-00
వరంగల్	357-00
ముంబై	400-00
చెన్నై	397-00
విజయవాడ	359-00
గోదావరి	359-00
నమక్కల్	387-00
27-8-2017 ఫామ్ ధర...	
హైదరాబాద్	355-00
రిటైల్ (ఒక గుడ్డుకు)	4.15
బెంగళూరు	382-00
ఢిల్లీ	355-00
కోల్‌కతా	394-00

ఒడిదుడుకుల వారం

- ఆగస్టు సిరీస్ ఎఫ్ అండ్ ఓ ముగింపు ఈ వారంలోనే
- క్యూ1 జీడీపీ గణాంకాలపై మార్కెట్ దృష్టి
- నీలేకని రీఎంట్రీతో అందరి చూపూ ఇన్ఫోసిస్‌పైనే



ముంబై: ఈ వారం స్టాక్ మార్కెట్ తీవ్రమైన ఒడిదుడుకులకు గురవుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఆగస్టు సిరీస్ డెరివేటివ్ కాంట్రాక్టులు ఈ వారంలోనే ముగియనుండటం, జీడీపీ, పీఎంఐ గణాంకాలు వెలువడుతున్నందున స్టాక్‌సూచీలు తీవ్రమైన హెచ్చు తగ్గులకు లోనవుతాయని వారంటున్నారు. వీటికి తోడు విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడుల సరళి, అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరల గమనం, డాలర్‌తో రూపాయి మారకం కదలికలు, ప్రపంచ స్టాక్‌మార్కెట్ల పోకడ.. తదితర అంశాలు కూడా స్టాక్ మార్కెట్ గమనాన్ని నిర్దేశిస్తాయని విశ్లేషకులంటున్నారు.

ఈ ఏడాది ఏప్రిల్–జూన్ క్వార్టర్(క్యూ1) జీడీపీ గణాంకాలను ఈ నెల 31న(గురువారం–ఇదే రోజు ఆగస్టు సిరీస్ ఎఫ్ అండ్ ఓ కాంట్రాక్టులు కూడా ముగుస్తాయి)మార్కెట్ ముగిసిన తర్వాత ప్రభుత్వం వెల్లడిస్తుంది. మార్కెట్ దృష్టి ఈ గణాంకాలపైన ఉంటుందని కోటక్ సెక్యూరిటీస్ వైస్ ప్రెసిడెంట్(పీసీజీ) టీనా వీర్మాణి చెప్పారు. కొత్త సీఈఓ ఎంపిక విషయమై ఇన్ఫోసిస్ యాజమాన్యం తీసుకునే చర్యలను ఇన్వెస్టర్లు నిశితంగా పరిశీలిస్తారని వివరించారు. ఇక శుక్రవారం (వచ్చే నెల 1న) తయారీ రంగానికి చెందిన పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్(పీఎంఐ) గణాంకాలు వస్తాయి. వివిధ దేశాల కేంద్ర బ్యాంక్‌ల అధినేతల(జాక్సన్ హోల్) సమావేశ ఫలితాలు కూడా కీలకమేనని పేర్కొన్నారు. కాగా ఎలాంటి తాజా ట్రిగ్గర్‌లు లేనందున మార్కెట్ పరిమిత శ్రేణిలోనే కదలాడే అవకాశాలున్నాయని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ చెప్పారు. గత క్వార్టర్లో మంచి ఫలితాలు సాధించిన రంగాలు, కంపెనీలపై ఇన్వెస్టర్లు దృష్టి సారిస్తారని ఆయన అభిప్రాయపడుతున్నారు. ఇన్ఫోసిస్ కంపెనీ ఛైర్మన్‌గా మళ్లీ నందన్ నీలేకని పగ్గాలు చేపట్టడంతో ఇన్ఫీపై అందరి చూపూ ఉంటుందని వివరించారు.

రూ.12వేల కోట్ల ఈక్విటీ పెట్టుబడులు వెనక్కి...

మన ఈక్విటీ మార్కెట్ నుంచి విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ రెండో వారం కూడా కొనసాగింది. తయారీ, సేవా రంగాలు మందగించడం, ఈ క్యూ1లో కంపెనీల ఆర్థిక ఫలితాలు అంతంత మాత్రంగానే ఉండటం ప్రతికూల ప్రభావం చూపాయి. దీంతో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐ) ఈ నెలలో ఇప్పటివరకూ స్టాక్ మార్కెట్ నుంచి రూ.12,626 కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు. అయితే డెట్ మార్కెట్లో మాత్రం రూ.13,000 కోట్ల మేర పెట్టుబడులు పెట్టారు.

కీలకస్థాయి 31,940

మార్కెట్ పంచాంగం

రెండు వారాల క్రితం అతిపెద్ద కరెక్షన్ చోటుచేసుకున్నందున..వరుసగా రెండోవారం భారత్ సూచీల రిలీఫ్ ర్యాలీ కొనసాగింది. కానీ ప్రపంచ మార్కెట్లు వివిధ అంశాల కారణంగా హెచ్చుతగ్గులకు లోను కావడం, బ్రెజిల్ మినహా మరే ఇతర ప్రధాన దేశపు సూచీలు కొత్త గరిష్టస్థాయిని చేరలేకపోవడం, మరోవైపు రిస్క్ సమయాల్లో రక్షణ ఇచ్చే సాధనంగా భావించే బంగారం ధర 1,300 డాలర్ల సమీపంలో ట్రేడ్ కావడం వంటి అంశాలు..భారత్‌తో సహా ప్రపంచ మార్కెట్లన్నీ మరింతగా కరెక్షన్‌కు లోనుకావొచ్చన్న సంకేతాల్ని వెలువరిస్తున్నాయి. అయితే బ్రెజిల్‌కు తోడుగా మరిన్ని దేశాల సూచీలు కొత్త గరిష్టస్థాయిని చేరగలిగితే..భారత్ మార్కెట్ కూడా మరికొద్ది వారాల్లో ఆ ఫీట్‌ను సాధించే అవకాశం వుంటుంది. ఇక సూచీల సాంకేతికాల విషయానికొస్తే...

సెన్సెక్స్ సాంకేతికాలు



ఆగస్టు 24తో ముగిసిన నాలుగు రోజుల ట్రేడింగ్ వారంలో బీఎస్‌ఈ సెన్సెక్స్ 31,221–31,678 పాయింట్ల కనిష్ట, గరిష్టస్థాయిల మధ్య హెచ్చుతగ్గులకు లోనై, చివరకు అంతక్రితంవారంతో పోలిస్తే 71 పాయింట్ల స్వల్పలాభంతో 31,596 పాయింట్ల వద్ద ముగిసింది. ఈ సోమవారం మార్కెట్ గ్యాప్‌అప్‌తో మొదలైతే 31,730 పాయింట్ల వద్ద తక్షణ అవరోధం ఏర్పడుతున్నది. ఈ స్థాయిపైన స్థిరపడితే ప్రస్తుతం మార్కెట్లో జరుగుతున్న రిలీఫ్ ర్యాలీ మరింతగా కొనసాగే ఛాన్స్ వుంటుంది. ఆపైన 31,940 పాయింట్ల స్థాయిని అందుకోవొచ్చు. రానున్న రోజుల్లో ఈ స్థాయి సెన్సెక్స్‌కు కీలకం. మళ్లీ కొత్త రికార్డుస్థాయికి చేరాలంటే ఈ స్థాయిని అధిక ట్రేడింగ్ పరిమాణంతో ఛేదించాల్సివుంటుంది. ఈ వారం తొలి నిరోధాన్ని దాటలేకపోయినా, గ్యాప్‌డౌన్‌తో మొదలైనా... 31,380 పాయింట్ల సమీపంలో తొలి మద్దతు లభ్యమవుతున్నది. ఈ స్థాయి దిగువన ముగిస్తే 30,960 పాయింట్ల వరకూ తగ్గవచ్చు. ఆలోపున 30,680 పాయింట్లస్థాయికి క్షీణించే ప్రమాదం వుంటుంది.

నిఫ్టీ తక్షణ అవరోధం 9,885



ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ గత మార్కెట్ పంచాంగంలో ప్రస్తావించిన 9,885 పాయింట్ల నిరోధస్థాయిని గతవారం రెండు దఫాలు చేరినప్పటికీ, ఆ స్థాయిని దాటలేకపోయింది. ఒక సందర్భంలో 9,740 పాయింట్ల కనిష్టస్థాయికి తగ్గినా, చివరకు అంతక్రితంవారంతో పోలిస్తే 20 పాయింట్ల లాభంతో 9,857 పాయింట్ల వద్ద ముగిసింది. ఈ వారం నిఫ్టీకి తొలి అవరోధం 9,885 పాయింట్ల వద్ద ఎదురవుతున్నది. గ్యాప్‌అప్‌తో ఈ స్థాయిని దాటి స్థిరపడితే మరోసారి 9,950 పాయింట్ల వరకూ కూడా ర్యాలీ కొనసాగవచ్చు. కొత్త గరిష్టస్థాయికి పెరగాలంటే 9,950 పాయింట్లపైన నిఫ్టీ క్లోజ్‌కావాల్సివుంటుంది. ఈ వారం నిఫ్టీ తొలి నిరోధస్థాయిపైన స్థిరపడలేకపోయినా, గ్యాప్‌డౌన్‌తో మొదలైనా 9,785 పాయింట్ల వద్ద తక్షణ మద్దతు లభిస్తున్నది. ఈ మద్దతును కోల్పోయి ముగిస్తే 9,685 పాయింట్ల వద్దకు పడిపోవొచ్చు. ఆలోపున 9,595 పాయింట్ల స్థాయికి తగ్గవచ్చు.

– పి. సత్యప్రసాద్

విలీనాలకు మూలధన మద్దతు!

ప్రభుత్వ రంగ బ్యాంకుల విలీనాలపై ఆర్థిక శాఖ సంకేతం

మొండిబకాయిలకు పరిష్కారమే లక్ష్యం



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంకుల(పీఎస్‌బీ) మధ్య విలీనాలను ప్రోత్సహించడం కోసం తగినంత మూలధనాన్ని అందించేందుకు కేంద్రం సిద్ధంగా ఉంది. ప్రధానంగా కొండలా పేరుకుపోయిన మొండి బకాయిల సమస్యను పరిష్కరించాలంటే బ్యాంకుల విలీనాలే శరణ్యమని.. అందుకు మూలధన నిధుల రూపంలో తోడ్పాటునివ్వనున్నట్లు ఆర్థిక శాఖ అధికారిక వర్గాలు పేర్కొన్నాయి. పీఎస్‌బీల విలీనాన్ని వేగవంతం చేసేందుకు ప్రత్యేక యంత్రాంగాన్ని లేదా మంత్రుల బృందాన్ని ఏర్పాటు చేసే ప్రతిపాదనకు తాజాగా కేంద్ర కేబినెట్ ఆమోదముద్ర వేసిన సంగతి తెలిసిందే. 'మొండిబకాయిల సమస్యను ఎదుర్కొంటున్న బ్యాంకుల మధ్య విలీన ప్రతిపాదన వచ్చిన పక్షంలో... విలీనం వల్ల పటిష్టమైన బ్యాంకు ఆవిర్భవిస్తుందని మంత్రుల బృందం విశ్వసిస్తే.. వాటికి మూలధన నిధుల కొరత లేకుండా చూస్తాం. కొనుగోలు చేసే బ్యాంకుకు ఏదైనా మూలధన అవసరం ఉంటేగనుక కేంద్రం కచ్చితంగా అందిస్తుంది. అయితే, విలీన ప్రతిపాదన అనేది ఆయా బ్యాంకుల బోర్డుల నుంచే రావాల్సి ఉంటుంది' అని పేరు వెల్లడించడానికి ఇష్టపడని ఆర్థిక శాఖ అధికారి ఒకరు పేర్కొన్నారు.

మార్చికల్లా ఒక విలీనం ఖాయం!

ఈ ఆర్థిక సంవత్సరం చివరికల్లా(2018, మార్చి నాటికి) కనీసం ఒక విలీన ప్రతిపాదనను అయినా ఖాయం చేయాలన్న సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం ఉన్నట్లు ఆయా వర్గాలు చెబుతున్నాయి. అయితే, విలీనాలకు నిర్దిష్టంగా ఒక లక్ష్యాన్ని ఏదీ పెట్టుకోలేదని కేబినెట్ నిర్ణయం సందర్భంగా ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ పేర్కొనడం గమనార్హం. ప్రస్తుతం దేశంలో ఎస్‌బీఐ కాకుండా మరో 20 ప్రభుత్వ రంగ బ్యాంకులు ఉన్నాయి. వీటి మొత్తం మొండిబకాయిల పరిమాణం రూ.6 లక్షల కోట్లుగా అంచనా. బ్యాంకింగ్ వ్యవస్థలోని మొత్తం ఎన్‌పీఏల్లో ఇది 75 శాతానికి సమానం. కాగా, ప్రభుత్వ ప్రత్యేక యంత్రాంగం నుంచి విలీనానికి సూత్రప్రాయ ఆమోదం లభిస్తే... దీనికి అనుగుణంగా చట్టపరమైన, సెబీ నిబంధనల మేరకు తగిన చర్యలను ఆయా బ్యాంకులు చేపట్టాల్సి ఉంటుంది. విలీనానికి తుది ఆమోద నిర్ణయం మాత్రం కేంద్ర కేబినెట్ తీసుకుంటుంది.

2–3 బ్యాంకులూ విలీనం కావచ్చు...

పెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు... ఏదైనా చిన్న లేదా మధ్య స్థాయికి చెందిన ఒక పీఎస్‌బీని మాత్రమే విలీనం చేసుకోవాలనేమీ లేదని, అవసరమైతే 2–3 బ్యాంకులను కూడా విలీనపర్చి పటిష్టమైన, భారీ బ్యాంకుగా ఆవిర్భవించవచ్చని ఆర్థిక శాఖ వర్గాలు పేర్కొన్నాయి. దీనివల్ల మూలధన నిధుల కోసం ప్రభుత్వంపై ఆధారపడటం తగ్గుతుందని వ్యాఖ్యానించాయి. ఎస్‌బీఐలో ఐదు అనుబంధ బ్యాంకులతో పాటు భారతీయ మహిళా బ్యాంకు(బీఎంబీ)ను విజయవంతంగా విలీనం చేసిన సంగతి తెలిసిందే. ఈ ఆరు బ్యాంకులను విలీనం చేసుకోవడం ద్వారా ఎస్‌బీఐ ప్రపంచంలోని 50 అతిపెద్ద బ్యాంకుల్లో ఒకటిగా ఆవిర్భవించగలిగింది. ఎస్‌బీఐ మొత్తం కస్టమర్ల సంఖ్య దాదాపు 37 కోట్లకు చేరగా... బ్రాంచ్‌ల సంఖ్య 24 వేలకు, ఏటీఎంలు 54 వేలకు చేరాయి.

బ్యాంకింగ్ చట్ట సవరణలు నోటిఫై...



బ్యాంకింగ్ నియంత్రణ చట్టంలో తీసుకొచ్చిన సవరణలకు ఇటీవల పార్లమెంటు ఆమోదముద్ర వేసిన నేపథ్యంలో ఈ చట్టాన్ని ప్రభుత్వం నోటిఫై చేసింది. దీని ప్రకారం మొండిబకాయిల రికవరీ కోసం బ్యాంకులు దివాలా ప్రక్రియను (ఇన్‌సాల్వెన్సీ, అండ్ బ్యాంక్రప్సీ కోడ్–2016 కింద) మొదలుపెట్టేందుకు అవసరమైన ఆదేశాలను ఇచ్చేవిధంగా ఆర్‌బీఐకి అధికారాలు లభిస్తాయి. అంతక్రితం దీనిపై ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్డినెన్స్ స్థానంలో ఇప్పుడు పూర్తి స్థాయిలో చట్టం అమల్లోకి వచ్చినట్లయింది. కాగా, దేశీ బ్యాంకింగ్ రంగంలో మొండి బకాయిలు రూ.8 లక్షల కోట్లకుపైగానే పేరుకుపోయాయి. ఇందులో ఒక్క ప్రభుత్వ రంగ బ్యాంకులవే రూ.6 లక్షల కోట్లు. ఆర్డినెన్స్ ఆధారంగా ఆర్‌బీఐ ఇప్పటికే దాదాపు 12 భారీ మొండిబకాయిల ఖాతాలను (రూ.5,000 కోట్లకుపైబడిన ఎన్‌పీఏలు) గుర్తించి.. దివాలా చట్టాన్ని ప్రయోగించాల్సిందిగా బ్యాంకులకు ఆదేశాలు జారీ చేసింది కూడా. మొత్తం ఎన్‌పీఏల్లో ఈ 12 కార్పొరేట్ ఖాతాలవే 25 శాతం కావడం గమనార్హం. ఈ జాబితాలో ఎస్సార్ స్టీల్, భూషణ్ స్టీల్, ఏబీజీ షిప్‌యార్డ్, ఎలక్ట్రోస్టీల్, అలోక్ ఇండస్ట్రీస్ వంటివి ఉన్నాయి. కాగా, పీఎస్‌బీలు ఇప్పటివరకూ 5,954 మంది ఉద్దేశపూర్వక రుణ ఎగవేతదారులపై(విల్‌ఫుల్ డిఫాల్టర్స్) సర్ఫేసీ చట్టం కింద రికవరీ చర్యలు చేపట్టాయని ఆర్థిక శాఖ గణాంకాల్లో వెల్లడైంది. ఈ విల్‌ఫుల్ డిఫాల్టర్స్ ఎగ్గొట్టిన రుణాల విలువ రూ.70,000 కోట్లుగా లెక్కతేలింది. ఇందులో ఎస్‌బీఐ 1,444 మందిపై చర్యలు తీసుకుంది. వీరి బకాయిల విలువ రూ.20,943 కోట్లు.



110 నిమిషాల 'సింధు' వదనం

విషాదం

- చిరస్మరణీయ ఫైనల్లో పోరాడి ఓడిన సింధు
- ఓడినా హృదయాలు గెల్చుకున్న తెలుగు తేజం
- రజత పతకంతో సంతృప్తి
- మహిళల సింగిల్స్ విజేత ఒకుహారా
- ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్

ప్రపంచ చాంపియన్‌షిప్ ఫైనల్ మ్యాచ్ అంటే ఎలా ఉండాలి... ప్రత్యర్థులు కసితీరా కొదమ సింహాల్లా తలపడాలి. ఒక్కో పాయింట్ సాధించాలంటే శక్తియుక్తులు మొత్తం పణంగా పెట్టాలి... ప్రాణాలొడ్డినట్లు పోరాడాలి... కోర్టు అంటే కదనరంగంగా మారిపోవాలి... ఒంట్లో సత్తువ మొత్తం క్షీణిస్తున్నా...సమరంలో ఆఖరి క్షణం వరకు పట్టుదల ప్రదర్శించాలి. ఒక్క మాటలో చెప్పాలంటే పీవీ సింధు, నొజోమి ఒకుహరా మధ్య జరిగిన మ్యాచ్‌లా ఉండాలి.

గంటా 50 నిమిషాలు... మొత్తం 124 పాయింట్లు... 73 షాట్‌ల ర్యాలీ... కాళ్లు నొప్పి పెడుతున్నాయి, కండరాలు పట్టేస్తున్నాయి... అలసట ఆటపై ఆధిపత్యం ప్రదర్శిస్తోంది... స్మాష్ కొట్టడంకంటే తాము స్మాష్ కాకుండా ఉండిపోవడమే ముఖ్యంగా మారిపోతోంది. ఎనర్జీ డ్రింక్‌లు పని చేయడం లేదు. మధ్యలో స్కూల్ హెడ్మాస్టర్‌లా రిఫరీ మందలింపులు... ఇక చాలు నా వల్ల కాదంటూ అనిపిస్తున్న క్షణాన్నే ఎదురుగా ప్రపంచ చాంపియన్ హోదా ఆగిపోవద్దంటూ హెచ్చరిక.

ఎప్పటికీ మరచిపోలేని, బ్యాడ్మింటన్ చరిత్రలో అరుదైన మ్యాచ్ చివరకు జపాన్ అమ్మాయి వశమైంది. ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ ఫైనల్లో భారత బిడ్డ, తెలుగు తేజం పూసర్ల వెంకట సింధుకు పరాజయం ఎదురైంది. పాయింట్లు చూస్తే పోరు హోరాహోరీగా సాగినట్లు అనిపిస్తున్నా... ఈ మ్యాచ్ గొప్పతనం గురించి స్కోరు బోర్డు చెప్పలేదనేది మాత్రం సత్యం. ఏ మ్యాచ్‌లోనైనా చివరకు విజేత ఒకరే. కానీ ఈ మ్యాచ్‌లో మాత్రం గెలుపు ఇద్దరిదీ. నిజంగా అవకాశం ఉంటే స్వర్ణం, వెండి మిశ్రమమైన 'పచ్చ బంగారపు' పతకాన్ని వీరిద్దరికి పంచేయడమే న్యాయంగా ఉండేదేమో!



స్వర్ణంతో ఒకుహారా

గ్లాస్గో (స్కాట్లాండ్): భారత బ్యాడ్మింటన్ స్టార్ పూసర్ల వెంకట సింధు కల చెదిరింది. ప్రపంచ చాంపియన్‌గా నిలవాలని పట్టుదలగా శ్రమించిన ఆమెను తుది మెట్టుపై దురదృష్టం వెంటాడింది. ఆదివారం ఇక్కడ జరిగిన ఫైనల్లో నాలుగో సీడ్ సింధు 19–21, 22–20, 20–22 తేడాతో జపాన్‌కు చెందిన ఏడో సీడ్ నొజోమి ఒకుహారా చేతిలో పరాజయంపాలైంది. ఫలితంగా ఈ మెగా ఈవెంట్‌లో ఆమె రజత పతకానికే పరిమితమైంది. ఒకరితో మరొకరు పోటీ పడుతూ అసాధారణంగా సాగిన ఈ పోరులో ఆఖరి క్షణాల్లో జపాన్ అమ్మాయి ఒత్తిడిని అధిగమించడంలో సఫలమైంది. మూడు గేమ్‌ల లోనూ అర్ధ భాగం ముగిసే సరికి ఆధిక్యంలో నిలిచిన సింధు... చివరి వరకు దానిని నిలబెట్టుకోలేకపోయింది.

తొలి గేమ్‌ను కోల్పోయినా...

ఈ మ్యాచ్‌కు ముందు ఇద్దరి మధ్య 3–3తో రికార్డు సమంగా ఉంది. అయితే టాప్ ఫామ్‌లో ఉన్న సింధుకు మెరుగైన అవకాశాలు కనిపించాయి. పైగా ప్రత్యర్థితో పోలిస్తే గత మ్యాచ్‌లు సునాయాసంగా గెలవడం వల్ల పెద్దగా అలసిపోకపోవడం కూడా ఆమెకు అనుకూలాంశంగా కనిపించింది. తొలి గేమ్‌ను తడబడుతూ ప్రారంభించిన సింధు ఆరంభంలో 3–5తో వెనుకబడింది. అయితే కోలుకొని చక్కటి రిటర్న్ షాట్‌లతో 11–5తో దూసుకుపోయింది. ఈ ఆధిక్యం 13–8కి పెరిగింది. అయితే ఒకుహారా పోరాడి స్కోరును 14–14తో సమం చేసింది. ఆ తర్వాత వరుసగా నాలుగు పాయింట్లు సాధించిన ఆమె 18–14తో ముందంజ వేసింది. అయితే జపాన్ అమ్మాయి తప్పులతో స్కోరు 19–19 వద్ద సమమైంది. ఈ దశలో తడబడి షటిల్‌ను నెట్‌లోకి కొట్టిన సింధు, తొలి గేమ్‌ను ప్రత్యర్థికి సమర్పించుకుంది. అయితే రెండో గేమ్‌లో మాత్రం సింధు అద్భుతమైన ఆటను ప్రదర్శించింది. ఒక్కసారిగా ఆమె 5–1తో ఆధిక్యంలో నిలిచి, ఆ తర్వాత 9–3కు చేరింది. మరోసారి సింధు 11–8 గేమ్‌లో ముందుకు వెళ్లింది. ఈ సమయంలో వరుస ర్యాలీలతో ఇద్దరూ హోరాహోరీగా తలపడ్డారు. అయితే సింధు నియంత్రణ కోల్పోకుండా ఆడి ఆధిక్యం కోల్పోకుండా జాగ్రత్త పడింది. 18–16తో దానిని ఆమె కొనసాగించింది. స్కోరు 21–20 వద్ద ఉన్నప్పుడు గెలుపు పాయింట్ కోసం సాగిన ర్యాలీ మ్యాచ్‌కే హైలైట్‌గా నిలిచింది. ఏకంగా 73 షాట్‌ల ర్యాలీ తర్వాత సింధు పైచేయి చూపించి గేమ్‌ను సొంతం చేసుకుంది.

నిర్ణయాత్మక గేమ్‌లో...

అయితే అప్పటికే తీవ్రంగా పోరాడిన వీరిద్దరు బాగా అలసిపోయారు. మూడో గేమ్‌లో స్మాష్‌లలో వేగం తగ్గింది. ఇద్దరూ డ్రాప్ షాట్‌లు, ప్లేసింగ్ ద్వారానే పాయింట్లు రాబట్టేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో ఇద్దరూ జాగ్రత్తగా ఆడుతూ ఒక్కో పాయింట్ సాధించారు. విరామం సమయంలో 11–9తో సింధు ముందంజ వేయడం మినహా...మిగతా గేమ్ మొత్తం దాదాపు సమంగా సాగింది. 17–17 వద్ద సింధు రెండు పాయింట్లు సాధించి 19–17తో నిలిచింది. అయితే ఒకుహారా వరుసగా మూడు పాయింట్లు రాబట్టి 20–19తో ముందంజ వేసింది. మరో రెండు సార్లు సింధు మ్యాచ్ పాయింట్లు కాపాడుకోవడంలో సఫలమైనా...చివరకు జపాన్ అమ్మాయి స్మాష్‌ను అందుకోలేక భారత క్రీడాకారిణి కూలిపోయింది.

3 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో సింధు గెలిచిన పతకాల సంఖ్య. 2013, 2014లలో సింధు సెమీఫైనల్లో ఓడి కాంస్య పతకాలు సొంతం చేసుకుంది. భారత్ తరఫున అత్యధికంగా మూడు పతకాలు నెగ్గిన క్రీడాకారిణి కూడా సింధునే కావడం విశేషం.

1 ప్రపంచ చాంపియన్‌షిప్ చరిత్రలో ఏకకాలంలో భారత్‌కు రజతం, కాంస్యం లభించడం ఇదే తొలిసారి.

7 నాలుగు దశాబ్దాల ప్రపంచ చాంపియన్‌షిప్ పోటీల్లో భారత్ ఖాతాలో చేరిన పతకాలు. 1983లో ప్రకాశ్ పదుకొనే పురుషుల సింగిల్స్‌లో కాంస్యం నెగ్గగా... 2011లో గుత్తా జ్వాల–అశ్విని పొన్నప్ప జంట కాంస్యం దక్కించుకుంది. 2015లో మహిళల సింగిల్స్‌లో సైనా రజతం, ఈ ఏడాది కాంస్యం సాధించింది.



ఫలితంతో నేను తీవ్ర నిరాశ చెందాను. నిర్ణాయక మూడో గేమ్‌లో స్కోరు 20-20 వద్ద ఇద్దరికీ విజయావకాశాలు సమానంగా ఉన్నాయి. ఫైనల్ బరిలో ఉన్న వారెవరైనా స్వర్ణం కోసమే పోరాడతారు. నేను విజయానికి చేరువైనట్టే చేరువై దూరమైపోయాను. చివరి క్షణాల్లోనే అంతా తారుమారు అయింది. ఒకుహారా అసాధారణ క్రీడాకారిణి. గతంలో ఆమెతో ఆడినప్పుడల్లా మ్యాచ్‌లు హోరాహోరీగా సాగాయి. ఆమెను నేను ఏమాత్రం తక్కువ అంచనా వేయలేదు. సుదీర్ఘ మ్యాచ్‌కు సిద్ధమయ్యే వచ్చాను. ఈ రోజు నాది కాదంతే. దేశం కోసం రజతం గెలిచినందుకు చాలా గర్వంగా ఉంది. ఈ పతకం నాలో మరింత విశ్వాసాన్ని పెంచింది. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధిస్తాను.

-పీవీ సింధు

చిన్నబోవద్దు

అద్భుతం ఆ పోరాటం...అసాధారణం ఆ ప్రదర్శన... అయితే ఆటలో క్రూరత్వం కూడా దాగి ఉంటుంది... అది మీ శ్రమను, చిందించిన చెమటను లెక్కలోకి తీసుకోదు. ప్రపంచాన్ని జయించాలంటే పడ్డ కష్టం పాయింట్ల రూపంలోనే కనిపించాలి. తుది ఫలితంలో చాంపియన్ ఒక్కరే కనిపిస్తారు. అలా చూస్తే సింధుకు ఇది పరాజయం కావచ్చు! కానీ 110 నిమిషాల పాటు కోట్లాది మంది అభిమానులను మునివేళ్లపై నిలబెట్టించగలిగిన ఆట అది. కోర్టులో ఆమె కదలికలకు ఫిదా అయిపోయిన క్షణాలు అవి. స్మాష్, డ్రాప్, ర్యాలీ... ఏదైతేనేం ఆమె చూపించిన ఆటకు జయహో అనకుండా ఉండగలమా? 'రియో' ఒలింపిక్ వేదికపై రజతంతో మురిపించిన మన సింధూరం ఈసారి మరో ప్రపంచ వేదికపై బంగారాన్ని అందుకునేందుకు చూపించిన పట్టుదలకు సలామ్ చేయకుండా ఆగిపోగలమా? ఆమె ఓటమి మనల్ని బాధించడం లేదు. ఎందుకంటే ఆమె ఒక్కో పాయింట్ సాధించిన తీరు గెలుపుతో సమానమైన సంతృప్తిని ఇచ్చింది. సింధు ఓడిపోయిందనే మాటను చెప్పేందుకు కూడా మనకు మనస్కరించడం లేదు. ఈ మ్యాచ్‌లో స్వర్ణాన్ని కోల్పోయినా... షటిల్ ప్రపంచంలో ఆమె ఎప్పటికీ మన బంగారు బాలికనే.

సాక్షి క్రీడా విభాగం

సరిగ్గా ఏడాది క్రితం రియో ఒలింపిక్స్‌లో సింధు రజత పతకాన్ని గెలుచుకొని భారతీయులందరి మనసు దోచుకుంది. ఆ వెంటనే సన్మానాలు, సత్కారాలు, కోట్ల రూపాయల కనకాభిషేకం, బ్రాండింగ్ బంధాలు... ఒక్కటేమిటి, సంవత్సరం వ్యవధిలో ఇలాంటివన్నీ ఆమెను ఉక్కిరి బిక్కిరి చేశాయి. సాధారణంగా అయితే ఒక 22 ఏళ్ల ప్లేయర్ ఇలాంటి వాటి మాయలో ఆదమరిచి ఆటను కూడా వెనక్కి పంపే ప్రమాదం చాలా ఉంటుంది. ఉవ్వెత్తున ఎగసి ఉస్సురని కూలిన క్రీడాకారులు ఎందరికో చరిత్ర సాక్షిగా నిలిచింది. ఒక ఒలింపిక్ పతకంతో జీవిత కాలపు ఆనందాన్ని అనుభవించి అంతటితో సంతృప్తి చెందే అల్ప సంతోషులు కూడా ఎందరో ఉంటారు. కానీ సింధులో గొప్పతనమంతా ఇక్కడే కనిపించింది. ఆమెపై ఎన్ని ప్రశంసలు ముంచేసినా... తను ఆటను మాత్రం అంతే అపురూపంగా చూసుకుంది. అందుకే ఎక్కడా తను ఆగిపోలేదు. ఒలింపిక్స్‌లో విజయం తర్వాత కూడా మూడు ప్రతిష్టాత్మక టోర్నీలలో విజేతగా నిలిచి తన ప్రాధాన్యాలేమిటో ఆమె చూపించింది. ముందుగా చైనా ఓపెన్ సూపర్ సిరీస్ ప్రీమియర్ టోర్నీ గెలిచిన సింధు... ఈ ఏడాది ఇండియా ఓపెన్ సూపర్ సిరీస్‌లో, సయ్యద్ మోడి గ్రాండ్‌ప్రి గోల్డ్ టోర్నమెంట్‌లలో విజేతగా నిలిచింది. 'రియో' నుంచి మొదలైన జోరును గ్లాస్గోలో ప్రపంచ విజేతగా ముగించాలని ఆమె కలగంది. దురదృష్టవశాత్తూ అది స్వర్ణ తీరం చేరలేకపోయినా... ఆమె స్థాయిని మరింత పెంచింది.



కుమార్తె సింధు ఓటమి తర్వాత హైదరాబాద్‌లోని తన స్వగృహంలో తండ్రి పీవీ రమణ కంటతడి

ప్రిక్వార్టర్స్‌లో మినహా...

ఒలింపిక్ పతకం సాధించిన తర్వాత కూడా కోచ్ పుల్లెల గోపీచంద్ సంతృప్తి చెందలేదు. మనమేంటో ప్రపంచం గుర్తించాలంటే ప్రపంచ చాంపియన్ కూడా కావాలి అంటూ ఆయన తన ఉద్దేశాలు ఏంటో స్పష్టంగా చెప్పారు. అదే లక్ష్యంగా సింధును సిద్ధం చేశారు కూడా. ఈ టోర్నీ తొలి మ్యాచ్‌లో అలవోకగా నెగ్గిన సింధు, రెండో మ్యాచ్‌లో తడబడింది. తొలి గేమ్‌ను కోల్పోయి, చివరకు చచ్చీ చెడి మ్యాచ్ గెలుచుకుంది. బహుశా ఇదే ఆమెలో పట్టుదల పెంచింది. తన అసలు సత్తా ఏమిటో ఆమెకు మరోసారి గుర్తు చేసింది. ఫలితం... తర్వాతి రెండు మ్యాచ్‌లలో సింధు ప్రత్యర్థులకు ఏడుపొక్కటే తక్కువ! క్వార్టర్ ఫైనల్లో 21–14, 21–9 సున్ యు (చైనా)పై... సెమీస్‌లో 21–13, 21–10తో చెన్ యుఫె (చైనా)పై గెలిచింది. సరిగ్గా చెప్పాలంటే తన ఆటతో ఆమె వారందరినీ తొక్కేసింది! ఇదే ఊపులో ఫైనల్‌కు కూడా సన్నద్ధమైంది. ఇప్పటి వరకు ఆమె ప్రదర్శన చూస్తే తుది పోరులో కూడా అందరూ అదే అద్భుతాన్ని ఆశించారు. అయితే ప్రాణం ఒడ్డి పోరాడిన తర్వాత చివరకు రెండో స్థానం తప్పలేదు.

ఆగిపోవద్దు...

2013లో తొలిసారి సింధు ప్రపంచ చాంపియన్‌షిప్‌లో కాంస్యం గెలుచుకున్నప్పుడు అభిమానులకు ఆనందాశ్చర్యాలు కలిగాయి. సైనా నెహ్వాల్ హవా సాగుతున్న ఆ సమయంలో సింగిల్స్‌లో ఈ ఘనత సాధించిన తొలి మహిళగా నిలిచిన 18 ఏళ్ల అమ్మాయి గురించి కొత్తగా చర్చ మొదలైంది. తర్వాతి ఏడాది మరోసారి అదే పతకం గెలుచుకున్నప్పుడు సింధును సత్తా ఉన్న షట్లర్‌గా ప్రపంచం గుర్తించింది. రాకెట్ వేగంతో దూసుకొచ్చిన ఈ తెలుగమ్మాయి రెండేళ్లలోనే ఒలింపిక్స్‌లో వెండి పతకం గెలుచుకొని తన విలువను ప్రదర్శించింది. ఈ మధ్యలో సూపర్ సిరీస్‌లు, గ్రాండ్‌ప్రి గోల్డ్‌లలో సంచలన విజయాల గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే. ఫైనల్లో సింధు ఓటమిలో అలసట కూడా ఒక కారణంలా కనిపించింది. అద్భుతమైన ఫిట్‌నెస్ ఉన్నా మ్యాచ్ ఆఖరి క్షణాల్లో ఆమె కాస్త బలహీనంగా మారిపోయింది. ఇవాళ విజయం దక్కకపోవచ్చు... కానీ ప్రపంచ చాంపియన్‌షిప్ ప్రతీ ఏటా ఆమె ముందుకు వచ్చే అవకాశం. ఈ తరహా ఆట ఆమెకు చాంపియన్ అయ్యే అన్ని అర్హతలూ ఉన్నాయని చూపించింది. కాబట్టి సింధుకు స్వర్ణం సుదూర స్వప్నం మాత్రం కాబోదు!



స్కాట్లాండ్‌లోని గ్లాస్గోలో కాంస్య పతక విజేత సైనా నెహ్వాల్, రజత పతకం నెగ్గిన సింధులతో తెలంగాణ బ్యాడ్మింటన్ సంఘం ఉపాధ్యక్షుడు చాముండేశ్వరీనాథ్

ప్రిక్వార్టర్స్‌లో మనోజ్, కవీందర్

ప్రపంచ సీనియర్ బాక్సింగ్ చాంపియన్‌షిప్



మనోజ్

హాంబర్గ్ (జర్మనీ): ప్రపంచ సీనియర్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత బాక్సర్లకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. మనోజ్ కుమార్ (69 కేజీలు), కవీందర్ బిష్త్ (52 కేజీలు) శుభారంభం చేయగా... సతీశ్ కుమార్ (ప్లస్ 91 కేజీలు) తొలి రౌండ్‌లోనే నిష్క్రమించాడు. తొలిరౌండ్‌లో మనోజ్ 3–2తో వాసిలి బెలూస్ (మాల్దోవా)పై, కవీందర్ 3–2తో రుసె బాబా (జపాన్)పై విజయం సాధించి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించారు. సతీశ్ 0–5తో మజిదోవ్ (అజర్‌బైజాన్) చేతిలో ఓడిపోయాడు. ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో మొహమ్మద్ ఫ్లిసి (అల్జీరియా)తో కవీందర్; పెరెజ్ (వెనిజులా)తో మనోజ్ తలపడతారు.

వెస్టిండీస్ 427

లీడ్స్: ఇంగ్లండ్‌తో జరుగుతున్న రెండో టెస్టులో వెస్టిండీస్ భారీ స్కోరు సాధించింది. ఆదివారం మూడో రోజు తమ తొలి ఇన్నింగ్స్‌లో విండీస్ 127 ఓవర్లలో 427 పరుగులకు ఆలౌట్ అయ్యింది. దీంతో జట్టుకు 169 పరుగుల ఆధిక్యం లభించింది. హోప్ (147; 23 ఫోర్లు) శతకంతో చెలరేగగా... బ్లాక్‌వుడ్ (49; 7 ఫోర్లు), హోల్డర్ (43; 7 ఫోర్లు) రాణించారు. అండర్సన్‌కు ఐదు, స్టోక్స్‌కు రెండు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత తమ రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన ఇంగ్లండ్ ఆట ముగిసేసమయానికి 59 ఓవర్లలో 3 వికెట్లకు 171 పరుగులు చేసింది.

ఆసీస్ తడబాటు

ఢాకా: బంగ్లాదేశ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో ఆస్ట్రేలియా జట్టు తడబడుతోంది. ఆదివారం తొలిరోజు ఆట ముగిసే సమయానికి ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 9 ఓవర్లలో 18 పరుగులు చేసి 3 వికెట్లు కోల్పోయింది. అంతకుముందు బంగ్లాదేశ్ 78.5 ఓవర్లలో 260 పరుగులకు ఆలౌటైంది. షకీబ్ అల్ హసన్ (84; 11 ఫోర్లు), తమీమ్ ఇక్బాల్ (71; 5 ఫోర్లు, 3 సిక్సర్లు) మినహా అంతా విఫలమయ్యారు. కమిన్స్, లియోన్, అగర్‌లకు మూడేసి వికెట్లు దక్కాయి.

బెంగాల్ వారియర్స్ గెలుపు

ముంబై: రైడర్ల ప్రదర్శనతో బెంగాల్ వారియర్స్ ప్రొ కబడ్డీ లీగ్‌లో నాలుగో విజయాన్ని నమోదు చేసింది. ఆదివారం జోన్–బిలో జరిగిన పోరులో వారియర్స్ 32–26 స్కోరుతో బెంగళూరు బుల్స్‌పై విజయం సాధించింది. బెంగాల్ రైడర్లలో జాంగ్ కున్ లి, వీరేందర్ అదరగొట్టారు. 11 సార్లు రైడింగ్‌కు వెళ్లిన జాంగ్ 6 పాయింట్లు చేయగా, వీరేందర్ 8 సార్లు వెళ్లి ఐదు పాయింట్లు సాధించాడు. బెంగళూరు బుల్స్ జట్టులో రోహిత్ కుమార్, గుర్విందర్ సింగ్ చెరో 7 పాయింట్లు చేశారు. పది మ్యాచ్‌లాడిన బెంగళూరుకు ఇది ఆరో ఓటమి. అనంతరం జరిగిన హోరాహోరీ పోరులో దబంగ్ ఢిల్లీ 33–32తో యు ముంబాపై గెలుపొందింది. ఢిల్లీ తరఫున మెరాజ్ షేక్ రైడింగ్‌లో 11 పాయింట్లు చేశాడు. అబొల్‌ఫజల్ 8, బాజీరావు హొడగే 4, తపస్ పాల్ 3 పాయింట్లు సాధించారు. సోమవారం విశ్రాంతి రోజు. మంగళవారం జరిగే పోటీల్లో బెంగళూరు బుల్స్... యూపీ యోధతో, యూ ముంబా... గుజరాత్ ఫార్చ్యూన్ జెయింట్స్‌తో తలపడతాయి.



2019 వరకు ధోని స్థానం ధోనిదే: సెహ్వాగ్

వన్డే ప్రపంచకప్ (2019) వరకు ధోని స్థానాన్ని ఎవరూ భర్తీ చేయలేరని మాజీ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ అన్నాడు. 'వికెట్ కీపర్ రిషభ్ పంత్ బాగా ఆడుతున్నప్పటికీ అతనికి ఇంకా అనుభవం కావాలి. దీనికి సమయం పడుతుంది. ఏదేమైనా వరల్డ్‌కప్ తర్వాతే ధోని స్థానం భర్తీ అవుతుంది. ధోని పరుగులు చేసినా, చేయకపోయినా నష్టం లేదు. అప్పటిదాకా కేవలం ఫిట్‌నెస్‌తో ఉంటే చాలని ప్రార్థిద్దాం' అని వీరూ అన్నాడు. మిడిలార్డర్, లోయర్ ఆర్డర్‌ను ధోనిలా నడిపించే ఆటగాడెవరూ లేరని సెహ్వాగ్ అన్నాడు.

'మూడు'లోనే కొట్టేశారు...

వన్డే సిరీస్‌నూ నెగ్గిన భారత్

- రోహిత్ అజేయ శతకం
- అండగా నిలిచిన ఎంఎస్ ధోని
- బుమ్రాకు ఐదు వికెట్లు
- మూడో వన్డేలో విజయం



శ్రీలంకపై భారత్ విజయ యాత్ర కొనసాగుతోంది. అంచనాలకు తగినట్టుగానే వన్డే సిరీస్‌ను కూడా తమ ఖాతాలో వేసుకుంది. 218 పరుగుల స్వల్ప లక్ష్యం కోసం బరిలోకి దిగిన భారత్ 61 పరుగులకే 4 వికెట్లు కోల్పోయిన దశలో... రోహిత్ శర్మ తన అద్భుత సెంచరీతో జట్టును నిలబెట్టాడు. అతడికి జతగా 'మిస్టర్ కూల్' మరోసారి తన విలువైన ఇన్నింగ్స్ ఆడటంతో లంక మరోసారి భంగపడింది. అంతకుముందు పేసర్ బుమ్రా కెరీర్‌లో తొలి సారిగా ఐదు వికెట్లతో చెలరేగి ఆతిథ్య జట్టు వెన్నువిరిచాడు. ఇక మిగిలిన రెండు వన్డేలు నామమాత్రమే కావడంతో భారత్ తమ రిజర్వ్ బెంచ్‌ను పరీక్షించే అవకాశం చిక్కినట్టే.

రోహిత్‌శర్మ
ధోని

పల్లెకెలె: సిరీస్‌లో సజీవంగా ఉండాలంటే కచ్చితంగా నెగ్గి తీరాల్సిన మ్యాచ్‌లో శ్రీలంక ఎప్పటిలాగే చేతులెత్తేసింది. లంక గడ్డపై రోహిత్ శర్మ తొలిసారి సెంచరీ (145 బంతుల్లో 124 నాటౌట్; 16 ఫోర్లు, 2 సిక్సర్లు) అందుకోగా... సీనియర్ బ్యాట్స్‌మన్ ఎంఎస్ ధోని (86 బంతుల్లో 67 నాటౌట్; 4 ఫోర్లు, 1 సిక్స్) తన ఫామ్‌ను మరోసారి చాటుకున్నాడు. ఫలితంగా ఆదివారం జరిగిన మూడో వన్డేలో భారత్ 6 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. దీంతో ఐదు వన్డేల సిరీస్‌ను కోహ్లి బృందం మరో రెండు వన్డేలు మిగిలి ఉండగానే దక్కించుకున్నట్టయ్యింది. 1997 తర్వాత భారత్‌పై లంక ఇప్పటిదాకా వన్డే సిరీస్ గెలవకపోవడం గమనార్హం. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన లంక 50 ఓవర్లలో 9 వికెట్లకు 217 పరుగులు చేసింది. తిరిమన్నె (105 బంతుల్లో 80; 5 ఫోర్లు, 1 సిక్స్) చండిమాల్ (71 బంతుల్లో 36; 4 ఫోర్లు) మాత్రమే రాణించగలిగారు. బుమ్రా 27 పరుగులకు 5 వికెట్లు తీశాడు. ఆ తర్వాత స్వల్ప లక్ష్యం కోసం బరిలోకి దిగిన భారత్ 45.1 ఓవర్లలో 4 వికెట్లకు 218 పరుగులు చేసి గెలిచింది. రోహిత్, ధోని మధ్య ఐదో వికెట్‌కు అజేయంగా 157 పరుగుల భాగస్వామ్యం నెలకొంది. ధనంజయకు రెండు వికెట్లు దక్కాయి. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్'గా బుమ్రా నిలిచాడు. సిరీస్‌లోని నాలుగో వన్డే ఈనెల 31న కొలంబోలో జరుగుతుంది.

బుమ్రా ధాటికి విలవిల...

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక తమ బ్యాటింగ్‌లో మరోసారి నిరాశపరిచింది. పేసర్ బుమ్రా ధాటికి ఆరంభం నుంచే వణికింది. అయితే 28 పరుగులకే 2 వికెట్లు కోల్పోయిన దశలో సిరీస్‌లో తొలిసారి ఆడుతున్న చండిమాల్, తిరిమన్నె జట్టును ఆదుకున్నారు. ఓపిగ్గా ఆడుతూనే చెత్త బంతులను బౌండరీలకు తరలించారు. కానీ అతిజాగ్రత్తకు పోవడంతో పరుగులు నిదానంగా వచ్చాయి. 26వ ఓవర్లో జట్టు వంద పరుగులు పూర్తి చేయగలిగింది. అయితే అదే ఓవర్‌లో పాండ్యా.. చండిమాల్‌ను అవుట్ చేశాడు. డీప్ స్క్వేర్ లెగ్‌లో బుమ్రా క్యాచ్ పట్టడంతో పెవిలియన్‌కు చేరాడు. దీంతో మూడో వికెట్‌కు 72 పరుగుల కీలక భాగస్వామ్యం ముగిసింది. 69 బంతుల్లో తిరిమన్నె అర్ధ సెంచరీ పూర్తి చేశాడు. కొద్దిసేపటికే జాదవ్ బౌలింగ్‌లో రివర్స్ స్వీప్ ఆడబోయిన మాథ్యూస్ (11) ఎల్బీ అయ్యాడు. తను రివ్యూకు వెళ్లినా ఫలితం దక్కలేదు. ఆ తర్వాత బుమ్రా ప్రమాదకరంగా మారిన తిరిమన్నెను వెనక్కి పంపడంతో లంక ఓ మాదిరి స్కోరు కూడా చేయలేక పోయింది. కెప్టెన్ కపుగెడెర (14)ను అక్షర్ అవుట్ చేయగా.. తన వరుస ఓవర్లలో బుమ్రా విజృంభించి ధనంజయ (2), సిరివర్ధన (29)ను అవుట్ చేయడంతో కెరీర్‌లో తొలిసారి ఐదు వికెట్లను పడగొట్టాడు. 47వ ఓవర్ తర్వాత వర్షం కారణంగా మ్యాచ్‌కు స్వల్పంగా అంతరాయం కలిగింది.

రోహిత్, ధోని దూకుడు...

స్వల్ప స్కోరే అయినా భారత్ ఆదిలోనే తడబడింది. మూడో ఓవర్‌లోనే ధావన్ (5)ను మలింగ బౌల్డ్ చేయగా... వన్‌డౌన్‌లో దిగిన కోహ్లి (3)ని ఫెర్నాండో అవుట్ చేయడంతో 19 పరుగులకే రెండు వికెట్లు పడ్డాయి. దీంతో రాహుల్ (24 బంతుల్లో 17; 2 ఫోర్లు)తో కలిసి రోహిత్ కొద్దిసేపు ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. వీరి మధ్య మూడో వికెట్‌కు 42 పరుగులు వచ్చాయి. ధనంజయ తన తొలి ఓవర్‌లో రాహుల్‌ను అవుట్ చేయగా మరో ఓవర్‌లో జాదవ్ పనిపట్టాడు. 61/4 స్కోరుతో ఇబ్బందుల్లో పడిన భారత్‌ను రోహిత్, ధోని ఆదుకున్నారు. 19వ ఓవర్‌లో రోహిత్ వరుసగా మూడు ఫోర్లు బాదడంతో పాటు 64 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేశాడు. క్రమంగా ఈ జోడి లంక బౌలర్లకు ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా ఎదురుదాడికి దిగింది. ఇదే జోరుతో రోహిత్ 118 బంతుల్లో లంక గడ్డపై తొలి సెంచరీని అందుకున్నాడు. 40వ ఓవర్‌లో రోహిత్ ఇచ్చిన క్యాచ్‌ను కపుగెడెర వదిలేశాడు. అటు ధోని 74 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేశాడు.



బుమ్రా

అభిమానుల అల్లరి...

లంక పేలవ ప్రదర్శనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన ప్రేక్షకులు కాసేపు మైదానంలో అలజడి సృష్టించారు. 44వ ఓవర్‌లో ధోని సిక్సర్‌తో పాటు రోహిత్ ఓ బౌండరీ బాదడంతో 12 పరుగులు వచ్చాయి. అయితే ఈ ఓవర్ పూర్తయ్యాక భారత్ విజయానికి మరో ఎనిమిది పరుగులు అవసరం కాగా సహనం కోల్పోయిన లంక ప్రేక్షకులు మైదానంలోకి బాటిళ్లను విసరడంతో మ్యాచ్ అర్ధగంట సేపు ఆగింది. చాలాసేపు తర్జనభర్జనల అనంతరం ఇరు జట్ల ఆటగాళ్లు పెవిలియన్‌కు చేరుకున్నారు. మైదానంలోని ప్రేక్షకులను భద్రతా సిబ్బంది బయటికి పంపిన అనంతరం ఆటను తిరిగి కొనసాగించగా మరో ఏడు బంతుల్లో భారత్ లక్ష్యాన్ని అందుకుంది.

4 భారత్ తరఫున అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్లలో అజహర్ (9378)ను అధిగమించి నాలుగో స్థానానికి చేరిన ధోని (9434).

7 శ్రీలంకపై వరుసగా 7 వన్డే సిరీస్‌లు నెగ్గిన భారత్.

స్కోరు వివరాలు

శ్రీలంక ఇన్నింగ్స్: డిక్‌వెలాఎల్బీడబ్ల్యు (బి) బుమ్రా 13; చండిమాల్ (సి) బుమ్రా (బి) పాండ్యా 36; కుశాల్ (సి) రోహిత్ (బి) బుమ్రా 1; తిరిమన్నె (సి) జాదవ్ (బి) బుమ్రా 80; ఏంజెలో మాథ్యూస్ ఎల్బీడబ్ల్యు (బి) జాదవ్ 11; కపుగెడెర (బి) అక్షర్ 14; సిరివర్ధన (బి) బుమ్రా 29; ధనంజయ (బి) బుమ్రా 2; చమీర (రనౌట్) 6; ఫెర్నాండో నాటౌట్ 5; మలింగ నాటౌట్ 1; ఎక్స్‌ట్రాలు 19; **మొత్తం (50 ఓవర్లలో 9 వికెట్లకు) 217.**

వికెట్ల పతనం: 1–18, 2–28, 3–100, 4–138, 5–159, 6–181, 7–191, 8–201, 9–210.

బౌలింగ్: భువనేశ్వర్ 9–2–41–0; బుమ్రా 10–2–27–5; చాహల్ 10–0–49–0; పాండ్యా 8–0–42–1; అక్షర్ 10–1–35–1; జాదవ్ 3–0–12–1.

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ నాటౌట్ 124; ధావన్ (బి) మలింగ 5; కోహ్లి (సి) చమీర (బి) ఫెర్నాండో 3; రాహుల్ (సి) తిరిమన్నె (బి) ధనంజయ 17; జాదవ్ ఎల్బీడబ్ల్యు (బి) ధనంజయ 0; ధోని నాటౌట్ 67; ఎక్స్‌ట్రాలు 2; **మొత్తం (45.1 ఓవర్లలో నాలుగు వికెట్లకు) 218**

వికెట్ల పతనం: 1–9, 2–19, 3–61, 4–61.

బౌలింగ్: మలింగ 5–0–25–1; ఫెర్నాండో 8.1–2–35–1; చమీర 10–1–59–0; మాథ్యూస్ 3–0–17–0; ధనంజయ 10–0–38–2; సిరివర్ధన 9–0–43–0.

ఆ 'ఇద్దరే' ఫేవరెట్స్...

అందరి కళ్లు నాదల్, ఫెడరర్‌లపైనే ◆ బరిలో షరపోవా ◆ నేటి నుంచి యూఎస్ ఓపెన్

ఈ సీజన్ చివరి గ్రాండ్‌స్లామ్ టోర్నీ యూఎస్ ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్‌కు రంగం సిద్ధమైంది. సీడెడ్ ఆటగాళ్లు, మాజీ చాంపియన్లు గాయాలతో దూరమవడంతో కళ తప్పిన ఈ టోర్నీకి చిరకాల ప్రత్యర్థులు నాదల్, ఫెడరర్‌లే ఫేవరెట్లుగా నిలిచారు. రష్యా బ్యూటీ మరియా షరపోవా వైల్డ్‌కార్డ్ ఎంట్రీతో బరిలోకి దిగుతోంది.



నాదల్



ఫెడరర్

న్యూయార్క్: 13 ఏళ్లు... 37 మ్యాచ్‌లు... చిరకాల ప్రత్యర్థులు నాదల్, ఫెడరర్‌ల వైరానికి ఎన్నో వేదికలు. అయినా వీరిద్దరి పోరంటే ఆసక్తి తగ్గదు. హోరాహోరీ తప్పదు. టెన్నిస్‌కే వన్నె తెచ్చిన ఈ లెజెండ్స్ యూఎస్ ఓపెన్ టైటిల్‌పై కన్నేశారు. ఇప్పటికే ఈ సీజన్‌లో జరిగిన మూడు గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు వీరి చేతికే చిక్కాయి. ఈ నేపథ్యంలో స్పెయిన్ స్టార్, నంబర్‌వన్ రాఫెల్ నాదల్, మూడో సీడ్ స్విట్జర్లాండ్ దిగ్గజం ఫెడరర్ ఈ చివరి గ్రాండ్‌స్లామ్‌లో టైటిల్ ఫేవరెట్లుగా బరిలోకి దిగుతున్నారు. స్టార్ ఆటగాళ్లు గాయాలతో వైదొలగడంతో ఒకే పార్శ్వంలో ఉన్న నాదల్, ఫెడరర్ సెమీస్‌లో అమీతుమీ తేల్చుకునే అవకాశాలు మెరుగ్గా ఉన్నాయి. మూడేళ్ల తర్వాత టాప్ ర్యాంకుకు చేరిన నాదల్ ఇక్కడ 2010, 2013లో టైటిల్స్ నెగ్గాడు. మరోవైపు ఫెడరర్ ఏకంగా ఐదుసార్లు (2004 నుంచి 2008) యూఎస్ ఓపెన్‌లో విజేతగా నిలిచాడు. 36 ఏళ్ల ఈ వన్నె తగ్గని వెటరన్ ఈ సీజన్‌లో ఆస్ట్రేలియా, వింబుల్డన్ టైటిళ్లు సాధించాడు. పురుషుల సింగిల్స్ తొలిరౌండ్లో నాదల్... లెజొవిచ్ (సెర్బియా)తో, ఫెడరర్... టియాఫె (అమెరికా)తో తలపడతారు. మహిళల సింగిల్స్‌లో షరపోవా... రెండో సీడ్ సిమోనా హాలెప్ (రొమేనియా)తో, టాప్ సీడ్ ప్లిస్కోవా (చెక్ రిపబ్లిక్)... లినెట్ (పోలాండ్)తో, 9వ సీడ్ వీనస్ విలియమ్స్... విక్టోరియా కుజ్‌మోవా (స్లోవేకియా)తో, మూడో సీడ్ ముగురుజా... లెప్చెంకో (అమెరికా)తో, 13వ సీడ్ క్విటోవా (చెక్ రిపబ్లిక్)... జెలెనా జంకోవిచ్ (సెర్బియా)తో పోటీపడనున్నారు.

గ్రాండ్‌స్లామ్‌లో మళ్లీ షరపోవా...

రష్యా టెన్నిస్ అందం మరియా షరపోవా. కోర్టుల్లో షాట్లతో పాటు అరుపులతో హోరెత్తించే ఆమె... డోపింగ్ సస్పెన్షన్ తర్వాత ఓ మేజర్ ఈవెంట్ బరిలోకి దిగుతోంది. ఐదు గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్స్ నెగ్గిన ఆమె నిషేధిత ఉత్ప్రేరకం తీసుకోవడంతో 15 నెలల సస్పెన్షన్ విధించారు. ఈ సస్పెన్షన్ కాలం ఎప్పుడో ముగిసినా... చిన్నా చితక టోర్నీలే ఆడింది తప్ప మేజర్ టోర్నీ ఆడలేదు. తాజాగా 30 ఏళ్ల మరియాకు యూఎస్ ఓపెన్ నిర్వాహకులు వైల్డ్‌కార్డ్ ఎంట్రీ ఇచ్చారు. దీంతో సస్పెన్షన్ అనంతరం తొలిసారిగా గ్రాండ్‌స్లామ్ టోర్నీలో ఆడేందుకు సిద్ధమైంది. అయితే ఆమె పునరాగమనంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు సహచరులు ఆమె ఓ టెన్నిస్ ఫైటర్ అని స్వాగతిస్తుంటే... మరి కొందరు విమర్శలు ఆపడం లేదు. 'టెన్నిస్ అభిమాని ఆమె మ్యాచ్‌వైపు కన్నెత్తి చూస్తాడని నేననుకోవడం లేదు' అని 15వ సీడ్ మాడిసన్ కీస్ అభిప్రాయపడింది. 'షరపోవా మంచి ఫైటర్. కోర్టుల్లో స్ఫూర్తి కనబరుస్తుంది. అభిమానులు ఆమెను ఆదరిస్తారు. టోర్నీకి వన్నె తెస్తుంది' అని మూడో సీడ్ ముగురుజా (స్పెయిన్) పేర్కొంది. 'ప్రొఫెషనల్ ప్లేయర్ షరపోవా శుభారంభం చేస్తుంది' అని ప్రపంచ నంబర్‌వన్ ప్లిస్కోవా (చెక్ రిపబ్లిక్) తెలిపింది.

గాయంతో ముర్రే కూడా...

స్టార్ ఆటగాళ్ల గాయాలతో యూఎస్ ఓపెన్ కోర్టులు కళతప్పనున్నాయి. ఇప్పటికే మాజీ నంబర్‌వన్ నొవాక్ జొకోవిచ్ (సెర్బియా), డిఫెండింగ్ చాంపియన్ వావ్రింకా (స్విట్జర్లాండ్), మాజీ రన్నరప్ నిషికోరి (జపాన్), రావ్‌నిచ్ (కెనడా)లు ఈ టోర్నీకి దూరం కాగా... తాజాగా బ్రిటన్ స్టార్, ప్రపంచ రెండో ర్యాంకర్ ఆండీ ముర్రే ఈ జాబితాలో చేరాడు. తుంటి గాయంతో అతను ఈ సీజన్ చివరి గ్రాండ్‌స్లామ్ ఈవెంట్ నుంచి వైదొలిగాడు. దీంతో టాప్–11 ర్యాంకర్లలో ఏకంగా ఐదుగురు ఆటగాళ్లు ఈ టోర్నీకి దూరమయ్యారు.

రాత్రి గం. 8.15 నుంచి స్టార్ స్పోర్ట్స్ సెలెక్ట్-1లో ప్రత్యక్ష ప్రసారం

హామిల్టన్‌దే విక్టరీ

బెల్జియం గ్రాండ్‌ప్రి టైటిల్ కైవసం



స్పా-ఫ్రాంకోర్‌చాంప్స్ (బెల్జియం): ఫార్ములావన్ సీజన్‌లో లూయిస్ హామిల్టన్ మరో టైటిల్ సాధించాడు. ఆదివారం బెల్జియం గ్రాండ్‌ప్రిలో ఈ మెర్సిడెస్ జట్టు డ్రైవర్ విజేతగా నిలిచాడు. ఈ ఏడాది హామిల్టన్ సాధించిన ఐదో టైటిల్ ఇది. ఓవరాల్‌గా 32 ఏళ్ల ఈ బ్రిటన్ రేసర్ తన 200వ గ్రాండ్‌ప్రి రేసును విజయంతో ముగించాడు. తన కెరీర్‌లో అతనికిది 58వ విజయం కావడం మరో విశేషం. శనివారం 68వ పోల్ పొజిషన్‌తో జర్మనీ రేసింగ్ దిగ్గజం మైకేల్ షుమాకర్ రికార్డును సమం చేసిన హామిల్టన్ అదే జోరును ప్రధాన రేసులోనూ కనబరిచాడు. 44 ల్యాప్‌ల ఈ ట్రాక్‌లో ఫెరారీ డ్రైవర్ సెబాస్టియన్ వెటెల్ గట్టి పోటీనిచ్చాడు. కొన్ని ల్యాపుల్లో హామిల్టన్‌కు అత్యంత చేరువైనా... అతని విజయాన్ని మాత్రం ఆపలేకపోయాడు. చివరకు రేసును మెర్సిడెస్ డ్రైవర్ అందరి కంటే ముందుగా గంటా 24 నిమిషాల 42.820 సెకన్లలో పూర్తి చేశాడు. కేవలం 2.358 సెకన్ల వ్యవధిలో వెటెల్ రన్నరప్‌గా నిలిచాడు. రెడ్‌బుల్ డ్రైవర్ డానియెల్ రికియార్డో మూడో స్థానంతో పోడియంలో నిలిచాడు. జోరుమీదున్న హామిల్టన్ వచ్చే ఆదివారం (సెప్టెంబర్ 3) ఇటాలియన్ గ్రాండ్‌ప్రి గెలిస్తే ఈ ఏడాది చాంపియన్‌షిప్‌లో తొలిసారిగా ఆధిక్యంలోకి వస్తాడు. ఫోర్స్ ఇండియా డ్రైవర్లలో ఈస్టెబన్ ఒకాన్ తొమ్మిదో స్థానంలో నిలువగా... మరో డ్రైవర్ సెర్గియో పెరెజ్ రేసును పూర్తిచేయలేకపోయాడు. 42 ల్యాపుల్ని పూర్తి చేసిన అతను 17వ స్థానం దక్కించుకున్నాడు.

మేవెదర్... 50 నాటౌట్

కెరీర్‌లో అజేయంగా నిలిచిన అమెరికా స్టార్ బాక్సర్

- మెక్‌గ్రెగోర్‌తో బౌట్‌లో విజయం
- రూ. 1,277 కోట్ల ప్రైజ్‌మనీ సొంతం



మేవెదర్ పంచ్‌కు మెక్ గ్రెగోర్ విలవిల (కుడి)

లాస్‌వేగాస్ (అమెరికా): ప్రొఫెషనల్ బాక్సింగ్‌లో తనకు తిరుగులేదని అమెరికా స్టార్ బాక్సర్ ఫ్లాయిడ్ మేవెదర్ జూనియర్ మరోసారి నిరూపించుకున్నాడు. 29 ఏళ్ల కానర్ మెక్‌గ్రెగోర్ (ఐర్లాండ్)తో ఆదివారం జరిగిన 'సూపర్ ఫైట్' బౌట్‌లో 40 ఏళ్ల మేవెదర్ టెక్నికల్ నాకౌట్ పద్ధతిలో విజయం సాధించాడు. 12 రౌండ్లపాటు జరగాల్సిన ఈ బౌట్‌లో మేవెదర్ సంధించిన పంచ్‌ల ధాటికి 10వ రౌండ్ తర్వాత మెక్‌గ్రెగోర్ పోటీపడలేకపోయాడు. దాంతో రిఫరీ బౌట్‌ను నిలిపివేసి మేవెదర్‌ను విజేతగా ప్రకటించారు. 10 రౌండ్‌లు ముగిసేసరికి మేవెదర్ 89–81, 89–82, 87–83 పాయింట్లతో మెక్‌గ్రెగోర్‌పై ఆధిక్యంలో ఉన్నాడు. మేవెదర్ ప్రొఫెషనల్ కెరీర్‌లో ఇది వరుసగా 50వ విజయం కావడం విశేషం. మేవెదర్ పోటీపడిన 50 బౌట్‌లలోనూ అతనే విజేతగా నిలిచాడు. తద్వారా ప్రొఫెషనల్ బాక్సింగ్ కెరీర్‌లో అజేయంగా నిలిచిన ఏకైక బాక్సర్‌గా ఈ అమెరికా బాక్సర్ చరిత్ర సృష్టించాడు. 49 వరుస విజయాలతో అమెరికా హెవీవెయిట్ ప్రొఫెషనల్ బాక్సర్ రాకీ మర్సియానో పేరిట ఉన్న రికార్డును ఈ గెలుపుతో మేవెదర్ బద్దలు కొట్టాడు. 2015లో మ్యానీ పకియావ్ (ఫిలిప్పీన్స్)తో జరిగిన బౌట్ తర్వాత రిటైర్మెంట్ ప్రకటించిన మేవెదర్ కెరీర్‌లో 50వ విజయం సాధించాలనే ఉద్దేశంతో రిటైర్మెంట్‌ను ఉపసంహరించుకొని మళ్లీ రింగ్‌లోకి దిగాడు. ప్రొఫెషనల్ బాక్సింగ్ చరిత్రలో ఖరీదైన బౌట్‌లలో ఒకటిగా గుర్తింపు పొందిన ఈ పోటీ ద్వారా మేవెదర్ సుమారు 20 కోట్ల డాలర్లు (రూ. 1,277 కోట్లు)... మెక్‌గ్రెగోర్ సుమారు 10 కోట్ల డాలర్లు (రూ. 638 కోట్లు) ఆర్జించారు. 'కెరీర్‌లో 50వ విజయం సాధించాను. మళ్లీ నేను రింగ్‌లోకి దిగే అవకాశాలు లేవు' అని మేవెదర్ వ్యాఖ్యానించాడు.

గుంటూరు జిల్లాలో బయటపడిన బౌద్ధారామం


బౌద్ధారామ మండప స్తంభాలపై ఉన్న ఆనవాళ్లను పరిశీలిస్తున్న శివనాగిరెడ్డి తదితరులు

మొగల్రాజపురం (విజయవాడ తూర్పు): గుంటూరు జిల్లా అచ్చంపేట మండలం పుట్లగూడెం భైరవగుట్ట పైన శిథిలమైన వేంకటేశ్వరాలయం ఆవరణలో రెండు వేల ఏళ్ల నాటి (శాతవాహన కాలం) బౌద్ధారామం బయటపడినట్లు ది కల్చరల్ సెంటర్ ఆఫ్ విజయవాడ, అమరావతి సీఈవో డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక గ్రామస్తులు ఇచ్చిన సమాచారం మేరకు ఆదివారం ఉదయం ఈ ప్రాంతంలో పరిశోధనలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. బౌద్ధ చిహ్నాలైన అర్ధపద్మంతో పాటుగా బౌద్ధ ఆనవాళ్లను తెలిపేలా వివిధ డిజైన్లతో చెక్కిన ఆరు శిలా మండప స్తంభాలు ఇక్కడ గుర్తించినట్లు వెల్లడించారు. ఇటీవల ఈ ప్రాంతంలో గుప్త నిధుల కోసం కొందరు దుండగులు ఈ మండపాన్ని కూలదోసి తవ్వకాలు జరిపినట్లు తాము గుర్తించామని తెలిపారు. ఎంతో చారిత్రక ప్రాధాన్యత ఉన్న ఈ బౌద్ధ మండప ఆనవాళ్లను పురావస్తుశాఖాధికారులు భద్రపరిచి భవిష్యత్ తరాలకు అందించాలని విజ్ఞప్తి చేశారు.

కూలీల పెన్షన్ల చెల్లింపులో తీవ్ర జాప్యం

- మూడు నెలలకోసారి ఇస్తున్న సీఆర్‌డీఏ
- అది కూడా ఒక నెల పెన్షన్ మాత్రమే
- ఆందోళనలో రాజధాని పేదలు

సాక్షి, అమరావతి: రాజధానిలో భూమిలేని నిరుపేదలకు పెన్షన్లు పంపిణీ చేసే విషయంలో చంద్రబాబు సర్కారు తీవ్ర అలసత్వం ప్రదర్శిస్తోంది. ప్రతి నెలా రూ. 2500 చొప్పున ఇవ్వాల్సిన పెన్షన్‌ను తనకు గుర్తొచ్చినప్పుడు మాత్రమే విదిలిస్తోంది. మూడు, నాలుగు నెలలకోసారి ఒక నెల పెన్షన్‌ను మాత్రమే ఇస్తోంది. రాజధాని కోసం 33 వేల ఎకరాలను భూసమీకరణ ద్వారా తీసుకోవడంతో 29 గ్రామాల్లో వ్యవసాయ పనులు లేకుండా పోయాయి. వాటిపై ఆధారపడిన భూమిలేని నిరుపేద వ్యవసాయ కూలీలు రోడ్డున పడడంతో వారికి పెన్షన్లు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. కానీ ఎప్పుడూ సమయానికి పెన్షన్లు ఇవ్వలేదు. 20,605 మంది కూలీలకు ప్రతి నెలా రూ.5.15 కోట్లను పెన్షన్ల కింద ఇవ్వాల్సి ఉంది. ఈ సంఖ్యను ప్రతి నెలా మారుస్తున్న సీఆర్‌డీఏ కచ్చితంగా దాన్ని పంపిణీ చేయడంలో విఫలమవుతోంది. జూలై, ఆగస్టు పెన్షన్లు బకాయి ఉండగా, రెండు రోజులు ఆగితే సెప్టెంబర్ బకాయి కూడా జాబితాలో చేరనుంది. చాలా రోజుల నుంచి అడుగుతుండడంతో వినాయక చవితి ముందు జూన్ పెన్షన్‌ను కూలీల అకౌంట్‌లో వేశారు.

తీవ్ర ఇబ్బందులు పడుతున్న కూలీలు..

ప్రతి నెలా ఇవ్వాల్సిన పెన్షన్‌ను మూడు, నాలుగు నెలలకోసారి ఇస్తుండడంతో కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అసలే పనులు లేక నానా బాధలు పడుతున్నారు. ఇప్పుడు ఈ పెన్షన్ కూడా సకాలంలో అందకపోవడంతో పస్తులుంటున్నారు. గతంలో చేతి నిండా పని ఉండడంతో రోజుకు రూ.500 నుంచి రూ.800 సంపాదించేవారు. ప్రస్తుతం వ్యవసాయ పనులు లేకపోవడంతో పరిసర ప్రాంతాలకు పనుల కోసం వలస వెళుతున్నారు. అక్కడకు వెళ్లినా పని దొరుకుతుందనే గ్యారంటీ లేకుండా పోయింది. నిధుల కొరత వల్లే ప్రతి నెలా పెన్షన్లు ఇవ్వలేకపోతున్నట్లు సీఆర్‌డీఏ వర్గాలు చెబుతున్నాయి. రాజధానిలో తాత్కాలిక సచివాలయం, సీఎం తాత్కాలిక నివాసం వంటి పనులకు రూ.వందల కోట్లు ఖర్చు పెడుతున్న ప్రభుత్వం కూలీలకు నెలా నెలా పెన్షన్లు ఇవ్వకపోవడంపై ఆగ్రహం వ్యక్తమవుతోంది.

హిందూ సంప్రదాయాలను గౌరవించాలి

హిందూ దేవాలయ ప్రతిష్టాన పీఠాధిపతి కమలానందభారతీ స్వామీజీ


కమలానందభారతీ స్వామీజీ

వెంకటగిరిరూరల్: సమాజంలోని ప్రతి ఒక్కరూ హిందూ సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించే విధంగా నడుచుకోవాలని హిందూ దేవాలయ ప్రతిష్టాన పీఠాధిపతి కమలానందభారతీ స్వామీజీ పిలుపునిచ్చారు. సంపూర్ణ గ్రామ దేవాలయ సందర్శన రథ యాత్రలో భాగంగా ఆదివారం శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వెంకటగిరి మండలంలోని కె.ఉప్పరపల్లి, కుమ్మరిపేట, జీకేపల్లి, కలవళపూడి, చిన్నపరెడ్డిపల్లి నీలకంఠాపురం, ఎల్లకారు, చిన్నన్నపేట గ్రామాల్లోని ఆలయాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కమలానందభారతీ స్వామిజీ.. భక్తులనుద్దేశించి మాట్లాడారు. ప్రస్తుతం మారుతున్న టెక్నాలజీల కారణంగా పట్టణాలు, గ్రామాల్లో హిందూ సంప్రదాయాలు అంతరించిపోతున్నాయన్నారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించి హిందూ సంప్రదాయానికి పూర్వ వైభవం తీసుకువస్తామని చెప్పారు. గ్రామదేవతలు, గ్రామాల్లోని ఆలయాలను అభివృద్ధి చేసి ఇంటింటా గోవింద నామస్మరణను ఘనంగా కీర్తించాలనే ఉద్దేశంతో దేవాలయ సందర్శన రథయాత్రకు శ్రీకారం చుట్టామని తెలిపారు. అనంతరం తిరుపతి దేవస్థానానికి (టీటీడీ) సంబంధించి ముడుపులను, శ్రీవారి ప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సమతాసేవా ఫౌండేషన్ మండల ధర్మ ప్రచారకులు శేషాద్రి పాల్గొన్నారు.

సీఎంకు వ్యతిరేకంగా పోస్టింగ్‌లను షేర్ చేస్తావా?

'అధికార' సూచనలతో యువకుడికి పోలీసుల వేధింపులు

పలమనేరు: ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా ఉన్న ఓ పోస్ట్‌ను వాట్సాప్‌లో షేర్ చేసిన యువకుడిపై పోలీసులు వేధింపులకు దిగారు. అధికార పార్టీ నేతల సూచనలతో బెంగళూరు నుంచి ఆ యువకుడిని రప్పించి రెండు రోజుల పాటు పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించారు. బాధితుడి వివరాల ప్రకారం... చిత్తూరు జిల్లా వీకోట మండలం మోటుపల్లికి చెందిన శ్రీనివాసులురెడ్డి కుమారుడు శశికుమార్‌రెడ్డి బెంగళూరులో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. 4 రోజుల కిందట సీఎంకు వ్యతిరేకంగా ఉన్న ఓ పోస్టింగ్ తన మొబైల్‌కు వచ్చింది. దాన్ని అతడు వాట్సాప్ గ్రూప్‌లో షేర్ చేశాడు. ఇది స్థానికంగా వైరల్ అయింది. దీనిపై అధికార పార్టీ నేతల సూచనలతో పోలీసులు రంగంలోకి దిగారు. రెండ్రోజుల కిందట ఎస్సై రాజశేఖర్ శివకుమార్‌రెడ్డిని స్టేషన్‌కు పిలిపించారు. 'సీఎంకు వ్యతిరేకంగా పోస్టింగ్‌లను షేర్ చేస్తావా' అంటూ వారి స్టైల్‌లో బెదిరించారు. తనను ఎందుకిలా తీసుకొచ్చారని బాధితుడు విన్నవించినా పోలీసులు పట్టించుకోలేదు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ కన్వీనర్ బాల గురునాథ్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వెంకటేశ్ గౌడ తదితరులు స్టేషన్ వద్దకు వెళ్లడంతో ఆదివారం సాయంత్రం ఆ యువకుడిని వదిలిపెట్టారు. తమ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపైనా పలువురు పోస్టింగ్‌లు పెట్టారని, వారిని కూడా స్టేషన్‌కు పిలిపించాలని వారు ఫిర్యాదు చేశారు. అయితే దీనిపై పోలీసులు స్పందించలేదు. యువకుడిని నిర్బంధించిన ఘటనపై స్థానిక డీఎస్పీ శంకర్‌ను వివరణ కోరగా, శశికుమార్‌రెడ్డి అనే యువకుడిని వీకోట పోలీసులు తీసుకొచ్చిన మాట వాస్తమేనని చెప్పారు.

'స్టాలిన్'తో దినకరన్ ఒప్పందం

బీజేపీ సీనియర్ నేత సుబ్రమణ్యస్వామి ఆరోపణ

సాక్షి, చెన్నై: డీఎంకే కార్యనిర్వాహక అధ్యక్షుడు స్టాలిన్‌తో అన్నాడీఎంకే దినకరన్ ఒప్పందం కుదుర్చుకున్నారని బీజేపీ సీనియర్ నేత సుబ్రమణ్యస్వామి ఆరోపించారు. ఆదివారం ఆయన చెన్నైలో తమిళ మీడియాతో మాట్లాడారు. పళనిస్వామి ప్రభుత్వాన్ని కూల్చి, స్టాలిన్ నేతృత్వంలో ప్రభుత్వ ఏర్పాటుకు దినకరన్ పథకం రచించినట్లున్నారని అనుమానం వ్యక్తం చేశారు. దినకరన్‌కు మద్దతిచ్చే ఎమ్మెల్యేలు బయటి నుంచి కొంతకాలం స్టాలిన్‌కు మద్దతు ఇస్తారని, తరువాత వారు డీఎంకేలోకి చేరడం ఖాయమని స్వామి వ్యాఖ్యానించారు. అయితే, ఈ వ్యాఖ్యలపై దినకరన్ మాట్లాడేందుకు నిరాకరించారు. కాగా, ఆదివారం ఉదయం దినకరన్‌కు మద్దతు ప్రకటించిన తిరుప్పురగుండ్రంఎమ్మెల్యే బోసు మాట మార్చి పళని స్వామి నాయకత్వంలో తాను పనిచేస్తానని చెప్పారు.

Published and Printed by K.Ramachandra Murthy, Editorial Director on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No. 310, Tadigotla Village, Chintakommadinne Mandal, YSR Kadapa District. 516 003 and Printed at Jagati Publications Limited, Survey No. 310, Tadigotla Village, Chintakommadinne Mandal, YSR Kadapa District. 516 003 EDITOR: V. Murali, Phone No. 08562-200076, 77 RNI Regn No. APTEL/2008/23796.

ఆగస్టు 15 వ తారీఖున
జెండా పండుగకు వెళ్తున్న ఓ స్కూలు విద్యార్థినిని
చెత్తలోకి లాక్కెళ్లారు.

స్వచ్ఛ భారత్ అభియాన్ చెత్తలను దులుపుతుంది.
అలాగే.. మగాడిలో ఉన్న చెత్తను దులపాలి.
స్వచ్ఛ భారత్‌ను మాత్రమే కాదు..

మహిళకు కావలసిన స్వేచ్ఛా భారత్‌ను కూడా ఇవ్వాలి.
జెండా పండుగ రోజు మాత్రమే కాదు.
ప్రతి రోజూ జెండా... మన అమ్మాయిలకు అండగా ఉండాలి.

ప్రియ మోదీజీ • బేటీ బచావో



దివ్యాంకా త్రిపాఠి

‘‘ప్రియమైన నరేంద్రమోదీజీ... స్వచ్ఛభారత్ అభియాన్ కింద రేపిస్టులనే చెత్తను ఏరిపారేసి దేశాన్ని స్వచ్ఛంగా మార్చండి. చెత్తలోనైనా బతకగలం.. కాని ఏ క్షణంలో ఎవరిమీద లైంగిక దాడి జరుగుతుందోనన్న భయంతో మాత్రం బతకలేం!

మీ ‘బేటీ బచావో’ ఏది? ఇప్పటికైనా ఆడపిల్లలను కాపాడండి. కంటే కూతురినే కనాలనే ఆశతో ఉన్నాను. కాని ఈ పరిస్థితులను చూస్తుంటే అమ్మాయిని కనాలంటేనే భయమేస్తోంది. కని.. చూస్తూ చూస్తూ ఈ నరకంలో ఎలా పడేయగలను? మోదీ సర్.. ఈ రేపిస్టులకు ఎలాంటి శిక్ష వేయాలంటే.. జీవితంలో స్త్రీని కన్నెత్తి చూడాలనే ఆలోచనకే వాళ్లు భయపడాలి. మీ మీద నమ్మకం ఉంది. అమ్మాయిల రక్షణ కోసం ఏమైనా చేయండి. స్వతంత్ర్య భారతావనిలో ఇప్పుడు జరగాల్సింది మహిళా స్వాతంత్ర్య పోరాటమే!’ అంటూ ప్రధానికి ఘాటుగా చిన్న ఉత్తరంలాంటి ట్వీట్ చేశారు ఓ వ్యక్తి.

అంతేకాదు ‘‘70 ఏళ్ల స్వపరిపాలన మనకు స్వేచ్ఛనివ్వలేదు. అలాంటి పార్టీలకు మనం ఓటెందుకు వేయాలి? స్త్రీలను అలక్ష్యం చేసే పార్టీలకు వోటు వేయకండి. మహిళలకు చోటులేని గడ్డ ఇది. రేపిస్టుల స్వర్గం. పార్టీలూ ఇప్పటికైనా కళ్లు తెరవండి. ఈ దేశంలోని ప్రతి ఆడపిల్లకూ రక్షణకావాలి’’ అంటూ మహిళలను అభ్యర్థిస్తూ కూడా మరో ట్వీట్ చేశారు అదే వ్యక్తి.

అడుగడుగునా పొంచి ఉన్న ప్రమాదాల నుంచి తన పిల్లలను కాపాడుకునే తల్లి పాత్రను అద్భుతంగా పోషించింది. ఆ మనసు కేవలం సీరియల్ వరకే కాదు రియల్‌గా కూడా ఉందని నిరూపించింది తన ట్వీట్స్ ద్వారా!

ఆ మనస్తత్వం, ఆమె వ్యక్తిత్వమే ఈ వారం దివ్యాంక ‘బయో’ను ఆవిష్కరించేలా చేసింది.

టీవీచిత్రంగా...

తన భవిష్యత్ గురించి తండ్రి ఒక కలకన్నాడు. అడ్వంచర్ అంటే ప్రాణం పెట్టే తను ఆర్మీఆఫీసర్ కావాలనే గోల్‌ను సెట్ చేసుకుంది. పోటీలంటే సహజంగా ఉన్న ఆసక్తి అందాల, అభినయ పోటీల్లో పాల్గొనేలా చేసింది. అయితే ఎక్కడ గురి తప్పని దివ్యాంక తన ఆశయం, లక్ష్యం విషయంలో మాత్రం గురి తప్పి.. చిత్రంగా నటిగా టర్న్ తీసుకుంది. ముందుగా దూరదర్శన్‌లో ప్రసారమయ్యే టెలీఫిలిమ్స్‌తో డెబ్యూ ఇచ్చింది. ఆ తర్వాత కామెడీ సర్కస్ సీజన్స్‌లోనూ సందడి చేసింది. ఆర్‌జే మంత్ర, అనూప్ సోనీతో జతకట్టి చేసిన కామెడీ సర్కస్ ఆమెకు మంచి గుర్తింపునే ఇచ్చాయి. అదే.. జీటీవీ ‘బనూ మే తేరి దుల్హన్’ అనే సీరియల్‌లో ఆమెకు చాన్స్‌నిచ్చింది. ఇది దివ్యాంక తొలి టీవీ సీరియల్. నటనా కౌశలాన్ని ప్రదర్శించే స్కోప్ దొరికింది. ఆ అభినయానికి అబ్బురపడ్డారు యావత్‌దేశ మహిళా ప్రేక్షకులు. ఈ సీరియల్ ఆమెకు స్టార్

యే హై మొహబ్బతే..

ఇవన్నీ ఒకెత్తయితే.. డాక్టర్ ఇషితా భల్లా పాత్ర ఒకటి ఒకెత్తు. అది యే హై మొహబ్బతే సీరియల్‌లో మెయిన్‌రోల్. ఇషితా భల్లా పేరే తన అసలు పేరుగా స్థిరపడ్డంత పాపులర్ అయింది ఆ సీరియల్‌లోని తన రోల్. అవార్డ్స్ ఫంక్షన్స్‌లో తనను స్టేజ్ మీదకు కూడా డాక్టర్ ఇషితా భల్లా ఉరఫ్ దివ్యాంక త్రివేది అని పిలిచేంతగా నోటెడ్ అయింది. ఒక ఇల్లాలిగా.. తన కుటుంబాన్ని, తల్లిగా పిల్లలను సంభాళించుకునే తీరు, మల్టీటాస్కింగ్ ఉమెన్‌గా తను చూపిన ప్రతిభకు ప్రేక్షకులు మంత్రముగ్ధులయ్యారు. అయితే తల్లి మినహా మిగిలినవన్నీ ఆమెలోని గుణాలే కాబట్టి.. యే హై మొహబ్బతేలో దివ్యాంక డాక్టర్ ఇషితా భల్లా పాత్రలో సహజంగా ఒదిగిపోయింది. కాబట్టే ఆ పాత్రకు అంత జీవం వచ్చింది. ప్రేక్షకుల అభిమానానికి నోచుకుంది. మొన్న పదిహేను ఆగస్టున ఓ ఆడపిల్లకు జరిగిన అన్యాయానికి ఘాటుగా స్పందించి తనలోని తల్లి మనసునూ చూపించింది.

అవార్డులు..: 2007లో డ్రామా కేటగరీ కింద ఇండియన్ టెలివిజన్ అకాడెమీ అవార్డ్ అందుకుంది. అదేయేడు ఇండియన్ టెలీ అవార్డ్స్ ‘ ఫ్రెష్ ఫేస్’అవార్డునూ సొంతం చేసుకుంది. ఇవికాక 2008, 2012, 2014, 2015, 2016, 2017ల్లో వివిధ చానెళ్లకు సంబంధించి బెస్ట్ యాక్ట్రెస్ అవార్డులనూ తీసుకుంది.

అనుబంధాలు.. బంధాలు

దివ్యాంకలోని చురుకుదనం, అందం, సామాజిక బాధ్యతను చూసి శరద్ మల్హోత్ర అనే నటుడు ఆమెతో ప్రేమలో పడ్డాడు. ఆ మాటే దివ్యాంకతో చెప్పాడు. కెరీర్‌లో పీకల్లోతులో మునిగిపోయిన ఆమె ప్రేమలో పడే చాన్స్ లేదంది. ఆ సమాధానంతో మిన్నకుండి పోలేదు శరద్. మళ్లీ అడిగాడు. ఒప్పుకుంది దివ్యాంక. ప్యూర్‌వెజిటేరియన్ అయిన ఆమె అతనికోసం నాన్‌వెజ్ వండడం కూడా నేర్చుకునేంత ప్రేమలోపడింది. తొమ్మిదేళ్లు సాగిన ఆ అనుబంధం దివ్యాంకకు వచ్చిన ఫేమ్‌తో శరద్‌కు పుట్టిన అసూయ కారణంగా బీటలు వారి కూలిపోయింది. కుంగిపోయింది దివ్యాంక. అయితే ఓటమి అంటే నచ్చని ఆమె అంతే వేగంగా కోలుకుంది. యే హై మొహబ్బతే



విజయంతో పూర్వపు ఉత్సాహాన్ని తెచ్చుకుంది. ఆ క్రమంలోనే ఆ సీరియల్‌లోని నటుడైన వివేక్ దహియాకు దివ్యాంకా అంటే అభిమానం పెరిగింది. కామన్‌ఫ్రెండ్స్ ద్వారా ఆమె గురించి విన్న ఆయన ఆ అభిమానాన్ని ఇష్టంగా మార్చుకున్నాడు. కష్టంలో నిబ్బరం కోల్పోని ఆమె మనోధైర్యం వివేక్ ఎంతో నచ్చింది. ఆ కామన్‌ఫ్రెండ్స్ ద్వారే దివ్యాంక పట్ల తనకున్న ప్రేమను ఆమెకు తెలియజేశాడు. అప్పుడప్పుడే కోలుకుంటున్న దివ్యాంక ఆ ప్రేమసందేశాన్ని విని నవ్వి ఊరుకుంది. స్నేహితుడిగానైనా కొనసాగనివ్వమనే రిక్వెస్ట్ వివేక్ నుంచి. అదే మౌనంతో అంగీకారం తెలిపింది ఆమె. కొన్నాళ్లకు ఆ స్నేహం ప్రేమగా మారి 2016, జూలై 8న పెళ్లిబంధంగా ముడిపడింది. టీవీ ఇండస్ట్రీలోనే చక్కటి జంటగా పేరూ పొందింది.

వీటికి కారణం, నేపథ్యం..

చండీఘర్‌లో మొన్న పంద్రాగస్టు రోజు ఉదయం.. స్కూల్లో జెండావందనం కోసం వెళ్తున్న పన్నెండేళ్ల అమ్మాయిపై ఓ వ్యక్తి జరిపిన లైంగికదాడి.

ఈ విషాదాన్ని అన్ని వార్తా చానళ్లు తెలిపాయి. సున్నిత హృదయులు స్పందించారు. ఆ స్పందనల్లోవే పైన ట్వీట్స్ కూడా! 70 ఏళ్ల స్వాతంత్ర్య ఫలం... 71వ స్వాతంత్ర్యదినోత్సవం మూటగట్టుకున్న అపకీర్తిని.. ఆగ్రహం, ఆవేదన, అభ్యర్థనగా వెలిబుచ్చిన ఆ ట్వీట్స్ ఒక స్త్రీ మూర్తివి. కాజల్, ఐ లైనర్, మస్కారా, లిప్‌స్టిక్, ఆర్క్‌లైట్స్ మధ్య ఆర్టిఫీషియల్ నవ్వులు, గ్లిజరిన్ ఏడుపులు, లాజిక్‌కి అందని సెంటిమెంట్ల అభినయాలు పూసే గ్లామర్ తోటలోని ఓ పువ్వు ఆమె! బుల్లితెర నటి.. పేరు దివ్యాంకా త్రిపాఠి. వయసు 32 ఏళ్లు. ‘‘బనూ మై తేరీ దుల్హన్’’ ఫేమ్.. ఇంకా చెప్పాలంటే అశేషజనాన్ని ఆకట్టుకుంటున్న ‘‘యే హై మొహబ్బతే’’ నటి!

టీవీ ప్రొడక్షన్స్‌లోనూ బోలెడు అవకాశాలను తెచ్చిపెట్టాయి.



సామాజిక స్పృహ

దివ్యాంకకు చిన్నప్పటి నుంచీ పుస్తకాలంటే పిచ్చి. జానపద కథలు, పౌరాణికాల దగ్గర్నుంచి సాంఘిక నవలలు, జీవిత చరిత్రల వరకు అన్నిటినీ చదువుతుంది. ఇష్టమైన నవల ‘గాడ్‌ఫాదర్’. పుస్తకాలంటే మోజు పెరిగినప్పటి నుంచి గాడ్‌ఫాదర్‌ను ఎన్నిసార్లు చదివిందో లెక్కేలేదట. అలాగే ఆ నవల ఆధారంగా వచ్చిన గాడ్‌ఫాదర్ సినిమా అంటే కూడా అంతే ఇష్టం అంటుంది.

పుస్తక పఠనం వల్లే సమాజంలోని సమస్యల పట్ల సోయి పెరిగిందని, అవగాహన వచ్చిందని, స్పందించే తత్వమూ అలవడిందని చెప్తుంది. అందుకే బుల్లితెర సెలబ్రిటీగా కాకుండా తనకున్న వ్యక్తిగత ఆసక్తితోనే సామాజిక కార్యక్రమాల్లో పాలుపంచుకుంటానంటుంది. అలాంటిదే 2011లో గ్లోబల్ ఇనీషియేటివ్ ‘సైబర్‌డూడూ డిఫెండర్ ఆఫ్ లైఫ్’కి అంబాసిడర్‌గా వ్యవహరించడం. ఇది చైల్డ్‌రైట్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ సంస్థ. ఇలాంటి సామాజిక అంశాలకు చెందిన ఎన్నో టెలీఫిలిమ్స్‌లో నటించి దేశ పౌరురాలిగా తన బాధ్యతను చాటుకుంది ఆమె. జానపద కథలంటే ఉన్న ఆసక్తితో బుందేల్‌ఖండ్ (మధ్యప్రదేశ్)కి చెందిన ఓ జానపదకథ ఆధారంగా తీసిన ‘లాలా హర్‌దువాల్’ అనే సినిమాలో నటించింది. ఇందులో ఆమె రాణి పద్మావతి పాత్రను పోషించింది.


ఆకాశవాణి : దివ్యాంక పుట్టింది,పెరిగింది మధ్యప్రదేశ్ రాజధాని భూపాల్‌లో. తండ్రి నరేంద్ర త్రిపాఠి. ఫార్మాసిస్ట్. తల్లి నీలం త్రిపాఠి.. గృహిణి. దివ్యాంక అక్క.. ప్రియాంక త్రిపాఠి, తమ్ముడు.. ఐశ్వర్య త్రిపాఠి. అతను పైలట్. స్థూలంగా ఇదీ ఆమె కుంటుంబం. భోపాల్‌లోని కార్మెల్ కాన్వెంట్ స్కూల్లో పాఠశాల విద్యను పూర్తి చేసుకుంది దివ్యాంక. ఆ ఊళ్లోనే సరోజినీ నాయుడు గవర్నమెంట్ గర్ల్స్ పీజీ కాలేజ్‌లో గ్రాడ్యుయేషన్ చేసింది. స్కూల్లో ఉన్నప్పుడే రేడియో అనౌన్సర్‌గా చేరింది. ఇది ఆమె తొలి కొలువు. అందుకున్న జీతం ఎనిమిదివందల రూపాయలు. టీవీ నటిగా ఇప్పుడు ఎపిసోడ్‌కు లక్షరూపాయల పారితోషికం తీసుకుంటున్నా ఆ ఎనిమిది వందల రూపాయల వేతనమే చాలా విలువైంది అంటుంది దివ్యాంక.

మిస్ భూపాల్ : కూతురిని ఎన్‌సీసీలో చేర్పించాలని దివ్యాంక వాళ్ల నాన్న కోరిక. ‘భూపాల్ రైఫిల్ అకాడమీ’లో తన పేరు నమోదు చేసుకుంది. షూటింగ్‌లో శిక్షణ కూడా పొందింది. బంగారు పతకమూ సాధించింది. ఆమె గురి అలాంటిది మరి! అందుకే మల్టిపుల్ టాస్క్‌ను ఛేధించింది. తండ్రికోసం ఎన్‌సీసీ.. సాహసాలంటే తనకు ఆసక్తి కాబట్టి ఉత్తరకాశిలోని నెహ్రూ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మౌంటెనీరింగ్‌లో జాయిన్ అయింది. పట్టుతప్పకుండా ఆ కోర్స్‌ను కంప్లీట్ చేసింది. కెరీర్‌ను ఆ దిశగా నిర్మించుకునేలోపే 2003లో స్నేహితుల బలవంతం మీద ‘పాంటీన్ జీ తీన్ క్వీన్’ బ్యూటీ కాంటెస్ట్‌లో పాల్గొంది. ‘మిస్ బ్యూటిఫుల్ స్కిన్’గా ఎన్నికైంది. దీంతో ఆ తర్వాత యేడాది జరిగిన ‘ఇండియా బెస్ట్ సినీస్టార్స్ కి ఖోజ్’ అనే ఓ టీవీ కాంటెస్ట్‌కు తన పేరును పంపించారు ఇంట్లోవాళ్లు. పెద్ద ఆసక్తితో వెళ్లలేదు కాని పాల్గొన్నాక ఇంట్రెస్ట్ పెరిగింది దివ్యాంకకు. భోపాల్‌జోన్‌కు గెలుపు ఖాయం చేసుకుంది. ఈ ఉత్సాహంతో తానే 2005లో జరిగిన ‘మిస్ భూపాల్’ బ్యూటీ కాంటెస్ట్‌కి వెళ్లింది. అడుగుపెట్టిన చోటల్లా విజయమే కనుక.. అక్కడా మిస్ భూపాల్ క్రౌన్‌ను ధరించి వచ్చింది.

- శారాది

ఆత్మీయం

అర్ధసత్యాలను నమ్మొద్దు!



దశోపనిషత్తుల్లో రెండవది కేనోపనిషత్తు. ఈ కేనోపనిషత్తు ఆత్మ అంటే ఏమిటో, బ్రహ్మమంటే ఏమిటో వివరిస్తుంది. ఆత్మ శక్తితోనే చెవి వినగలుగుతోంది. మనస్సు గ్రహిస్తోంది. వాక్కు పలుకుతోంది. ప్రాణం ఉంటోంది. కన్ను చూస్తోంది. ఈ సత్యాన్ని, ఆత్మ తత్వాన్ని తెలుసుకున్నవారు అమృతత్వాన్ని పొందుతారు.

ఈ ఆత్మను... అనగా బ్రహ్మపదార్థాన్ని ఎలా చూడాలి? ఎలా చెప్పాలి... అంటే,

దానిని కళ్లతో చూడలేము. వాక్కుతో చెప్పలేము. మనసుతో తెలుసుకోలేము. అది మనకు తెలిసిన వాటన్నింటికీ వేరైనది. తెలియని వాటికి పైన ఉంటుంది. అయితే, తెలియనిదానిని గురించి ఒక్కొక్కరు ఒక్కో విధంగా ఊహించి అదే సత్యం అనుకుంటారు. నలుగురు గుడ్డివాళ్లు ఏనుగు ఎలా ఉంటుందో తెలుసుకోవాలనుకున్నారు. ఒకడు తొండం పట్టుకుని తొండమే ఏనుగు అన్నాడు. మరొకడు తోక పట్టుకొని తోకే ఏనుగు అన్నాడు. ఇంకొకడు కాలు, మరొకడు దంతాన్ని పట్టుకుని అనే ఏనుగు అనుకున్నారు. వారికి తెలిసిన పాక్షిక సత్యాన్ని అజ్ఞానంతో అహంకారంతో సంపూర్ణ సత్యంగా ప్రకటిస్తున్నారు. పాక్షిక సత్యాన్ని విని మోసపోవద్దని చెప్పడం కేనోపనిషత్తు విశిష్టత. దేనిని మాటలతో చెప్పలేమో, దేనితో మాటలు ఏర్పడ్డాయో అదే అసలైన బ్రహ్మపదార్థం. భ్రమతో అనుకునేది నిజమైనది కాదు. ఏది మనస్సుకు తెలియదో, దేనివల్ల మనస్సు అన్నిటినీ తెలుసుకోగలుగుతోందో అనే అసలైన బ్రహ్మం. దేనిని కళ్లతో చూడలేమో, దేనివల్ల కళ్లు చూడగలుగుతున్నాయో అదే బ్రహ్మం. దేనిని చెవితో వినలేమో, దేని వల్ల చెవి వినగలుగుతోందో అదే బ్రహ్మం. దేనిని ప్రాణం బతికించలేదో ప్రాణం దేనివల్ల ఉంటున్నదో అదే బ్రహ్మం అని తెలుసుకోవాలి. అంతేకానీ, పాక్షిక సత్యాలను తాత్కాలిక ఫలితాలను నమ్మి మోసపోవద్దని కేనోపనిషత్తు చెబుతోంది. మాటలతో, మనసుతో, చూపుతో, వినికిడితో, ప్రాణంతో పరబ్రహ్మ జ్ఞానం కలిగినట్లు భావించరాదు. అంతరిక్షంలోకి పోయే వాహనంలో కొన్ని భాగాలు ఎక్కడికక్కడ విడిపోయి పడిపోతూ ఉంటాయి. అసలైన ఉపగ్రహాన్ని పైకి చేర్చటమే వాటి పని. అంతేకాని అవి ఉపగ్రహం కావు. వాక్కు, మనస్సు, కన్ను, చెవి, ప్రాణం అలాంటివి. సగుణపాసన అలాంటిదే అని కేనోపనిషత్తు స్పష్టంగా చెబుతోంది.

గుడ్ ఫుడ్

ఇనుములాంటి ఒంటి కోసం మినుములు



మినుములు తింటే ఇనుమంత బలం అన్నది మన వాడుక. దీనిలోని పోషకాలు మంచి వ్యాధి నిరోధక శక్తిని సమకూరుస్తాయి కాబట్టి... వ్యాధి కారకాలకు మన ఒళ్లు ఇనుములాగే తోస్తుంది. దాంతో ఎన్నో రకాల జబ్బుల నుంచి నివారణ సాధ్యమవుతుంది. వంద గ్రాముల మినుముల్లో 18 గ్రాముల పీచు (ఫైబర్) ఉంటుంది. ఒక గ్రాము పొటాషియమ్, రెండు గ్రాముల కొవ్వులతో పాటు విటమిన్ సి, విటమిన్ బి–కాంప్లెక్స్‌లోని బి1, బి3 వంటివి పుష్కలంగా ఉంటాయి. అలాగే క్యాల్షియమ్, మెగ్నీషియమ్, ఫాస్ఫరస్, ఐరన్ కూడా ఎక్కువే. మినుములతో ఒనగూరే ప్రయోజనాల్లో కొన్ని...

- మినుముల్లో ప్రోటీన్ పాళ్లు ఎక్కువ. ప్రోటీన్లు కండరాల రిపేర్లకు ఉపయోగపడతాయి. పైగా మినుముల్లో వాపు, మంటను తగ్గించే యాంటీ–ఇన్‌ఫ్లమేటరీ గుణం ఉంది. కాబట్టి గాయాలైన వారికి అవి త్వరగా తగ్గడానికి మినుములు మంచి ఆహారం.
- ఇక మినుముల్లో దాదాపు 72 శాతం పీచు ఉండటం వల్ల మన జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతాయి. అంతేగాక మలబద్ధకం, ఇరిటబుల్ బవెల్ సింఢ్రోమ్ వంటి సమస్యలను స్వాభావికంగానే తొలగిస్తాయి. అంతేకాదు... జీర్ణ వ్యవస్థకు సంబంధించిన డయేరియా, డిసెంట్రీ వంటి సమస్యలు ఉన్న వారు కూడా మందులకు బదులు మినుముతో చేసిన వంటకాలను వాడవచ్చునని ఆహార నిపుణులు సిఫార్సు చేస్తున్నారు.
- గుండె జబ్బులను నివారించే అద్భుతమైన గుణం మినుములకు ఉంది. ఇందుకు మినుముల్లో పుష్కలంగా ఉన్న పొటాషియం, పీచుపదార్థాలే కారణం. అవి రక్తంలోకి వెలువడే చక్కెర, కొలెస్ట్రాల్ పాళ్లను గణనీయంగా తగ్గిస్తాయి. పొటాషియమ్ వల్ల రక్తపోటు తగ్గుతుంది.
- కీళ్లనొప్పులనుంచి ఉపశమనం కలిగించే గుణం కూడా మినుములకు ఉంది.
- స్వాభావికమైన పీచు ఎక్కువగా ఉండటం వల్ల డయాబెటిస్ సమస ఉన్నవారికి మినుములు మంచి ఆహారం.

లవ్ డాక్టర్ — నన్నడగొద్దు ప్లీజ్



ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

హాయ్ సర్! నేను ఒక అమ్మాయిని లవ్ చేస్తున్నాను. ఆ అమ్మాయి కూడా నన్ను లవ్ చేస్తోంది. కానీ వాళ్ల ఇంట్లో ఒప్పుకోవడం లేదు! మా పేరెంట్స్ అయితే.. 'వాళ్లు ఒప్పుకుంటేనే పెళ్లి చేసుకోండి! లేదంటే వద్దు!!' అంటున్నారు. నాకు వాళ్ల ఇంటికి వెళ్లి అడిగే ధైర్యం లేదు. ఆ అమ్మాయి చెబితే వాళ్లు వినడంలేదు. సో ఇప్పుడు నన్ను ఏం చెయ్యమంటారో చెప్పండి సార్ ప్లీజ్!

- హరీష్



నీలాంబరీ! వెంటనే మార్కెట్‌కి వెళ్లి రా.
'ఎందుకు సార్?!?'
అర్జెంట్‌గా వెళ్లు!
'అర్ కైకూ.. జానా.. మార్కెట్‌కు..'
ఎహే?!?
'అదే సార్ హిందీలో అడుగుతున్నా మార్కెట్‌కు ఎందుకు వెళ్లాలని?'
వై హిందీ..?
'హైదరాబాద్ మార్కెట్‌లో హిందీ ఎక్కువ సార్...'
ఓకే.. వెంటనే మార్కెట్‌కి వెళ్లు...!
'ఏమి తేవడానికి అని అడుగుతున్నా..'
నేను చెబుతా కదా నువ్వు బయలుదేరు!
'ఫోన్‌లో చెబుతారా సార్..!'
ఎస్!
'ఇప్పుడు చెప్పరా?'
నో
'వై..?'
అది అంతే...



'ఇప్పుడు చెబితే ఏమవుతుంది..?'
ఇప్పుడు.. ఇక్కడ.. చెబితే నువ్వు నమ్మవు!
'మైండ్ బ్లాక్ అయ్యిందా సార్.. తొక్క మీద కాలేశారా సార్.. కరెక్ట్‌గా చెప్పండి!'
సరే చెబుతా విను!
'నేనక్కడికి వెళ్లి ఏం తేవాలి... చెప్పండి'
మార్కెట్‌కి వెళ్లి ఒక కిలో ధైర్యం తీసుకురా!
'సార్..!?!'
హరీష్ వాళ్ల ఇంట్లో ధైర్యం అయిపోయిందట!!
'అయితే మార్కెట్‌లో దొరుకుద్దా సార్? ధైర్యం??'
ఆ ముక్క హరీష్‌కి చెప్పు.. ఎక్కడయితే ప్రేమ కలుగుతుందో.. ధైర్యం కూడా అక్కడే దొరుకుతుంది!

ప్రేమ, ఆకర్షణ, టీనేజ్ అనుబంధాల్లోని అయోమయం మిమ్మల్ని గందరగోళపరుస్తుంటే ప్లీజ్ ఈ అడ్రస్‌కు మాత్రం అస్సలు రాయకండి.
లవ్ డాక్టర్, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, రోడ్ నంబరు 1, బంజారాహిల్స్, హైదరాబాద్-34. lovedoctorram@sakshi.com

నీకు చెప్పలేను!



'మీ ఫీజెంతో చెప్పండి డాక్టర్..?'
అడిగాడు పేషెంట్
'నువ్వసలే హార్ట్ పేషెంట్‌వి.
నీ తరపు వారినెవరినైనా పిలువు
వారికి చెబుతా..!' అన్నాడు డాక్టర్.

శ్రావ్యా.. ప్లీజ్..!



'నేనేంటి మీకు?'
గుడ్లు తేలేశాడు శ్రీరామ్.
'నేనేంటి మీకు?'
గద్దించింది శ్రావ్య.
'అర్థం కాలేదు శ్రావ్యా. భర్తకు భార్య ఏమౌతుంది? భార్యే కదా!' అన్నాడు శ్రీరామ్.
'అవుతుంది నిజమే. నేను మీకు అయ్యానా..' అంది శ్రావ్య.
శ్రీరామ్ భయంగా చూశాడు.
అది ఆఫీస్ టైమ్. ఆఫీస్‌కు వెళ్లే ముందు కానీ, ఆఫీస్ నుంచి వచ్చాక కానీ సడన్‌గా ఇలా టాటా, బైబై చెబుతుంటుంది శ్రావ్య.
'ఏంటి అవడం శ్రావ్యా?'.. వెనక్కు వస్తూ అన్నాడు.
'నేను మీ భార్యను అని కదా అన్నారు. అనడం వరకేనా? అనుకోవడం వరకూనా?'
'అనుకోకుండా అనడం ఉంటుందా ఎక్కడైనా?'
'కానీ నాకు తెలుస్తోంది శ్రీరామ్.. మీకు నా మీద ప్రేమ పోయింది'.
'ఎలా చెప్తావ్ శ్రావ్యా?'
'పెళ్లికి ముందు మీరిలా లేరు!'
'ఇలా' అంటే?
'అప్పుడున్నట్లు ఇప్పుడు లేరు'.
'అప్పుడెలా ఉండేవాడిని?'
'అది కూడా గుర్తు లేదా?'
'గుర్తు లేకపోవడం కాదు శ్రావ్యా.. ఇప్పుడున్నట్లే అప్పుడూ ఉన్నట్లు గుర్తు. నీకు కోపం వచ్చిందని అర్థం అవుతూనే ఉంది కానీ.. ముందు 'మీరు' అనడం ఆపు నన్ను'.
'అప్పుడు నా కోసం ఎదురు చూసేవాడివి. నా మాట కోసం ఆరాటపడేవాడివి. నా నవ్వు కోసం...'
'ఇప్పుడు?'
'చూశావా.. నా మాట వినడం కూడా విసుగ్గా ఉంది నీకు!'
'విసుగా?!
'నా నవ్వు కోసం నువ్వేం చేసేవాడివో చెప్పబోతుంటే వినకుండా.. 'ఇప్పుడు?' అని బ్రేక్ చేశావ్.
'ఏం బ్రేక్ చేశాను?'
'నా మాటను బ్రేక్ చేశావ్?'
'సరే.. చెప్పు. నీ నవ్వు కోసం నేనేం చేసేవాడిని?'
'అక్కర్లేదు'.
'ఏంటక్కర్లేదు'
'నా నవ్వు కోసం నువ్వేం చేసేవాడివో నేను గుర్తు చెయ్యనక్కర్లేదు. నువ్వు గుర్తుకు తెచ్చుకోనక్కర్లేదు'.
'ఏమైంది శ్రావ్యా.. నీకు? టార్చర్ పెడుతున్నావు తెలుసా?'
'టార్చరా!! నువ్వా, నేనా.. టార్చర్ పెడుతున్నది శ్రీరామ్?'
'రాత్రంతా బాగానే ఉన్నావ్ కదా!'
'బాగా.. ఉన్నానా?!
'అదే.. శ్రావ్యా.. మన మధ్య గొడవేం జరగలేదు కదా అని!'
'గొడవ జరగ్గపోతే బాగున్నట్టు.. గొడవ జరిగితే బాగోలేనట్టు.. ఏంటిది శ్రీరామ్? ఏం మాట్లాడుతున్నావ్?'
'బాగోవడం, బాగోలేకపోవడం.. గొడవల వల్లే కదా శ్రావ్యా?'
'మరి ఏ గొడవా లేకుండానే.. అప్పుడెందుకు నువ్వు అన్నిసార్లు 'ఏంటి శ్రావ్యా అలా ఉన్నావ్?' అని అడిగేవాడివి?!
'అప్పుడు.. అంటే?'
'పెళ్లికి ముందు'.
'పెళ్లికి ముందా?!'
'అవును. అప్పుడు ఒంట్లో బాగున్నా.. 'అలా ఉన్నావేంటి?' అని అడిగేవాడివి. ఇప్పుడు ఒంట్లో బాగోలేకున్నా 'ఎలా ఉన్నావ్?' అని కూడా అడగడం లేదు'.
'పెళ్లికి ముందు.. పెళ్లికి తర్వాత.. ఒకేలా ఎలా ఉంటుంది శ్రావ్యా?'
'చూశావా.. నువ్వే ఒప్పుకున్నావ్.. మారిపోయానని'
'నేను మారిపోవడం, నువ్వు మారిపోవడం కాదు శ్రావ్యా.. ప్రేమలో ఎలా ఉంటామో.. పెళ్లి తర్వాత కూడా అలా ఉండలేం అని అంటున్నా'.
'అంటే.. ప్రేమ ఉండదనా.. శ్రీరామ్?'
'ఉండదు అని కాదు శ్రావ్యా.. ఉందీ అని చెప్పడానికి సరిపడినంత టైమ్ ఉండదూ అని'.
'ప్రేమ ఉంటే టైమ్ ఉండదా శ్రీరామ్?'
'మనసుంటే.. మార్గం ఉండదా అన్నట్లు అడిగావ్ శ్రావ్యా. పెళ్లికి ముందు నీ కోసం ఎదురు చూసింది నిజమే. ఇప్పుడూ చూస్తున్నా.. ఆఫీస్‌లో ఉండి, నీ ఫోన్ కాల్ కోసం! పెళ్లికి ముందు నీ మాట కోసం ఆరాటపడిన మాట నిజమే. ఇప్పుడూ పడుతున్నా.. నా పది మాటలకు అలకలో నువ్వొక్క మాటైనా బదులు చెప్పనప్పుడు. పెళ్లికి ముందు కట్టు కథలు చెప్పి నిన్ను నవ్వించాలని చూసింది నిజమే. ఇప్పుడూ చెప్పాలని ట్రయ్ చేస్తున్నా..' అన్నాడు శ్రీరామ్ నీరసంగా.
'సో.. ట్రయ్ చేస్తున్నావ్. ప్రేమగా ఉండడానికి ట్రయ్ చేస్తున్నావ్. ప్రేమించడానికి ట్రయ్ చేస్తున్నావ్. ప్రేమ లేకున్నా, ప్రేమ ఉన్నట్లు నమ్మించడానికి ట్రెయ్ చేస్తున్నావ్. అంతే తప్ప.. నిజంగా నీకు నా మీద ప్రేమ లేదు'.
'శ్రావ్యా.. ప్లీజ్. ఆఫీస్‌కి టైమ్ అవుతోంది. బయల్దేరేదా?'
'వెళ్లండి. కానీ సమాధానం చెప్పి వెళ్లండి'.
'దేనికి సమాధానం?'
'నేనేంటి మీకు?'
('నువ్వు' లోంచి మళ్లీ 'మీరు' లోకి వచ్చేసింది శ్రావ్య).

ప్రతి సంసారంలోనూ కొన్ని ఇబ్బందులుంటాయి. అప్పటికవి పెద్దవే. ఎలాగోలా గట్టెక్కుతాం. వాటివల్లనే సంసారం బలపడుతుంది. ఆ అనుభవంతో చిన్న, పెద్ద ఇబ్బందులను దాటుకుని హాయిగా జీవించడం నేర్చుకుంటాం. కొంతకాలం తర్వాత వెనక్కి తిరిగి చూసుకుంటే అదసలు సంకటమే కాదనిపిస్తుంది, పొట్ట చెక్కలయ్యేలా నవ్వొస్తుంది కూడా. అలాంటి సరదా సంఘటనలను అక్షరాలతో కళ్లకు కట్టండి. సాక్షి పాఠకులతో పంచుకోండి.
ఈ మెయిల్: samsaaram2017@gmail.com

సినిమాలో సంసారం

(మణిరత్నం 'సఖి' చిత్రంలోని సీన్ ఇది. మాధవన్, షాలిని లవ్ కపుల్. పెద్దల్ని కాదని, పెళ్లి చేసుకుని వేరుగా ఓ అపార్ట్‌మెంట్‌లో ఉంటారు. ఇద్దరివీ ఉద్యోగాలు. సాయంత్రం మాధవన్ వచ్చేటప్పటికి ఇంటికి తాళం వేసి ఉంటుంది. బయట చాలా సేపటిగా వెయిట్ చేస్తాడు. చేస్తూ ఉంటాడు...)

సారీ, కూరలు తేవడానికి వెళ్లాను. లేటైంది.
నలభై ఐదు నిముషాలుగా వెయిట్ చేస్తున్నాను.
సారీ.. ర.. (ర అంటే.. ఇంట్లోకి రమ్మని)
లేటౌతుందంటే తాళం చెవి పైన పెట్టి వెళ్లొచ్చుగా.
కొంచెం లేటయింది. దానికింత కోపమా?
నువ్వు ఎక్కడికైనా వెళ్లి, ఎంత లేటుగా అయినా రావచ్చు. నేను మాత్రం బయట వెయిట్ చెయ్యాలా?
నేను మాత్రం ఏమైనా షికార్లు కొట్టడానికి వెళ్లానా? మీకు వండి పెట్టడానికేగా వెళ్లాను.
ఎవరు కాదన్నారు? నన్నెందుకు బయట గూర్ఖాలా వెయిట్ చెయ్యించడం?
పెళ్లికి ముందు మూడు గంటలు వెయిట్ చెయ్యలా.. బీచ్‌లో. ఇప్పుడు పది నిముషాలు వెయిట్ చెయ్యలేరా?
అది వేరు..
వేరు అంటే?!
అదప్పుడు పెళ్లి కాక ముందు.
మరి పెళ్లి తర్వాత? అంతేనా?
ఇప్పుడు ఆ మాట ఎవరన్నారు? తలుపు తియ్.
ఇప్పుడు నువ్వన్నావ్‌గా.
తలుపు తియ్ శాంతీ.
మాట మార్చకు.
తలుపు తియ్.
మరెందుకన్నావ్?
నువ్ మాత్రం ఎందుకలా మాట్లాడావ్?
నువ్వు అన్నావా లేదా?
బయట నించుని ఇప్పుడు గొడవ దేనికి? లోపలికి పద చెప్తాను.
చెప్పు నాకు.
చెప్తాను పదా...
(లోపలికి వెళ్లగానే షాలిని అలక తీర్చేపనిలో పడిపోతాడు మాధవన్)



సంసారంలో పడ్డాక, బాధ్యతల్లో తలమునకలై మునుపటి ప్రేమానురాగాలు తగ్గినట్లు అనిపిస్తుంది కానీ, నిజంగా తగ్గినట్లు కాదు. గొడవలు, అలకలు కూడా ప్రేమానురాగాల్లో భాగమే.

సెల్ఫ్ చెక్

ఇబ్బంది పెడుతున్నారా?

"ఎందుకు అలా అందరినీ విసిగిస్తావ్. నీ పని చేసుకోరాదూ!" అని పిల్లలపై తల్లిదండ్రులు కోప్పడటం సహజం. అన్ని విషయాలూ తెలుసుకోవాలన్న ఉత్సాహం పిల్లల్లో ఉంటుంది. అందుకే వారు అలా చేస్తుంటారు. పిల్లల సందేహాలను తీర్చవలసిన బాధ్యత పెద్దలపై ఉంటుంది. అయితే పెద్దయ్యాక ఉద్దేశపూరకంగా అందరికీ ఇబ్బంది కలిగిస్తుంటే? ఇతరులను అర్థం చేసుకోకపోతే? ఎదుటి వారిని ఏడిపించే ఆనందిస్తుంటే... అది ఒకరకంగా ఎదుటి వారి స్వేచ్ఛకు భంగం కల్గించటమే. మీరూ ఇతరులను ఇబ్బందికి గురి చేస్తుంటారా?

1. మీరనుకున్నది చేసేదాకా ఊరుకోరు. దీనివల్ల ఇతరులకు ఇబ్బంది కలుగుతుందని ఆలోచించరు.
ఎ. కాదు ☐ బి. అవును ☐
2. ఇతరును గేలి చేయటం మీకు సరదా.
ఎ. కాదు ☐ బి. అవును ☐
3. మీకంటే ఉన్నతంగా ఉన్నవారంటే మీకు నచ్చదు. వారిని ఆపాలనుకుంటారు
ఎ. కాదు ☐ బి. అవును ☐
4. మీ వల్ల ఇబ్బంది కలుగుతుందని ఎవరైనా కంప్లైంట్ ఇస్తే ఊరుకోరు.
ఎ. కాదు ☐ బి. అవును ☐
5. ఇతరుల సొంతవిషయాలను గుచ్చి గుచ్చి అడుగుతారు. వారి విషయాలు మనకెందుకు అని అనుకోరు.
ఎ. కాదు ☐ బి. అవును ☐
6. మీతో మాట్లాడటం కొందరికి ఇష్టం లేకపోయినా వారివద్దకే వెళ్లి మాట్లాడే ప్రయత్నం చేస్తారు.
ఎ. కాదు ☐ బి. అవును ☐
7. ఎవరైనా పర్సన్‌లా మాట్లాడుకునేటప్పుడు మీరు తప్పుకోరు. వారి మాటల్లో జోక్యం చేసుకుంటారు.
ఎ. కాదు ☐ బి. అవును ☐
8. మీమాట వినని వారిని ఇబ్బంది పెడతారు. మీమాటే వినాలన్న పంతం మీలో ఉంటుంది.
ఎ. కాదు ☐ బి. అవును ☐
9. అందరూ మిమ్మల్నే అనుసరించాలనుకుంటారు.
ఎ. కాదు ☐ బి. అవును ☐
10. మీ ప్రాధాన్యం తగ్గితే భరించలేరు.
ఎ. కాదు ☐ బి. అవును ☐



'బి' సమాధానాలు ఏడు దాటితే మీ ప్రవర్తన వల్ల ఇతరులు బాధపడుతుంటారని చెప్పక తప్పదు. ఇతరుల వ్యక్తిగత విషయాల్లో తల దూర్చకుండా ఉండటం నేర్చుకోండి. 'ఎ' లు ఆరు దాటితే మీ వల్ల ఎవరికీ ఇబ్బందికలగదు. మీ ప్రవర్తన హద్దులు దాటదు.

కాసుకో సుడోకు

		4	8	6		3	9	7
	6	1			2			
				4	9	1	6	
1	9	6		8		4		
	3						7	
		2		9		8	3	1
	5	9	4	7				
			9			7	8	
4	8	7		1	3	9		

నిబంధనలు: ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా,నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3X3 చదరం లోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

5	2	3	1	9	4	6	7	8
8	7	6	3	5	2	1	9	4
1	9	4	8	6	7	2	5	3
4	6	8	7	3	1	5	2	9
2	3	7	5	4	9	8	1	6
9	5	1	2	8	6	4	3	7
3	1	5	4	7	8	9	6	2
7	4	9	6	2	5	3	8	1
6	8	2	9	1	3	7	4	5

నిన్నటి జవాబు

ఈ వారం YouTube హిట్స్

ఆశలు వదులుకోవద్దు
జాన్ సీనా రియాక్ట్స్ । ఫ్యాన్స్ సర్‌ప్రైజ్

రెస్లింగ్‌లో ఉద్దండులను మట్టి కరపించిన అమెరికన్ మల్లయోధుడు జాన్ సీనా.. ఒక చిన్న ఎమోషన్‌కి వలవల ఏడ్చేశారు. ఆ దృశ్యం ఇప్పుడు యూట్యూబ్‌ను కదిలిస్తోంది. యు.ఎస్.లోని ఒక వైర్‌లెస్ సంస్థ ప్రమోషన్ కోసం ఆయన తన అభిమానుల నుంచి వచ్చిన 'థ్యాంక్స్ గివింగ్' ఉత్తరాలను చదువుతున్న క్రమంలో ఒక వీడియోను కూడా చూడవలసి వచ్చింది. ఆ వీడియో పంపిన పిల్లవాడు, మిగతా ఉత్తరాలు రాసిన అభిమానులు ఆ పక్క గదిలోనే ఉన్న సంగతిని జాన్ సీనాకు తెలియకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేసుకున్నారు. 'నెవర్ గివ్ అప్' అనేది సీనా తరచూ అనే మాట. ఆ మాట ప్రపంచ వ్యాప్తంగా ఎందరికో స్ఫూర్తిని ఇచ్చింది. అయినవాళ్లను కోల్పోయిన వారు, అవయవాలను పోగొట్టుకున్నవారు, డిప్రెషన్‌తో పోరాడిన వారు, గాయాల బారిన పడినవారు.. ఇలా ఎందరిలోనో జాన్ సీనా 'నెవర్ గివ్ అప్' (ఆశలు వదులుకోవద్దు) అంటూ ఆత్మవిశ్వాసాన్ని నింపారు. అందుకు వాళ్లు జాన్ సీనాకు ధన్యవాదాలు తెలిపే ప్రచార కార్యక్రమం ఇది. ఇందులో భాగంగా టేలర్ షీవేర్ అనే బాలుడు పంపిన వీడియోను జాన్ సీనా చూస్తున్నప్పుడు.. వీడియోలో ఆ బాలుడి మాటలకు సీనా కదిలిపోయారు. కంటతడి పెట్టారు. 'డియర్ జాన్ సీనా.. మా అమ్మకు క్యాన్సర్ అని తెలిసి మేమంతా షాక్ తిన్నాం. ఆ చేదు నిజాన్ని విని మా అమ్మ తట్టుకోలేకపోయింది. బాధపడకు మమ్మీ... నీకు నయం అవుతుంది అని చెప్పాను. వెంటనే తను గట్టిగా నన్ను చుట్టేసుకుని రోదించింది. డియర్ సీన్.. అప్పుడు నేను.. 'నెవర్ గివ్ అప్ మమ్మీ' అన్నాను. అనడం మాత్రమే కాదు. రెజ్లింగ్ బరి బయట ఓసారి మీరు నా చేతికి కట్టిన బ్యాండ్‌ను విప్పి మా అమ్మకు కట్టాను. ఇది జాన్ సీనా బ్యాండ్. నెవర్ గివ్ అప్ బ్యాండ్. క్యాన్సర్‌తో చేసే పోరాటంలో చివరికి నువ్వే గెలుస్తావు మమ్మీ' అని తనతో చెప్పాను'.. అని టేలర్ చెబుతుంటే.. జాన్ సీనాకు ఒక్కసారిగా కన్నీళ్లు వచ్చేశాయి. అకస్మాత్తుగా అప్పుడే పక్క గదిలోనే ఉన్న టేలర్.. అడ్డుగా ఉన్న పేపర్ వాల్‌ను చీల్చుకుని వచ్చి జాన్ సీనా ఎదురుగా నిలుచున్నాడు. సీనా ఆశ్చర్యంతో, ఆనందంతో చిన్నారి టేలర్‌ను గట్టిగా గుండెలకు హత్తుకున్నాడు. మరి కొందరు అభిమానులతో జాన్ సీనా షేర్ చేసుకున్న ఉద్విగ్న అనుభవాలను కూడా మీరు ఈ వీడియోలో చూడొచ్చు.



నిడివి 5 ని. 4 సె.
హిట్స్ 25,80,314

బీచ్ ఉలిక్కి పడింది!
బ్లూ ఏంజెల్స్ స్నీక్ పాస్ రియాక్షన్

చికాగో బీచ్ ఉల్లాసంగా, ప్రశాంతంగా ఉంటుంది. అలల హోరు కూడా ఆహ్లాదకరంగా ఉంటుంది. అక్కడి వాళ్లు, చుట్టుపక్కల నుంచి వచ్చినవాళ్లు వీకెండ్స్‌లో ఇక్కడ భలే ఎంజాయ్ చేస్తారు. అయితే ఈవారం అదనంగా, ఊహించని విధంగా వారికి ఎక్స్‌ట్రా ఆనందం లభించింది. అది భయానక ఆనందం! సముద్రాన్ని చూస్తో, ఆకాశాన్ని చూస్తూ, ఇసుకను చూస్తూ, ఆడుతున్న పిల్లల్ని చూస్తూ, ఆయాస పడుతున్న పెద్దల్ని చూస్తూ ఎవరికి వారు మైమరిచి ఉన్న క్షణంలో అకస్మాత్తుగా వారి మధ్యలోంచి, నెత్తిపైన 100 అడుగుల సమీపంలోంచి ఓ 'బ్లూ ఏంజెల్' దూసుకుపోయింది. అంతా కెవ్వుమన్నారు. ఆ వెంటనే పకపకా నవ్వుకున్నారు. బ్లూ ఏంజెల్ అంటే భూతం కాదు, భూతం లాంటి పక్షీ కాదు. అది విమానం. యు.ఎస్.నౌకాదళంలోని ఈ బ్లూ ఏంజెల్ విమానాలు తరచూ ఇక్కడ విన్యాసాలు చేస్తూ భూ ఉపరితలానికి సమీపంగా, మనుషుల తలలకు తగులుతాయేమోనన్నంత దగ్గరగా.. జుయ్‌న వచ్చి వెళ్లిపోతుంటాయి. వీడియో చూడండి. మీరూ ఉలిక్కిపడతారు.



నిడివి 2 ని. 43 సె.
హిట్స్ 2,63,244



నిడివి 16 సె.
హిట్స్ 38,36,445

ఒక్కరూ తగ్గరు
పటేల్ కి పంజాబీ షాదీ

మనం సంస్కృతి, సంప్రదాయాలు, వివాహ వ్యవస్థ గొప్పదనం ఇవన్నీ చూపిస్తే ఎవరు చూస్తారు? ఆ సంగతి దర్శకుడికీ, నిర్మాతకు తెలియకుండా ఉంటుందా? అందుకే ఫ్యామిలీ సెంటిమెంట్‌లను, ఫన్నీ మూమెంట్‌లను.. భంగారా, గార్బా డాన్సులకు, ధోక్లా, పరాటాలకు కలిపి సినిమా తీశారు. 'పటేల్‌కి పంజాబీ షాదీ' అని సినిమాకు పేరు పెట్టారు. ఆ చిత్రం ట్రెలరే ఈ వీడియో. సినిమా సెప్టెంబర్ 15న విడుదల అవుతోంది. ఇందులో రిషీ కపూర్ పంజాబీ. పరేశ్ రావల్ గుజరాతీ. పాయల్ ఘోష్ పరేశ్ రావల్ కూతురు. రిషీ కపూర్ కొడుకు వీర్ దాస్. పిల్లలిద్దరూ ప్రేమించుకుంటారు. పెద్దలిద్దరూ పెళ్లి చేయాలి. ఎలా చేస్తారు? పక్కపక్క ఇళ్లల్లో ఉన్నా.. ఎవరిల్లు వారిదే. ఎవరి టేస్టులు వారివే. మధ్యలోకి 'ప్రేమ' అనే కొత్త టేస్ట్ వచ్చి రిషీ, రావల్‌ల జీవితాలను తికమక పెట్టేసింది. సతమతం చేసేసింది. మరో వైపు పిల్లల ప్రేమ ట్రాక్ చాలా ఇన్నోసెంట్‌గా చకచక నడిచేస్తుంటుంది. ఆ అమాయకత్వంతోనే పెద్దల్ని ఓడించి, తమ ప్రేమను గెలిపించుకుంటారు.



నిడివి 3 ని. 17 సె.
హిట్స్ 1,60,73,078

కవలల కామెడీ
జుడ్వా 2: ట్రైలర్

మరో కవల సోదరుల కథ ఇది. మొదటి కథ వట్టి 'జుడ్వా'. 1997లో వచ్చింది. అందులో సల్మాన్ ఖాన్ డబల్ యాక్షన్. కరిష్మా కపూర్, రంభ.. హీరోయిన్లు. ఇప్పుడీ జుడ్వా 2 లో వరుణ్ ధావన్ డబల్ యాక్షన్. తాప్సీ, జాక్వెలీన్ హీరోయిన్లు. దాని డైరక్షను ధావనే, దీని డైరెక్షనూ ధావనే. దాని నిర్మాత, దీని నిర్మాతా ఒక్కరే... సాజిద్ నదియావాల. సేమ్ థీమ్‌తో 1994లో తెలుగులో 'హలో బ్రదర్' వచ్చింది. మరి ఇప్పుడీ జుడ్వా 2 ఏ విధంగా భిన్నంగా ఉండబోతోంది? కొత్త తరం నటులు పండించే పాత తరం నవ్వుల్లో ఏదో ఒక నవ్యత్వం లేకుండా పోతుందా? ఇందులో ఇంకా.. ఓ డాక్టర్ గారు (అలీ సాగర్), ఓ 'టైగర్ ది విలన్ (వివాన్ భటేనా) సపోర్టింగ్‌గా కొన్ని నవ్వుల్ని రువ్వబోతున్నారు. కథలో కూడా స్పీడ్ ఉండొచ్చని ట్రైలర్‌ని చూస్తుంటే అనిపిస్తుంది.

నాకోసం నా కుటుంబంతో యుద్ధం చేయిస్తుంటా – రాజమౌళి


● రానా, నాగచైతన్య, కీరవాణి, సాయి కొర్రపాటి, కృష్ణ మరిముత్తు, రాజమౌళి, కార్తికేయ, సురేశ్‌బాబు

''ట్రైలర్‌ను బట్టి... ఓ సామాన్యుడు శక్తివంతమైన ప్రతినాయకుడితో యుద్ధం చేయడమనేది ఈ చిత్రకథ. నాకది బాగా నచ్చింది. చైతన్య కథల సెలక్షన్ బాగుంది. నేనైతే ఫ్యామిలీ కోసం యుద్ధం చేయను. నా కోసం నా ఫ్యామిలీతో యుద్ధం చేయిస్తుంటా'' అన్నారు రాజమౌళి. నాగచైతన్య, లావణ్యాత్రిపాఠి జంటగా కృష్ణ మరిముత్తు దర్శకత్వంలో రజనీ కొర్రపాటి నిర్మించిన 'యుద్ధం శరణం' ప్రీ–రిలీజ్ వేడుక ఆదివారం జరిగింది. వివేక్ సాగర్ స్వరపరిచిన పాటల సీడీలను యం.యం. కీరవాణి, ట్రైలర్‌ను రాజమౌళి విడుదల చేశారు. తొలి సీడీని రాజమౌళి, డి. సురేశ్‌బాబు అందుకున్నారు. రాజమౌళి మాట్లాడుతూ– ''నా సిన్మాలకు తప్ప మా ఆవిడ (రమా రాజమౌళి) ఇతర సిన్మాలకు కాస్ట్యూమ్ డిజైనర్‌గా చేయదు. తనకేదీ ఓ పట్టాన నచ్చదు. నా సిన్మాల్లోనైనా ఏదైనా పాయింట్ బాగోలేదంటే నిర్మొహమాటంగా చెప్తుంది. కృష్ణ చెప్పిన కథ నచ్చడంతో ఈ సిన్మా చేయడానికి ఒప్పుకుంది. ''బాహుబలి'లో ప్రతి పాత్రకు మనమెంత ప్రీ–వర్క్ చేశామో... కృష్ణ కూడా అలానే ఈ సిన్మాలో పాత్రలను డిజైన్ చేశాడు. ఈ సిన్మాకు వర్క్ ఎగ్జయిటింగ్‌గా ఉంది'' అని చెప్పింది. తొలిసారి తనంత పాజిటివ్‌గా చెప్పడంతో సినిమాపై చాలా నమ్మకం ఏర్పడింది. తర్వాత సెట్‌కి వెళ్లినప్పుడు, ఇందులో కొన్ని డైలాగులు విన్నప్పుడు సినిమా హిట్టని ఫిక్సయ్యా'' అన్నారు. ''తెలుగులో కొత్త ప్రతిభను ప్రోత్సహించడంలో సాయిగారు కేరాఫ్ అడ్రస్. నేను, కృష్ణ 4వ తరగతి నుంచి క్లాస్‌మేట్స్. 8వ తరగతిలో ఒక అమ్మాయినే ప్రేమించాం. అప్పుడా యుద్ధంలో నేను గెలిచా. ఇప్పుడీ యుద్ధంలో తనే గెలుస్తాడు. వివేక్‌సాగర్ మంచి మ్యూజిక్ ఇచ్చారు. ఈ సిన్మాలో హీరో ఎక్కువగా ఏ ఆయుధం వాడడు. కొత్తగా ఉంటుందీ సిన్మా'' అన్నారు నాగచైతన్య. ''చైతు, కృష్ణకీ మధ్య మంచి వేవ్‌లెంగ్త్ ఉంది. అది సెప్టెంబర్ 8న తెలుస్తుంది. నా సిన్మాల కంటే చైతూ సిన్మాలు బాగా ఆడాలని కోరుకుంటా'' అన్నారు రానా. ''చైతన్యగారితో నెక్స్ట్ మూవీ చేయాలనుకుంటున్నాం'' అని మైత్రి మూవీ మేకర్స్ నవీన్ తెలిపారు. నిర్మాతలు శోభు యార్లగడ్డ, లగడపాటి శ్రీధర్, దర్శకుడు ఇంద్రగంటి, దర్శక–నటుడు అవసరాల పాల్గొన్నారు.


● రజనీకి ప్రోస్థెటిక్ మేకప్ చేస్తున్న వాన్స్ హార్ట్‌వెల్

ఎందుకీ ముసుగులు?

...'2.0' మేకింగ్ వీడియో చూసిన కొందరికి ఈ డౌటొచ్చింది. ముసుగులు కావవి. మరేంటి? అంటే... ప్రోస్థెటిక్ మేకప్ టెక్నిక్. ఇదేంటి? మేకప్ అంటే ముఖం కనిపించాలి కదా! కానీ, కొంచెం కూడా కనిపించకుండా మొత్తం కవర్ చేసేస్తున్నారేంటి? అనుకుంటున్నారా! కవర్ చేయడం కాదు, కొలతలు తీసుకుంటున్నారు. రజనీకాంత్, అక్షయ్‌కుమార్‌ల ఫేస్ కొలతలు తీసుకుంటున్నారు. ఈ కొలతలను సిన్మాకు అవసరమైన మాస్క్స్ తయారు చేయడానికి, గ్రాఫిక్స్‌కి ఉపయోగిస్తారు! ఇంతకీ, ఆ కొలతలు తీసుకుంటున్నది ఎవరో తెలుసా? ప్రముఖ హాలీవుడ్ మేకప్ ఆర్టిస్ట్ వాన్స్ హార్ట్‌వెల్. 'లార్డ్ ఆఫ్ ద రింగ్స్', 'ఐరన్ మాన్', 'లైఫ్ ఆఫ్ పై' తదితర హిట్ సిన్మాలకు ఈయన వర్క్ చేశారు. '2.0'లో రజనీకాంత్ ఐదు గెటప్స్‌లో కనిపిస్తారట. అందులో రోబో గెటప్ ఒకటి. అలాగే, విలన్‌గా అక్షయ్‌కుమార్ క్రౌమ్యాన్‌గా కనిపించనున్న సంగతి తెలిసిందే. ఈ రెండు గెటప్స్ మేకప్ కోసం గంటలు గంటలు పట్టేదని సమాచారం. శంకర్ దర్శకత్వంలో లైకా ప్రొడక్షన్స్ సంస్థ నిర్మిస్తున్న ఈ '2.0' మేకింగ్ వీడియోను వినాయక చవితి సందర్భంగా విడుదల చేశారు. అమీ జాక్సన్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాకు ఏఆర్ రెహమాన్ స్వరకర్త. వచ్చే ఏడాది జనవరి 25న సినిమా విడుదల కానుంది.


● '2.0'లో రజనీకాంత్


● టబు

కేంద్రమంత్రిగా టబు!

టబు రాజకీయాల్లోకి వచ్చారు. ఎంపీగా గెలిచి, కేంద్రమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు! ఇదంతా ఎప్పుడు జరిగింది అనుకుంటున్నారా? టబు కేంద్రమంత్రి బాధ్యతలు స్వీకరించనుంది రియల్ లైఫ్‌లో కాదు... రీల్ లైఫ్‌లో! అదీ సంగతి. భారత విదేశాంగ మంత్రి సుష్మా స్వరాజ్ పాత్రలో టబు నటించనున్నారని బాలీవుడ్ వర్గాల టాక్. ఉజ్మా అహ్మద్ అనే భారతీయురాలిని పాకిస్థాన్‌కు చెందిన తాహిర్ బెదిరించి, బలవంతంగా పెళ్లి చేసుకోవడం, సుష్మా స్వరాజ్ బాధితురాలికి అండగా నిలిచి, ఇండియాకి రప్పించిన సంగతి అందరికీ తెలిసిందే. బాలీవుడ్ దర్శకుడు ధీరజ్ కుమార్ ఇప్పుడు ఉజ్మా అహ్మద్ జీవితకథను తెరపైకి తీసుకువచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారట. ఉజ్మా పాత్రలో పరిణీతి చోప్రా, సుష్మా స్వరాజ్ పాత్రలో టబును ఎంపిక చేసినట్లు సమాచారం.

నవ్విస్తూ భయపెడతా... నాలుగోసారి


● రాఘవా లారెన్స్

ఒకటోసారి... 'ముని'. రెండోసారి... 'కాంచన'. మూడోసారి... 'గంగ'. ఇప్పటివరకు హారర్ కామెడీ 'ముని' సిరీస్‌లో మూడు సిన్మాలొచ్చాయి. రాఘవా లారెన్స్ హీరోగా నటించి, దర్శకత్వం వహించిన ఈ మూడూ ప్రేక్షకులను నవ్వించాయి, భయపెట్టాయి. ఓ రకంగా చెప్పాలంటే హారర్ కామెడీ సిన్మాల్లో ట్రెండ్ సెట్టర్‌గా నిలిచాయి. ఇప్పుడు నాలుగోసారి ప్రేక్షకులను నవ్విస్తూ, భయపెట్టడానికి రాఘవా లారెన్స్ రెడీ అయ్యారు. ప్రస్తుతం 'ముని–4' స్క్రిప్ట్ వర్క్ జరుగుతోంది. వచ్చే నెలలో చిత్రీకరణ ప్రారంభించనున్నారు. ''ప్రస్తుతం కథకు కీలకమైన ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్స్ రాస్తున్నా. 'కాంచన'లో ట్రాన్స్‌జెండర్స్ సమస్యలను చూపినట్టు ఇందులో ఓ సోషల్ ఇష్యూను ప్రస్తావిస్తా. ఇందులో ఇద్దరూ లేదా అంతకంటే ఎక్కువమంది హీరోయిన్లు నటిస్తారు'' అని రాఘవా లారెన్స్ పేర్కొన్నారు.

దెయ్యంగా కాజల్?!

'ముని–4'లో కాజల్ నటిస్తారట. అదీ దెయ్యంగా! చెన్నై కోడంబాక్కమ్‌లో ఇప్పుడిదే హాట్ టాపిక్. రాఘవా లారెన్స్‌కు జోడీగా నటించమని కాజల్ అగర్వాల్‌కు ఓ ఆఫర్ వచ్చిన మాట వాస్తవమే. అయితే... 'ముని–4' కోసం ఆమెను అడగలేదు. రాజమౌళి శిష్యుడు మహదేవ్ దర్శకత్వంలో లారెన్స్ హీరోగా నటించే సినిమా కోసం సంప్రదించారు. నిజం చెప్పాలంటే... ఈపాటికి ఆ సినిమా మొదలవ్వాలి. విజువల్ ఎఫెక్ట్స్ బేస్డ్ సిన్మా కావడంతో ప్రీ–ప్రొడక్షన్ వర్క్‌కు టైమ్ తీసుకుంటున్నారు. అందువల్ల, 'ముని–4' ముందుకొచ్చింది. ఒకవేళ ఈ సినిమాలో కాజల్ నటిస్తే అందమైన దెయ్యంగా కనిపిస్తారట! మహదేవ్ సినిమాకు రాజమౌళి తండ్రి వి. విజయేంద్రప్రసాద్ కథ అందిస్తున్నారు. ఆ సంగతలా ఉంచితే.. ఒక వేళ 'ముని–4'లో నటిస్తే? మహదేవ్ దర్శకత్వంలో లారెన్స్ హీరోగా రూపొందనున్న చిత్రంలోనూ కాజల్ నటిస్తారా? వెయిట్ అండ్ సీ!!


● కాజల్ అగర్వాల్

బాలయ్య డబ్బులిచ్చి సినిమాలు ఆడించలేదు – మోహన్‌బాబు


● పూరి జగన్నాథ్, ఆనందప్రసాద్, మోహన్‌బాబు, బాలకృష్ణ, శ్రియ, చార్మీ కౌర్

''బాలయ్య ఒక చరిత్ర సృష్టించాడు. సిల్వర్‌జూబ్లీ, గోల్డెన్‌జూబ్లీ రికార్డులు క్రియేట్ చేశాడు. ఇది నిజం... డబ్బులు ఇచ్చి సినిమాలు ఆడించలేదు'' అని మంచు మోహన్‌బాబు అన్నారు. బాలకృష్ణ హీరోగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో వి. ఆనందప్రసాద్ నిర్మించిన సినిమా 'పైసా వసూల్'. అనూప్ రూబెన్స్ స్వరకర్త. ఆదివారం రాత్రి హైదరాబాద్‌లో ఆడియో సెలబ్రేషన్స్ జరిగాయి. మోహన్‌బాబు మాట్లాడుతూ– ''ప్రపంచం గర్వించదగ్గ మహానటుడు మా అన్నయ్య ఎన్టీఆర్. ఆయన కుమారుడు బాలయ్య ఎంతో ప్రేమగా, ఆప్యాయంగా నన్ను పిలవడంతో చెన్నై వెళ్లాల్సి ఉన్నా... ఇది నా ఇంటి ఫంక్షన్ కాబట్టి వచ్చా. 'పైసా వసూల్' 101కోట్ల కంటే ఎక్కువ వసూలు చేయాలి'' అన్నారు. బాలకృష్ణ మాట్లాడుతూ– ''నాకు మోహన్‌బాబుగారితో చనువు ఎక్కువ. ఆయన్ను తరచూ కలుస్తుంటా. నేనెక్కువగా కథలు, సినిమాల గురించి ఆలోచించను. నాకు, పూరీకి మధ్య ఈ కథ గురించి ఎక్కువ డిస్కషన్ జరగలేదు. చేసేద్దామనుకుని మొదలుపెట్టాం. మా ఇద్దరికీ పని తప్ప వేరే ఆలోచన లేదు. నిర్మాత బాగుండాలన్నదే మా తపన. అభిమానులు, ప్రేక్షకులు నా నుంచి ఆశించే అన్ని హంగులూ ఉన్న చిత్రమిది'' అన్నారు. ''బాలయ్య బాబుతో సినిమా చేయాలనే కోరిక ఈ 'పైసా వసూల్'తో తీరింది. ఆయనతో మరెన్నో సినిమాలు చేసే ఛాన్స్ ఇస్తారని ఆశిస్తున్నా. చెన్నైలో స్టంట్ మాస్టర్ అసోసియేషన్ 50 వసంతాల సభకు బాలయ్య బాబు, మంచు విష్ణుగారు హాజరయ్యారు. వాళ్ల నాన్నగారి బయోపిక్ గురించి అక్కడి వారితో కొంత డిస్కస్ చేశారు. బాలయ్యబాబు 101వ సినిమా సందర్భంగా ఆయన అభిమానుల్లో 101మంది మెరిట్ స్టూడెంట్స్‌కు రూ. పదివేల చొప్పున అందజేయాలని అనుకుంటున్నాం. సెప్టెంబర్ 1న పూరీగారు పండగ తీసుకొ స్తున్నారు'' అన్నారు నిర్మాత. ''నా లైఫ్‌లో... 'లైట్ పోతుంది, త్వరగా షాట్ తీద్దాం రండి' అని అందర్నీ పిలిచి కెమెరా ముందుకెళ్లి నిలబడిన ఏకైక హీరో బాలకృష్ణగారు. 'నిర్మాతల డబ్బు వృథా కాకూడదు' అని ఫీలయ్యే వ్యక్తి. ఇలాంటి హీరోను నేనిప్పటివరకు చూడలేదు. ఆయన క్రమశిక్షణ, అంకితభావం అమేజింగ్. సేమ్ డెడికేషన్ ఇంతకు ముందు మోహన్‌బాబు గారిలో చూశా'' అన్నారు పూరి. దర్శకుడు ఎ. కోదండరామిరెడ్డి, నాయికలు శ్రియ, కైరా దత్, ముస్కాన్, నటుడు అలీ, ఎగ్జిక్యూటివ్ నిర్మాత అన్నే రవి, లైన్ ప్రొడ్యూసర్ చార్మీ కౌర్, పాటల రచయితలు భాస్కరభట్ల, పులగం చిన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.


● తాతినేని సత్య, సచిన్‌జోషి, సి. కల్యాణ్, శివప్రసాద్ గుడిమిట్ల

ఒకవైపు పాజిటివ్.. మరోవైపు నెగటివ్! – సచిన్ జోషి

సచిన్ జోషి, ఇషా గుప్తా జంటగా తాతినేని సత్య దర్శకత్వంలో రైనా జోషి నిర్మించిన సినిమా 'వీడెవడు'. సెప్టెంబర్ 8న విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్రబృందం హైదరాబాద్‌లో విలేకరులతో మాట్లాడారు. తాతినేని సత్య మాట్లాడుతూ– ''నేను చేసిన 'ఎస్.ఎం.ఎస్, భీమిలి కబడ్డీ జట్టు, శంకర' సినిమాలన్నీ రీమేక్ చిత్రాలే. తెలుగులో నేను చేసిన స్ట్రయిట్ సినిమా 'వీడెవడు'. ఇదొక మంచి థ్రిల్లర్. ప్రేకుకులకు నచ్చే అన్ని అంశాలు ఉంటాయి'' అన్నారు. నిర్మాత సి. కల్యాణ్ మాట్లాడుతూ– ''వైవిధ్యమైన కథతో వస్తోన్న సినిమా ఇది. టైటిల్ చాలా ఆసక్తిగా ఉంది. సత్య చాలా ఇంటెలిజెంట్ స్క్రీన్‌ప్లేతో తెరకెక్కించాడు. సెప్టెంబర్ 2న సినిమా ప్రీ–రిలీజ్ వేడుక నిర్వహిస్తాం'' అన్నారు. ''ఇందులో నాది ఛాలెంజింగ్ క్యారెక్టర్. నా పాత్రలో పాజిటివ్ యాంగిల్, నెగటివ్ యాంగిల్... రెండూ ఉన్నాయి. లవ్, యాక్షన్, స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌లో సినిమా ఉంటుంది. యూనిక్ స్క్రీన్‌ప్లేతో సాగుతుంది. తెలుగు, తమిళ భాషల్లో సెప్టెంబర్ 8న విడుదల చేస్తున్నాం'' అన్నార్ సచిన్ జోషి. ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ శివప్రసాద్ గుడిమిట్ల పాల్గొన్నారు. ఈ చిత్రానికి కెమెరా: బినేంద్ర మీనన్, సంగీతం: ఎస్.ఎస్.తమన్.

స్వచ్ఛమైన ప్రేమ

తనిష్‌రెడ్డి, అలెక్సియస్, సుభాంగి పంత్ హీరో హీరోయిన్లుగా వి. రామకృష్ణ దర్శకత్వంలో రూపొందనున్న చిత్రం 'దర్పణం'. వి. చిన శ్రీశైలం యాదవ్ ఆశీస్సులతో వి. ప్రవీణ్ కుమార్ యాదవ్ (వెంకట్ యాదవ్) నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి దర్శకుడు ఎన్. శంకర్ కెమెరా స్విచ్చాన్ చేయగా, రచయిత పరుచూరి వెంకటేశ్వరరావు క్లాప్ ఇచ్చారు. చిన శ్రీశైలం యాదవ్ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. నిర్మాత ప్రవీణ్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ– ''ఇదొక


● అలెక్సియస్, తనిష్క్‌రెడ్డి, సుభాంగి, పరుచూరి వెంకటేశ్వరరావు

మంచి ప్రేమకథా చిత్రం. స్వచ్ఛమైన ప్రేమ ఎలా ఉంటుందో చూపించబోతున్నాం. దర్శకుడు రామకృష్ణ కథ చెప్పిన విధానం నన్నెంతగానో ఆకట్టుకుంది. సింగిల్ షెడ్యూల్‌లో సినిమాను పూర్తి చేస్తాం'' అన్నారు. దర్శకుడు శ్రీనివాసరెడ్డి, నవీన్ యాదవ్, సంగీత దర్శకుడు సిద్ధార్థ్ సదాశివుని, సహనిర్మాత కేశవ్ దేశాయ్, తనీష్‌రెడ్డి, అలెక్సియస్, సుభాంగి పంత్, రచయిత శివశక్తిదత్తా, నటుడు కాదంబరి కిరణ్, కెమెరామెన్ ప్రభాకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ చిత్రానికి కెమెరా: సతీష్ ముత్యాల, సహనిర్మాతలు: కేశవ్ దేశాయ్, క్రాంతి కిరణ్ వెల్లంకి.

ఆ మూడు లుక్స్ అంటే ఇష్టం!


● ప్రియాంకా చోప్రా

సుమారు 15 ఏళ్ళ కెరీర్‌లో ప్రియాంక ఎన్నో రకాల పాత్రలను పోషించారు. బాలీవుడ్ స్థాయి నుంచి హాలీవుడ్ స్థాయికి ఎదిగారు. హీరోయిన్‌గా గ్లామరస్ రోల్స్‌తో పాటు నాన్–గ్లామరస్ రోల్స్ కూడా చేశారు. ఇప్పటివరకూ చేసిన పాత్రల్లో తనకు మాత్రం మూడు సినిమాల్లోని లుక్స్ అంటేనే ఇష్టం అని చెబుతున్నారు ప్రియాంక. ఫర్హాన్ అక్తర్ డైరెక్షన్‌లో షారుక్ హీరోగా వచ్చిన 'డాన్' చిత్రంలోని 'రోమా' క్యారెక్టర్ లుక్, జోయా అక్తర్ దర్శకత్వంలో వచ్చిన 'దిల్ ధడ్‌కనే దో' సినిమాలో అయేషా క్యారెక్టర్ లుక్, అలీ అబ్బాస్ జాఫర్ దర్శకత్వంలో వచ్చిన 'గుండే' సినిమాలోని నందిత క్యారెక్టర్ లుక్. ''ఈ మూడు లుక్స్ అంటే నాకు చాలా ఇష్టం'' అని పేర్కొన్నారు ప్రియాంక. మేకప్ గురించి మాట్లాడుతూ – ''క్యారెక్టర్ కోసం సెట్‌లో ఉన్నప్పుడు హెవీ మేకప్ వేసుకుంటా. విడిగా మాత్రం సింపుల్ మేకప్‌నే ఇష్టపడతా. కంఫర్ట్‌గా ఉండే డ్రెస్సులే వేసుకుంటా. అలా లేనప్పుడు ఏ బ్రాండ్ అయినా పట్టించుకోను'' అని ప్రియాంక స్పష్టం చేశారు


● అరుణ్ విజయ్

సాహోకి సై

ప్రభాస్ హీరోగా సుజీత్ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'సాహో'. బాలీవుడ్ బ్యూటీ శ్రద్ధా కపూర్ కథానాయిక. ఇంకా ఈ క్రేజీ ప్రాజెక్ట్‌లో బాలీవుడ్ యాక్టర్లు జాకీ ష్రాఫ్, నీల్ నితిన్ ముఖేశ్, చంకీ పాండే విలన్లుగా నటిస్తున్నారు. తాజాగా తమిళ నటుడు అరుణ్ విజయ్ 'సాహో'లోకి ఎంట్రీ ఇవ్వనున్నారు. ఆ మధ్య రామ్‌చరణ్ హీరోగా వచ్చిన 'బ్రూస్‌లీ'లో విలన్ దీపక్ కుమార్ రోల్లో యాక్ట్ చేసి, అరుణ్ విజయ్ టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చారు. ఇప్పుడు 'సాహో'లో నటించబోతున్నట్లు ట్విట్టర్‌లో ప్రకటించారు. ''ప్రభాస్ లాంటి హీరోతో స్క్రీన్ షేర్ చేసుకోబోతున్నందుకు ఆనందంగా ఉంది'' అని అరుణ్ విజయ్ పేర్కొన్నారు.


● ఇలియానా

పెళ్లయితే అంతే!

హీరోయిన్ ఎంత టాలెంటెడ్ అనేది ఇంపార్టెంట్ కాదిక్కడ! పెళ్లైందా? లేదా? అనేది మాత్రమే ఇంపార్టెంట్! ఎంత పెద్ద స్టార్ హీరోయిన్‌కి అయినా పెళ్లైతే ఆటోమేటిక్‌గా ఛాన్సులు తగ్గుతాయంటున్నారు ఇలియానా. 'పెళ్లైన హీరోయిన్లకు సరైన అవకాశాలు రావట్లేదు' అనే అంశం గురించి ఎప్పుడైనా ఆలోచించారా? అని ఇలియానాను అడిగితే... ''యస్, అఫ్‌కోర్స్. అది నిజమే. ఫిల్మ్ ఇండస్ట్రీలో పరిస్థితి అలాగే ఉంది. నేను ఆ పరిస్థితిని అంగీకరించి ముందడుగు వేయడం ఓ ఆప్షన్. లేదా జీవితాంతం దాని గురించి ఫైట్ చేస్తుండడం మరో ఆప్షన్. నేను మొదటి ఆప్షన్‌కు ఓటేస్తా. కానీ, అదో చెత్త ఐడియాలజీ. పెళ్లైన కారణంగా ఎంతోమంది టాలెంటెడ్ హీరోయిన్లకు తమ ప్రతిభకు తగ్గ అవకాశాలు రావడం లేదు. మన కళ్ల ముందు అటువంటి ఉదాహరణలెన్నో ఉన్నాయి. నా వరకు నేను హ్యాపీగా ఉన్నా. వృత్తిపరంగా, వ్యక్తిగతంగా! ఫిల్మ్ ఇండస్ట్రీపై నాకెలాంటి కంప్లయింట్స్ లేవు'' అన్నారు.

ఎదిరించే శక్తి

ప్రియాంకా నాయుడు ప్రధాన పాత్రధారిగా ప్రకాష్ పులిజాల దర్శకత్వంలో రాంబాబు నాయక్ నిర్మించిన చిత్రం 'అనగనగా ఒక దుర్గ'. గడ్డంపల్లి రవీందర్ సమర్పకుడు. హైదరాబాద్‌లో జరిగిన ఈ చిత్రప్రదర్శనకు తెలంగాణ విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్వర్‌రెడ్డి అతిథిగా హాజరయ్యారు. ప్రకాష్ పులిజాల మాట్లాడుతూ– ''ప్రతిఘటన, ఒసేయ్ రాములమ్మ' చిత్రాల స్ఫూర్తితో మా చిత్రాన్ని రూపొందించాం. మహిళలపై జరిగే దాడులను ఎదిరించే శక్తిలా దుర్గ పాత్ర ఉంటుంది. సినిమాను త్వరలో విడుదల చేస్తాం'' అన్నారు. ''ఆడపిల్లలను రక్షించుకోవాలనే సందేశం ఇచ్చాం. మా సినిమా చూసేందుకు వచ్చిన మంత్రి జగదీశ్వర్‌రెడ్డి గారికి కృతజ్ఞతలు'' అన్నారు రాంబాబు నాయక్. ''ఈ చిత్రం స్ఫూర్తితో మరిన్ని చిత్రాలు రావాలి'' అన్నారు అతిథిగా హాజరైన దర్శకుడు ఎన్. శంకర్. ఈ చిత్రానికి సంగీతం: విజయ్ బాలాజీ.


● ప్రియాంకా నాయుడు

కబాలి కూతురి వాలుజడ!

ఈ అమ్మాయి ఎవరో గుర్తుపట్టారా? 'కబాలి'లో రజనీకాంత్ కుమార్తెగా నటించిన సాయి ధన్సిక. 'కబాలి'లో మోడ్రన్‌గా కనిపించిన ధన్సిక కొత్త సినిమా కోసం ఇలా ట్రెడిషనల్‌గా మారారు. తమిళ దర్శకులు చేరన్, గౌతమ్ మీనన్, 'మనం' ఫేమ్ విక్రమ్ కె. కుమార్‌ల వద్ద దర్శకత్వ శాఖలో పనిచేసిన రమణ మల్లం దర్శకుడిగా పరిచయమవుతున్న సినిమా 'వాలుజడ'. 'శరణం గచ్ఛామి, జానకి రాముడు' సినిమాల ఫేమ్ నవీన్ సంజయ్, సాయి ధన్సిక జంటగా నటిస్తున్నారు. హిందీ నటుడు నానా పటేకర్ కీలక పాత్ర చేస్తున్నారు. ఈ సినిమాలో సాయి ధన్సిక ఫస్ట్ లుక్‌ను కాజల్ అగర్వాల్ విడుదల చేశారు. ''వాస్తవ సంఘటనల ఆధారంగా రూపొందుతోన్న ద్విభాషా చిత్రమిది. తమిళంలో 'కుజాళి'గా రూపొందిస్తున్నాం. 50 శాతం చిత్రీకరణ పూర్తైంది. సెప్టెంబర్‌లో భారీ షెడ్యూల్ మొదలవుతుంది'' అన్నారు దర్శకుడు రమణ మల్లం. ఈ చిత్రానికి కెమెరా: సిద్ధార్థ రామస్వామి, కూర్పు: కె.ఎల్. ప్రవీణ్, కళ: కిరణ్, స్టంట్స్: అన్బు–అరియు, సాహిత్యం: చంద్రబోస్, కందికొండ, సంగీతం: రధన్.


● సాయి ధన్సిక

హరియాణాలో హై అలర్ట్

నేడు డేరా చీఫ్ గుర్మీత్ సింగ్‌కు శిక్ష ఖరారు

- రోహ్‌తక్ జైలుకు హెలికాప్టర్‌లో వెళ్లనున్న న్యాయమూర్తి
- హింసపై హెచ్చరించిన ఇంటెలిజెన్స్.. అప్రమత్తమైన పంజాబ్ ప్రభుత్వం
- 144 సెక్షన్ అమలు.. పటిష్టమైన భద్రత ఏర్పాటు
- హరియాణాలో నేడు విద్యాసంస్థలకు సెలవు.. రేపటి వరకు ఇంటర్నెట్‌పై నిషేధం

చండీగఢ్: డేరా సచ్చా సౌదా చీఫ్ గుర్మీత్ రాం రహీమ్ సింగ్ (50)కు అత్యాచారం కేసులో నేడు శిక్ష ఖరారు కానుంది. రోహ్‌తక్ జిల్లా సునరియా జైల్లో ఉన్న గుర్మీత్‌కు జైలు గోడల మధ్యే సీబీఐ కోర్టు న్యాయమూర్తి శిక్ష విధించనున్నారు. 2002 నాటి ఓ అత్యాచార కేసులో డేరా చీఫ్‌ను సీబీఐ కోర్టు శుక్రవారం దోషిగా ప్రకటించటం.. అనంతరం హరియాణా, పంజాబ్, ఢిల్లీ, రాజస్తాన్, ఉత్తరప్రదేశ్‌లలో అతని అభిమానులు విధ్వంసం సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కోర్టు హాల్లో కాకుండా జైల్లోనే గుర్మీత్‌కు శిక్ష ఖరారుచేయాలని సీబీఐ కోర్టు న్యాయమూర్తి నిర్ణయించారు. ఇందు కోసం జైల్లో అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. పంచకుల నుంచి న్యాయమూర్తి జగ్‌దీప్ సింగ్‌ను ప్రత్యేక హెలికాప్టర్‌లో సునరియా జైలుకు తీసుకెళ్లనున్నారు. శుక్రవారం నాటి తీర్పు అనంతరం డేరా అభిమానుల ఉన్మాదకాండలో మృతిచెందిన వారి సంఖ్య 38కి చేరింది.



సిర్సాలో డేరా సచ్చా సౌదా ఆశ్రమం సమీపంలో నిర్మానుష్య వాతావరణం



ఆదివారం డేరా ఆశ్రమం నుంచి వెళ్లిపోతున్న గుర్మీత్ అభిమానులు

హింసపై ఇంటెలిజెన్స్ హెచ్చరిక

గుర్మీత్‌సింగ్‌కు శిక్ష ఖరారు నేపథ్యంలో హరియాణాలో హింస చెలరేగే ప్రమాదం ఉందని ఇంటెలిజెన్స్ హెచ్చరించింది. ఈ గొడవలు కొన్నిరోజులపాటు కొనసాగే అవకాశం ఉందని కూడా వెల్లడించింది. ఈ నేపథ్యంలో శిక్ష ప్రకటించాక మళ్లీ ఉద్రిక్త పరిస్థితులు తలెత్తకుండా ప్రభుత్వ యంత్రాంగం, పోలీసులు పటిష్టమైన ఏర్పాట్లు చేశారు. పంచకుల, సిర్సాలతోపాటుగా రోహ్‌తక్ చుట్టుపక్కన ప్రాంతాల్లోనూ 144 సెక్షన్‌ను అమల్లోకి తీసుకొచ్చారు. గుర్మీత్ సింగ్‌ను విడిపించేందుకు ఆయన అనుచరులు ప్రయత్నిస్తున్నారన్న వార్తల నేపథ్యంలో జైలుకు వెళ్లే మార్గాల్లోనూ అంచెలంచెలుగా భద్రతను కట్టుదిట్టం చేశారు. రోహ్‌తక్ రేంజ్ ఐజీ నవ్‌దీప్ విర్క్ పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. శని, ఆదివారాల్లో హరియాణా, పంజాబ్‌లలో ఎక్కడా గొడవలు జరగలేదని ఆయన తెలిపారు. తీర్పు నేపథ్యంలో ఢిల్లీలోనూ హై అలర్ట్ ప్రకటించారు.

గుర్మీత్‌ను తప్పించే యత్నం

పంచకుల కోర్టులో శుక్రవారం తీర్పు వెలువడిన తర్వాత గుర్మీత్‌ను పోలీసులు అరెస్టు చేసిన సమయంలో ఆయన్ను తప్పించేందుకు ప్రయత్నించారన్న ఆరోపణలపై ఏడుగురు గుర్మీత్ వ్యక్తిగత భద్రతా సిబ్బందిని దేశద్రోహం, హత్యాయత్నం కేసుల కింద పోలీసులు అరెస్టు చేశారు. వీరిలో ఐదుగురు హరియాణా పోలీసులు కూడా ఉన్నారు. సిర్సాలోని డేరా ప్రధాన కార్యాలయంతో (మహిళలు, చిన్నారులు సహా లక్షమంది ఉంటారని అంచనా) పాటుగా వివిధ ఇతర కేంద్రాల్లో ఉన్న మద్దతుదారులు, అభిమానులను వారి ప్రాంతాలకు ప్రత్యేక బస్సుల్లో తరలిస్తున్నారు. డేరా కేంద్రాలన్నింటినీ ఖాళీ చేయాలని ఆర్మీ, పారామిలటరీ బలగాలు ఆదేశించాయి.

శిక్ష ప్రకటించాకే సోదాలు

శిక్ష ఖరారు నేపథ్యంలో హరియాణాలో సోమవారం విద్యాలయాలకు సెలవు ప్రకటించారు. హరియాణా, పంజాబ్‌ల్లోని పలు ప్రాంతాల్లో నిలిపేసిన మొబైల్ ఇంటర్నెట్ సేవలపై నిషేధం కొనసాగుతోంది. మంగళవారం ఉదయం 11.30 వరకు నిషేధం కొనసాగుతుందని అధికారులు తెలిపారు. సిర్సా మినహా పలు ప్రాంతాల్లో కొంతసేపు కర్ఫ్యూను సడలించారు. డేరా సచ్చా సౌదా అకౌంట్ల వివరాలు ఇవ్వాలని బ్యాంకులకు ఆదేశాలు జారీ అయ్యాయి. గుర్మీత్‌కు శిక్ష పడిన తర్వాతే డేరా ప్రధాన కార్యాలయంలో సోదాలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

డేరా కొత్త చీఫ్ హనీప్రీత్!



డేరా సచ్చా సౌదా చీఫ్ గుర్మీత్ రాం రహీమ్ సింగ్‌కు ఓ కూతురు ఉంది. ఆమె పేరు హనీప్రీత్ సింగ్ ఇన్సాన్ (30). 'తండ్రి ముద్దుల కూతురు, పరోపకారి, దర్శకురాలు, సంపాదకురాలు, నటి' ఇవి సోషల్ మీడియాపై హనీప్రీత్ సింగ్ పరిచయ వాక్యాలు. డేరా చీఫ్ గుర్మీత్‌కు ఈమె దత్త పుత్రిక. ఈమె ట్విటర్ అకౌంట్‌కు 10 లక్షల మంది, ఫేస్‌బుక్‌కు ఐదు లక్షల మంది ఫాలోవర్లున్నారు. తండ్రితో 'ఎంఎస్‌జీ 2 – ద మెసెంజర్', ఎంఎస్‌జీ – ద వారియర్ లయన్ హార్ట్' చిత్రాల్లో ప్రత్యేక పాత్రల్లో నటించింది. అంతేకాదు గుర్మీత్ నటించిన చిత్రాలకు ఈమే దర్శకురాలు, ఎడిటర్ కావటం విశేషం. ఈమెకు సొంతంగా 'www.HoneypreetInsan.me' అనే వెబ్‌సైట్ కూడా ఉంది. 'అద్భుతమైన తండ్రికి గొప్ప కూతురు' అని ఈ సైట్‌లో పెద్దగా రాసి ఉంటుంది. '50 ఏళ్లు పూర్తిచేసుకున్న 'గురుపా'కు పుట్టినరోజు శుభాకాంక్షలు. ప్రతి చీకటి క్షణాన్ని తేజోవంతం చేసినందుకు ధన్యవాదాలు' అని ఆగస్టు 15న గుర్మీత్ పుట్టినరోజు సందర్భంగా హనీప్రీత్ ట్వీట్ చేశారు. ఇప్పుడు తండ్రి గైర్హాజరీలో డేరా సచ్చా సౌదా మొత్తాన్ని నడిపించాల్సిన బాధ్యత హనీప్రీత్‌దే. గుర్మీత్ సీబీఐ కోర్టుకు వచ్చినపుడు తండ్రితో పాటుగా ఈమె కూడా వచ్చింది. గుర్మీత్ సింగ్ భార్య హర్జీత్ కౌర్. వీరికి ఇద్దరు కూతుళ్లు , ఓ కుమారుడు ఉన్నారు.

భుజంపై బాంబు పెట్టుకుని..

400 మంది చిన్నారుల్ని కాపాడిన హెడ్ కానిస్టేబుల్



బాంబుతో పరుగెడుతున్న అభిషేక్ పటేల్

భోపాల్: బాంబు పేరు వినగానే మనలో ఏదో తెలియని భయం. అలాంటిది పాఠశాల ఆవరణలో ఉన్న ఒక బాంబును తన భుజాలపై పెట్టుకుని కిలోమీటర్ దూరం పరుగెత్తికెళ్లి పడేశాడో పోలీసు.. ఈ సంఘటన మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌కు సరిగ్గా 170 కిలోమీటర్ల దూరంలో సాగర జిల్లాలోని చిట్టోడా గ్రామంలో జరిగింది. ఆ బాంబు బారి నుంచి సుమారు 400 మంది విద్యార్థుల ప్రాణాలను కాపాడి హెడ్ కానిస్టేబుల్ అభిషేక్ పటేల్ రియల్ హీరో అయ్యాడు. గుర్తుతెలియని వస్తువేదో పాఠశాల ప్రాంగణంలో కనిపించిందంటూ ఫోన్‌కాల్ రావడంతో అభిషేక్ పటేల్ హుటాహుటినా తన బృందంతో స్కూల్‌కు చేరుకున్నాడు. తీరా అక్కడికెళ్లి చూస్తే.. అది ఓ పెద్ద బాంబు. బాంబు నిర్వీర్య బృందం మాత్రం ఇంకా సంఘటనా స్థలానికి రాలేదు. వాళ్లు వచ్చేసరిగా పరిస్థితి చేయి దాటిపోతుందేమోనని భావించిన అభిషేక్ 10 కిలోల బాంబును తన భుజంపై పెట్టుకొని పరుగుతీశాడు. పటేల్ చేతిలో ఉన్నప్పుడు బాంబు పేలకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. బాంబు పాఠశాల ఆవరణలోకి ఎలా వచ్చిందో వివరాలు తెలియరాలేదు. పిల్లల ప్రాణాలు కాపాడిన అభిషేక్‌తో పాటు తన సిబ్బందికి త్వరలో రివార్డు అందజేస్తామని ఉన్నతాధికారులు తెలిపారు.

హరికేన్ ధాటికి ఐదుగురి మృతి



హరికేన్ హార్వే ధాటికి టెక్సాస్‌లో దెబ్బతిన్న మొబైల్ పార్క్

హూస్టన్: అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రాన్ని హరికేన్ హార్వీ తుపాను వణికిస్తోంది. వరదల ధాటికి ఐదుగురు మృతిచెందగా, 14 మందికి గాయాలయ్యాయి. గంటకు 130 కి.మీ. వేగంతో పెనుగాలులు వీస్తుండటంతో పలు విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకొరిగాయి. దీంతో విద్యుత్, రవాణా వ్యవస్థ స్తంభించింది. పలు విమాన సర్వీసులు రద్దయ్యాయి. గత 13 ఏళ్లలో ఇదే తీవ్రమైన హరికేన్ అని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. రాబోయే రోజుల్లో కుండపోత వర్షాలు కురిసే అవకాశాలున్నాయని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

బ్రిటన్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

మృతుల్లో పలువురు భారతీయులు

లండన్: బ్రిటన్‌లో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. విహారయాత్రకు వెళుతున్న ఓ మినీ బస్సు రెండు భారీ ట్రక్కుల మధ్య చిక్కుకుని నుజ్జునుజ్జు కావడంతో ఇద్దరు మహిళలు సహా 8 మంది దుర్మరణం చెందారు. మృతుల్లో పలువురు భారతీయులు ఉన్నారనీ..అయితే ఎంత మంది చనిపోయారన్న దానిపై ఇంకా స్పష్టత రావాల్సి ఉందని థేమ్స్ వ్యాలీ పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదం బకింగ్‌హామ్‌షైర్‌లోని న్యూపోర్ట్ పెగ్నెల్‌లో ఎం1 రహదారిపై శనివారం వేకువజామున 3.15 గంటలకు చోటుచేసుకున్నట్లు వెల్లడించారు. చెన్నైకి చెందిన పర్యాటకులు నాటింగ్‌హామ్ నుంచి లండన్ వెళ్లడానికి ఈ మినీ బస్సును అద్దెకు తీసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు.

ట్రంప్ సమాజానికి ప్రమాదకారి: పద్మా లక్ష్మి

థింపూ: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 'సమాజానికి ప్రమాదకారి' అని భారతసంతతికి చెందిన టీవీ హోస్ట్, రచయిత పద్మా లక్ష్మి మండిపడ్డారు. ఈ మేరకు ఇక్కడ ఆదివారం నిర్వహించిన 'మిస్ట్రెస్ ఆఫ్ స్పైసెస్' అనే సదస్సుకు ఆమె హాజరయ్యి మాట్లాడారు. 'ట్రంప్ సమా జానికి ప్రమాదకారిగా నేను భావిస్తున్నాను. మన దేశంలో అత్యంత పవిత్రమైన అధ్యక్ష పీఠం ట్రంప్‌నకు దక్కకూడదని ఎంతో ప్రయత్నిం చాను. అది జరుగనందుకు క్షమించండి' అని ఆమె అన్నారు. అమెరికా అధ్యక్ష ఎన్నికల సమయంలో ట్రంప్‌నకు వ్యతిరేకంగా హిల్లరీ క్లింటన్ తరఫున పద్మా లక్ష్మి ప్రచారం నిర్వహించారు.

నెలకు రూ. నాలుగు లక్షలు భరణం

న్యూఢిల్లీ: భార్యనుంచి వేరుపడిన ఓ భర్తకు ఢిల్లీ కోర్టు దిమ్మతిరిగే షాక్ నిచ్చింది. వీరి కుమార్తె ఖర్చుల నిమిత్తం భార్యకు భరణంగా నెలకు రూ. నాలుగు లక్షలు చెల్లించాలని కోర్టు తీర్పునిచ్చింది. దీంతోపాటు ప్రతియేటా ఈ మొత్తానికి 15 శాతం పెంచుతూ భరణం చెల్లించాలని కూడా అతడిని ఆదేశించింది. బిజినెస్ టర్నోవర్ రూ. వెయ్యికోట్లు ఉందంటూ ఓ బిజినెస్ మ్యాగజైన్‌లోని సూపర్‌రిచ్ కేటగిరీలో సదరు భర్త వార్తల్లోకి ఎక్కడమే ఇందుకు ప్రధాన కారణంగా తెలుస్తుంది. అతని రెండేళ్ల వ్యాపారంలో గణనీయమైన వృద్ధి సాధించిన విషయాన్ని విస్మరించకూడదని అందుకే అతని మాజీ భార్య, కూతురు ఖర్చుల నిమిత్తం రూ. నాలుగు లక్షలే కాకుండా ప్రతియేటా 15శాతం పెంచుతూ ఉండాలని ప్రిన్సిపల్ జడ్జి నరోత్తమ్ కౌశల్ తీర్పునిచ్చారు.

హింసను సహించేది లేదు

తప్పు చేసినవారికి శిక్ష తప్పదు

- డేరా విధ్వంసంపై 'మన్ కీ బాత్'లో మోదీ పరోక్ష ప్రస్తావన
- సెప్టెంబర్ 15 నుంచి 'స్వచ్ఛత సేవ' ప్రచారంలో పాల్గొనండి
- జన్‌ధన్‌లో 30 కోట్ల మందికి భరోసా: మోదీ

న్యూఢిల్లీ: విశ్వాసం పేరిట హింసను సహించేది లేదని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే హక్కు ఎవరికీ లేదని, అందరూ చట్టం ముందు తలొగ్గాల్సిందేనని ఆయన పేర్కొన్నారు. ఆదివారం మన్ కీ బాత్ నెలవారీ రేడియో ప్రసంగంలో... హరియాణా, పంజాబ్‌ల్లో గుర్మీత్ రామ్ రహీం సింగ్ అనుచరులు సృష్టించిన విధ్వంసాన్ని మోదీ పరోక్షంగా ప్రస్తావిస్తూ దోషులకు తప్పకుండా శిక్ష పడుతుందని చెప్పారు. సెప్టెంబర్ 15 నుంచి 'స్వచ్ఛత సేవ' ప్రచారంలో భాగస్వాములుగా కావాలని ప్రధాని పిలుపునిచ్చారు.

ప్రధాని ప్రసంగం ఆయన మాటల్లోనే

ఒకవైపు దేశం పండుగల సంబరాల్లో ఉండగా.. మరోవైపు హింసాత్మక సంఘటనల వార్తలు వినిపిస్తే తప్పనిసరిగా ఆందోళన చెందాల్సి వస్తోంది. బుద్ధుడు, గాంధీలు పుట్టిన దేశం మనది. శతాబ్దాలుగా మన పూర్వీకులు ఆకళింపు చేసుకున్న సోదర భావం, అహింస, పరస్పర గౌరవం మనకు వారసత్వంగా అలవడ్డాయి. ఎర్రకోట నుంచి.. ఇటీవల స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల సందర్భంగా ఒక విషయం స్పష్టం చేశాను. విశ్వాసం పేరిట హింసను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని చెప్పాను. అది మత నమ్మకాలకు సంబంధించినదైనా, రాజకీయ సిద్ధాంతాలు లేక వ్యక్తి విధేయత, ఆచార, సంప్రదాయాల విషయంలోనైనా హింసను సహించేది లేదు. ఒకరి విశ్వాసాల కోసం చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే హక్కు ఏ ఒక్కరికి లేదు. చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకునేవారు, హింసాత్మక ప్రవృత్తిని అనుసరించేవారి విషయంలో ఈ దేశం, ఏ ప్రభుత్వమైనా చూస్తూ ఊరుకోదని హామీనిస్తున్నా.



కేంద్ర ప్రభుత్వ ఉన్నతాధికారులతో సమావేశమైన ప్రధాని మోదీ

పండుగలు నమ్మకానికి ప్రతీకలు

దేశంలో భిన్నత్వమనేది వంటకాలు, జీవన విధానం, వస్త్రధారణకే పరిమితం కాలేదు. ప్రతీ విషయంలో అది కనిపిస్తుంది. ఇటీవల గుజరాత్ వరదల్లో దెబ్బతిన్న 22 ఆలయాల్ని, రెండు మసీదుల్ని జమియత్–ఉలేమా–ఈ–హింద్ వాలంటీర్లు శుభ్రం చేశారు. ఐక్యమత్యానికి అది మంచి ఉదాహరణ. ఆధునిక భారతంలో పండుగలు విశ్వాసం, నమ్మకానికి ప్రతీకలు. జైనులు జరుపుకునే సంవత్సరి పండుగ క్షమాగుణం, అహింస, సోదరభావానికి ప్రతీక. గణేశ్ చతుర్థి సందర్భంగా అందరికీ నా శుభాకాంక్షలు. ఈ పండుగ.. ఐక్యత, సమానత్వం, నిజాయతీకి అద్దం పడుతుంది. కొద్ది రోజుల్లో ఈద్–ఉల్–జువా జరుపుకోనున్నాం. ఈ సందర్భంగా అందరికీ శుభాకాంక్షలు.

స్వచ్ఛత కోసం మరో ముందడుగు

దేశంలో 67 శాతం ప్రజలకు ప్రస్తుతం మరుగుదొడ్ల సదుపాయం అందుబాటులోకి వచ్చింది. మూడేళ్ల క్రితం అక్టోబర్ 2న స్వచ్ఛ భారత్‌ను ప్రారంభించాం. ఈ కార్యక్రమం ద్వారా ఎన్నో మంచి ఫలితాలు చూశాం. ఈ సారి గాంధీ జయంతిని ' క్లీన్ సెకండ్ అక్టోబర్'గా జరుపుకోవాలి. సెప్టెంబర్ 15 నుంచి 'స్వచ్ఛత సేవ' ప్రచారంలో అందరూ పాలుపంచుకోవాలి. జన్‌ధన్ యోజన ప్రారంభించి ఆదివారంతో మూడేళ్లు పూర్తవుతుంది. దాదాపు 30 కోట్ల మందికి జన్‌ధన్ ఖాతాలు ఇచ్చాం. రూ. 65 వేల కోట్లు బ్యాంకుల్లో జమయ్యాయి.

'నవ భారత్' దిశగా పనిచేయండి

2022 నాటికి 'నవ భారత్' కల సాకారం చేసేందుకు స్పష్టమైన లక్ష్యాలతో ముందుకు సాగాలని ప్రధాని మోదీ కేంద్ర ప్రభుత్వ ఉన్నతాధికారులకు సూచించారు. ఆయన ఆదివారం 80 మంది కేంద్ర ప్రభుత్వ అదనపు కార్యదర్శులు, ఉమ్మడి కార్యదర్శులతో సమావేశమయ్యారు. తయారీ రంగం వైద్య పరికరాల తయారీపై దృష్టి కేంద్రీకరించాలని అన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో సానుకూల పని వాతావరణాన్ని కొనసాగించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. కొత్త చట్టాలు రూపొందించిన తరువాత పాతవి సమీక్షించి, అనవసరమని భావిస్తే రద్దు చేయాలని అన్నారు.

రూ.6 పెరిగిన పెట్రోల్ ధర

జూలై నుంచి రోజువారీ పెరుగుతున్న ధర • డీజిల్‌పై రూ.3.67 పెంపు

న్యూఢిల్లీ: వినియోగదారుడికి తెలియకుండానే పెట్రో ఉత్పత్తుల ధరలు భారీగా పెరిగిపోతున్నాయి. గత జూలై ఒకటి నుంచి ఏకంగా పెట్రోల్ ధర రూ.6 పెరిగి, మూడేళ్లలో గరిష్టానికి చేరింది. మరోపక్క డీజిల్ ధర కూడా రూ.3.67 పెరిగి, ఢిల్లీలో లీటర్ ధర రూ. 57.03కి చేరింది. గడిచిన నాలుగు నెలల్లో ఇదే అత్యధికమని ఆయిల్ కంపెనీల గణాంకాలు చెబుతున్నాయి. 2014, ఆగస్టులో ఢిల్లీలో లీటర్ పెట్రోల్ ధర రూ.69.04 ఉండగా, ప్రస్తుతం రూ.70.33 కు చేరింది. గతంలో అంతర్జాతీయ ముడిచమురు ధరలకు అనుగుణంగా ప్రతి నెలా 1, 16వ తేదీల్లో పెట్రో ధరలను నిర్ణయించేవారు. అయితే గత జూన్ నుంచి ప్రభుత్వ రంగ ఆయిల్ కంపెనీలు ఏ రోజు ధరను ఆ రోజే నిర్ణయించి విక్రయించడం ప్రారంభించాయి. జూన్ 16న డీజిల్ ధర రూ.54.49 ఉండగా, జూలై 2 నాటికి రూ.53.36 తగ్గింది. ఆ తర్వాత డీజిల్ ధరలు కూడా పెరుగుతూ వస్తున్నాయి. గతంలో రూ.2 లేదా రూ.3 పెరిగినా ధరలు వినియోగదారులకు తెలిసేవి.



దూకుడుగా దినకరన్

సీఎం పళని, విప్ రాజేంద్రన్‌పై వేటు



సాక్షి, చెన్నై : అన్నాడీఎంకే నాయకురాలు శశికళను పార్టీ నుంచి సాగనంపేందుకు తమిళనాడు ముఖ్యమంత్రి పళని స్వామి ప్రయత్నాలు వేగవంతం చేసిన నేపథ్యంలో పార్టీ ఉప ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్ మరో అడుగు ముందుకు వేశారు. సేలం రూరల్ జిల్లా పార్టీ కార్యదర్శి పదవి నుంచి సీఎం పళనిని తొలగిస్తూ ఆదేశాలు జారీచేశారు. అలాగే తన వర్గం ఎమ్మెల్యేలకు నోటీసులు ఇచ్చిన విప్ రాజేంద్రన్‌ను కూడా ఆ పదవి నుంచి తొలగిస్తూ ప్రకటన జారీచేశారు. దినకరన్ తీరును నిరసిస్తూ పలుచోట్ల సీఎం మద్దతుదారులు ఆందోళనలకు దిగారు. మరోవైపు తనకు ఎవరెవరు మద్దతుగా ఉన్నారో తెలుసుకునేందుకు పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలతో సోమవారం ప్రత్యేక సమావేశానికి సీఎం పళని పిలుపునిచ్చారు.


ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలి

అర్హత కన్నా తక్కువ స్థాయి ఉద్యోగాలే ప్రధాన సమస్య: నీతి ఆయోగ్

న్యూఢిల్లీ: దేశంలో 2024 నాటికల్లా లోక్‌సభతోపాటు అన్ని శాసనసభలకు కలిపి ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వ మేధో సంస్థ నీతి ఆయోగ్ సిఫార్సు చేసింది. దేశ ప్రయోజనాలా దృష్ట్యా ఇదేమంత పెద్ద ఇబ్బంది కాదని అభిప్రాయపడింది. 2017–18 నుంచి 2019–20 కోసం తీసుకొచ్చిన తన త్రైవార్షిక ప్రణాళికలో నీతి ఆయోగ్ పలు విషయాలను ప్రస్తావించింది. దేశంలో నిరుద్యోగం ప్రధాన సమస్య కాదని ప్రతిభకు తగ్గ ఉద్యోగాలు, వేతనాలు లభించకపోవడమే అసలు సమస్యని తెలిపింది.

'జామ్'తో సామాజిక విప్లవం

జామ్ అంటే జన్‌ధన్, ఆధార్, మొబైల్ త్రయం: అరుణ్‌జైట్లీ



న్యూఢిల్లీ: జన్‌ధన్, ఆధార్, మొబైల్(జామ్) త్రయం దేశంలో సామాజిక విప్లవానికి నాంది పలికిందని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ పేర్కొన్నారు. దీని వల్ల ప్రతి భారతీయుడు ఏకీకృత డిజిటల్ ఆర్థిక వ్యవస్థలోకి వస్తాడని చెప్పారు. 'ప్రస్తుతం 100 కోట్ల ఆధార్ నంబర్లను 100 కోట్ల బ్యాంకు ఖాతాలకు, 100 కోట్ల మొబైల్ ఫోన్లకు అనుసంధానించడమే లక్ష్యం. ఒకసారి ఈ ప్రక్రియ పూర్తయితే దేశం డిజిటల్ ఆర్థిక వ్యవస్థ రూపంలో ఏకతాటిపైకి వస్తుంది' అని వెల్లడించారు. జన్‌ధన్ యోజన ప్రారంభించి మూడేళ్లు పూర్తయిన సందర్భంగా జైట్లీ తన ఫేస్‌బుక్ పేజీలో ఒక పోస్ట్‌ను ఉంచారు. 'జీఎస్‌టీతో ఒకే పన్ను, ఒకే మార్కెట్, ఒకే దేశం అమలులోకి వచ్చిన మాదిరిగానే.. ఈ అనుసంధానంతో దేశం మొత్తం ఒకే ఆర్థిక వ్యవస్థ కిందకు వస్తుంది. దీనికి వెలుపల ఎవరూ ఉండరు' అని చెప్పారు.

బీజేపీ ఓటమే లక్ష్యం

పట్నాలో విపక్షాలతో కలిసి లాలూ భారీ ర్యాలీ ❖ హాజరైన మమత, శరద్ యాదవ్, అఖిలేశ్



శరద్ యాదవ్, లాలూ ఆత్మీయ ఆలింగనం

పట్నా: బీజేపీకి వ్యతిరేకంగా విపక్షాల ఐక్యతను ప్రదర్శిస్తూ ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ పట్నాలో ఆదివారం భారీ ర్యాలీ నిర్వహించారు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ, జేడీయూ సీనియర్ నేత శరద్ యాదవ్, సీపీఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్, కాంగ్రెస్ తరఫున గులాం నబీ ఆజాద్ తదితర ప్రముఖ నేతలు ర్యాలీకి విచ్చేశారు. ఎన్సీపీ, ఎన్సీ, జేడీఎస్, డీఎంకే, జేఎంఎం తదితర పార్టీల ప్రతినిధులు కూడా హాజరయ్యారు. ముందుగా ఊహించినట్లుగానే కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ, ఆ పార్టీ ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీ సభకు రాలేదు. బదులుగా వారు తమ సందేశాలను ప్రతినిధుల ద్వారా పంపారు. బీఎస్పీ అధినేత్రి మాయావతి, సీపీఎం నేతలు కూడా గైర్హాజరయ్యారు. 'బీజేపీని తరిమి కొట్టండి, దేశాన్ని కాపాడండి' పేరుతో నిర్వహించిన ఈ ర్యాలీకి ప్రజలు భారీ సంఖ్యలో తరలి వచ్చారు.

మతవాద శక్తులకు తలవంచను

లాలూ మాట్లాడుతూ 'కేంద్ర ప్రభుత్వ దర్యాప్తు సంస్థలను ఉపయోగించి మా కుటుంబంపై అక్రమ కేసులు బనాయించి భయపెట్టాలని ప్రధాని మోదీ, బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా అనుకుంటున్నారు. మతవాద శక్తులకు నేను తలవంచను. 2019 ఎన్నికల్లో బీజేపీ ఓటమి కోసం మేం ప్రయత్నిస్తూనే ఉంటాం. ఎన్నికలయ్యే వరకు పోరాటం ఆపను' అని ఉద్ఘాటించారు. మమతా బెనర్జీ మాట్లాడుతూ.. 'మంచి రోజుల (మోదీ ఎన్నికల ప్రచార నినాదం) పేరుతో మూడున్నరేళ్లు గడిచిపోయాయి. క్షేత్రస్థాయిలో ఏ మార్పూ లేదు. రైతులు చనిపోతున్నారు. నిరుద్యోగుల సంఖ్య ఇంతకు ముందెన్నడూ లేనంతగా పెరుగుతోంది' అని విమర్శించారు. 2019 ఎన్నికలనాటికి దేశ వ్యాప్తంగా ఉన్న బీజేపీ వ్యతిరేక పార్టీలతో కలసి కూటమిని ఏర్పాటు చేయనున్నట్లు శరద్ యాదవ్ సంకేతాలిచ్చారు. సభలో మాట్లాడిన వక్తలంతా...మహా కూటమిని విచ్ఛిన్నం చేసి బీజేపీతో చేతులు కలిపిన బిహార్ సీఎం నితీశ్‌ను విమర్శిస్తూ, లాలు తనయుడు తేజస్వీ యాదవ్‌ను పొగిడారు. తనపై వచ్చిన అవినీతి ఆరోపణలన్నింటికీ వివరణ ఇస్తానని గతంలో చెప్పిన తేజస్వీ ఆదివారం మాత్రం ఆ విషయం గురించి మాట్లాడకుండా 'నేనొక దొంగను, అవినీతిపరుడినంటే మీరు నమ్ముతారా?' అని ప్రజలను ప్రశ్నించారు. మరోవైపు సభకు వచ్చిన అశేష ప్రజానీకాన్ని చూపుతూ లాలూ ట్విటర్‌లో ఓ ఫొటో పోస్ట్ చేయగా, అది మార్ఫింగ్ చేసిన చిత్రమని చాలా మంది నెటిజన్లు పేర్కొన్నారు. బిహార్ ఉప ముఖ్యమంత్రి, సుశీల్ మోదీ... లాలు ఫొటో నకిలీదనీ పేర్కొంటూ జనాలు పెద్దగా లేని మరో చిత్రాన్ని పోస్ట్ చేశారు. లాలూ మార్ఫింగ్ చేసిన ఫొటోను పోస్ట్ చేశారంటూ విమర్శలు వెల్లువెత్తగా, ఆర్జేడీ వాటిని తోసిపుచ్చింది. మరోవైపు జాతి విద్రోహ శక్తులకు మద్దతివ్వద్దని హెచ్చరిస్తూ శరద్ యాదవ్‌కు గుర్తు తెలియని వ్యక్తుల బెదిరింపు లేఖ వెలుగులోకి వచ్చింది.



ర్యాలీకి భారీగా హాజరైన ప్రజలు

శరద్ యాదవ్ రాజ్యసభ సభ్యత్వంపై వేటు!

పార్టీ ఆదేశాలను ధిక్కరించి లాలు నిర్వహించిన విపక్షాల ర్యాలీకి హాజరైనందుకుగాను శరద్ యాదవ్ రాజ్యసభ సభ్యత్వాన్ని రద్దు చేయాల్సిందిగా ఉపరాష్ట్రపతికి సిఫార్సు చేయాలని జేడీయూ నిర్ణయించింది. ఈ మేరకు ఉప రాష్ట్రపతి, రాజ్యసభ అధ్యక్షుడు వెంకయ్య నాయుడుకు ఓ లేఖ రాయనున్నట్లు జేడీయూ అధికార ప్రతినిధి కేసీ త్యాగి చెప్పారు. పార్టీని కాదని విపక్షాల ర్యాలీకి హాజరవడం ద్వారా శరద్ యాదవ్ పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డారు కాబట్టి రాజ్యాంగంలోని పదవ షెడ్యూల్ ప్రకారం ఆయనను రాజ్యసభ సభ్యత్వానికి అనర్హుడిగా ప్రకటించవచ్చని త్యాగి వెల్లడించారు.